www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



పాస్‌పోర్ట్ పోర్టల్ 4 రోజులు బంద్

సాంకేతిక నిర్వహణే కారణం

సోమవారం ఉదయం 6 గంటల తర్వాత అందుబాటులోకి..

2

శుక్రవారం | 30-8-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 153 | వరంగల్

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం; తిథి: ద్వాదశి రా. 2.25 తదుపరి త్రయోదశి; నక్షత్రం: పునర్వసు సా. 5.56 తదుపరి పుష్యమి వర్జ్యం:శేషం ఉ.6.58 వరకు, రా.2.30-4.13, దుర్ముహూర్తం: ఉ.8.32-9.22, మ.12.40-1.29, అమృతఘడియలు: మ.3.24-5.05; రాహుకాలం: ఉ.10.30-12.00, సూర్యోదయం:6.04, సూర్యాస్తమయం: 6.26

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



అక్రమ నిర్మాణాల కూల్చివేత (ఫైల్)

చుక్క పెట్టి.. చక్కబెట్టారు

హైదరాబాద్‌లో చెరువుల చెర వెనుక అధికారుల లీలలు

టీపీవో అభ్యంతరాన్ని తొక్కిపెట్టిన అసిస్టెంట్ సిటీ ప్లానర్

ఆపై మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ స్థాయిలో అనుమతి!

ప్రభుత్వ స్థలం.. ప్రైవేట్ అని ఒకే భూమికి 2 నివేదికలు

ఉన్నతాధికారులకు మాత్రం 'ప్రైవేట్' అని పంపిన ఏడీ

వేరే దగ్గరి సర్వే నంబరును చెరువుకు వేసిన తహశీల్దార్

క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే ఆమోదించిన ఏపీవో

భవనాలకు అడ్డగోలుగా ఓకే చెప్పిన సూపరింటెండెంట్

ఆరుగురు అధికార్లపై క్రిమినల్ కేసులు.. హైడ్రా సిఫారసు

శాఖాపర చర్యలకు నివేదన.. ఉద్యోగ వర్గాల్లో కలకలం

'ఈ స్థలం చెరువులో ఉంది. సాగు నీటి శాఖ అధికారులు అభ్యంతరం చెబుతున్నారు' అని పట్టణ ప్రణాళిక విభాగం అధికారిణి (టీపీవో) స్పష్టంగా రాసి అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ)కు నివేదిక పంపారు. కానీ, ఆయన తన అభిప్రాయం చెప్ప కుండా.. కేవలం చుక్క (డాట్) పెట్టి మునిసిపల్ డిప్యూటీ కమిషనర్ (ఎండీసీ)కు చేరవేశారు. అంతే.. ఎండీసీ స్థాయిలో భారీ భవనాల నిర్మాణానికి అనుమతులొచ్చేశాయ్.

హైడ్రా పేరిట అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు 13

వసూళ్లపై దృష్టి పెటాలని ఏసీబీకి సీఎం ఆదేశం

జన్వాడ ఫామ్‌హౌస్ వద్ద సర్వే పూర్తి

ఔటర్ పరిధిలో ఆక్రమణలకు ఇక హైడ్రా నోటీసులు 13

విధి విధానాలు రూపొందిస్తున్నాం: సీఎస్

పిటిషనర్ల వాదనలు తహసీల్దార్ వినాలి

కావూరిహిల్స్ పిటిషన్‌లో హైకోర్టు ఆదేశాలు

ఎప్పుడో కట్టిన ఇళ్లకు ఇప్పుడు నోటీసులా?



అమర్ సొసైటీ కాలనీ

నోటీసులు అందుకున్న వారి ఆందోళన

అన్ని అనుమతులతో 25 ఏళ్ల క్రితమే ఇళ్లు కట్టుకున్నామని స్పష్టీకరణ

గతంలో ఇచ్చిన నోటీసులకు సమాధానాలు ఇచ్చామని వెల్లడి

న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టీకరణ

హైదరాబాద్ సిటీ/మియాపూర్, రాయదుర్గం, మాదాపూర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) పరిధిలో, బఫర్ జోన్‌లో నిర్మించిన అక్రమ కట్టడాలంటూ రెవెన్యూ అధికారులు నోటీసులు ఇవ్వడంపై.. దుర్గం చెరువు చుట్టూ ఉన్న కాలనీలవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న ఇళ్ల గేట్లు, గోడలపై 'ఎఫ్' అనే అక్షరం.. బఫర్ జోన్‌లోని నిర్మాణాలకు 'బి' అనే అక్షరం రాయడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. నోటీసులు జారీ చేసిన 30 రోజుల్లోగా

మిగతా 13వ పేజీలో...

బఫర్ జోన్‌లో ఉంటే ఏ చర్యలు తీసుకున్నా ఓకే

కొన్నపుడు బఫర్‌జోన్ అని తెలీదు 13

రేవంత్ సోదరుడు తిరుపతిరెడ్డి స్పందన

రేవంత్ వ్యాఖ్యలు సరికావు!

కవిత బెయిల్‌పై ముఖ్యమంత్రి కామెంట్ల మీద సుప్రీంకోర్టు సీరియస్

సీఎం స్థాయి వ్యక్తి చేయాల్సిన వ్యాఖ్యలా?

నేతలను సంప్రదించి తీర్పులిస్తున్నామా?

రాజ్యాంగ పదవిలో ఉన్నారని గుర్తెరగండి

సంస్థల పట్ల పరస్పర గౌరవం ఉండాలి

రాజకీయాల్లోకి మమ్మల్నెందుకు లాగుతారు?

ముఖ్యమంత్రి వైఖరి ఇలానే ఉంటే..

ఓటుకు నోటు కేసుపై వేరే రాష్ట్రంలో విచారణ

ప్రభుత్వ న్యాయవాదికి సుప్రీంకోర్టు హెచ్చరిక

తొలుత కేసు బదిలీకి న్యాయమూర్తులు విముఖం

సీఎం వ్యాఖ్యలతో నిర్ణయం 2కు వాయిదా



న్యూఢిల్లీ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఢిల్లీ మద్యం కేసులో కవితకు బెయిల్ ఇవ్వడంపై బుధవారం నాడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల మీద సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. ముఖ్యమంత్రి స్థాయి రాజ్యాంగ హోదాలో ఉన్న వ్యక్తి చేయాల్సిన వ్యాఖ్యలు కాదని ధర్మాసనం అభిప్రాయ పడింది. ఆయన న్యాయస్థానానికి ఉద్దేశాలను ఆపాదించినట్లు వ్యాఖ్యానించారని చెప్పింది. ఓటుకు నోటు కేసును మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయాలని కోరుతూ బీఆర్ఎస్ నేతలు దాఖలు చేసిన పిటిషన్లపై శుక్రవారం మధ్యాహ్నం వాదనల సందర్భంగా ధర్మాసనం కవితకు బెయిల్ ఇవ్వడంపై రేవంత్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించింది. "తాజాగా లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ విజయం కోసం బీఆర్ఎస్ పని చేసిందని, బీఆర్ఎస్, బీజేపీల మధ్య కుదిరిన ఈ ఒప్పందం వల్లే కవితకు

మిగతా 11వ పేజీలో...



మురళీ దివి

భాగ్యనగరమే

దేశంలో అత్యధిక బిలియనీర్లు ఉన్న 3వ నగరం.. ముంబై, ఢిల్లీ తర్వాత మనమే

నగరంలో 104మంది సహస్ర కోటీశ్వరులు

అగ్రభాగాన రూ.76,100 కోట్లతో మురళీ దివి కుటుంబం 2

దేశంలో అదానీ మళ్లీ నెంబర్‌వన్

రూ.11.60 లక్షల కోట్ల నికర సంపద

హురున్ ఇండియా రిచ్‌లిస్ట్-2024 వెల్లడి

ఉచ్చు బిగుస్తోంది!

ముంబై నటి కేసుపై ఏపీ సర్కారు సీరియస్

విచారణాధికారిగా ఏసీపీ స్రవంతి రాయ్

నేడు విజయవాడకు కాదంబరి జెత్వానీ

వేధింపులపై వాంగ్మూలం ఇచ్చే అవకాశం

1నే ఏపీ పోలీసులపై ముంబైలో ఫిర్యాదు

తాజాగా విజయవాడ సీపీకి ఆన్‌లైన్‌లో..



శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో జెత్వానీ

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

'జగన్ ఆదేశించారు... మేం పాటిస్తాం' అంటూ అడ్డగోలు పనులు చేసిన పోలీసు అధికారుల చుట్టూ బలంగా ఉచ్చు బిగుస్తోంది. ముంబై నటి, వైద్యురాలు కాదంబరి జెత్వానీని తప్పుడు కేసులో ఇరికించి, ఆమె కుటుంబ సభ్యులనూ అరెస్టు చేసి, అక్రమంగా

మిగతా 3వ పేజీలో...

నటితో సెటిల్‌మెంట్ కోసం ఐపీఎస్!

పలుమార్లు ముంబై వెళ్లిన అధికారి

జిందాల్‌మీద కేసు వాపస్‌పై చర్చలు

ససేమిరా అనడంతో కాదంబరిపై ఇక్కడ కేసు నమోదు 3

టిమ్స్ వ్యయం పెంపుపై విజిలెన్స్ విచారణ!

ఆదేశించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

అల్వాల్ టిమ్స్ అంచనా వ్యయం 1,197 కోట్లకు చేరడంపై సీఎం ఆరా

వరంగల్ ఆస్పత్రి స్థలం మార్టిగేజ్‌పై నివేదిక ఇవ్వాలని ఆదేశాలు 14

కుమార్తెను చూసి భావోద్వేగం!

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కళ్లలో నీళ్లు..

ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌కు కవిత

తండ్రితో ఆలింగనం.. పాదాభివందనం

11

త్వరలో రాహుల్ 'డోజో' యాత్ర!

న్యూఢిల్లీ, ఆగస్టు 29: కన్యాకుమారి నుంచి శ్రీనగర్ వరకు భారత్ జోడో యాత్ర, మణిపూర్ నుంచి ముంబై వరకు భారత్ జోడో న్యాయ యాత్ర నిర్వహించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ.. త్వరలో భారత్ 'డోజో' యాత్ర చేపట్టనున్నారు. ఈ విషయాన్ని ఆయన 'ఎక్స్'లో వెల్లడించారు. డోజో అనేది మార్షల్ ఆర్ట్స్ నేర్పే స్కూలు లేదా మైదానం. న్యాయయాత్ర సందర్భంగా రోజూ సాయంత్రం తాను బస చేసిన శిబిరం వద్ద ప్రత్యేకంగా కార్యకర్తలతో కలిసి రాహుల్ జియు-జిత్సు ఆర్ట్‌ను ప్రాక్టీసు చేసేవారు. ఆ వీడియోను గురువారం ఆయన పోస్టు చేశారు. గురువారం (ఆగస్టు 29) జాతీయ క్రీడల దినోత్సవాన్ని పురస్కరించుకున్న ప్రజలతో తన అనుభవాలను ఆయన ఎక్స్‌లో పంచుకున్నారు. 'భారత్ డోజో యాత్ర త్వరలో రాబోతోంది' అని పేర్కొన్నారు.

జమ్మూకశ్మీర్‌లో ముగ్గురు ఉగ్రవాదుల కాల్చివేత

శ్రీనగర్, ఆగస్టు 29: జమ్మూకశ్మీర్‌లో రెండు చోట్ల జరిగిన ఎన్‌కౌంటర్లలో ముగ్గురు ఉగ్రవాదులు మృతి చెందారు. గురువారం కుప్వారా, మచ్చల్ ప్రాంతాల్లో భద్రతా బలగాలు, ఉగ్రవాదులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. "కుప్వారా, మచ్చల్ ప్రాంతాల్లో ఉగ్రవాదులు ఉన్నట్లు సమాచారం అందింది. దీంతో వారి కోసం వేట ముమ్మరం చేశాం. ఆర్మీ, జమ్మూకశ్మీర్ పోలీసు అధికారులతో కలిసి సంయుక్తంగా గస్తీ ఆపరేషన్ నిర్వహించాం. ఈ క్రమంలో భద్రతా సిబ్బందిపై ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. భద్రతా సిబ్బంది జరిపిన కాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. గురువారం ఉదయం కుప్వారాలో ఇద్దరు ఉగ్రవాదుల మృతదేహాలను గుర్తించాం. అలాగే కర్నాహ ప్రాంతంలో మరో మృతదేహం లభించింది. వారి వద్ద నుంచి ఆయుధాలు స్వాధీనం చేసుకున్నాం"అని శ్రీనగర్‌కు చెందిన అధికారులు 'ఎక్స్'లో తెలిపారు.

నేను వైద్యులను బెదిరించలేదు : మమత

కోల్‌కతా, ఆగస్టు 29 : జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటన అంశంలో తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ), బీజేపీ పార్టీల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. హత్యాచార ఘటనకు నిరసనగా విధులు బహిష్కరించిన వైద్యులను బెంగాల్ సీఎం బెదిరించారంటూ బీజేపీ చేస్తోన్న ఆరోపణలను మమత బెనర్జీ తీవ్రంగా ఖండించారు. తాను వైద్యులను బెదిరించలేదని, రోగుల అవసరాల దృష్ట్యా విధులకు రావాలని కోరానని, ఆందోళన చేస్తున్న వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయమని చెప్పానని గురువారం పేర్కొన్నారు. మరోపక్క.. బెంగాల్ తగలబడితే అసోం, ఢిల్లీ సహా పలు రాష్ట్రాలు కూడా కాలిపోతాయంటూ దేశ వ్యతిరేక వ్యాఖ్యలు చేసిన మమత బెనర్జీ సీఎం పదవికి రాజీనామా చేయాలని పశ్చిమ బెంగాల్ బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర సహాయ మంత్రి సుకాంత మజుందార్ డిమాండ్ చేశారు. మమత వ్యాఖ్యలను అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ, మణిపూర్ ముఖ్యమంత్రి బిరేన్ సింగ్ కూడా తీవ్రంగా ఖండించారు.

కోల్‌కతా హత్యాచారం కేసు..
తల్లిదండ్రులకు అరగంటలో మూడు కాల్స్

కోల్‌కతా, ఆగస్టు 29: కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో వైద్య విద్యార్థిని హత్యాచారం కేసులో మరిన్ని అనుమానాలను రేకెత్తించేలా మూడు ఫోన్ కాల్స్‌కు సంబంధించిన ఆడియో క్లిప్పులు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ కాల్స్‌లో మాట్లాడిన వ్యక్తుల తీరును బట్టి.. ముందు నుంచీ వాస్తవాలను దాచే ప్రయత్నాలను ఆస్పత్రి వర్గాలు చేశాయంటూ మృతురాలి తల్లిదండ్రులు ట్రయల్ కోర్టుకు వివరించారు.

మొదటి ఫోన్‌కాల్: ఈ నెల 9వ తేదీ ఉదయం సుమారు 10.24కు ఆస్పత్రి సిబ్బంది నుంచి మృతురాలి తల్లిదండ్రులకు ఫోన్‌కాల్ వచ్చింది. "మీ కుమార్తెకు జ్వరం వచ్చింది. వెంటనే మీరు ఆస్పత్రికి రాగలరా?" అంటూ ఆర్‌జీ కర్ ఆస్పత్రి సిబ్బంది ఒకరు ఫోన్‌లో చెప్పారు.

రెండో ఫోన్‌కాల్: ఆ తర్వాత కాసేపటికే రెండో ఫోన్‌కాల్ వచ్చింది. "మీ కుమార్తె పరిస్థితి సీరియస్‌గా ఉంది. వీలైనంత త్వరగా ఆస్పత్రికి రండి" అని చెప్పిన అవతలి వ్యక్తి.. తనను తాను ఆస్పత్రి అసిస్టెంట్ సూపరింటెండెంట్‌గా పరిచయం చేసుకున్నారు.

మూడో ఫోన్‌కాల్: ఉదయం 10.53 సమయంలో వచ్చిన మూడో ఫోన్‌కాల్‌లో ఆస్పత్రి సిబ్బంది జంకుతూ మాట్లాడారు. "మీ అమ్మాయి చనిపోయింది. ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చు. పోలీసులు ఇక్కడే ఉన్నారు. ఆస్పత్రి అధికారులు కూడా వచ్చారు. మీరు వెంటనే ఇక్కడకు రండి" అని ఫోన్ పెట్టేశారు.

హడావుడిగా ఆస్పత్రికి వెళ్లగా.. తమ కుమార్తె విగత జీవిగా కనిపించిందని ఆ తల్లిదండ్రులు బోరున విలపించారు. ముందు నుంచి ఆస్పత్రి సిబ్బంది వాస్తవాలను దాచే ప్రయత్నం చేశారని వారు ఆరోపించారు.

కలెక్టర్ అనుమతిలేనిదే కట్నం వేధింపుల కేసు చెల్లదు

» పంజాబ్-హరియాణా హైకోర్టు తీర్పు

చండీగఢ్, ఆగస్టు 29: కలెక్టర్ నుంచి ముందస్తు అనుమతి తీసుకోకుండా వరకట్నం నిషేధం చట్టం-1961 కింద కేసు పెట్టడం చెల్లదని పంజాబ్-హరియాణా హైకోర్టు తీర్పు చెప్పింది. ఆ చట్టంలోని సెక్షన్ 8-ఏ ప్రకారం కలెక్టర్ అనుమతి తప్పనిసరి అని న్యాయమూర్తి జస్టిస్ జస్జీత్ సింగ్ బేడీ స్పష్టం చేశారు. పెళ్లికి అన్ని ఏర్పాట్లు చేసి, శుభలేఖలు కూడా పంచిపెట్టిన తర్వాత రూ.25 లక్షలు కట్నంగా ఇస్తేనే వివాహం చేసుకుంటానంటూ బెదిరిస్తున్నాడని ఆరోపిస్తూ కమల్‌జీత్ సింగ్ అనే వ్యక్తిపై సూర్జన్‌సింగ్ ఫిర్యాదు చేశాడు. దీనిపై పంజాబ్‌లోని సంగ్రూర్ జిల్లా ఛాజ్లీ పోలీసు స్టేషన్ అధికారులు గత ఏడాది ఫిబ్రవరి 18న కేసు నమోదు చేశారు. అయితే జిల్లా కలెక్టర్ నుంచి ముందస్తు అనుమతి తీసుకోనందున ఈ కేసు చెల్లదంటూ కమల్‌జీత్‌సింగ్ హైకోర్టును ఆశ్రయించాడు. ఈ వాదనతో న్యాయమూర్తి ఏకీభవించారు.


బళ్లారి జైలుకు దర్శన్ భారీ భద్రత నడుమ తరలింపు

బళ్లారి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రేణుకాస్వామి హత్య కేసు నిందితుడు, కన్నడ నటుడు దర్శన్‌ను పోలీసులు గురువారం ఉదయం 9.30 గంటలకు భారీ బందోబస్తు మధ్య బళ్లారి జైలుకు తీసుకొచ్చారు. జైలు సూపరింటెండెంట్ ఆయన్ను తనిఖీ చేసి ఖైదీ నంబరు 511ను కేటాయించారు. రేణుకాస్వామి హత్య కేసులో ఏ-2 నిందితుడుగా ఉన్న దర్శన్.. బెంగళూరు పరప్పన అగ్రహార జైలులో విలాసవంతమైన జీవితం గడుపుతున్న విషయం ఫొటోలు, వీడియోల ద్వారా బయటకు వచ్చింది. దీంతో దర్శన్ సహా నిందితులను వేర్వేరు జైళ్లకు తరలించాలని ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. దర్శన్‌ను బెంగళూరు నుంచి ఏపీలోని అనంతపురం జిల్లా మీదుగా బళ్లారికి తీసుకొచ్చారు.

భాగ్యనగరమే

దేశంలో అత్యధిక బిలియనీర్లు ఉన్న 3వ నగరం

» ముంబై, ఢిల్లీ తర్వాత హైదరాబాదే
» దేశంలో అదానీ మళ్లీ నంబర్‌వన్
» రూ.10.14 లక్షల కోట్లతో 2వ స్థానంలో ముఖేశ్ అంబానీ
» హురున్ ఇండియా రిచ్‌లిస్ట్-2024 వెల్లడి



ముంబై, ఆగస్టు 29: మన రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నిజంగానే భాగ్యనగరం అని తాజాగా మరో మారు వెల్లడైంది. దేశంలో అత్యధిక సంఖ్యలో బిలియనీర్లు ఉన్న నగరాల జాబితాలో దక్షిణాదిలో నెంబర్‌వన్‌గా నిలవటమేగాక దేశంలో ఢిల్లీ, ముంబై తర్వాత మూడో స్థానంలో నిలిచింది. హైదరాబాద్‌లో 18 మంది బిలియనీర్లు (వందకోట్ల డాలర్లు అంటే రూ.8,388 కోట్ల నికర సంపద ఉన్నవారు), 104 మంది సంపన్నులు (రూ.వెయ్యి కోట్ల నికర సంపద ఉన్నవారు) ఉన్నారని గురువారం విడుదలైన హురున్ ఇండియా రిచ్ లిస్ట్ -2024 వెల్లడించింది. ఇప్పటి వరకూ మూడోస్థానంలో ఉన్న బెంగళూరును వెనక్కి నెట్టి హైదరాబాద్ ఆ స్థానాన్ని కైవసం చేసుకుందని తెలిపింది. రూ.76,100 కోట్ల నికర సంపదతో మురళీ దివి కుటుంబం హైదరాబాద్ బిలియనీర్లలో అగ్రస్థానంలో ఉంది. నగరానికి చెందిన పి.పిచ్చిరెడ్డి (రూ.54,800 కోట్లు), పీవీ కృష్ణారెడ్డి (రూ.52,700 కోట్లు), బి.పార్థసారథిరెడ్డి (రూ.29,900 కోట్లు) రిచ్ లిస్ట్ జాబితాలో ఉన్నారు. కాగా, దేశవ్యాప్తంగా బిలియనీర్ల పరంగా చూస్తే గౌతమ్ అదానీ తిరిగి నెంబర్‌వన్ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. గత ఏడాది జనవరిలో హిండెన్‌బర్గ్ సంస్థ ఆరోపణల నేపథ్యంలో అదానీ సంపద 57 శాతం ఆవిరైపోయి రూ.4.74 లక్షల కోట్లకు పడిపోయింది. దీంతో రూ.8.08 లక్షల కోట్లతో ముఖేశ్ అంబానీ హురున్ రిచ్ లిస్ట్-2023లో అగ్రస్థానంలో నిలిచారు. అయితే, అదానీ తిరిగి పుంజుకున్నారు. రూ.11.60 లక్షల కోట్ల నికర సంపదతో ఈ ఏడాది భారత్‌లో అత్యంత సంపన్నుడిగా నిలిచారు. గత ఏడాదితో పోల్చితే ఆయన సంపద ఏకంగా 95 శాతం పెరిగింది. అదానీ తర్వాత రిలయెన్స్ ఇండస్ట్రీస్ అధిపతి ముఖేశ్ అంబానీ రూ.10.14 లక్షల కోట్లతో రెండో స్థానంలో ఉన్నారు. అంబానీ సంపద గత ఏడాదితో పోల్చితే 25 శాతం పెరిగింది. అదానీ, అంబానీల తర్వాత మూడోస్థానంలో.. రూ.3.14 లక్షల కోట్ల నికర సంపదతో హెచ్‌సీఎల్ కంపెనీ యజమాని శివ్‌నాడర్ నిలిచారు. రూ.2.89 లక్షల కోట్లతో సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా యజమాని సైరస్ పూనావాలా 4వ స్థానాన్ని, రూ.2.5 లక్షల కోట్లతో సన్ ఫార్మసూటికల్స్ దిలీప్ షాంఘ్వి 5వ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. మహిళల పరంగా చూస్తే రూ.47,500 కోట్ల నికర సంపదతో జోహో కంపెనీ యజమాను రాలు రాధా వెంబూ తొలిస్థానంలో ఉన్నారు. 20 ఏళ్ల కైవల్య వోహ్రా (రూ.3,600 కోట్లు), 22 ఏళ్ల ఆదిత్ పాలిచా (రూ.4,300 కోట్లు).. సంపన్నుల జాబితాలో అత్యంత పిన్న వయస్కులుగా నిలిచారు. వీరిద్దరూ క్విక్ కామర్స్ సంస్థ జెప్టో వ్యవస్థాపకులు. రూ.7,300 కోట్ల సంపదతో షారూక్‌ఖాన్ తొలిసారిగా హురున్ రిచ్ లిస్ట్‌లో తన పేరు నమోదు చేసుకున్నారు. సినీ రంగానికి చెందిన ప్రముఖుల జాబితాలో తొలిస్థానంలో షారూక్ ఉండగా.. రెండో స్థానంలో రూ.4,600 కోట్లతో ఆయన వ్యాపార భాగస్వామి జూహీచావ్లా ఉన్నారు. తర్వాత స్థానాల్లో హృతిక్ రోషన్, అమితాబ్ బచన్, కరణ్ జోహార్ నిలిచారు. ఈసారి 16 మంది కార్పొరేట్ ఉన్నతోద్యోగులు కూడా హురున్ లిస్ట్‌లో చేరారు. వీరిలో అరిస్టా నెట్‌వర్క్స్ సీఈఓ జయశ్రీ ఉల్లాల్ (రూ.32,100 కోట్లు), డీ మార్ట్ సీఈఓ ఇగ్నేషియస్ నావిల్ నోరోన్హా (రూ.6,900 కోట్లు) తదితరులున్నారు. భారత్‌లో ప్రతి ఐదు రోజులకు కొత్తగా ఒక బిలియనీర్ ఆవిర్భవిస్తున్నట్లుగా హురున్ రిచ్ లిస్ట్ వెల్లడించింది.

బీజింగ్‌ను తలదన్నిన ముంబై

సంపన్నుల పరంగా చైనా రాజధాని బీజింగ్‌ను ముంబై దాటిపోయిందని ఈ ఏడాది మార్చిలోనే హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్ వెల్లడించింది. బిలియనీర్ల నగటు సంపద చైనాలో రూ.26,840 కోట్లు కాగా.. భారత్‌లో అది రూ.31,873 కోట్లు అని ఈ జాబితా తెలిపింది. బీజింగ్‌లో 91 మంది బిలియనీర్లు ఉండగా ముంబైలో 92 మంది ఉన్నారని.. తద్వారా దక్షిణాసియా బిలియనీర్ల రాజధానిగా ముంబై రికార్డు నెలకొల్పిందని పేర్కొంది.

సంపన్నుల సంపదలో 46 శాతం వృద్ధి

హురున్ భారత సంపన్నుల జాబితాలో ఈసారి మొత్తం 1539 మంది స్థానం సంపాదించుకున్నారు (వీరిలో 334 మంది బిలియనీర్లు). గత ఏడాది జాబితాతో పోల్చితే ఈసారి 220 మంది అదనంగా చేరారు. అలాగే, గత ఏడాదితో చూస్తే సంపన్నుల మొత్తం సంపద ఈసారి 46 శాతం పెరిగింది. దేశంలోని నగరాల పరంగా చూస్తే 386 మంది సంపన్నులతో (వీరిలో 92 మంది బిలియనీర్లు) ముంబై తొలిస్థానంలో ఉంది. 217 మంది సంపన్నులతో (వీరిలో 68 మంది బిలియనీర్లు) రెండో స్థానంలో ఢిల్లీ నిలిచింది. కాగా, గత ఏడాది హురున్ లిస్టులో 3వ స్థానంలో ఉన్న బెంగళూరును అధిగమించి తొలిసారిగా ఆ స్థానాన్ని హైదరాబాద్ కైవసం చేసుకుంది. హైదరాబాద్‌లో ఉన్న సంపన్నుల సంఖ్య 104 (వీరిలో 18 మంది బిలియనీర్లు). గత ఏడాదితో పోల్చితే 17 మంది ఎక్కువ. తదుపరి స్థానాల్లో బెంగళూరు (100), చెన్నై (82), కోల్‌కతా (69), అహ్మదాబాద్ (67), పుణె (53), సూరత్ (28), గురుగ్రామ్ (23) ఉన్నాయి. రిచ్ లిస్ట్‌పై హురున్ ఇండియా వ్యవస్థాపకుడు, ఆ సంస్థ ప్రధాన పరిశోధకుడు అనస్ రెహమాన్ జునైద్ మాట్లాడుతూ, ఆసియాలోనే సంపదను సృష్టించే ఇంజిన్‌గా భారత్ ఆవిర్భవిస్తోందన్నారు. భారత్‌లో బిలియనీర్ల సంఖ్య 29 శాతం పెరగగా, చైనాలో 25 శాతం తగ్గుదల నమోదైందన్నారు.

లోకం తీరు



ప్రముఖ న్యాయ కోవిదుడు నూరానీ కన్నుమూత

» రాజ్యాంగ నిపుణుడు, రచయితగా గుర్తింపు



ముంబై, ఆగస్టు 29: ప్రముఖ న్యాయకోవిదుడు, రాజ్యాంగ నిపుణుడు, రచయిత, మేధావిగా గుర్తింపు పొందిన ఎ.జి.నూరానీ గురువారం ముంబైలో కన్ను మూశారు. ఆయన వయసు 94 ఏళ్లు. ఆయన పూర్తి పేరు అబ్దుల్ గఫూర్ మజీద్ నూరానీ. 1930 సెప్టెంబరు 16న ముంబయిలో జన్మించారు. ముంబైలోని ప్రభుత్వ న్యాయ కళాశాలలో విద్యనభ్యసించిన ఆయన సుప్రీంకోర్టు, బాంబే హైకోర్టుల్లో ప్రతిభావంతుడైన న్యాయవాదిగా పేరు గడించారు. పలు జాతీయ, ప్రాంతీయ పత్రికలకు నిత్యం వ్యాసాలు రాస్తూ కాలమిస్టుగా గుర్తింపు పొందారు. 'హైదరాబాద్ విధ్వంసం' (డిస్ట్రక్షన్ ఆఫ్ హైదరాబాద్), కశ్మీర్ డిస్ప్యూట్-1947-2012, ఆర్టికల్ 370 వంటి పుస్తకాలు రాశారు. మాజీ రాష్ట్రపతి జాకీర్ హుస్సేన్, బ్రిటిష్ పాలనలో బాంబే హైకోర్టులో మొట్టమొదటి భారతీయ బారిస్టర్‌గా పనిచేసిన బద్రుద్దీన్ త్యాబ్జీల జీవిత చరిత్రలు రాశారు. షేక్ అబ్దుల్లా, కరుణానిధిల తరఫున కేసులు వాదించారు. రాజ్యాంగ అంశాలు, ముస్లింల సమస్యలపై పలు ఉపన్యాసాలు ఇవ్వడంతో పాటు సదస్సుల్లో పత్రాలు సమర్పించారు. ఆయన మృతి పట్ల జమ్మూ-కశ్మీర్ మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లా సంతాపం తెలిపారు. ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ సంతాపం తెలుపుతూ రాజ్యాంగం, కశ్మీర్, చైనా వంటి అంశాలతో పాటు.. మంచి ఆహారాన్ని ఆస్వాదించడంపైనా పుస్తకాలు రాశారని తెలిపారు. మేధావుల్లో ఉన్నతుడని ప్రస్తుతించారు.

మంత్రులు రెండు నెలలు జీతాలు తీసుకోరు

» ఎమ్మెల్యేలూ ఇదే పని చేయాలి
» అసెంబ్లీలో హిమాచల్ సీఎం వినతి
» బీజేపీ వాకౌట్..ఆర్థిక సంక్షోభంలో రాష్ట్రం

సిమ్లా, ఆగస్టు 29: హిమాచల్ ప్రదేశ్ ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పొదుపు చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా అందరు మంత్రులు, చీఫ్ పార్లమెంటరీ సెక్రటరీలు, కేబినెట్ ర్యాంక్ హోదా ఉన్న నాయకులను రెండు నెలల పాటు జీతాలు, టీఏ, డీఏ వంటి భత్యాలు తీసుకోరని రాష్ట్ర ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సుక్కు తెలిపారు. గురువారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగయ్యే వరకు రెండు నెలల పాటు జీతాలు, భత్యాలు తీసుకోకూడదని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించినట్టు వెల్లడించారు. ఇది చిన్నమొత్తమే కావచ్చని, కానీ ఒక మంచి సందేశాన్ని పంపించేదని చెప్పారు. ఎమ్మెల్యేలు కూడా ఈ మార్గాన్ని అనుసరించాలని కోరారు. ముఖ్యమంత్రి ప్రకటన చేసిన అనంతరం మాజీ సీఎం జైరాం ఠాకూర్ ఆధ్వర్యంలో బీజేపీ సభ నుంచి వాకౌట్ చేసింది. ఈ సందర్భంగా ఠాకూర్ మాట్లాడుతూ "రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నందున జీతాలు తీసుకోవడాన్ని వారు వాయిదా వేశారు. రాజ్యాంగం అనుమతించకపోయినా చీఫ్ పార్లమెంటరీ కార్యదర్శులను నియమించారు. చాలా మందికి కేబినెట్ హోదా, చైర్మన్ హోదా ఇచ్చి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఇప్పుడేమో జీతాలు తీసుకోవద్దని ఎమ్మెల్యేలను అడుగుతున్నారు. సమస్యలకు ఇది పరిష్కారం కాదు" అని అన్నారు.

నేవీలోకి ఐఎన్ఎస్ అరిఘాత్

» నౌకాదళానికి అప్పగించిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్
» రక్షణ రంగంలో మరో కీలక ముందడుగు
» అణ్వస్త్రాల దాడుల నుంచి భారత్‌కు రక్షణ



విశాఖపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): భారత నేవీ అమ్ములపొదిలో మరో అస్త్రం చేరింది. ఏ దేశమైనా అణ్వస్త్రాలతో దాడి చేస్తే మూడో కంటికి తెలియకుండా వారిపై విరుచుకుపడే శక్తి కలిగిన అణు జలాంతర్గామి 'ఐఎన్ఎస్ అరిఘాత్' నౌకాదళంలో చేరింది. విశాఖపట్నం నేవల్ బేస్‌లో గురువారం అత్యంత రహస్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వాస్తవానికి దీన్ని సెప్టెంబరులో ప్రధాని నరేంద్రమోదీ చేతులు మీదుగా జాతికి అంకితం చేస్తారనే ప్రచారం జరిగింది. దానికి భిన్నంగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేతుల మీదుగా దీన్ని ప్రారంభించారు. అత్యంత అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో స్వదేశీయంగా రూపొందించిన రెండో అణు జలాంతర్గామి ఇది. దీన్నే నేవీ 'సెకండ్ స్ట్రయిక్' సామర్థ్యంగా అభివర్ణిస్తోంది. అయితే ఎవరిపైనా ముందుగా అణ్వాయుధం ప్రయోగించకూడదనేది భారత్ పెట్టుకున్న నిబంధన.

రెండు అందుబాటులోకి.. మరో రెండు నిర్మాణంలో..

రెండు దశాబ్దాల క్రితమే నేవీ అణు జలాంతర్గాముల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. విశాఖపట్నంలోని నేవీ షిప్ బిల్డింగ్ సెంటర్‌లో డీఆర్‌డీవో సాయంతో వీటి నిర్మాణం ప్రారంభమైంది. తొలుత రూపుదిద్దుకున్న ఐఎన్ఎస్ అరిహంత్ 2016లో నేవీలో చేరింది. ఆ మరుసటి ఏడాదే రెండోదైన అరిఘాత్ పరీక్షలకు సిద్ధమైంది. అన్నీ పూర్తయిన తర్వాత రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చేతులు మీదుగా గురువారం దీన్ని నౌకాదళానికి అప్పగించారు. ఎస్ఎస్‌బీఎన్ ప్రాజెక్టు పేరుతో నాలుగు అణు జలాంతర్గాముల నిర్మాణానికి నేవీ నడుం కట్టగా.. ఇప్పటికి రెండు అందుబాటులోకి వచ్చాయి. మరో రెండు నిర్మాణంలో ఉన్నాయి. యుద్ధ నౌకలు, విమానాలు, విమాన వాహక నౌకలు ఏదో ఒక నౌకాదళం కేంద్రంగా చేసుకొని పనిచేస్తాయి. ఈ అణు జలాంతర్గాములు మాత్రం ప్రధాని ఆధ్వర్యంలో నడిచే 'స్పెషల్ స్ట్రాటజిక్ ఫోర్స్' నేతృత్వంలో పనిచేస్తాయి. ఇవి ఎప్పుడు... ఎక్కడ ఉంటాయో ఎవరికీ తెలియదు. ఐఎన్ఎస్ అరిఘాత్ ఇండో పసిఫిక్ రీజియన్‌లో పహారా కాస్తుందని విశ్వసనీయ సమాచారం.

ఐఎన్ఎస్ అరిఘాత్ విశేషాలు

బరువు : 6వేల టన్నులు
పొడవు : 111.6 మీటర్లు
వెడల్పు : 11 మీటర్లు
డ్రాఫ్ట్ (లోతు): 9.5 మీటర్లు

వేగం : సముద్ర ఉపరితలంలో గంటకు 22 నుంచి 28 కి.మీ. వేగంతో ప్రయాణిస్తుంది. సముద్ర గర్భంలో గంటకు 44 కి.మీ. వేగంతో వెళ్తుంది.

ఇతర ప్రత్యేకతలు : దీనిలోని కె-15 బాలిస్టిక్ క్షిపణులు 750 కి.మీ. దూరంలోని లక్ష్యాన్ని ఛేదించగలవు. ఇలాంటివి ఒకేసారి 12 మిస్సైళ్లను మోసుకుపోగల సామర్థ్యం అరిఘాత్‌కు ఉంది. దీనిలో కె-4 క్షిపణులు కూడా నాలుగు ఉంటాయి.

అరిహంత్ కంటే అరిఘాత్ మెరుగైనది: రాజ్‌నాథ్



ఐఎన్ఎస్ అరిహంత్ కంటే అరిఘాత్ మరింత శక్తివంతమైనదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఐఎన్ఎస్ అరిఘాత్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. అణ్వాయుధాల విషయంలో అగ్రరాజ్యాలతో భారత్ సమానంగా నిలుస్తుందని, శాంతి స్థాపనకు, వ్యూహాత్మక ప్రయోజనాలకు ఇది దోహదపడుతుందని అన్నారు. అరిఘాత్ నిర్మాణంలో భారత నౌకాదళం, డీఆర్‌డీవో సమన్వయంతో పనిచేశాయని ప్రశంసించారు. దీని ద్వారా దేశంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు భారీ ప్రోత్సాహం లభించిందన్నారు. కార్యక్రమంలో నేవీ ఉన్నతాధికారులు, డీఆర్‌డీఓ ఎస్ఎస్‌బీఎల్ అధికారులు పాల్గొన్నారు.

4 రోజులు పాస్‌పోర్ట్ పోర్టల్ పని చేయదు!

హైదరాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక నిర్వహణ కారణంగా పాస్‌పోర్ట్ పోర్టల్ నాలుగు రోజులు పని చేయదని ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయం తెలిపింది. గురువారం (ఆగస్టు 29) రాత్రి 8 గంటల నుంచి సోమవారం (సెప్టెంబరు 2) ఉదయం 6 గంటల వరకు అన్ని రకాల సేవలు నిలిచిపోతాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆగస్టు 30న అన్ని రకాల పాస్‌పోర్టు కార్యాలయాల్లోని అపాయింట్‌మెంట్లు రద్దవుతాయని తెలిపింది. అయితే ఈ అపాయింట్‌మెంట్లు రీషెడ్యూల్ అవుతాయని, తదుపరి ఏయే తేదీల్లో రావాలో దరఖాస్తుదారులకు ఎస్ఎంఎస్ రూపంలో సమాచారం అందుతుందని పేర్కొంది. ఏవైనా సందేహాలుంటే rpo.hyderabad@mea.gov.in మెయిల్ ద్వారా తమను సంప్రదించవచ్చని గురువారం ఓ ప్రకటనలో తెలిపింది.

అత్యాచార బాధితుల కోసం పునరావాస కేంద్రం

» తరుణి స్వావలంబన పేరిట హైదరాబాద్‌లో ఏర్పాటు

దిల్‌సుఖ్‌నగర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపులకు గురైన బాలికలకు అండగా నిలిచేందుకు తరుణి అనే స్వచ్ఛంద సంస్థ రాష్ట్రంలోనే తొలిసారిగా ఓ పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. తరుణి స్వావలంబన పేరిట హైదరాబాద్, చైతన్యపురి ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఈ పునరావాస కేంద్రాన్ని డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్ సీఈవో శ్రీరమణ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా 'తరుణి' డైరెక్టర్ డాక్టర్ మమత రఘువీర్ మాట్లాడుతూ.. ఈ పునరావాస కేంద్రం ద్వారా అత్యాచార బాధితులకు పునరావాసం కల్పించడంతోపాటు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తామని తెలిపారు. అలాగే, బాధితులు తిరిగి సాధారణ జీవితం గడిపేందుకు అవసరమైన శిక్షణ ఇవ్వడంతోపాటు వైద్య సాయం అందిస్తామని చెప్పారు. ప్రభుత్వం సహకారం అందిస్తే మరిన్ని పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. తరుణి నేషనల్ డైరెక్టర్, రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి రఘువీర్ మాట్లాడుతూ అత్యాచార బాధితులకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. కాగా, లైంగిక వేధింపులకు గురై గర్భం దాల్చిన బాలికలకు తమ ఆస్పత్రిలో ఉచితంగా ప్రసవాలు చేస్తున్నామని ఫెర్నాండెజ్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ ఏవిటా ఫెర్నాండెజ్ తెలిపారు.

విషాద యాత్ర!

» ఆగివున్న వ్యానును ఢీకొన్న కారు
» నలుగురి మృతి.. మరో నలుగురికి గాయాలు
» మృతుల్లో తండ్రి, కుమారుడు, అల్లుడు
» మహబూబ్‌నగర్ జిల్లాలో ఘటన
» మరో ఘటనలో నల్లగొండ జిల్లా కేతేపల్లి వద్ద డివైడర్‌ను ఢీకొట్టిన కారు
» ఒకరి మృతి.. మరో ఇద్దరికి తీవ్రగాయాలు



వెంకటరమణ (ఫైల్)



కెంపు రావు, వెంకట్ యాదవ్, అశోక్ యాదవ్ (ఫైల్)

భూత్పూర్, సైదాబాద్, కేతేపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రేడియం స్టిక్కర్లు గానీ, పార్కింగ్ లైట్లు గానీ లేకుండా రోడ్డుపై ఆగివున్న ఆ వ్యాను తీర్థయాత్ర ముగించుకొని కారులో తిరుగు ప్రయాణమైన వారి పాలిట మృత్యువై నిరీక్షించింది! మరో గంటలో ఇంటికి చేరుకుంటారనగా వారు ప్రయాణిస్తున్న కారు ఆ ఆగివున్న వ్యాన్‌ను బలంగా ఢీకొట్టింది. ఆ వేగానికి కారు నుజ్జునుజ్జయింది. అందులో ప్రయాణిస్తున్న ఎనిమిది మందిలో నలుగురు మృతిచెందారు. మృతుల్లో తండ్రి, కుమారుడు, అల్లుడు.. ఇలా ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురున్నారు. మిగతా నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం తాటికొండ గ్రామ స్టేజీ వద్ద ఈ ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. హైదరాబాద్ మాదన్నపేటకు చెందిన ఉర్సుల కెంపురావు (75) రిటైర్డ్ ఉద్యోగి. ఆయన కుమారుడు ఉర్సుల వెంకట్ యాదవ్ (43), భార్య, కుమారుడితో కలిసి లండన్‌లో స్థిరపడ్డాడు. పది రోజుల క్రితం ఒక్కడే లండన్ నుంచి హైదరాబాద్‌కొచ్చాడు. తండ్రి కెంపు రావు, తల్లి సువర్ణ, అక్కా, బావలు అశోక్ యాదవ్, అంబిక.. ఈ దంపతుల కుమారుడు గోవింద్, కూతురు అక్షిత, బడంగ్‌పేటకు చెందిన బాల్య స్నేహితుడు, రియల్ ఎస్టేట్ వ్యాపారి గోనె వెంకటరమణ (43)తో కలిసి మూడు రోజుల క్రితం వేంకటేశ్వర స్వామి దర్శనం కోసం కారులో తిరుపతి బయలుదేరాడు. దర్శనం అయ్యాక వీరంతా బుధవారం అక్కడి నుంచి హైదరాబాద్‌కు తిరుగు పయణమయ్యారు. గురువారం తెల్లవారుజామున వీరు ప్రయాణిస్తున్న కారు.. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం తాటికొండ గ్రామ శివారులోని పోల్కంపల్లి స్టేజీ వద్ద ప్రమాదానికి గురైంది. అక్కడ ఎలాంటి సిగ్నల్ వేయకుండా రోడ్డుపై ఆగి ఉన్న వ్యానును కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు నడుపుతున్న అశోక్ యాదవ్, గోనె వెంకట రమణ, కెంపురావు అక్కడికక్కడే మృతిచెందారు. అక్షిత, అంబిక, సువర్ణ, వెంకట్ యాదవ్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరిలో చికిత్స పొందుతూ వెంకట్ యాదవ్ మృతి చెందాడు. మిగతా నలుగురిని మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. మృతుల బంధువు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రాణం తీసిన నిద్రమత్తు

కారు డ్రైవర్ నిద్రమత్తు ఒకరి ప్రాణం తీసింది. మరో ఇద్దర్ని తీవ్ర గాయాలపాల్జేసింది. పోలీసులు స్థానికుల వివరాల ప్రకారం.. హైదరాబాద్ మియాపూర్‌కు చెందిన సొంటి కృష్ణ సంతోష్ విజయవాడలో తన మేనత్త అంత్యక్రియలకు హాజరయ్యేందుకు తల్లిదండ్రులు దుర్గామల్లేశ్ ప్రసాద్, శివనాగమల్లేశ్వరి(63), మేనత్తలు పామర్తి పార్వతి, గుడిపల్లి అలివేలమ్మలతో కలిసి గురువారం తెల్లవారుజామున 3గంటలకు కారులో బయలుదేరారు. కారు ఉదయం ఆరు గంటలకు నల్లగొండ జిల్లా కేతేపల్లి మండల కేంద్రం వద్ద ప్రమాదానికి గురైంది. కారు నడుపుతున్న సొంటి కృష్ణను నిద్రమత్తు ఆవరించడంతో కారు అదుపు తప్పి.. కేతేపల్లి డీపాల్ స్కూల్ వద్ద గల జంక్షన్‌లోకి దూసుకెళ్లి డివైడర్‌ను ఢీకొట్టి పల్టీకొట్టింది. ప్రమాదధాటికి కారు ముందు ఎడమ చక్రం విరిగి దూరంగా పడింది. కారులోని ఎయిర్ బ్యాగులు తెరుచుకోవడంతో ముందు సీట్లలో ఉన్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కారు వెను సీటులో కూర్చున వారిలో సొంటి కృష్ణ సంతోష్ తల్లి శివనాగమల్లేశ్వరి ప్రమాద తీవ్రతకు భయాందోళనకు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ప్రమాదంలో గాయపడిన దుర్గామల్లేశ్ ప్రసాద్, పామర్తి పార్వతి, గుడిపల్లి అలివేలమ్మను చికిత్స నిమిత్తం తొలుత నకిరేకల్ ఏరియా ఆస్పత్రికి.. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు.

బేతవోలుకు భాషా సమ్మాన్ అవార్డు ప్రదానం

ఈ అవార్డు లభించడం ఓ వరం: బేతవోలు రామబ్రహ్మం

న్యూఢిల్లీ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): తెలుగు, సంస్కృత భాషల్లో 40కి పైగా కావ్యాలు, నాటకాలు రచించిన ప్రముఖ సాహితీ వేత్త, పండితుడు బేతవోలు రామబ్రహ్మం ప్రతిష్ఠాత్మకమైన భాషా సమ్మాన్ అవార్డు అందుకున్నారు. 2021వ సంవత్సరానికిగాను ఆయన్ను ఈ అవార్డు వరించింది. ఢిల్లీలోని కేంద్ర సాహిత్య అకాడమీ ఆడిటోరియంలో గురువారం అకాడమీ అధ్యక్షుడు మాధవ్ కౌశిక్ ఈ అవార్డును ఆయనకు అందజేశారు. రూ.లక్ష నగదు, తామ్రపత్రంతో ఆయన్ను సత్కరించారు. ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల గ్రామానికి చెందిన బేతవోలు రామబ్రహ్మం 1948లో జన్మించారు. తెలుగు యూనివర్సిటీతోపాటు కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకులుగా పనిచేశారు. పురస్కారం స్వీకరించిన తర్వాత బేతవోలు మాట్లాడుతూ తెలుగు భాషాదినోత్సవం సందర్భంగా తనకు పురస్కారం లభించడం ఒక వరమని అన్నారు. సంస్కృతం, ప్రాకృతంతోపాటు దేశంలోని భారతీయ భాషలన్నింటికీ కలిపి సమగ్ర నిఘంటువును రూపొందించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఇందుకోసం భాషా శాస్త్రవేత్తలతో కూడిన నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. ఇది దేశ సమగ్రతకు దోహదం చేస్తుందని చెప్పారు. ఈ సూచనపై కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి కృత్తివెంటి శ్రీనివాసరావు తక్షణమే స్పందించారు. నిఘంటువు రూపకల్పన విషయాన్ని అకాడమీ సానుకూలంగా పరిశీలిస్తుందని, ఇది అనువాదకులకు కూడా తోడ్పడుతుందని పేర్కొన్నారు. ఒక భాష అంతరిస్తే సంస్కృతితోపాటు భావాలు అంతమవుతాయని అభిప్రాయపడ్డారు. ప్రాచీన, మధ్యయుగాల సాహిత్యంపై బేతవోలు రామబ్రహ్మం చేసిన కృషి అపారమని కొనియాడారు. భారతీయ భాషలెన్ని ఉన్నా సాహిత్యం వాటికి అంతస్స్రోతంగా ఉంటుందని అకాడమీ అధ్యక్షుడు మాధవ్ కౌశిక్ పేర్కొన్నారు. రామబ్రహ్మంతోపాటు ఉత్తరాది నుంచి పురుషోత్తం అగర్వాల్, అవతార్ సింగ్, ఈశాన్యం నుంచి రెంతలీ లర్వానా, రోజమా చాంగ్సు, దక్షిణాది నుంచి బేతవోలు రామబ్రహ్మం, మలయాళీ రచయిత కేజి పాలోస్ ఈ పురస్కారాలను స్వీకరించారు. ఈ సందర్భంగా బేతవోలు.. సంస్కృతం, తెలుగు భాషల్లో పద్యాలను చదివి ఆహూతులను అలరించారు.



భువనగిరి జిల్లాలోని స్వర్ణగిరి దేవాలయంలో గవర్నర్

ఆధ్యాత్మికతకు ప్రసిద్ధి.. 'యాదాద్రి'

- జిల్లాలో మహిళా సంఘాల పనితీరు బాగుంది
- ఉపాధి పనుల్లో ప్రగతి భేష్: గవర్నర్ జిష్ణుదేవ్

యాదాద్రి/జనగామ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికం, సాంస్కృతికంగా యాదాద్రి భువనగిరి జిల్లా ఎంతో ప్రసిద్ధి చెందిందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన ఆలేరు మండలం కొలనుపాకలోని జైనమందిరం, సోమేశ్వరాలయం, భువనగిరిలోని స్వర్ణగిరిలోని వేంకటేశ్వరుడి ఆలయాలను దర్శించుకున్నారు. తిరుపతి తరహాలో స్వర్ణగిరి క్షేత్ర నిర్మాణం మహాద్భుతమని కొనియాడారు. అనంతరం భువనగిరి కలెక్టరేట్‌లో జిల్లాలోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, జిల్లా అధికారులతో గవర్నర్ సమావేశమయ్యారు. జిల్లాలో మహిళా స్వయం సహాయక సంఘాల పనితీరు చాలా ప్రభావవంతంగా ఉందని, ఉపాధి హామీ పనుల్లో అధికంగా పనులు కల్పించడం అభినందనీయమన్నారు. స్వతంత్ర సమరయోధుడు మన్నె గోపాల్‌రెడ్డి, పద్మశ్రీ అవార్డు గ్రహీతలు కూరెళ్ల విఠలాచర్య, కేతావత్ సోమ్లానాయక్‌లను గవర్నర్ శాలువాతో సత్కరించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటిస్తున్న తనకు జనగామ జిల్లా సందర్శన చాలా సంతృప్తినిచ్చిందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. వీలైతే త్వరలోనే జనగామకు మళ్లీ వస్తానని చెప్పారు. మూడు రోజుల ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా మూడో రోజైన గురువారం ఉదయం జనగామ జిల్లాలో గవర్నర్ పర్యటించారు. జనగామ కలెక్టరేట్‌లో కవులు, కళాకారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు ప్రభుత్వ శాఖల పనితీరును గవర్నర్ తెలుసుకున్నారు. అనంతరం జనగామ మండలం ఓబుల్‌కేశ్వాపూర్‌లోని వెంకటేశ్వరస్వామి 8వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో గవర్నర్ పాల్గొన్నారు. తన కార్యదర్శి బుర్రా వెంకటేశం స్వగ్రామానికి రావడం సంతోషంగా ఉందని తెలిపారు.

ఉచ్చు బిగుస్తోంది!

(మొదటి పేజీ తరువాయి)



నిర్బంధించి, చిత్రహింసలు పెట్టిన కేసులో సీనియర్ ఐపీఎస్‌ల పాత్ర తేల్చేందుకు రంగం సిద్ధమైంది. రెండు తెలుగురాష్ట్రాలతోపాటు... ముంబైలో, సినీ వర్గాల్లో సంచలనం సృష్టించిన ఈ కేసుపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. అటు బాధితురాలు కాదంబరి కూడా అప్పటి ఏపీ పోలీసులపై ఈనెల 1వ తేదీనే కేసు పెట్టారు. ఈ మొత్తం వ్యవహారం వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో గురువారం విజయవాడ నగర పోలీసు కమిషనర్ రాజశేఖరబాబుకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. అంతేకాదు... ఆమె నేరుగా విజయవాడకు వచ్చేస్తున్నారు. గురువారం రాత్రి ముంబై నుంచి హైదరాబాద్‌కు వచ్చిన కాదంబరి... శుక్రవారం విజయవాడ చేరుకోనున్నారు. ఇక్కడ ఆమె పోలీసులు ఆమె వాంగ్మూలం నమోదు చేస్తారు. అదే సమయంలో తనను వేధించిన ఏపీ ఐపీఎస్‌లపై ఆమె ఫిర్యాదు చేసే అవకాశముంది. ఈ కేసును సమగ్రంగా విచారించేందుకు విచారణాధికారిగా విజయవాడ ఏసీపీ కె.స్రవంతి రాయ్‌ని నియమించింది. డీజీపీ ఆదేశాల మేరకు విజయవాడ పోలీసు కమిషనర్ రాజశేఖర బాబు గురువారం ఈ ఉత్తర్వులు జారీ చేశారు.

అడ్డగోలుగా అరెస్టు...

నటి కాదంబరిపై కుక్కల విద్యాసాగర్ ఈ ఏడాది ఫిబ్రవరి 2న ఫిర్యాదు చేయడం... ఆ మరుసటి రోజునే ముంబైలో ఏపీ పోలీసులు ఆమెను అరెస్టు చేయడం జరిగింది. ఆ తర్వాత ఏపీలో తనను వేధించిన తీరుపై ఆగస్టు 1వ తేదీన ముంబై జుహూ పోలీసుస్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేశారు. "నన్ను, నా తల్లిదండ్రులను ఏపీ పోలీసులు ఈ ఏడాది ఫిబ్రవరి 3న అరెస్టు చేశారు. ఫిబ్రవరి 2న ఎఫ్‌ఐఆర్‌ను నమోదు చేసి, 24 గంటల్లోనే రోడ్డు మార్గాన విజయవాడ నుంచి ముంబై వచ్చి ఎలాంటి ఆధారాలు లేకున్నా అరెస్టు చేశారు. ఆ సమయంలో మా లాయర్‌ను కానీ, బంధువులను కానీ సంప్రదించే అవకాశం కల్పించలేదు. విజయవాడ తీసుకెళ్లిన తర్వాత కూడా మాకు లాయర్‌ను ఏర్పాటు చేసుకునే అవకాశం ఇవ్వలేదు. మా అరెస్టు సమాచారాన్ని బంధువులకు తెలియజేశామని ఏపీ పోలీసులు చెప్పడం పెద్ద అబద్ధం. అలాగే... మా నివాసం నుంచి ఓ డాక్యుమెంట్‌ను రికవరీ చేశామని, దాని ఆధారంగానే అరెస్టు చేశామని చెబుతున్నారు. దానిని సృష్టించింది కూడా పోలీసులే. 2018లో అగ్రిమెంట్ చేసుకున్నట్లు ఆ డాక్యుమెంట్‌లో ఉంది. కానీ... అందులోని చిరునామా మాత్రం 2020లో నేను జుహూలో కొనుగోలు చేసిన ఫ్లాట్‌ది. అంతేకాదు... ఆ డాక్యుమెంట్ పేపర్‌ను 2023లో కొన్నారు. అది ఫోర్జరీ అని చెప్పేందుకు ఇవే నిదర్శనాలు" అని ఆ ఫిర్యాదులో కాదంబరి పేర్కొన్నారు.

విజయవాడ సీపీకి ఫిర్యాదు

కాదంబరి జెత్వానీ గురువారం విజయవాడ కమిషనర్ రాజశేఖర్ బాబుకు ఆన్‌లైన్‌లో మరో ఫిర్యాదు చేశారు. వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్ తనపైన, తన తల్లిదండ్రులపైన నమోదు చేసిన తప్పుడు కేసుపై సమగ్ర విచారణ చేయాలని కోరారు. విద్యాసాగర్ తమపై తప్పుడు ఫిర్యాదు చేయగా దాని ఆధారంగా ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. విద్యాసాగర్ రాజకీయంగా తనకున్న సంబంధాలను ఉపయోగించి పోలీసులపై ఒత్తిడి తీసుకొచ్చి తప్పుడు కేసు పెట్టారని తెలిపారు.

నాలుగైదు రోజుల్లో విచారణ పూర్తి!

"కాదంబరి జెత్వానీ కేసుకు సంబంధించిన అన్ని అంశాలను పరిశీలిస్తున్నాం. ఇందులో ప్రధానంగా ఐపీఎస్ అధికారులపై ఆరోపణలు వచ్చాయి. ఇందులో ఎంత వరకు వాస్తవం ఉందనే అంశంపై దృష్టి పెట్టాం. బాధితురాలితో మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకుంటాం. చీటింగ్ కేసులో నటితోపాటు ఆమె కుటుంబం మొత్తాన్ని ఎందుకు అరెస్టు చేశారో తెలియాలి. అరెస్టు చేసిన సమయంలో ఎవరెవరి పాత్ర ఎంత వరకు ఉందో దర్యాప్తులో తేలుతుంది. నాలుగైదు రోజుల్లో ఈ విచారణ పూర్తి చేస్తాం. ఈ కేసులో సాంకేతిక ఆధారాలను కూడా సేకరిస్తాం. ఐపీఎస్‌ల పాత్ర ఉన్నట్లు తేలితే డీజీపీ చర్యలు తీసుకుంటారు."

\- ఎస్వీ రాజశేఖర్ బాబు, సీపీ విజయవాడ

అరెస్టు చేసి అబద్ధాలు!

- ముంబై పోలీసులకూ తెలుసు
- 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి'తో కాదంబరి

ఒకవైపు తనను ఏపీ పోలీసులు అక్రమంగా అరెస్టుచేయగా... మరోవైపు 'అందుబాటులో లేదు' అంటూ తాను సజ్జన్ జిందాల్‌పై పెట్టిన కేసును ముంబై పోలీసులు మూసివేశారని కాదంబరి జెత్వానీ ఆరోపించారు. గురువారం సాయంత్రం హైదరాబాద్‌కు వచ్చేముందు... ముంబై విమానాశ్రయం నుంచే ఆమె 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. తన అరెస్టు సమయంలో బంధువులకు కానీ, న్యాయవాదులకు కానీ ఏపీ పోలీసులు సమాచారం ఇవ్వలేదన్నారు. తన అక్రమ అరెస్టు గురించి ముంబై పోలీసులకూ తెలుసని... అయినా 'అందుబాటులో లేదు' అంటూ సజ్జన్ జిందాల్‌పై .తాను పెట్టినకేసును క్లోజ్ చేశారని చెప్పారు. "ముంబై జోన్-8 డీసీపీ ఫిబ్రవరి 6న నా ఆచూకీ తెలపాలంటూ విజయవాడ సీపీకి మెయిల్ పంపారు. కానీ... నేను ఇక్కడ లేనంటూ విజయవాడ సీపీగా ఉన్న కాంతి రాణా సమాధానమిచ్చారు" అని జెత్వానీ సంచలన ఆరోపణ చేశారు. సజ్జన్ జిందాల్ తనను రేప్ చేశారంటూ 2023 డిసెంబరులో ముంబై పోలీసు స్టేషన్‌లో కాదంబరి ఫిర్యాదు చేశారు. తొలుత ఎఫ్‌ఐఆర్ నమోదుకు పోలీసులు ముందుకు రాలేదు. ముంబై హైకోర్టు జోక్యం చేసుకుని ఆదేశాలు జారీ చేయడంతోనే ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. ఆ కేసులో జిందాల్‌ను రక్షించేందుకు అప్పటి ఏపీ సీఎం జగన్ ముందుకు వచ్చారన్నది స్పష్టమవుతోంది. ఆయన ఆదేశాల మేరకు అప్పటి సలహాదారు సజ్జల రంగంలోకి దిగి అధికారాన్ని ఉపయోగించి ఐపీఎస్‌లు పీఎస్సార్ ఆంజనేయులు, కాంతిరాణా, విశాల్ గున్నీల సహకారంతో జెత్వానీపై వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్‌తో తప్పుడు ఫిర్యాదు చేయించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

గనులను దక్కించుకొని సింగరేణిని బతికించుకుందాం

- కొత్త గనులపై సింగరేణితో ఐదు జాతీయ కార్మిక సంఘాల సమావేశం
- బొగ్గు రంగంలో ఎదురవుతున్న సవాళ్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్

హైదరాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల చరిత్ర కలిగిన సింగరేణి సంస్థ మనుగడ కోసం, తెలంగాణ ప్రాంత నిరుద్యోగులకు ఉపాధి కల్పన కోసం కొత్త బ్లాక్‌లను దక్కించుకోవడం అత్యంత అవసరమని ఐదు జాతీయ కార్మిక సంఘాలు అభిప్రాయపడ్డాయి. గురువారం సింగరేణి సంస్థలో ఉత్పత్తి, ఉత్పాదకత పెంపు, కంపెనీ భవిష్యత్ కోసం తీసుకోవాల్సిన వ్యూహాత్మక విధానాలపై సింగరేణి భవన్‌లో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ, సీఐటీయూ, హెచ్ఎంఎస్, బీఎంఎస్ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. కంపెనీ మనుగడ కోసం యాజమాన్యం తీసుకునే వ్యూహాత్మక నిర్ణయాలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. కొత్త గనుల ఆవశ్యకత, మానవ వనరుల వినియోగం, ప్రస్తుతం బొగ్గు రంగంలో ఎదురవుతున్న సవాళ్లపై యాజమాన్యం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించింది. గత 9 ఏళ్లుగా ఒక్క బ్లాక్ కూడా సింగరేణి దక్కకపోవడంపై అన్ని సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ప్రస్తుత ఈ విధానమే కొనసాగితే రానున్న 6 సంవత్సరాలలో బెల్లంపల్లి, మణుగూరు, ఇల్లందు ప్రాంతాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని సంఘాలు విచారం వ్యక్తం చేశారు. ఏటా కొత్త బొగ్గు గనులు ప్రారంభించుకోకపోతే, సింగరేణి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారనుందని సీఎండీ ఎన్.బలరామ్ గుర్తుచేశారు.



ఒకరికొకరు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ రసాభాస

- మెదక్ జిల్లా హత్నూరలో ఉద్రిక్తత

హత్నూర, ఆగస్టు 29: మెదక్ జిల్లా హత్నూరలో గురువారం ఏర్పాటు చేసిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం రసాభాసగా మారింది. హత్నూర మండలంలోని పలు గ్రామాలకు చెందిన 197 మంది లబ్ధిదారులకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అధికారులతో కలిసి చెక్కులు పంపిణీ చేస్తున్నారు. అంతలోనే కొందరు బీఆర్ఎస్ నాయకులు స్టేజ్ పైకి ఎక్కడంతో కాంగ్రెస్, బీజేపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికారిక కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పెత్తనం ఏమిటని ప్రశ్నించారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని బీజేపీ నాయకులు అధికారులను నిలదీశారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో బీఆర్ఎస్ నాయకులు సునీతాలక్ష్మారెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి, బీఆర్ఎస్ జిందాబాద్ అంటూ ప్రతి నినాదాలు చేశారు. దీంతో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, పోలీసులు ఇరువురికి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా.. ఫలితం లేకుండా పోయింది. గందరగోళ పరిస్థితుల మధ్యనే సునీతాలక్ష్మారెడ్డి లబ్ధిదారులకు షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కులతో పాటు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు.

తెలుగు సినీ ప్రొడక్షన్ యూనియన్‌లో రూ.1.37 కోట్ల గోల్‌మాల్

- 11 మందిపై క్రిమినల్ కేసులు

బంజారాహిల్స్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు సినీ ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్స్ యూనియన్‌లో రూ.1.37 కోట్ల గోల్‌మాల్ జరిగింది. ఇందుకు సంబంధించి సంఘానికి చెందిన 11 మందిపై జూబ్లీహిల్స్ పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఈ నిధుల అవకతవకలపై యూనియన్ ప్రధాన కార్యదర్శి కాట్రగడ్డ సుధాకర్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని ఆదేశించగా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

నటితో సెటిల్‌మెంట్ కోసం ఐఏఎస్!

- పలుమార్లు ముంబై వెళ్లిన అధికారి
- తనకున్న పరిచయాలతో బెదిరింపు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ముంబై నటి కాదంబరి జెత్వానీ కేసులో ఇదో కొత్తకోణం. ఇప్పటిదాకా వైసీపీ ఐపీఎస్‌ల నిర్వాకం మాత్రమే బయటపడగా... ఒక సీనియర్ ఐఏఎస్ కూడా ఇందులో కీలక పాత్ర పోషించినట్లు తాజాగా తేలింది. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక హోదాను తీసుకొచ్చే సమావేశాలకు డుమ్మాకొట్టిన ఈ అధికారి... గత ఐదేళ్లు జగన్, వైసీపీ నేతల సేవలో తరించిపోయారు. గత ప్రభుత్వంలో కీలక శాఖలు నిర్వహించారు. సజ్జన్ జిందాల్‌పై కాదంబరి పెట్టిన కేసు వాపస్ తీసుకునేందుకు ముంబై కేంద్రంగా మంత్రాంగం నడిపారు. దీనికోసం ముంబైలోని అధికార వర్గాల్లో తనకున్న పరిచయాలు, సినిమా లింకులను ఉపయోగించారు. దీని కోసం ఆయన పలుమార్లు ముంబైకి వెళ్లారు.

ఇదీ ఆయన నిర్వాకం...

ఎన్నికలకు ముందు ఏపీలో జగన్ సర్కారు ఓబుళాపురం, ప్రకాశం జిల్లా మర్లపాడు ఐరన్ ఓర్ మైనింగ్ ప్రాజెక్టులకు బిడ్డర్‌ను ఎంపిక చేసింది. ఈ రెండూ జిందాల్ (జేఎస్‌డబ్ల్యూ) కంపెనీకే దక్కాయి. అయితే, ఈ గుట్టును 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకొచ్చింది. ఈ టెండరు ఖరారైన తర్వాత జేఎస్‌డబ్ల్యూ ఎండీ సజ్జన్ జిందాల్ పలుమార్లు ఏపీకి వచ్చి జగన్‌ను కలిశారు. ఆ తర్వాత గనులశాఖతో సంబంధం లేని ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి పలుమార్లు ముంబైకి వెళ్లి వచ్చారు. సజ్జన్ జిందాల్‌పై కాదంబరి పెట్టిన కేసును మూసివేయించడమే లక్ష్యంగా ఆయన అక్కడ పావులు కదిపినట్లు సమాచారం. ఈ ఐఏఎస్‌కు ముంబైలో అక్కడి ఉన్నతస్థాయి పోలీసు అధికారులను ప్రభావితం చేయగల పరిచయాలున్నాయి. దీంతో జగన్ ప్రభుత్వ పెద్దలు ఏరికోరి రేప్‌కేసు సెటిల్‌మెంట్‌ను ఈయనకు అప్పగించి ఉంటారని తెలిసింది. బాధితురాలు రేప్ కేసును ఉపసంహరించుకునేలా చేయాలన్నది ఈ అధికారికి ఇచ్చిన టాస్క్. ఇందుకు అవసరమైన శక్తులన్నీ ఉపయోగించాలని ముందే చెప్పి పంపారు. అయితే, ఈయన యత్నాలేవీ ఫలించలేదు. దీంతో ఆయన ఇదే విషయం వైసీపీ పెద్దలకు చెప్పి అమరావతికి వచ్చేశారు. దీంతో ఆ నటిని దారికి తెచ్చుకునేందుకు బెదిరింపుల మార్గాన్ని ఎంచుకున్నారు. వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్ చేత తప్పుడుకేసు పెట్టించి... ఆమెను, తల్లిదండ్రులను నిర్బంధించి, అరెస్టు చేసి, రిమాండుకు పంపించారు.

ఇద్దరు వైసీపీ ఎంపీలు అవుట్!

- రాజ్యసభకు మోపిదేవి, మస్తాన్‌రావు గుడ్‌బై
- చైర్మన్ ధన్‌ఖడ్‌ను కలిసి రాజీనామాల సమర్పణ

న్యూఢిల్లీ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డికి మరో షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన రాజ్యసభ ఎంపీలు మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్‌రావు తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ మేరకు గురువారం రాజ్యసభ చైర్మన్, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌ను కలిసి రాజీనామా లేఖలు అందజేశారు. ఆయన అడిగిన ప్రశ్నలకు బదులిస్తూ.. మనస్సాక్షిగానే ఎంపీ పదవులకు రాజీనామా చేస్తున్నామని వెల్లడించారు. వారి రాజీనామాలను ధన్‌ఖడ్ తక్షణమే ఆమోదించారు. ఖాళీ అయిన రాజ్యసభ స్థానాల ఉప ఎన్నికకు 10 రోజుల్లో ఎన్నికల కమిషన్ ఈసీ నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశముందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఇంకోవైపు.. రాజీనామాలు సమర్పించాక మోపిదేవి, మస్తాన్‌రావు మీడియాతో మాట్లాడారు. స్వచ్ఛందంగానే ఎంపీ పదవులకు రాజీనామా చేశామని, వెనుక ఎవరి ప్రలోభాలూ లేవని స్పష్టంచేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తనను పరిగణనలోకి తీసుకోకుండా స్థాయి లేని వ్యక్తికి టికెట్ ఇచ్చారని, అప్పుడే పార్టీ మారాలని అనుకున్నానని మోపిదేవి తెలిపారు. తాను టీడీపీలో చేరుతున్నానని స్పష్టం చేశారు. ఆయన రాజ్యసభ సభ్యత్వం 2026 జూన్ 21 వరకు ఉన్నా వదులుకోవడం గమనార్హం. తనకు నాలుగేళ్ల పదవీ కాలం ఉన్నప్పటికీ వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేశామని బీద మస్తాన్‌రావు చెప్పారు. టీడీపీలో చేరికపై అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. 32 ఏళ్లు టీడీపీలో ఉన్నానని చెప్పారు. కుటుంబసభ్యులు, సన్నిహితులు, బంధువులతో చర్చించి తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటానన్నారు. వైసీపీకి, రాజ్యసభ సభ్యత్వానికి తాను రాజీనామా చేస్తున్నట్లు వస్తున్న వార్తలపై ఎంపీ గొల్ల బాబురావు స్పందించారు. సరైన సమయంలో తన నిర్ణయం వెల్లడిస్తానని చెప్పారు.

తెలుగు గొప్ప భాష: మోదీ

- తెలుగు వెలగాలి : ఏపీ సీఎం చంద్రబాబు

అమరావతి, న్యూఢిల్లీ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని పలువురు నాయకులు గురువారం సామాజిక మాధ్యమాల వేదికగా తెలుగు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వ్యవహారిక తెలుగు భాషకు గిడుగు వెంకట రామ్మూర్తి చేసిన విశేష సేవను పలువురు గుర్తు చేసుకున్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గురువారం ఏపీ ప్రజలకు ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో స్పందిస్తూ 'తెలుగు భాషా దినోత్సవ శుభాకాంక్షలు. ఇది నిజంగా చాలా గొప్ప భాష. భారతదేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా తనదైన ముద్ర వేసింది. తెలుగును మరింత ప్రాచుర్యంలోకి తెచ్చేందుకు కృషి చేస్తున్న వారందరినీ అభినందిస్తున్నా' అని మోదీ పేర్కొన్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎక్స్‌లో స్పందిస్తూ... 'తెలుగు భాషాభివృద్ధికి విశేష కృషి చేసిన మహనీయులను నేడు తలుచుకోవడం ద్వారా అమ్మ భాషకు సేవ చేసిన తెలుగు పెద్దలకు కృతజ్ఞతలు చెబుదాం. వారి అడుగుజాడల్లో నడుస్తూ, మన భాషను సుసంపన్నం చేసుకుందాం. తెలుగు భాష ఔన్నత్యాన్ని ముందు తరాలకు అందించే బృహత్ బాధ్యతని మనం తీసుకుందాం. అదే వారికి మనమిచ్చే ఘన నివాళి. తెలుగు వెలగాలి.. తెలుగు భాష వర్ధిల్లాలి అని కోరుకుంటూ దాని కోసం పని చేద్దాం' అని పిలుపునిచ్చారు.

విద్యార్థుల పట్ల సర్కారుకు చిన్నచూపెందుకు?

- ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు చెల్లించాలి
- సెల్ఫ్ డిక్లరేషన్ పేరిట రుణమాఫీలో కొత్త డ్రామా
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలు రూ.5900 కోట్లు చెల్లించాల్సి ఉందని, అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలైనా పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. బిల్లులు పెండింగ్‌లో పెట్టడంతో విద్యా సంస్థలు, విద్యార్థులు అవస్థలు పడాల్సి వస్తోందని గురువారం ఎక్స్ వేదికగా ఆయన పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ విద్యార్థుల పట్ల కాంగ్రెస్ సర్కారుకు చిన్నచూపు ఎందుకని, దాదాపు ఆరు వేల కోట్ల స్కాలర్‌షిప్ బకాయిలు చెల్లించాల్సి ఉన్నా ప్రభుత్వంలో చలనం లేదని కేటీఆర్ ధ్వజమెత్తారు. తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా రుణం మాఫీకాని రైతులను రేవంత్ సర్కార్ అవమానిస్తోందని, మాఫీ చేయలేక సెల్ఫ్ డిక్లరేషన్ పేరుతో కొత్త డ్రామా మొదలుపెట్టిందని కేటీఆర్ ఆరోపించారు. రుణమాఫీలో వాపస్ ఆప్షన్ పెట్టడం విచిత్రంగా ఉందన్నారు. ఇచ్చేది పక్కనపెట్టి వాపస్‌పై దృష్టి పెట్టారని.. రుణమాఫీ కోసం రైతులు సెల్ఫీ దిగి నేను రైతునని నిరూపించుకోవాలా? అని కేటీఆర్ ప్రశ్నించారు. కాగా, ఏడాది కిందట చైనాకు చెందిన ఆటోమేకర్ సంస్థ బియాది(బీవైడీ) తెలంగాణలో తమ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇవ్వని కేంద్రం.. ఇప్పుడు ఎందుకు ఆహ్వానిస్తుందో చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తెలంగాణలో బీవైడీ సంస్థ పెట్టుబడులు పెట్టి ఉంటే వేలాది మందికి ఉపాధి అవకాశాలు దక్కేవని ఆయన అన్నారు.

హైడ్రా పనితీరు భేష్

ఎంపీ అనిల్ కుమార్ ప్రశంస

హైడ్రాకు రూ.25 లక్షల ఎంపీ లాడ్స్ నిధులు



రూ.25 లక్షలను కేటాయిస్తూ లేఖను రంగనాథ్‌కు అందజేస్తున్న అనిల్ కుమార్ యాదవ్

రాంగోపాల్‌పేట్/హైదరాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరంలోని చెరువులను కాపాడేందుకు ఏర్పాటు చేసిన హైడ్రా పనితీరు బాగుందని కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ కొనియాడారు. సీఎం రేవంత్ రెడ్డి హైడ్రాకు కమిషనర్‌గా మంచి అధికారిగా పేరున్న రంగనాథ్‌ను నియమించారని అన్నారు. గురువారం బుద్ధభవన్‌లో గల హైడ్రా కార్యాలయంలో కమిషనర్ రంగనాథ్‌ను ఆయన కలిశారు. హైడ్రా పనితీరును అభినందిస్తూ ఎంపీ లాడ్స్ నిధుల నుంచి హైడ్రాకు రూ.25 లక్షలను మంజూరు చేస్తున్నట్లు లేఖను అందజేశారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. పదేళ్ల అధికారంలో ఉన్న కేసీఆర్ హైదరాబాద్‌ను మహానగరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు కానీ.. కబ్జాకు గురైన ఒక్క చెరువును కూడా కాపాడలేక పోయారని విమర్శించారు. పదేళ్ల క్రితం అనేక చెరువులు నిండుకుండలా ఉండేవని, చెరువులను ఆక్రమించి అక్రమ కట్టడాలు చేపట్టిన వారు ఎవరైన హైడ్రా వదిలిపెట్టదని, డ్రగ్స్ నివారణ విషయంలో కూడా సీఎం ప్రత్యేక దృష్టి పెట్టారని చెప్పారు. హైడ్రాను ఇతర జిల్లాలలో కూడా అమలు చేయాలని ప్రభుత్వానికి వినతులు వస్తున్నాయని, హైడ్రాకు తన పూర్తి మద్దతు ఇస్తున్నానని ఆయన చెప్పారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పేదల పెన్నిధి

యూపీఏ హయాంలో ఆరంభమైన ఓ బృహత్తర కార్యక్రమానికి జన్‌ధన్ యోజనగా నరేంద్రమోదీ పేరుమార్చారని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఆర్థికమంత్రి చిదంబరం గురువారం వ్యాఖ్యానించారు. తమ పాలనలో అమలుజరిగిన ఆ పథకంలో భాగంగా 2005—2014మధ్యకాలంలో పేదలకోసం లక్షలాది బ్యాంకు ఎకౌంట్లు తెరుచుకున్నాయని ఆయన అన్నారు. ఇది రిజర్వ్‌బ్యాంక్ మాజీ గవర్నర్ సి. రంగరాజన్ మెదడులో మెరిసిన ఆలోచననీ, 2005లో 'జీరోబాలెన్స్ ఎకౌంట్' పథకాన్ని ఆరంభించినప్పుడు వై.వి.రెడ్డి ఆర్బీఐ గవర్నర్‌గా ఉన్నారనీ, ఆ తరువాత దువ్వూరి సుబ్బారావు ఆ కర్తవ్యాన్ని కొనసాగించారని చిదంబరం గుర్తుచేశారు. 2012లో ఈ పథకానికి 'బేసిక్‌సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్ ఎకౌంట్ (బిఎస్‌బిడిఎ)'గా పేరుమార్చామని, ఆ తరువాత నరేంద్రమోదీ వచ్చి దీనిని జన్‌ధన్ యోజనగా పిలిచారని చిదంబరం చెప్పుకొచ్చారు. ఆర్బీఐ మాజీ గవర్నర్లందరికీ ఈ సందర్భంగా ప్రశంసలు దక్కాల్సిందేనని అన్నారాయన. జన్‌ధన్ యోజన మొదలై బుధవారంనాటికి పదేళ్ళయిన సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ, ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ సహా బీజేపీ పెద్దలంతా ఆ పథకాన్ని ఆకాశానికెత్తేసిన నేపథ్యంలో చిదంబరం ఈ వ్యాఖ్యలు చేశారు. తమ ఆలోచనలను, పథకాలను ఎదుటిపక్షం ఎగరేసుకుపోయిందన్న విమర్శ రాజకీయాల్లో ఉన్నదే. ఆయన వ్యాఖ్యల్లో నిజం లేకపోలేదు కానీ, వాటి వెనుక ఉన్న రాజకీయోద్దేశాలను పక్కనబెడితే, జన్‌ధన్ విజయవంతమైందని మాజీ ఆర్థికమంత్రి కూడా భావిస్తున్నట్టు ఉంది.

ఆర్థికవ్యవస్థకు వెలుపల ఉండిపోయిన కోట్లాదిమందిని ఆర్థికవ్యవస్థ పరిధిలోకి తెచ్చిన ఈ బృహత్ పథకం అద్భుత విజయాలు సాధించిందని ప్రభుత్వం ప్రకటించింది. పదేళ్ళ అనంతరం 53.13 జన్‌ధన్ యోజన లబ్ధిదారులు ఉండగా, అందులో ముప్పైకోట్ల-మంది మహిళలు. ఖాతాల్లో జమచేసిన మొత్తం 2.31లక్షలకోట్లు. 2015 మార్చిలో 15.67కోట్ల ఖాతాలున్నాయని అంటున్నందున పెరుగుదల మూడురెట్లకుపైగానే ఉన్నట్టు. 66శాతం ఖాతాదారులు గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లో ఉన్నారట. రూపే కార్డులు ఇచ్చినందున ఖాతాదారులకు తమ ఖాతాల్లో ఉన్న సొమ్ముతో లావాదేవీలు నిర్వహించుకోగలరు. బ్యాంకింగ్ సేవలకు దూరంగా ఉండిపోయినవారికి పూర్తి ఉచితంగా ఖాతాలు తెరవడం, పొదుపు, రుణం, బీమా ఇత్యాది అవకాశాలను వాటిద్వారా కల్పించడం పేదలకు కచ్చితంగా మేలుచేస్తుంది. ఆధార్ వ్యవస్థ మరింత పదునుదేలడం, మొబైల్ సేవలు విస్తరించడం, మారుమూల గ్రామాల్లో సైతం ఇంటర్నెట్ అందుబాటులోకి రావడం వంటివి ఈ లక్ష్యసాధనకు ఉపకరించాయి. జన్‌ధన్—ఆధార్—మొబైల్ (జామ్) అనుసంధానం ద్వారా ఏర్పడిన ఈ వ్యవస్థ, అప్పటికే వేగం పుంజుకున్న డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ)ను మరింత సునాయాసం చేసింది. వివిధ సంక్షేమ పథకాల్లో భాగంగా ప్రజలకు అందించాల్సిన వస్తువులు, సేవలకు బదులు వారి ఖాతాల్లో కొంతసొమ్ము వేస్తే వదిలిపోతుందన్న భావన ఈ జీరోఖాతాలకు పునాది. సబ్సిడీలు దారిమళ్ళకుండా, దళారులూ మధ్యవర్తులు మధ్యలో దోచేయకుండా ఈ ఖాతాల్లోకి ప్రత్యక్షబదిలీ

నిరంతరాయంగా జరిగిపోతోందని ప్రభుత్వం సంతోషిస్తోంది. 2020—22మధ్య కేవలం మూడేళ్ళలోనే 8లక్షలకోట్లు నేరుగా ఈ బ్యాంకు ఖాతాల్లో పడ్డాయి. సంపాదించిన సొమ్ము దొంగలబారిన పడకుండా, పొదుపును బట్టి మరింత అప్పు పుట్టే అవకాశం పెరిగినందునా పేదలు వడ్డీవ్యాపారుల బారినపడకుండా ఈ వ్యవస్థ ఉపకరిస్తోంది. మహిళలకు సొంతఖాతాలు, వాటిలో డబ్బులు ఉండటం, పొదుపు, రుణాలకు అవకాశాలు పెరగడం వారి సాధికారతకు, ఆర్థిక స్వావలంబనకు వీలుకల్పిస్తుంది. సమ్మిళిత ఆర్థికాభివృద్ధికి ఈ పథకం ప్రబల నిదర్శనమని, సామాజికంగా ఇది అద్భుతాలు చేసిందని, నేరాలు, మద్యం వినియోగం బాగా తగ్గాయని ప్రభుత్వం చెబుతోంది. జన్‌ధన్ పథకంలో ఇప్పటివరకూ సాధించిన ప్రగతికి సంతోషిస్తూనే, దాదాపు అన్ని ప్రభుత్వ పథకాలకు ఈ ఖాతాలు కీలకంగా మారిన తరుణంలో ఈ విధానానికి ఆవల మిగిలిపోయినవారిపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. ఖాతాలు లేనికారణంగా వారు సంక్షేమపథకాలకు దూరంకాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పదేళ్ళ ప్రయాణంలో ఈ పథకం సాధించిన ఫలితాలు, ప్రభావాలతో పాటు, ఇంకా మిగిలివున్నదెంతో అధ్యయనం చేయగలిగితే విజయాన్ని మరింత కచ్చితంగా అంచనావేయవచ్చు.

ఈ రాజకీయ భావ దారిద్ర్యం తీరేదెలా?





■ యోగేంద్ర యాదవ్

రాజకీయ సిద్ధాంతం ఏమిటి? ఎవరు రాజకీయ తాత్త్వికుడు? రాజకీయ చింతన మరణించిందని ఎవరైనా ఒకరు ఎలా తీర్మానిస్తారు? ఇవీ, ఇంకా ఇతర ఆసక్తిదాయకమైన ప్రశ్నలను, నా 'చింతనాత్మక రాజకీయాలు యేవీ?' (ఆంధ్రజ్యోతి, ఆగస్టు 19) అన్న వ్యాసానికి ప్రతిస్పందిస్తూ పలువురు నాకు గుప్పించారు. వ్యాసాలు, సామాజిక మాధ్యమాల పోస్టులు, వ్యక్తిగతమైన లేఖలు, సందేశాలు, సంభాషణలు నన్ను ముంచెత్తాయి. 'చింతనాత్మక రాజకీయాలు యేవీ?' అన్న ప్రశ్నను సరైన సమయంలో వేశానన్న విషయాన్ని అవి ధ్రువీకరించాయి. ఆ ప్రశ్నను మరింత స్పష్టాతిస్పష్టం చేయవలసిన అవసరాన్ని కూడా ఆ తొలి ప్రతిస్పందనలు సూచించాయి.

అసలు ఈ 'రాజకీయ చింతన' ఏమిటి? (ఇది క్షీణించిపోవడం పట్ల నేను దుఃఖిస్తున్నాను, ఎందరో పరితాపం చెందుతున్నారు). అది, దైనందిన రాజకీయ వ్యాఖ్యానాలు, సైద్ధాంతిక వాద ప్రతివాదాలు, విధాన నిర్దేశాలను మించిన విస్తృత రాజకీయ పర్యాలోచనల ప్రస్తావన. ఈ రీతి రాజకీయ వివేచనను ఆ వ్యాసంతో మొదలుపెట్టినప్పటికీ మూడు విస్తృత ప్రశ్నలకు సాధారణ సమాధానాలు ఇచ్చేందుకై ఆ ఉపక్రమానికి విరామం పాటిస్తున్నాను.

మొదటి ప్రశ్న: ఏ వెల్లులకు మన ప్రస్థానం? ఎటువంటి రాజకీయ వ్యవస్థను సృష్టించాలని మన శుభ కామన? రాజకీయ దార్శనికత ఆవశ్యకమయ్యే నిర్ణయాత్మక ప్రశ్న ఇది. రెండో ప్రశ్న: మన ప్రస్థానంలో నేడు మనం ఎక్కడ ఉన్నాం? మనం వెళ్లాలని సంకల్పించుకున్న గమ్యానికి సమీపంలో ఉన్నామా? లేక సుదూరంలో ఉన్నామా? ఇదొక అనుభవపూర్వక ప్రశ్న (ఎంపిరికల్ క్వశ్చన్). దీనికి కార్యకారణ సంబంధాన్ని అవగాహన చేసుకొనేందుకు రాజకీయ విశ్లేషణ అవసరం. మూడవ ప్రశ్న: ఏమి చేయాలి? మనం ఎక్కడ ఉన్నామో అక్కడ నుంచి మనం వెళ్లదలుచుకున్న గమ్యానికి ఎలా వెళ్లాలి? ఇదొక నిర్దేశాత్మక ప్రశ్న. రాజకీయ కౌశలం, ఎత్తుగడలుగా రూపాంతరీకరణ కాగల రాజకీయ వివేచనా శక్తిని అది అపేక్షిస్తుంది. రాజకీయ తాత్త్వికులు అందరూ తమ దేశ పరిస్థితులు, కాలావధులకు లోబడి ఆ ప్రశ్నలన్నిటికీ ప్రతిస్పందించాలి. రాజకీయ సిద్ధాంతం, రాజకీయ తత్త్వశాస్త్రం, రాజకీయ భావజాలం లేదా రాజకీయ భావనాశక్తి.. ఏ పేరుతోనైనా పిలవండి, ఏ ప్రయోజనకరమైన రాజకీయ ఆచరణకు అయినా రాజకీయాల గురించి అటువంటి ఆలోచనా విధానం తప్పనిసరి.

సమున్నత రాజకీయ ఆచరణకు దోహదం చేసే సుసంగతమైన, గుణప్రదమైన రాజకీయ చింతనా సంప్రదాయాన్ని ఆధునిక భారతదేశం అభివృద్ధిపరిచింది. విశాల భావాలు, నిష్పాక్షిక దృక్పథంతో ఆచరణ సాధ్యమైన సిద్ధాంతాలను వెలయించిన రాజకీయ చింతకులు అన్ని భావజాలాల పరిధిలో మనకు ఎంతో మంది ఉన్నారు పైన పేర్కొన్న మూడు ప్రశ్నలకు వారు తమ తమ మార్గాలలో సాధారణ, పరస్పర సంబంధం కలిగివున్న సమాధానాలు ఇచ్చారు. అవి మన గతాన్ని అర్థం చేసుకునేందుకు, వర్తమానాన్ని వివేచించేందుకు, భవితవ్యాన్ని దర్శించేందుకు మనకు విశేషంగా దోహదం చేశాయి. ఐరోపాలోని రాజకీయ తాత్త్వికులవలే కాకుండా మన రాజకీయ చింతకులలో అత్యధికులు రాజకీయ క్రియాశీలురు. ఇప్పటి ఆలోచనాపరులకు భిన్నంగా వారు తమ తమ మాతృభాషా సంస్కృతులు, దేశీయ చింతనతో పేగుబంధం ఉన్న మేధోశీలురు. అయినా వారు ఆధునిక పాశ్చాత్య భావప్రవంతులను తరచి చూసి, వాటి నుంచి స్ఫూర్తి పొందారు. ఆ బాహ్య భావనలను గుడ్డిగా స్వీకరించడం కాకుండా ప్రాంతీయ సందర్భం, జాతీయవాద సంవేదనలతో వాటిని వడగట్టి తేర్చిన శ్రేష్ఠ ఆలోచనలతో మన జాతి జీవనంలో నవ్య భావోదయానికి స్రష్టలు అయ్యారు. విద్యాలందు మాత్రమే స్పర్థిస్తున్న భావాల భండారమే 'ఆధునిక భారతీయ రాజకీయ చింతన'. అదే మన జాతీయోద్యమానికి, మన రాజ్యాంగానికి, వలసపాలనానంతర రాజకీయాలకు ప్రాతిపదికలు సమకూర్చింది. రమారమి ఒక శతాబ్దం పాటు—1870ల నుంచి 1960ల దాకా— మహోన్నతంగా వర్ధిల్లిన ఆ చింతనా సంప్రదాయం హఠాన్మరణం కానప్పటికీ త్వరిత గతిన ప్రాధాన్యం కోల్పోయింది, అపాయకరంగా అవనతి అయింది. 21వ శతాబ్ది భారతదేశంలో రాజకీయ భావ దారిద్ర్యం, విశాల రాజకీయ అవగాహనా లేమి, సమగ్ర రాజకీయ వివేకం లోటు ఆ మహోన్నత చింతనా సంప్రదాయ క్షీణ ఫలాలే.

> రాజకీయ ఆచరణకు దోహదం చేసే సుసంగతమైన, గుణప్రదమైన రాజకీయ చింతనా సంప్రదాయాన్ని ఆధునిక భారతదేశం అభివృద్ధిపరిచింది. ఐరోపాలోని రాజకీయ తాత్త్వికుల వలే కాకుండా మన రాజకీయ చింతకులలో అత్యధికులు వర్తమాన భారతదేశంలో రాజకీయ భావదారిద్ర్యం, విశాల రాజకీయ అవగాహనా లేమి, సమగ్ర రాజకీయ వివేకం లోటు ఆ మహోన్నత చింతనా సంప్రదాయ క్షీణ ఫలాలే. ఆ చింతనా ధార మన రిపబ్లిక్‌కు ఒక జీవగర్ర. దాని స్ఫూర్తి ఒక జీవ మంత్రం. మనం ఆ జీవ స్ఫూర్తిని ఆవాహన చేసుకోవాలి.

ఈ సాధారణ ధోరణికి మినహాయింపులు ఉన్నాయి. ఆధునిక భారతీయ చింతనా సంప్రదాయంలో మూడు 'సజీవ' ప్రవంతుల— స్త్రీ వాదం, సామాజిక న్యాయం, 'అభివృద్ధి' — ను నేను ప్రస్తావించాను. భారతీయ 'విశిష్టత', పితృస్వామ్య అణచివేతలను స్త్రీ వాదం చర్చిస్తోంది. వాటికి వ్యతిరేకంగా పోరాడుతోంది. జెండర్ ఎలా కులం, వర్గంతో సంకీర్ణమవుతోందో నిశితంగా వివేచిస్తోంది. చట్టం పరిమితులు, ప్రగతిశీల శక్తిగా రాజ్యవ్యవస్థ బలహీనతలు, భారతీయ సమాజ నేపథ్యంలో స్వలింగ సంపర్కుల హక్కులు మొదలైన అంశాలపై చురుకైన వాదోపవాదాలు జరుగుతున్నాయి. ఇవన్నీ, జాతీయవాద చింతనలోని 'మహిళల ప్రశ్న'ను దాటి మన రాజకీయ భావనాశక్తిని కొత్త మార్గాల్లో సాగేలా పురిగొల్పుతున్నాయి. సామాజిక న్యాయంపై చర్చలు బాబాసాహెబ్ అంబేడ్కర్ ప్రభావాల నుంచి ఇంకా బయటపడనప్పటికీ కుల అంతరాలు, జాతి వివక్షల మధ్య సమాంతరాలపై చర్చలు జరుగుతున్నాయి. కుల వ్యవస్థ రాజకీయ ఆర్థికత, పస్మాండ ముస్లింలు, మహాదళితుల సమస్యలపై చర్చలు కొత్త ఆలోచనలకు దారితీస్తున్నాయి.

'అభివృద్ధి'కి సంబంధించిన ప్రత్యామ్నాయ నమూనాలపై సహేతుక, వివేకవంతమైన చర్చలు ఇప్పుడు మహాత్మాగాంధీ ఆలోచనా సీమలను దాటిపోయి కేవలం పర్యావరణంపైనే కాకుండా నూతన ఆర్థిక, రాజకీయ వ్యవస్థల విషయమై కూడా మన ఆలోచనా ప్రగతికి మార్గదర్శకమవుతున్నాయి. అయినప్పటికీ ఇవన్నీ కలిసికట్టుగా కూడా ఆధునిక భారత రాజకీయ చింతన విలుప్తత మిగిల్చిన అపార శూన్యతను పూరించలేవు.

నా వాదనను వివరించేందుకు నేను ప్రస్తావించిన చింతకుల జాబితాలోని పేర్లపై తొలి ప్రతిస్పందనలు తమ దృష్టి నిలిపాయి., ఆక్షేపించాయి. ఈ పేర్ల విషయంలో నా తప్పును ఒప్పుకుంటున్నాను. నా ఉదాహరణల కాల పరిధిని అపార్థం చేసుకున్నందున ఆ విమర్శలకు ఆస్కారమేర్పడింది. 1947లో సజీవంగా ఉన్న చింతకులతో నా జాబితా ప్రారంభమయింది (కనుకనే జ్యోతిబా పూలే, గోపాలకృష్ణ గోఖలే పేర్లు చోటుచేసుకోలేదు). నా సమకాలికులు అయిన నిశిత సామాజిక, రాజకీయ సిద్ధాంతవేత్తలను కూడా నేను పేర్కొనలేదు (ఇందుకు మేధావులు, క్రియాశీలురు అయిన స్నేహితులకు నా క్షమాపణలు). ఆ జాబితా సైద్ధాంతికంగా తటస్థమైనది. తత్కారణంగానే నాకు ఏ మాత్రం భావసారూప్యతలేని హిందుత్వ, ఇస్లామిక్ చింతకులను కూడా ఆ జాబితాలో చేర్చాను.

రాజకీయ చింతనను ఒక పరిమితార్థంలోనే పరిగణనలోకి తీసుకున్నాను. ఆ ఈ కారణంగానే సామాజిక సిద్ధాంతవేత్తలు ఆంద్రే బెటిల్లె, జెపిఎస్ యుబెరోయి, ఇంతియాజ్ అహ్మద్, వీణాదాస్; తత్త్వశాస్త్ర కోవిదులు దయాకృష్ణ, రామచంద్ర గాంధీ; రచయితలు నిర్మల్ వర్మ, రఘువీర్ సహాయ్ మొదలైన వారిని ప్రస్తావించలేదు. అయితే కమలాదేవి చటోపాధ్యాయ, అరుణా అసఫ్ అలీ, సరోజినీనాయుడు మొదలైన మహిళా చింతకులను మినహాయించడాన్ని ప్రొఫెసర్ నందినీ సుందర్‌తో సహా పలువురు ఆక్షేపించారు. ఇది, నా జాబితాకు ఒక విలువైన సవరణ అని అంగీకరిస్తున్నాను. స్వతంత్ర భారత చింతకులలో ఇఎమ్ఎస్ నంబూద్రిపాద్‌ను; ఆ తరువాయి తరంలోని డిఆర్ నాగరాజ్, క్లాడ్ ఆల్వేర్స్‌ను కూడా చేర్చి ఉండవల్సింది. మన మధ్యనే ఉన్న అరుణారాయ్, దిలీప్ సిమ్‌యోన్, వందనా శివ, దేవనూర మహదేవ, ఆనంద్ తెల్తుంబ్డెలను నేను ఆదర్శంగా తీసుకున్న రాజకీయ చింతనా సంప్రదాయానికి ప్రతినిధులుగా ఉదహరించివుండవల్సింది. తొలితరం రాజనీతిశాస్త్ర విశారదులలో రణధీర్ సింగ్, రషీదుద్దీన్ ఖాన్, రామ్ బాపట్, శాంతి స్వరూప్, రాఘవేంద్రరావు, మనోరంజన్ మొహంతి పేర్లు కూడా చేర్చి ఉండవల్సింది. రాజనీతి శాస్త్రాన్ని, రాజకీయ చైతన్యశీలతను సంధానించిన విద్వజ్జులు వారు.

ఇంకా మరెంతో మంది చింతకులను, ముఖ్యంగా నేను చదవలేని భాషలలో రాస్తున్న వారిని నా జాబితాలో చేర్చలేకపోయానన్న విషయం నాకు బాగా తెలుసు. ఆ మినహాయింపులు నా పరిమితులే గానీ, నేను ముందుకు తెచ్చిన ప్రాథమిక వాదనకు అవి పరిమితులు కానే కావు. నేను ఈ చర్చను ఆరంభించేందుకు ప్రేరేపించిన లక్ష్యం ఏమిటి? ఆధునిక భారత రాజకీయ చింతన 'మరణాన్ని' గుర్తించి పరితాపం చెందడం ఎంతమాత్రం కాదు. మనం ఈ పరిస్థితి (దుస్థితి కాదూ?)కి ఎందుకు వచ్చాం, మన సమున్నత ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యానికి ప్రాణరక్షకమైన చింతనా సంప్రదాయాన్ని పునశ్శక్తిమంతం చేసేందుకు ఏమి చేయాలి, ఏమి చేయగలమని సమష్టిగా వివేచించేందుకు ఆహ్వానించడమే. అవును, 'జీవ మంత్రమేది అహో, ఈ మిత్తవ జాముల్లో' అని ఆక్రోశించనవసరం లేదు. ఆధునిక భారతీయ రాజకీయ చింతన మన రిపబ్లిక్‌కు ఒక సమున్నతమైన జీవగర్ర. దాని స్ఫూర్తి ఒక జీవ మంత్రం. మరి ఆ జీవ స్ఫూర్తిని ఆవాహన చేసుకునేందుకు పూనుకుందామా?

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

మరో 'వయనాడ్'.. ఎలా ఆపాలి?



■ సునీతా నారాయణ్

మట్టివాసన

వయనాడ్ ఒక ప్రదేశం మాత్రమే కాదు. పర్యావరణ దుర్ఘటనలకు అదొక ప్రతీక. అటువంటి విపత్తులు మరెన్నో సంభవించేందుకు ఆస్కారమున్న పరిస్థితులకూ వయనాడ్ ఒక తాజా ప్రతీక. సరిగ్గా నెల రోజుల క్రితం వయనాడ్‌లో భారీ స్థాయిలో కొండచరియలు విరిగిపడిన దుస్సంఘటనకు బాధ్యులు ఎవరు? ఎవరి అలక్ష్యం ఆ ఉపద్రవానికి దారితీసింది? ప్రాణనష్టం, ఆస్తినష్టం హృదయ విదారకంగా వాటిల్లేందుకు కారణమైన ప్రమాదం అనివార్యమైనది కాదు. నేను నా గత కాలమ్‌లో ఈ అంశాలను చర్చించాను (ఆగస్టు 15, 'వయనాడ్ విపత్తుకు కారకులు ఎవరు?').

వయనాడ్ విలయం వాటిల్లి నాలుగు వారాలు గడిచిపోయాయి. మన దృష్టి వేరే ప్రదేశాలలో వాటిల్లిన ప్రాకృతిక విధ్వంసాల పైకి మళ్లింది. అక్కడా ఇక్కడా, ఈ ధరిత్రిపై మరెక్కడైనా కొట్టివేయలేని ఒక సుస్థిర సత్యంగా ఉన్న వాతావరణ మార్పు, వయనాడ్ వినాశనంలో నిర్వహించిన పాత్రనూ నా గత కాలమ్‌లో వివరించాను. పశ్చిమ కనుమలలోని వయనాడ్ ప్రాంతం ఇప్పటికే దుర్బల పర్యావరణ సీమగా మారిపోయింది. విచక్షణారహిత మానవ కార్యకలాపాల మూలంగా వాతావరణ వైపరీత్యం పెచ్చరిల్లడంతో వయనాడ్ ఒక విషాద సీమగా పరిణమించింది. అందుకే పర్యావరణ విపత్తులు సంభవించేందుకు ఆస్కారమున్న పరిస్థితులకు వయనాడ్ ఒక ప్రతీక అన్నాను. మరి మరో 'వయనాడ్' సంభవించకుండా ఉండాలంటే మనమేమి చేయాలి?

తొలుత వయనాడ్‌లో అభివృద్ధి కార్యకలాపాలు అమలవుతున్న తీరుతెన్నులను అవగతం చేసుకుందాం. నా సహచరులు రోహిణి కృష్ణమూర్తి, పులాహ రాయ్ ఆ 'అభివృద్ధి'ని నిశితంగా పరిశీలించారు. జూలై 29 అర్ధరాత్రి వయనాడ్ జిల్లాలో సంభవించిన దుర్ఘటన నివారింప సాధ్యం కానిదని వారి దర్యాప్తులో వెల్లడయింది. భీతి గొల్పుతున్న వాస్తవమది. మరింతగా వివరిస్తాను. వెల్లెరిమల గ్రామ పరిధిలో కొండచరియలు విరిగిపడ్డాయి. సున్నిత పర్యావరణ ప్రాంతాలుగా కె. కస్తూరి రంగన్ కమిటీ నివేదిక (2013) పేర్కొన్న గ్రామాలలో వెల్లెరిమల కూడా ఒకటి. 'పశ్చిమ కనుమల సమగ్ర సుస్థిరాభివృద్ధికి అనుసరించవలసిన పద్ధతులను' సిఫారసు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నియమించిన ఆ కమిటీలో నేనూ ఉన్నాను. గ్రామ వైశాల్యంలో ఇరవై శాతానికి పైగా సున్నిత పర్యావరణ ప్రదేశాలు ఉన్న గ్రామాలు అన్నిటిలోనూ ప్రకృతి వనరులను మరింతగా ధ్వంసం చేసే అభివృద్ధి కార్యకలాపాలపై కఠిన ఆంక్షలు విధించి తీరాలని ఆ కమిటీ సిఫారసు చేసింది. ముఖ్యంగా మైనింగ్, క్వారీయింగ్ లాంటి విధ్వంస కార్యకలాపాలను అసలు అనుమతించవద్దని కూడా కస్తూరి రంగన్ కమిటీ స్పష్టంగా సూచించింది.



> మన దేశంలో సున్నిత పర్యావరణ ప్రాంతాలు మానవ ఆవాస ప్రదేశాలే గానీ నిర్జన స్థలాలు ఎంత మాత్రం కావు. ఆ ప్రాంతాలను సంరక్షించే విధానాలు సమ్మిళితంగా ఉండి తీరాలి. పర్యావరణ పరిరక్షణలో అక్కడి ప్రజలను సంపూర్ణ భాగస్వాములుగా చేసుకోవాలి. విషాదసీమ వయనాడ్ ఘోషిస్తున్న సత్యమది.

నవంబర్ 2013లో కస్తూరి రంగన్ కమిటీ నివేదికను కేంద్రం ఆమోదించింది. పర్యావరణ పరిరక్షణ చట్టంలోని ఐదవ సెక్షన్ కింద వయనాడ్ జిల్లాలో 60,000 చదరపు కిలోమీటర్ల సువిశాల ప్రాంతం పర్యావరణ పరంగా సున్నితమైనదని ప్రకటించింది. మైనింగ్, క్వారీయింగ్‌తో సహా ఆ ప్రాంతంలో నిర్దిష్ట అభివృద్ధి కార్యలాపాలు జరగకూడదని ఆంక్షలు విధించింది. అయితే కేరళ ప్రభుత్వం ఆ సిఫారసులకు ఒక సవరణను కోరింది సున్నిత పర్యావరణ ప్రాంతాలుగా పేర్కొన్న గ్రామాలలో నిలిపివేయడానికి వీలులేని ఇతర అభివృద్ధి కార్యకలాపాలు కొనసాగుతున్నందున అటువంటి గ్రామాలను పూర్తిగా సున్నిత పర్యావరణ ప్రాంతాలుగా ప్రత్యేకించకూడదని తమ సొంత కమిటీ ఒకటి నిర్ధారించిందని, కనుక ఆ గ్రామాలను మాత్రమే పాక్షికంగా సున్నిత పర్యావరణ గ్రామాలుగా ప్రకటించాలని కేరళ ప్రభుత్వం అభ్యర్థించింది. కస్తూరి రంగన్ కమిటీ సున్నిత పర్యావరణ ప్రాంతాలుగా పేర్కొన్న 13 గ్రామాలకు సంబంధించిన ఉపగ్రహ చిత్రాలను పులహరాయ్ పరిశీలించారు. ఆ 13 గ్రామాలలోను 15 క్వారీయింగ్ ప్రదేశాలు ఉన్నట్లు వెల్లడయింది. ఒక్క నూల్‌పూర్పు గ్రామంలోనే 6 క్వారీయింగ్ ప్రదేశాలు ఉన్నాయి. అటవీ ప్రాంతంగా ప్రత్యేకించిన భూములలోనే అవన్నీ ఉన్నాయి. ఈ నియమోల్లంఘన కథ ఇంకా ఉంది. 2017లో మైనింగ్ నిబంధనలను కేరళ ప్రభుత్వం సవరించిందని రోహిణి పరిశోధనలో వెల్లడయింది. ఒక నివాస గృహానికి 50 మీటర్ల ఆవల అటవీ భూములు, కొండ వాలు ప్రాంతాల్లో గానీ ఎక్కడైనా సరే పేలుడు సామగ్రిని ఉపయోగించేందుకు ఆ సవరణలు అనుమతిచ్చాయి. అంటే మీ ఇంటి వెనుక ఉన్న కొండలను అస్థిరపరిచే పరిస్థితులను సృష్టించడం చట్టబద్ధమే అవుతుంది.

ఈ పరిస్థితులను నివారించేందుకు మనమేమి చేయాలి అన్నది ఇప్పుడు అసలు ప్రశ్న. పశ్చిమ కనుమల పర్యావరణ రక్షణకు తొలుత మాధవ్ గాడ్గిల్ కమిటీ సిఫారసులను, ఆ తరువాత కస్తూరి రంగన్ కమిటీ సూచనల అమలును సున్నిత పర్యావరణ ప్రాంతాల ప్రజలే తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఆ ప్రాంతాలలో పర్యటించినప్పుడు పర్యావరణ పరిరక్షణ చర్యల పట్ల ప్రజల విముఖతను నేను స్వయంగా గమనించాను. పరిరక్షణ పద్ధతులు, చర్యలను ప్రజలు వీధులలోకి వచ్చి నిరసిస్తున్నారు. వారు తమ స్వార్థ ప్రయోజనాలకే ప్రాధాన్యమిస్తున్నారా? వాస్తవమేమిటంటే సున్నిత పర్యావరణ ప్రాంతాలుగా ప్రకటించడం ద్వారా తమ తోటలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవచ్చని, తాము అనుసరిస్తున్న వ్యవసాయ పద్ధతులపై ఆంక్షలు విధించవచ్చని వారు భయపడుతున్నారు. వారి భయాందోళనలకు కారణమేమిటి? పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వాలు తమ ఇష్టానుసారం, అదీ హేతుబద్ధం కాని నిర్ణయాలు తీసుకుని అమలుపరుస్తుండడమే సుమా!

పర్యావరణ పరిరక్షణ విధానాల రూపకల్పనలో మనం ఈ వాస్తవాలను తప్పక దృష్టిలో ఉంచుకోవాలి. పర్యావరణ వ్యవస్థల నిర్వహణకు అనుసరిస్తున్న పద్ధతులను మనం శీఘ్రగతిన మార్చుకోవల్సివుంది. వాతావరణ మార్పు పర్యవసానాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు ఇది తప్పనిసరి. పర్యావరణంపై మానవ కార్యకలాపాల ప్రభావం తీవ్ర స్థాయిలో ఉంటున్నందున ప్రకృతి వనరులకు హాని కలిగిస్తున్న సదరు కార్యకలాపాలపై కఠిన ఆంక్షలు విధించి తీరాలనే భావన ప్రాతిదికన పర్యావరణ పరిరక్షణ విధానాలను రూపొందిస్తున్నారు. ఇది సరైన విషయమే కావచ్చు గానీ మన దేశంలో సున్నిత పర్యావరణ ప్రాంతాలు మానవ ఆవాస ప్రదేశాలే గానీ నిర్జన స్థలాలు ఎంత మాత్రం కావు. ఇది వాస్తవం. ఆ ప్రాంతాలు జనవాసాలు మాత్రమే కాదు, వ్యవసాయ భూములకు నెలవులు కూడా. మరి అటువంటి సున్నిత పర్యావరణ ప్రాంతాలను సంరక్షించే విధానాలు సమ్మిళితంగా ఉండి తీరాలి. పర్యావరణ పరిరక్షణలో అక్కడి ప్రజలను సంపూర్ణ భాగస్వాములుగా చేసుకోవాలి. ఇందుకు ఆ ప్రాంతాలలోని సామాజిక సముదాయాలకు ప్రయోజనకరమైన ప్రోత్సాహకాలు సమకూర్చాలి.

కాఫీ, తేయాకు తోటల పెంపకం, పర్యావరణ—పర్యాటకం మొదలైన హరిత జీవనాధారాల ప్రాతిపదికన అభివృద్ధి పథకాలు రూపొందించుకోవడం చాలా చాలా ముఖ్యం. ప్రజల భూములను వారి భాగస్వామ్యంతో సంరక్షించడాన్ని మనం నేర్చుకోవాలి. వయనాడ్ విపత్తు చెప్పుతున్న సత్యమది. వాతావరణ మార్పు చిక్కులు జటిలమవుతోన్న ఈ కాలంలో విషాదసీమ వయనాడ్ పాఠాలు స్పష్టంగా ఉన్నాయి. మనం వాటిని నేర్చుకోవాలి. నేర్చుకోవడమంటే పర్యావరణకు అనుసరించే పద్ధతులను మార్చుకోవడమే. పర్యావరణ పరిరక్షణలో గుణప్రదమైన మార్పును సత్వరమే సాధించలేనిపక్షంలో మన మనుగడ శాశ్వతంగా అపాయంలో పడుతుంది.

('సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

వర్గీకరణం.. రణం.. సార్వకాలీన సత్యం!!



■ రాహుల్ కుమార్

రాజకీయాల్లో రణ నినాదాలు, ఆర్భాట ప్రకటనలు, శుష్క వాగ్దానాలు మాత్రమే కాదు.. అర్థవంతమైన మౌనాలు ఉంటాయి. మిగతా వాటి సంగతి ఎలా ఉన్నా ఒక దానిపై అర్థవంతమైన మౌనం ప్రస్తుతం రాజ్యమేలుతోంది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణను రాష్ట్రాలు చేపట్టవచ్చని సుప్రీంకోర్టు తీర్పుని ఇచ్చిన తర్వాత ప్రధాన జాతీయ పార్టీలు దాన్ని ఘనంగా పాటిస్తున్నాయి! ఎస్సీల్లో సంపన్నశ్రేణికి చెందిన వారికి రిజర్వేషన్లను మినహాయించటం మంచిదనే అభిప్రాయాన్ని నలుగురు న్యాయమూర్తులు వ్యక్తంచేయటంపై మాత్రం పార్టీలు స్పందించాయి. దళిత వర్గానికి చెందిన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్.గవాయ్ సంపన్న శ్రేణి మినహాయింపుపై విపులంగా వ్యాఖ్యలు చేశారు. నిజానికి సంపన్నశ్రేణిపై న్యాయమూర్తులది కేవలం సూచన మాత్రమే. అది ప్రధాన తీర్పులో భాగం కాదు. అయినా దానికి రెండు జాతీయ పార్టీలూ ప్రాధాన్యాన్ని ఇచ్చాయి. బీజేపీ సూటిగా స్పందించకుండా కేంద్ర క్యాబినెట్ అభిప్రాయం పేరుతో కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌తో ఒక ప్రకటనను చేయించింది. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారమే కేంద్రం నడుచుకుంటుందనీ అందులో సంపన్నశ్రేణి ప్రస్తావన లేదు కాబట్టి దాన్ని అమలుపరచబోమని మంత్రి చెప్పారు. ఎంత తరచి చూసినా అదొక విధాన ప్రకటనలా అనిపించదు. వర్గీకరణ తీర్పుపై అసంతృప్తితో ఉన్న కొన్ని ఎస్సీ వర్గాలను సమాధానపరచటానికి దాన్ని చేసినట్లుగా కనపడుతుంది. రాజ్యాంగంలో వర్గీకరణ విషయమూ లేదు. సంపన్నశ్రేణి ప్రస్తావనా లేదు. మండల్ కమిషన్ తీర్పు సందర్భంగా సుప్రీంకోర్టు సంపన్నశ్రేణి విషయంలో స్పష్టమైన ఆదేశాలిచ్చింది. సంపన్నశ్రేణి గురించి వివరణ ఇప్పించిన తర్వాత వర్గీకరణ అములుపై మాత్రం బీజేపీ నుంచి ఎటువంటి ప్రకటనా వెలువడలేదు.

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాత్రం సంపన్నశ్రేణిపై తమ పార్టీ వైఖరి ఏమిటో స్పష్టంగానే వెల్లడించారు. దాన్ని ఎస్సీలకు వర్తింపచేయకుండా చట్టం చేయాలని డిమాండు చేశారు. కానీ ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై రాష్ట్రాలకు అధికారం కల్పిస్తూ పార్లమెంటు ఒక చట్టాన్ని చేయాలని మాత్రం డిమాండు చేయలేదు. మొత్తం సమస్యను అధ్యయనం చేయటానికి ఒక కమిటీని కాంగ్రెస్ నియమించింది. ఆ కమిటీ ఇచ్చే నివేదికపై నిర్ణయం తీసుకునే వరకూ వర్గీకరణపై ఎవరూ మాట్లాడకూడదనీ ఆదేశించింది. పార్టీ పాలిత రాష్ట్రాల్లో కూడా వర్గీకరణపై నిర్ణయాలు తీసుకోకూడదని తేల్చిచెప్పింది. ఇక బీజేపీ వైపు నుంచి అట్లాంటి కమిటీ కూడా ఏర్పాటైనట్లు లేదు.

నిజానికి వర్గీకరణ సమస్య కొత్తది కాదు. ఎస్సీ వర్గాల మధ్యనే గాక సామాజిక న్యాయం కోసం రిజర్వేషన్లు ఉండాలని వాదించే మేధావులు, రాజకీయవేత్తల మధ్య ఎప్పటి నుంచో దానిపై చర్చలు సాగుతున్నాయి. ఆర్థికంగా, విద్యాపరంగా ఎదిగిన కులాల్లోని వారే రిజర్వేషన్లను అత్యధికంగా ఉపయోగించుకున్నారని చెప్పటానికి సమాచారం చాలా ఉంది. మిగతా కులాలకు చాలా వరకూ అవి చేరలేదన్న సంగతీ అనేక పరిశీలనల్లో తేలింది. అయినా పార్టీలు వర్గీకరణను అమల్లో పెట్టటానికి ఎందుకు వెనకడుగు వేస్తున్నాయని ప్రశ్నించుకుంటే కులాల సంఖ్యాబలాలనే అందుకు కారణంగా చెప్పుకోవాలి. ప్రజాస్వామ్యంలో గెలుపు ఓటములను నిర్ణయించేది సంఖ్యాబలమే కాబట్టి అది అధికంగా ఉండి రాజకీయ ప్రభావాన్ని చూపించే కులాలను దూరం చేసుకోటానికి పార్టీలు సిద్ధంగా లేవు. రకరకాల కారణాలతో అధిక పదవులనూ సంపదలనూ ఆదాయాలనూ అనుభవిస్తున్న వర్గాలు ఏ ఒత్తిళ్లు లేకుండా వాటిని వదులుకున్న సందర్భాలు చరిత్రలో లేవనే చెప్పాలి. అన్ని వర్గాలకూ కులాలకూ వర్తించే సార్వకాలీన సత్యం ఇది!

> ప్రజాస్వామ్యంలో గెలుపు ఓటములను నిర్ణయించేది సంఖ్యాబలమే కాబట్టి అది అధికంగా ఉండి రాజకీయ ప్రభావాన్ని చూపించే కులాలను దూరం చేసుకోటానికి పార్టీలు సిద్ధంగా లేవు. రకరకాల కారణాలతో అధిక పదవులనూ సంపదలనూ ఆదాయాలనూ అనుభవిస్తున్న వర్గాలు ఏ ఒత్తిళ్లు లేకుండా వాటిని వదులుకున్న సందర్భాలు చరిత్రలో లేవనే చెప్పాలి.



ఎస్సీల్లోనే కాదు బీసీల్లోనూ పలు రాష్ట్రాల్లో రిజర్వేషన్ల ఫలాలను కొన్ని కులాలే అత్యధికంగా అందుకున్నాయి. బిహార్‌లో చేపట్టిన సామాజిక ఆర్థిక కులగణనలో వెల్లడైన నిజమదే. ఓబీసీల్లోని మూడు నాలుగు కులాలే సింహభాగం రిజర్వుడు ఉద్యోగాలను, పదవులను చేజిక్కించుకున్నాయి. భూములు, భవనాలు, వస్తు, వాహనాలూ వారి దగ్గరే అధికంగా ఉన్నాయి. ప్రజలు స్వచ్ఛందంగా వెల్లడించిన సమాచారంలో చాలా పరిమితులు ఉంటాయి. ఆస్తులు, సంపద గురించి ఉన్నదున్నట్లుగా ప్రజలు ఒకపట్టాన చెప్పరు. అయినా ఆ పరిమిత సమాచారమే కులాల ఆర్థిక స్థితిగతులను కాస్త విపులంగా తెలుసుకోటానికి ఉపయోగపడుతుంది.

సామాజికంగా అణచివేతకు గురైన ఏ కులమూ ఇప్పుడు గతంలో లాగా లేదు. సంఖ్యాబలం బాగా ఉన్న ప్రతికులంలోనూ ఆర్థికపరమైన అంతరాలతో కూడిన వర్గాలు ఏర్పడ్డాయి. ఆర్థిక సంస్కరణలు అమలు తర్వాత ఈ అంతరాలు ఇంకా పెరగటం వల్ల ఓబీసీ కులాల్లో రాజకీయ సంఘీభావం కనపడటం లేదనీ ప్రముఖ రాజకీయ శాస్త్రవేత్త క్రిస్టాఫ్ జఫలాట్ వ్యాఖ్యానించటమే ఇందుకు నిదర్శనం. హిందీ రాష్ట్రాల్లో ఓబీసీ రాజకీయ పార్టీలు బలహీనపడటానికి వర్గపరమైన ఆర్థిక అంతరాలే కారణమని కూడా ఆయన వ్యాఖ్యానించారు. ఫ్రెంచ్ దేశస్థుడైనా జఫలాట్ లాగా దేశంలో ఓబీసీ రాజకీయాలను లోతుగా అధ్యయనం చేసినవారు చాలా అరుదునే చెప్పాలి. ఇక ఓబీసీల్లోని ఆధిపత్య కులాల పట్ల అసంతృప్తితో ఉన్న ఇతర కులాలను చేరదీసి రాజకీయంగా ప్రాధాన్యం ఇవ్వటం వల్లే హిందీ రాష్ట్రాల్లో బీజేపీ స్థిరంగా బలపడింది. ఒక్క హిందూత్వ రాజకీయాలపైన మాత్రమే ఆధారపడితే బీజేపీ ఎన్నికల్లో చాలా ఒడిదుడుకులకు లోనయ్యేది.


ఎస్సీ కేటగిరిలోని కులాలను సంఖ్యాబలం దృష్టితో పరిశీలిస్తేనే రిజర్వేషన్ల వర్గీకరణపై ఎందుకంత వ్యతిరేకత వస్తుందో కొంత మేరకైనా అర్థం చేసుకోగలం. 2011 నాటి జనాభా లెక్కల ప్రకారం చూస్తే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీలు 1,38,78,078 ఉన్నారు. మొత్తం 60 కులాలను ఎస్సీ జాబితాలో చేర్చారు. ఈ 60 కులాలోనూ లక్ష పైచిలుకు జనాభా ఉన్న కులాలు ఏడు మాత్రమే ఉన్నాయి. ఈ ఏడు కులాల జనాభాని లెక్కగడితే 1,31,26,029 మంది తేలారు. అంటే అక్షరాల 94.58 శాతం జనాభా ఈ ఏడు కులాల్లోనే ఉంది. మిగతా 53 కులాల మొత్తం జనాభా 7,52,049 (5.42 శాతం) మాత్రమే.

ఏడు కులాల మధ్య కూడా జనాభా పంపిణీలో వ్యత్యాసాలు విపరీతంగా ఉన్నాయి. ఈ ఏడు కులాల్లోని మాదిగ (67,02,609), మాల—మాలసాలె (57,03,491) లను కలిపి లెక్కిస్తే జనాభాలో 94.5 శాతం వాళ్లే కనపడతారు. మిగిలిన అయిదు కులాల... ఆది ఆంధ్ర, ఆది ద్రవిడ, బేడజంగం, రెల్లి... జనాభా 5.5 శాతం మాత్రమే. ఈ అంకెలు చూస్తే ఒక విషయం స్పష్టంగా తెలుస్తుంది. మాదిగలకు గణనీయ సంఖ్యాబలం లేకపోతే వర్గీకరణ పోరాటంలో వాళ్లు గెలిచి ఉండేవారు కాదు. అక్షరాస్యతలో ఆది ఆంధ్ర (62.4శాతం), ఆది ద్రవిడ (62.6శాతం), మాల (60.13శాతం), రెల్లి (56.2శాతం) పోల్చితే మాదిగలు (51.3శాతం) దిగువన ఉన్నప్పటికీ సంఖ్యా బలానికి రాజకీయ చైతన్యం తోడై వర్గీకరణ కోసం ఏళ్లపాటు ఆందోళన కొనసాగించటానికి దోహదం చేసింది. రిజర్వేషన్ల ఫలాలను అధికంగా అనుభవిస్తున్న కులాలకు దీటుగా ఆ ఫలితాలను అనుభవించలేని కులాలకు తగిన సంఖ్యాబలం లేకపోతే, వారి పోరాటాల ఫలితాలు ఎలా ఉంటాయో ఊహించలేం! జనాభాలో దళితులు అయిదో వంతు ఉన్న ఉత్తరప్రదేశ్‌లో కూడా కులాల సంఖ్యాబలంలో ఇలాంటి అసమానతలే కనిపిస్తాయి. అక్కడ జాతవ్‌లు (అనుబంధ కులాలతో కలిపి) 2,24,96,047 మంది ఉన్నారు. రాజకీయంగా వారిదే ఆధిపత్యం. మొత్తం ఎస్సీ జనాభాలో (4,13,57,608) జాతవ్‌ల వాటా 54.39 శాతం ఉంది. పాసి—తార్‌మలి కులం (65,22,166) రెండో స్థానంలో ఉంది. మొత్తం 66 ఎస్సీ కులాల్లో 10వేల లోపు జనాభా ఉన్న కులాలు 36 ఉన్నాయి. లక్షపైన ఉన్న కులాలు 15 ఉన్నాయి. ఆర్థిక, విద్యాపరమైన తేడాలు అక్కడ కులాల మధ్య కూడా చాలా ఎక్కువ. జాతవ్‌ల్లో అక్షరాస్యులు 53 శాతం ఉంటే ముసాహర్‌ల్లో 19.16 శాతం మందికి మాత్రమే అక్షర జ్ఞానం ఉంది.

జనాభా లెక్కల్లో నమోదైన సమాచారం కొంతమేరకే వాస్తవ చిత్రాన్ని అందిస్తుంది. దాన్ని నిశితంగా పరిశీలించినా ఎస్సీ, ఎస్టీ కులాల్లో అసమానతలు కొట్టొచ్చినట్లు కనపడతాయి. ఇక వివిధ కేటగిరీ ఉద్యోగాల్లో, పదవుల్లో లెక్కలను నిర్దిష్టంగా ప్రభుత్వాలు సేకరిస్తే ఎన్నో విషయాలు వెలుగులోకి వస్తాయి. ఎవరు ఎక్కడ ఉన్నారో తేలుతుంది. రిజర్వేషన్ల వర్గీకరణ రాజ్యాంగబద్ధమేనని సుప్రీంకోర్టు ప్రకటించినా రాజకీయ దృష్టితో అసంబద్ధంగా దాన్ని చేపడితే ఉపేక్షించబోమని స్పష్టంచేసింది. విద్య ఉద్యోగాలకు సంబంధించి వివిధ స్థాయిల్లో తగినంత ప్రాతినిధ్యం లేదని పక్కాగా సమాచారాన్ని సేకరించిన తర్వాతే సంబంధిత కులాలకు రిజర్వేషన్ల శాతాన్ని నిర్ణయించాలని నిర్దేశించింది. అట్లా జరగని పక్షంలో ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలు న్యాయసమీక్షకు నిలబడాల్సి వస్తుందనీ హెచ్చరించింది. జనాభా సంఖ్యకు దామాషాగా ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ఉండాలనీ కాకుండా, సముచిత ప్రాతినిధ్య కోణం నుంచి మాత్రమే తగిన వాటాలు కల్పించాలని తీర్పు సారాంశంగా అర్థం చేసుకోవచ్చు. సుప్రీంకోర్టు షరతులు, వ్యాఖ్యల నేపథ్యంలో వర్గీకరణను చేపట్టి రిజర్వేషన్ల శాతాన్ని నిర్ణయించటం ప్రభుత్వాలకు కత్తిమీద సామే అవుతుంది.

వర్గీకరణ డిమాండ్లను దీర్ఘకాలిక ఆర్థిక మార్పుల నేపథ్యంలో పరిశీలిస్తే ఒక విషయం స్పష్టమవుతుంది. కులానికి కులం మొత్తంగా కొన్నిచోట్ల సామాజికంగా, ఆర్థికంగా ఒకే స్థాయిలో వెనుకబడి ఉండొచ్చు. ముఖ్యంగా ఆధునిక ఆర్థిక వ్యవస్థ పూర్తిగా చొచ్చుకెళ్లని మారుమూల గ్రామాల్లో కొన్నిచోట్ల అంతర్గత తారతమ్యాలు కింది కులాల్లో కొట్టొచ్చినట్లు కనపడకపోవచ్చు. కానీ వాటి సంఖ్య గణనీయమని ఇప్పుడు చెప్పుకోలేం. కులాల మధ్యా అంతర్గతంగా విడివిడి కులాల్లోనూ ఆర్థిక, విద్యా అసమానతలే క్రమేపీ పైచేయిని సాధిస్తున్నాయి. వర్గీకరణ డిమాండ్లకు అవే కారణమవుతున్నాయి. అధికారార్జనకు రాజకీయ పాచికగా మారకపోతే... ఆర్థిక, సామాజిక, కులగణనతో కొంత నిఖారైన చిత్రం కనపడే అవకాశమూ ఉంటుంది. అప్పుడు చేపట్టే చర్యల ద్వారా కులగణన కోసం అలుపెరగకుండా వాదనలు చేస్తున్న కాంగ్రెస్ తదితర పార్టీల అసలు రంగులు బయటపడతాయి. కచ్చితమైన లెక్కలు వచ్చినప్పుడు ఎస్సీ, ఎస్టీల్లో సంపన్నశ్రేణి విభజన అవసరమో కాదో కూడా స్పష్టమవుతుంది.

(ఆంధ్రజ్యోతి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్)





జనగామ కలెక్టరేట్‌లో పవర్ పాయింట్ ప్రజంటేషన్ వీక్షిస్తున్న గవర్నర్

దేవాదుల వద్ద ఇంటేక్‌వెల్ (ఫైల్)





దేవన్నపేట వద్ద నిర్మించిన దేవాదుల ప్రాజెక్టు మూడోదశ టన్నెల్ (ఫైల్)

దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. 2004లో కాంగ్రెస్ హయాంలోనే మొదలైన దేవాదుల ప్రాజెక్టును 2025 డిసెంబరు నాటికి పూర్తి చేసేందుకు సన్నద్ధమవుతోంది. ఈ మేరకు రూ.3,312కోట్ల నిధులు, 2,947 ఎకరాల భూసేకరణకు సర్కారు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అయితే గత ప్రభుత్వం తయారు చేసిన రీడిజైన్‌ను పక్కన పెట్టి 2004లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం నిర్ణయించిన పద్ధతిలోనే ప్రాజెక్టును నిర్మించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తోంది. ఇప్పటికే ఫేస్-1, 2 పనులు పూర్తి కాగా, కీలకమైన మూడో దశ పనులు తుదిదశకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్వయంగా గోదావరి తీరంలోని దేవాదుల పంపుహౌస్‌ను పరిశీలించటంతో పాటు ఇంజనీరింగ్ అధికారులతో అక్కడే సమీక్ష నిర్వ హించనున్నారు.

'దేవాదుల'లో కదలిక

ప్రాజెక్టు నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి

- వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి పూర్తయ్యేలా లక్ష్యం
- పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు కసరత్తు
- గత ప్రభుత్వ రీ డిజైన్‌ను పక్కన పెట్టి.. పాత పద్ధతిలోనే ముందుకు..
- రూ.3,312 కోట్ల నిధులు, 2,947 ఎకరాల భూ సేకరణకు గ్రీన్‌సిగ్నల్
- కొత్తగా 89,312ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించాలని నిర్ణయం
- 8 జిల్లాల రైతాంగానికి సాగుకు అందనున్న గోదావరి నీళ్లు
- నేడు దేవాదుల ఇంజనీర్లతో ముగ్గురు మంత్రుల సమీక్ష

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ఉమ్మడి వరంగల్ జిల్లాకు వరప్రదాయినిగా భావించే దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. 20 కిందట పురుడు పోసుకున్న దేవాదుల ప్రాజెక్టును గత పాలకులు నిర్లక్ష్యం చేశారు. మళ్లీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రూ.10వేల కోట్లలోపు పూర్తయ్యే వాటిని ప్రాధాన్యత ప్రాజెక్టులుగా గుర్తించింది. ఈ నేపథ్యంలో దేవాదులపై పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించింది. 2017లో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన రీ డిజైన్‌ను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పక్కన పెట్టింది. 60 టీఎంసీల నీటిని లిఫ్టు చేసి 6.25 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని గత ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. అయితే భారీగా అంచనా వ్యయం పెరగటంతోపాటు ప్రయోజనం కూడా అంతంతే ఉందని భావిస్తున్న ప్రస్తుత ప్రభుత్వం.. అంతకుముందున్న డిజైన్ వైపే మొగ్గు చూపింది. 38.16 టీఎంసీల నీటిని లిఫ్టు చేసి 5,56,722 ఎకరాలకు సాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే గత ప్రభుత్వం ఒక టీఎంసీ నీటిని 10వేల ఎకరాలకు మాత్రమే సాగునీరందించవచ్చునని లెక్కలు వేస్తే.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఒక్క టీఎంసీ నీటితో 15,360 ఎకరాల సాగు విస్తీర్ణంగా నిర్ణయించారు.



దేవాదుల వద్ద పంపుహౌస్

మూడు దశల్లో నిర్మించిన దేవాదుల ప్రాజెక్టు నుంచి ఏ దశ నుంచి ఎన్ని టీఎంసీలు, ఎన్ని ఎకరాలకు సాగునీరు అందించవచ్చునో ఇంజనీర్లు కొత్తగా డీపీఆర్‌ను రూపొందించారు. తొలిదశ నుంచి మూడు రిజర్వాయర్లను, నాలుగు పంపుహౌస్‌ల ద్వారా 5.18టీఎంసీల నీటిని లిఫ్టు చేసి, 1,23,768 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తున్నారు. రెండో దశలో 9 రిజర్వాయర్లు, ఏడు పంపుహౌస్‌ల ద్వారా 7.25టీఎంసీల నీటిని ఎత్తిపోసి 1,93,164 ఎకరాలకు సాగునీరు అందించవచ్చునని అంచనా వేశారు. ఇక ప్రాజెక్టులో కీలకమైన మూడో దశ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఈ మూడో దశ పనులు పూర్తి అయితే 10 పంపుహౌస్‌ల ద్వారా 25.75 టీఎంసీల నీటిని లిఫ్టు చేసి 2,39,790 ఎకరాలకు సాగునీరు అందనుంది. మొత్తం దేవాదుల ప్రాజెక్టు ద్వారా 170 రోజుల్లో 38.16 టీఎంసీల నీటిని లిఫ్టు చేసి 5,56,722 ఎకరాలకు సాగునీరు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

కాగా, మూడోదశలోనే ప్రపంచంలోనే అతిపెద్ద సొరంగాన్ని ములుగు జిల్లా జాకారం నుంచి హనుమకొండ జిల్లా దేవన్నపేట వరకు 49.6కిలో మీటర్లు నిర్మించారు. సుదీర్ఘకాలం పాటు ఈ భూగర్భ సొరంగాన్ని తవ్వారు. అనేక ఇబ్బందుల తరువాత అతిపెద్ద సొరంగం నుంచి గోదావరి జలాలను తరలించే పనులు పూర్తి చేశారు. ఈ సొరంగంలో ఆరు షాఫ్ట్‌లు, 10 ఆడిట్ పాయింట్లు ఏర్పాటు చేశారు. దేవన్నపేట రిజర్వాయర్ వద్ద నిర్మించిన అతిపెద్ద సర్జ్‌పూల్‌లోకి దేవాదుల నుంచి లిఫ్ట్‌ల ద్వారా గోదావరి జలాలు చేరుతాయి. ఈ సర్జ్‌పూల్‌ను 25మీటర్ల డయాతో 135మీటర్ల లోతున్న వెల్ టైప్‌లో నిర్మించగా, 141 మీటర్ల లోతులో పంపుహౌస్ ఏర్పాటు చేశారు. ఈ పనులు తుదిదశకు చేరటంతో త్వరలోనే మూడోదశ నుంచి కూడా ఎత్తిపోతలు చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో ములుగు, భూపాలపల్లి, హనుమకొండ, వరంగల్, జనగామ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, కరీంనగర్ తదితర జిల్లాలోని రైతాంగానికి 5.57లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుంది.

పెరుగుతూ వచ్చిన అంచనాలు

జూన్ 16, 2003లో అప్పటి సీఎం చంద్రబాబునాయుడు రూ.4,400కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. అయితే ఈపీసీ విధానంలో పిలిచన టెండర్ల ప్రక్రియలో ఆలస్యం కావటంతో 2004లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దేవాదుల ప్రాజెక్టును రీ డిజైన్ చేసింది. మూడు దశల్లో దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేసేందుకు లక్ష్యంగా పెట్టుకుని ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని

మిగతా 7వ పేజీలో..







నేడు ముగ్గురు మంత్రుల సమీక్ష

దేవాదుల ప్రాజెక్టును త్వరగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే మూడు దఫాలుగా దేవాదుల ఇంజనీర్లతో ప్రభుత్వం సమీక్షలు నిర్వహించింది. గత ప్రభుత్వం తీసుకువచ్చిన రీ డిజైన్‌ను పక్కన పెట్టింది. తక్కువ ఖర్చుతో దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేసేందుకు డీపీఆర్‌ను తయారు చేసింది. వచ్చే ఏడాది డిసెంబరు నాటికి దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేయాలని, కొత్తగా 89,312 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలని ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకుంది. దీంతో శుక్రవారం ఉదయం 9 గంటలకు రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్కలు స్వయంగా దేవాదుల ప్రాజెక్టును పరిశీలించనున్నారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం దేవాదుల వద్ద గోదావరిపై నిర్మించిన ఎత్తుపోతల పథకం పంపుహౌస్‌ను పరిశీలించనున్నారు. అక్కడే దేవాదుల ఇంజనీర్లతో ప్రాజెక్టుపై సమీక్ష చేయనున్నారు.

జనగామ జిల్లా పోరాటాల గడ్డ

- ఇక్కడి చరిత్ర తెలుసుకోవడం సంతోషంగా ఉంది
- సమన్వయంతో గొప్ప విజయాలను అందుకోవాలి
- జనగామ పర్యటనలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- కలెక్టరేట్‌లో కవులు, కళాకారులతో భేటీ
- ఓబుల్‌కేశవాపూర్‌లో వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



మాట్లాడుతున్న గవర్నర్

జనగామ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా పోరాటాలకు గడ్డ అని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కొనియాడారు. ఈ ప్రాంత పోరాటాలను, పోరాట వీరుల చరిత్రను తెలుసుకోవడం తన చాలా సంతోషాన్నిచ్చిందని అన్నారు. ఎందరో గొప్ప వ్యక్తులను జన్మనిచ్చిన ఈ జిల్లాకు రావడం తాను అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా మూడో రోజైన గురువారం జనగామ జిల్లాలో ఆయన పర్యటించారు. జనగామ కలెక్టరేట్‌లో అధికారులు, కవులు, కళాకారులతో భేటీ, ఓబుల్‌కేశాపూర్‌లోని వేంకటేశ్వరస్వామి 8వ వార్షిక బ్రహ్మోత్సవాలలో ఆయన పాల్గొన్నారు. గురువారం ఉదయం 9.56 గంటలకు గవర్నర్ జనగామ కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఆయనకు బోనాలు, కోలాటం, ఒగ్గుడోలు కళాకారుల విన్యాసాల నడుమ అధికారులు స్వాగతం పలికారు. గవర్నర్‌కు కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్లు పింకేశ్‌కుమార్, రోహిత్ సింగ్, డీసీపీ రాజమహేంద్రనాయక్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పుష్పగుచ్ఛాలు, శాలువతో స్వాగతం పలికారు. ఆ తర్వాత పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం అక్కడి నుంచి ఆయన నేరుగా కలెక్టరేట్‌లో డీఆర్‌డీఏ, విజయ డెయిరీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. ఇందిరా మహిళ శక్తి పథకం కింద అందించిన బ్యాంకు లింకేజీ రుణాలతో ఏర్పాటు చేసిన యూనిట్ల గురించి, విజయ డెయిరీ పాల ఉత్పత్తుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో అధికారులు, కవులు, కళాకారులు, వివిధ రంగాల్లోని ప్రముఖులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సమావేశంలో భాగంగా

మిగతా 7వ పేజీలో..

మావోయిస్టు ఏరియా కమిటీ సభ్యుడి

లొంగుబాటు

రూ.4లక్షల రివార్డు అందించిన సీపీ



మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, ఆగస్టు 29: సీపీఐ మావోయిస్టు పార్టీ ఏరియా కమిటీ సభ్యుడు బుజగుండ్ల అనిల్ పోలీసుల ఎదుట లొంగిపోయాడు. మావోయిస్టు పార్టీలో రెండేళ్లకుపైగా పనిచేసిన అనిల్.. అనారోగ్య కారణాలతో లొంగిపోయాడు. గురువారం హనుమకొండలోని కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీపీ అంబర్ కిషోర్‌ఝా లొంగిపోయిన అనిల్ వివరాలు వెల్లడించారు.

వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం అర్షనపల్లి గ్రామానికి చెందిన అనిల్, అలియాస్ క్రాంతికిరణ్ తల్లిదండ్రులు గతంలో మావోయిస్టు పార్టీలో పనిచేసి మరణించారన్నారు. దీంతో తాతయ్య - నానమ్మల వద్ద అనిల్ పెరిగారన్నారు. హైదరాబాద్‌లో ఎల్‌ఎల్‌బీ చేస్తూ అనిల్ మావోయిస్టు అనుబంధ సంస్థలో పనిచేసేవాడని తెలిపారు. మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు బడే చొక్కారావు ప్రోత్సాహంతో 2021లో మావోయిస్టు పార్టీలో చేరారన్నారు. పార్టీకి చెందిన పలువురు నేతల వద్ద సహాయకుడిగా చేశారన్నారు. అనంతరం 2023లో చత్తీస్‌గఢ్ మడ్ ఏరియా కమిటీ సభ్యుడిగా బాధ్యతలు చేపట్టి సెంట్రల్ కమిటీ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ ఆధ్వర్యంలో మావోయిస్టు పార్టీ ప్రచార కర్తగా పనిచేశాడని అన్నారు. ఈ యేడు జూలైలో అనిల్ తెలంగాణ రాష్ట్ర కమిటీలో ఏరియా కమిటీ సభ్యుడిగా నియమించబడ్డారాన్నరు. అగ్రనేతల సూచనల మేరకు పత్రికల్లో కథనాలు, వ్యాసాలు, వీడియోలు, ఇంటర్‌నెట్ సంబంధించిన కార్యకలాపాలు నిర్వహించేవాడని సీపీ చెప్పారు. కొద్దిరోజులుగా నరాల సంబంధ వ్యాధితో పాటు మావోయిస్టు పార్టీకి ప్రజల నుంచి ఎదురవుతున్న వ్యతిరేకత కారణంగా అనిల్ లొంగిపోయినట్లు చెప్పారు.

కాగా, కమిషనరేట్ పరిధిలో మావోయిస్టుల ఉనికి లేకుండా చేస్తామని సీపీ తెలిపారు. లొంగిపోయిన వారికి పునరావాసం కల్పించేందుకు సహకరిస్తామని పేర్కొన్నారు. కాగా, అనిల్‌పై ప్రభుత్వం ప్రకటించిన రూ.4లక్షల రివార్డును ఈ సందర్భంగా కమిషనర్ అందించారు. ఈ విలేకర్ల సమావేశంలో డీసీపీ రవి, ఏసీపీ జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఇదిలా వుండగా, ఎల్‌ఎల్‌బీ రెండే సంవత్సరం చదువుతున్న తాను.. కోర్సు పూర్తి చేస్తానని అనిల్ తెలిపారు.

పోలింగ్‌స్టేషన్లు, ఓటర్ల జాబితా రూపొందించాలి

- రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఎలక్షన్ కమిషనర్ పార్థసారథి



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎలక్షన్ కమిషనర్ పార్థసారథి, పాల్గొన్న కలెక్టర్ ప్రావీణ్య, ఇతర అధికారులు

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు 29: గ్రామ పంచాయతీల వారిగా ఓటరు, పోలింగ్ స్టేషన్ల జాబితాను రూపొందించాలని రాష్ట్ర ఎలక్షన్ కమిషనర్ పార్థసారథి కోరారు. ఈ మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, డీపీవోలతో హైదరాబాద్ నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఎన్నికలకు సంబంధించిన ప్రతీ పనికి మాడ్యుల్ ఉందని, దాని ప్రకారం ముందుకెళ్లాలన్నారు. ఓటరు జాబితా తయారీ, మ్యాపింగ్ పనులు చేసేందుకు ప్రతీ మండలంలో డేటా ఎంట్రీ ఆపరేటర్, కంప్యూటర్, ఇంటర్నెట్ సదుపాయం ఉండేలా చూసుకోవాలన్నారు. అన్ని మండలాల్లో కావాల్సిన అధికారులు, సిబ్బంది ఉన్నారో లేదో తెలుసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్లను ఆదేశించారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఇచ్చిన ఓటరు జాబితాను గ్రామాల వారిగా సిద్ధం చేయాలన్నారు. ప్రతీ పోలింగ్ స్టేషన్ పరిధిలో 600-650మంది ఓటర్లు ఉండేలా చూసుకోవాలని, ఓటర్లను బట్టి కేంద్రాలను సిద్ధం చేయాలన్నారు. గత ఎన్నికల సందర్భంగా ఎదురైన సమస్యలు గుర్తించాలని, మరోసారి రాకుండా చూడాలని ఆదేశించారు.

ఓటరు జాబితా ప్రదర్శించాలి

వార్డుల వారిగా రూపొందించిన ఫొటోలతో కూడిన ఓటర్ల జాబితాను సెప్టెంబర్ 6వ తేదీన అన్ని గ్రామపంచాయతీలు, మండల పరిషత్ కార్యాలయాలలో ప్రదర్శించాలని ఎలక్షన్ కమిషనర్ పార్థసారథి పేర్కొన్నారు. సెప్టెంబర్ 9న జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీలతో జిల్లా స్థాయి ఎన్నికల అధికారులు, 10వ తేదీన ఎంపీడీవోల ఆధ్వర్యంలో మండలస్థాయిలో సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు, మార్పులు, చేర్పులు సెప్టెంబర్ 7 నుంచి 13వ తేదీ వరకు స్వీకరించాలని, ఆర్డీవోల ఆధ్వర్యంలో వాటిని చేపట్టాలని సూచించారు. అభ్యంతరాలు సెప్టెంబర్ 19వతేదీలోగా జిల్లా పంచాయతీ అధికారి ద్వారా పూర్తి చేయాలని, పూర్తిస్థాయి వార్డులు, ఫొటోలు, ఓటర్ల జాబితాను 21వ తేదీన అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శించాలన్నారు.

జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీరమాకాంత్, ఆర్డీవోలు, ఇతర అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ప్రశంసలు

ఓటర్ల జాబితా తయారీ, పోలింగ్ కేంద్రాల వివరాలు ఎప్పటికప్పుడు రూపొందించడంలో ప్రతిభను చూపిన కలెక్టర్ ప్రావీణ్యను ఎన్నికల కమిషనర్ ప్రశంసించారు. జిల్లాలో 208 గ్రామాలు ఉండగా, మెర్జింగ్ ప్రక్రియ 85 శాతం పూర్తయిందని, మిగతా ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ ఎన్నికల కమిషనర్‌కు తెలిపారు. జిల్లాలో మొత్తం ఓటర్లు 3,73,900 మంది ఉన్నారని కలెక్టర్ వివరించారు.

దోపిడీ దొంగల బీభత్సం

- భార్య గొంతుపై కత్తి పెట్టి, భర్త చేతులను కట్టేసి దుండగుల చోరీ
- రూ.లక్ష నగదు, 5తులాల బంగారం, బైక్ అపహరణ
- డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీమ్‌లతో పోలీసుల తనిఖీ
- భూపాలపల్లి జిల్లా బస్వాపూర్‌లో ఘటన



క్లూస్‌టీం తనిఖీలు, ఇంట్లో రక్తపు మరకలు



దొంగల చేతిలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న స్వర్ణలత

వివరాలు 7లో..

రుణమాఫీ కాని రైతులు వివరాలు

నమోదు చేసుకోవాలి

బాలసముద్రం, ఆగస్టు 29: రుణమాఫీకాని రైతులు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో వారి కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేసుకోవాలని గురువారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రవీందర్‌సింగ్ ఒక ప్రకటనలో రైతులను కోరారు. జిల్లాలోని ఇప్పటివరకు ఆత్మకూరు 399, భీమదేవరపల్లి 848, దామెర 199, ధర్మసాగర్ 213, ఎల్కతుర్తి 216, హనుమకొండ 883, హసన్‌పర్తి 563, ఐనవోలు 353, కమలాపూర్ 750, కాజీపేట 656, పరకాల 927, శాయంపేట 87, వేలేరులో 118 మంది రైతులు కుటుంబ వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు. ఇంకా ఎవరైనా రైతులు తమ వివరాలు నమోదు కానీ పక్షంలో వెంటనే రైతులు ధ్రువీకరణ పత్రం ఆయా మండలాల పరిధిలో వ్యవసాయ అధికారులకు అందించి యాప్‌లో నమోదు చేసుకోవాలని కోరారు.


















రాయపర్తి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల

రాయపర్తి గురుకులంలో రగడ

రెగ్యులర్, తాత్కాలిక ఉద్యోగుల మధ్య గొడవ

ఠాణాలో ఒకరిపై ఒకరు ఫిర్యాదులు.. అధికారుల విచారణ

రాయపర్తి, ఆగస్టు 29: రాయపర్తి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో ఉద్యోగుల మధ్య గలాటా రచ్చకెక్కింది. ఉద్యోగులు ఒకరిపై ఒకరు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు వరకు వెళ్లడంతో గురువారం ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. రాయపర్తి గురుకుల పాఠశాలలో 15ఏళ్ల క్రితం ఔట్ సోర్సింగ్ విధానంలో మహిళా ఉద్యోగిని ల్యాబ్ అటెండర్‌గా విధుల్లో చేరింది. కీలక రికార్డుల సెక్షన్ల నుంచి జూనియర్, సీనియర్ అసిస్టెంట్ల పనులను ఆమెనే చూస్తోంది. గురుకులంలో ఏడాదికోసారి కొన్ని పనులకు, విద్యార్థులు తినే ఆహారాలకు టెండర్లలో ఆమె పాత్ర కూడా ఉంటుందని ప్రచారం సాగుతోంది. ఆమెకు అన్ని విధాలా గత ప్రిన్సిపాల్ కూడా సహకారం అందించినట్టు ప్రచారం సాగుతోంది. ఇదిలాఉంటే 18నెలల క్రితం రెగ్యులర్ పోస్టులో జన్ను రాజు అనే వ్యక్తి జూనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు చేపట్టాడు. కానీ, అక్కడ పెత్తనమంతా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిని చేతుల్లోనే ఉండడం, రికార్డుల వివరాలు, ఇతరత్రా పనులన్నీ ఆమెనే చేపట్టడంతో రెగ్యులర్ పోస్టులో వచ్చిన రాజుకు మింగుడు పడలేదు. అప్పటి నుంచి ఇద్దరి మధ్య తరచూ వాగ్వాదాలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. ఇటీవల ఓ ఉద్యోగి బదిలీ కాగా, అతని సర్వీస్ రికార్డు లభించలేదు. దీనికి సదరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగి వ్యవహారమే కారణమని తెలుస్తోంది. నిబంధన మేరకు రికార్డుల నిర్వహణ, ఇతరత్రా పనులన్నీ రెగ్యులర్ ఉద్యోగులు చేయాల్సి ఉండగా, ఆమెనే చేస్తోంది. ఈనేపథ్యంలో ఒకరినొకరు ప్రశ్నించుకునే క్రమంలో సదరు మహిళా ఉద్యోగి తనను కులంతో దూషించిందని రాజు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విషయం ఆమె రాజు తన పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని ఫిర్యాదు చేసింది. దీంతో పంచాయితీ రచ్చకెక్కింది.

జోనల్ ఆఫీసర్ రహస్య సమావేశం

రాయపర్తి గురుకులంలో జరుగుతున్న వ్యవహారం ఉన్నతాధికారుల దృష్టికి చేరడంతో గురువారం జోనల్ ఆఫీసర్ స్వరూపారాణి, జిల్లా కో-ఆర్డినేటర్‌తో కలిసి విచారణ చేపట్టారు. వారు రహస్య సమావేశం ఏర్పాటు చేసి రెగ్యులర్ ఉద్యోగి, ఔట్ సోర్సింగ్ ఉద్యోగితో వేరువేరుగా భేటి కావడంతో పాటు మళ్లీ కలిసి సమావేశమై వారి వద్ద నుంచి వివరాలు సేకరించారు.

ప్రిన్సిపాల్ దురుసు ప్రవర్తన

ప్రిన్సిపాల్ సరిత గురువారం విలేకరులతో దురుసుగా ప్రవర్తించారు. గురుకులంలో విచారణ చేస్తున్న విషయం తెలుసుకున్న మీడియా అక్కడికి చేరుకోవడంతో వారిని లోపలికి రానివ్వకుండా అడ్డుకుంది. ఇదేంటని ప్రశ్నించిన విలేకరులపై వారిపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రిన్సిపాల్‌గా విధుల్లో చేరిన నాటి నుంచి రికార్డుల నిర్వహణ, గురుకులంలో రెగ్యులర్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల విధులపై కనీస అవగాహన లేకపోవడమే ఈ గొడవకు కారణంగా స్థానిక ఉద్యోగులు భావిస్తున్నారు.

రాజీమార్గం చేస్తున్న అధికారులు

ఉద్యోగులు పరస్పరం పోలీస్ స్టేషన్లలో ఫిర్యాలు చేసుకుని రెండు రోజులు గడుస్తున్నప్పటికీ పోలీసులు ఇంకా ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఇటు గురుకులంలో రహస్య భేటీలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఉద్యోగుల మధ్య సంధి మార్గం కుదర్చి ఓ ఒప్పందానికి రానున్నట్లు తెలుస్తోంది. కేసులు నమోదైతే గురుకులం పేరు మసక బారుతుందని ఉన్నతాధికారులు భావిస్తున్నట్లు సమాచారం.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

మహబూబాబాద్ రూరల్ ఆగస్టు 29: అప్పులబాధతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లాలోని మహబూబా బాద్ మండలం నడివాడలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. నడివాడ గ్రామానికి చెం దిన పెద్దల పాపయ్య (51) వ్యవసాయం చేసుకుంటూ కుటుం బాన్ని పోషించు కుంటున్నాడు. తనకున్న రెండెకరాల వ్యవసాయ భూమితోపాటు మరో రెండెకరాలు కౌలుకుతీసుకుని గత ఏడాది రెండు ఎకరాల్లో మిర్చిసాగు చేశాడు. మిగతా రెండె కరాల్లో పత్తి, వరి పంటలు వేశాడు. తోటకు వైరస్ సోకడంతో దిగుబడి రాక, చేసిన అప్పులతో పాటు కుటుంబ అవసరాలతో పాటు రూ.8 లక్షలు బాకి చేశాడు. ఈ సంవత్సరం కూడా రెండెకరాల్లో మిర్చిసాగు చేయగా.. తోట ఎండిపోవడంతో మనో వేదనకు గురైన పాపయ్య మధ్యాహ్నం పొలంవద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానిక రైతులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వెంటనే పాపయ్యను మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య సారమ్మ, కుమారులు సంపత్, సందీప్ ఉన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

తొర్రూరు, ఆగస్టు 29: పెట్రోల్ పోసుకుని ఓ మహిళా ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘట న గురువారం తొర్రూరులో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం. పెద్దవంగర మండలం అవుతాపురం గ్రామానికి చెందిన బుర్రి రమకు తొర్రూరుకు చెందిన షబ్బీర్ అనేవ్యక్తి డబ్బులు ఇవ్వాల్సి ఉంది. డ బ్బుల కోసం ఆమెను చాలా రోజులుగా తిప్పుతున్నాడు. ఈ క్రమంలో గురువారం అతని షాప్ వద్దకు వచ్చి డబ్బులు ఇస్తారా! ఇవ్వరా? అని బెదిరిస్తూ.. ఒంటిపై పెట్రోల్ పోసుకుని రమ ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. గుర్తించిన స్థానికులు పక్కనే ఉన్న వాటర్‌ట్యాంక్ వద్దకు తీసుకెళ్లి మంటలు ఆర్పారు. చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి.ఉపేందర్ తెలిపారు.


ఆత్మహత్యకు యత్నించిన మహిళ

అనారోగ్యంతో విద్యార్థి మృతి

హసన్‌పర్తి, ఆగస్టు 29: అనారోగ్యంతో విద్యార్థి మృతిచెందినట్లు హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ చేరాలు గురువారం తెలిపారు. ఇన్‌స్పెక్టర్ కథనం ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం ముల్కలపల్లి గ్రామానికి చెందిన అనుముల రాంరెడ్డి కుమారుడు నర్సింహారెడ్డి (13) ఎల్లాపూర్ శివారు ఓ ప్రైవేటు పాఠశాల హాస్టల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. నాలుగు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండగా పాఠశాల నిర్వాహకులు తల్లిదండ్రులకు సమాచారం అందించారు. గురువారం విద్యార్థి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ విద్యార్థి పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారడంతో ఆ విద్యార్థిని ఎంజీఎంకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలపడంతో యాజమాన్యం విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మృతుడి తండ్రి రాంరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు.


రోదిస్తున్న తల్లిదండ్రులు

ఉద్రిక్తత

విద్యార్థి మృతితో హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ చేరాలు పర్యవేక్షణలో ఎల్లాపూర్ శివారు ప్రైవేటు స్కూల్ పరిసర ప్రాంతంతో పాటు ఎంజీఎం మార్చురీ వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. మృతుడి కుటుంబ సభ్యులు, పాఠశాల యాజమాన్యంతో సంప్రదింపులు జరిపారు. కాగా, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అప్పగించడంతో సమస్య సద్దుమణిగింది.

గవర్నర్‌కు వీడ్కోలు పలికిన కలెక్టర్లు

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు29: హనుమకొండ, వరంగల్ జిల్లాల పర్యటన ముగించుకుని జనగామ జిల్లా పర్యటనకు వెళుతున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద, వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝాలు గురువారం హనుమ కొండలోని నిట్ క్యాంపస్ వద్ద వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పోలీసులు గవర్నర్‌కు గౌరవ వందనం స్వీకరించారు. కలెక్టర్ల వెంట అదనపు కలెక్టర్లు వెంకట్ రెడ్డి, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు , ఇతర అధికారులు ఉన్నారు.


గవర్నర్‌తో కలెక్టర్లు, సీపీ సమావేశం


జిల్లా స్థాయి ఎంపిక పోటీలకు హాజరైన క్రీడాకారులతో నిర్వాహకులు

సందడిగా టెన్నికాయిట్ ఎంపికలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 80మంది క్రీడాకారులు హాజరు

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 29: హనుమకొండ జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లో జిల్లాస్థాయి టెన్నికాయిట్ ఎంపిక పోటీలు సందడిగా ప్రారంభమయ్యాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి సబ్ జూనియర్స్ బాలబాలికల విభాగంలో ఏర్పాటు చేసిన ఎంపిక పోటీలను అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అంబేద్కర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహించిన ఎంపిక పోటీలలో 80మంది బాలబాలికలు పాల్గొన్నారు. ఇక్కడ జిల్లాస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 4బాలురు, 4బాలికలను సెప్టెంబరు 1నుంచి 3వరకు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న అంతర్ జిల్లాల స్థాయి సబ్ జూనియర్స్ టెన్నికాయిట్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ హనుమకొండ, వరంగల్ జిల్లాల కార్యదర్శులు అలువాల రాజ్‌కుమార్, గోకారపు శ్యాం, కోశాధికారి ఎం.డి. జహుర్ పీడీలు జి.శ్రీనివాస్, డి.నర్సయ్య, ఆర్.శ్రీధర్, పీఈటీలు కమల కుమారి, సరిత, కావేరి, నిర్మల, భాస్కర్, నిరంజన్, సీనియర్ క్రీడాకారులు ప్రకాశ్, కౌశిక్, దేవేందర్, అర్జున్, పవన్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

నేడు గద్దర్ అవార్డుల ప్రదానోత్సవం

తొర్రూరు (మహబూబాబాద్ జిల్లా), ఆగస్టు 29 : పేద ప్రజల గుండెల్లో నిలిచిపోయిన గద్దర్ ప్రథమ వర్ధంతి సందర్భంగా 'గిద్దెగళం' ఆధ్వర్యంలో గద్దరన్న అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం జరుగుతుందని నిర్వహణ కమిటీ సభ్యులు గిద్దె రాంనర్సయ్య, జూపాక శివ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నాటి సామాజిక దోపిడీ, దౌర్జన్యాలను అంటగడుతూ తన జీవితాన్నే పణంగా పెట్టి, నాటి నిజాం నిరంకుశ పాలనను, దోపిడీ దొంగలను, దోపిడీ వర్గాలను అంతం కొరకు గర్జించిన గద్దర్ అవార్డుల ప్రదానోత్సవం శుక్రవారం (నేడు) తొర్రూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు వివరించారు. ముఖ్యఅతిథులుగా మంత్రి దనసరి అనసూయ (సీతక్క), పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్, ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కాంగ్రెస్ నాయకులు జంగా రాఘవరెడ్డి, హైదరాబాద్ నుంచి సుమారు 100 మంది కళాకారులు హాజరవుతారని తెలిపారు. తెలంగాణ వాదులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

నీటి సంప్‌లోపడి చిన్నారి మృతి

మహబూబాబాద్ జిల్లా బంగ్యాతండాలో ఘటన


మృతి చెందిన పుష్ప (ఫైల్)

గూడూరు, ఆగస్టు 29 : నీటి సంప్‌లో పడి మూడేళ్ల చిన్నారి మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం పడమటితండా శివారు బంగ్యాతండాలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బంగ్యాతండాకు చెందిన తేజావత్ సుమన్-వెన్నెల దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం. దంపతులిద్దరు తనకున్న వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ దంపతులు తమ పిల్లలను నానమ్మ గోరి వద్ద ఉంచి వ్యవసాయ పనులకు వెళ్లారు. ఇంటి వద్ద ఆడుకుంటూ చిన్నారి పుష్ప (3) నీటితొట్టి వైపువెళ్లి, అందులో పడి మృతి చెందింది. ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు పుష్ప కన్పించకపోవడంతో వెతికారు. ఆ తర్వాత నీటిసంప్‌లో పుష్ప విగతజీవిగా కన్పించడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

దోపిడీ దొంగల బీభత్సం

● భార్య గొంతుపై కత్తి పెట్టి, భర్త చేతులను కట్టేసి దుండగుల చోరీ ● భూపాలపల్లి జిల్లా బస్వాపూర్‌లో ఘటన


దోపిడీ జరిగిన ఇంటి వద్ద విచారణ చేస్తున్న అదనపు ఎస్పీ, డీఎస్పీ


సీసీ ఫుటేజీలో అనుమానితులు

కాటారం, ఆగస్టు 29: దోపిడీ దొంగలు బీభత్సం సృష్టించారు. అర్ధరాత్రి పకడ్బందీగా రెక్కీ నిర్వహించి వాష్‌రూం కోసం బయటికి వచ్చిన మహిళపై ముగ్గురు దుండగులు దాడి చేసి గొంతుపై కత్తి పెట్టి గాయపర్చి, ఆమె భర్త చేతులను వెనక్కి కట్టేసి భయాందోళనకు గురిచేసి దోపిడీకి పాల్పడ్డారు. ఈ సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని బస్వాపూర్‌లో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. కాటారం ఎస్సై మ్యాక అభినవ్, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. బస్వాపూర్‌లో పగడాల తిరుపతి, స్వర్ణలత దంపతులు కిరాణా షాపు నడిపిస్తున్నారు. తిరుపతి డీజిల్ కూడా అమ్ముతున్న క్రమంలో ఎవరైనా లారీల డ్రైవర్లు వచ్చి తీసుకెళ్తారని ఇంటి ముందు బాల్కనీ కింద రాత్రిపూట నిద్రిస్తుంటాడు. ఎప్పటిలాగే బుధవారం రాత్రి సైతం తిరుపతి ఆరుబయట నిద్రించగా, స్వర్ణలత ఇంట్లో పడుకుంది. అర్ధరాత్రి సుమారు 2గంటలకు స్వర్ణలత వాష్‌రూం కోసం బయటికి రాగా ముగ్గురు దుండగులు మంకీ క్యాప్‌లు ధరించి కనిపించడంతో తలుపు వేస్తుండగానే ఆమెపై దాడి చేయగా అరవడానికి యత్నిస్తుండగా గొంతుపై కత్తి పెట్టారు. దీంతో గొంతు కోసుకుపోయి గాయాలపాలైంది. భార్య అరుపులు విన్న భర్త తిరుపతి ఏదైనా అనారోగ్యం పాలైందా.. అంటూ లోపలికి రాగా ఇద్దరు దుండగులు దాడి చేసి గొంతులో గుడ్డలు నొక్కి చేతులు వెనక్కివిరిచి కట్టేశారు. కత్తులతో బెదిరిస్తూ కొట్టుకుంటూ ఇంట్లో విలువైన నగలు, నగదు విషయమై ప్రశ్నించారు. తనపై పుస్తెలతాడు మాత్రమే ఉందని, తీసుకుని తమను చంపకుండా విడిచిపెట్టాలని అభ్యర్థించారు. దొంగలు వారికి ఉన్న ట్రాక్టర్, బంగారు హారాల విషయమై అడిగారు. ఇద్దరు కత్తులతో బెదిరిస్తుండగా మరొకరు ఇంట్లో అన్ని చోట్ల వెదికి రూ.1లక్ష నగదు, 5తులాల బంగారు ఆభరణాలు, ఇంటి ముందు ఉన్న బైక్‌ను అపహరించి వెంట తెచ్చుకున్న బైక్‌పై పారిపోయారు. దొంగలు వెళ్లిన కొద్ది సేపటికి స్వర్ణలత భర్త చేతుల కట్లు విప్పి బయటికి వచ్చి 100 నంబర్‌కు డయల్ చేసింది. కాటారం పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి దోపిడి జరిగిన తీరును, వివరాలను తెలుసుకుని బాధిత దంపతులను భూపాలపల్లి ఆస్పత్రికి తరలించారు.

డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీంలతో తనిఖీలు

బుధవారం జిల్లా అదనపు ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన బోనాల కిషన్, కాటారం డీఎస్పీ గడ్డం రాంమోహన్‌రెడ్డి, సీఐ నాగార్జునరావు, సబ్ డివిజన్ ఎస్సైలు అభినవ్, పవన్, నరేష్, మహేందర్, సీసీఎస్ ఎస్సై రమేష్ సంఘటనాస్థలిని గురువారం ఉదయాన్నే సందర్శించారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీంలను రంగంలోకి దించి విచారణ ప్రారంభించారు. స్థానిక పోలీసు అధికారులు, సిబ్బంది బస్వాపూర్, కొత్తపల్లి, కొయ్యూరు తదితర ప్రాంతాల్లో సీసీ టీవీ ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నారు. బస్వాపూర్ టోల్‌గేట్ వద్ద సీసీ కెమెరాల్లో ముగ్గురు వ్యక్తులు అర్ధరాత్రి బైక్‌పై వెళ్తున్న ఆధారాలు లభించినా చిత్రాలు స్పష్టంగా లేకపోవడంతో పోలీసులు మరింత లోతుగా విచారణ చేస్తున్నారు. కాగా, బాధితులు భూపాలపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా అదనపు ఎస్పీ బోనాల కిషన్ పరామర్శించి దోపిడీ దొంగల వివరాలు, దోపిడీకి పాల్పడ్డ తీరును క్షుణ్ణంగా తెలుసుకున్నారు. కాగా, దోపిడీకి పాల్పడ వారు దూరప్రాంతాల వారు కాకుండా గతంలో కిరాణా షాపునకు వచ్చిన వారు లేదా తిరుపతి కుటుంబం గురించి తెలిసిన వారు కావచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తిరుపతికి ఉన్న ఆస్తుల వివరాలను, స్వర్ణలతకు ఉన్న నెక్లెస్ గురించి కొట్టుకుంటూ అడగడంపై పోలీసులు సైతం ఆ దిశలోనూ విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది.

గుజరాత్ బ్యాంక్ మహాసభలో టెస్కాబ్ చైర్మన్


మార్నేనిని సన్మానిస్తున్న గుజరాత్ చైర్మన్ డోలర్ వి కొచ్చన్

హనుమకొండ సిటీ, ఆగస్టు 29: గుజరాత్ రాష్ట్ర సహకార వ్యవసాయ గ్రామీణాభివృద్ధి వార్షిక మహాజన సభలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు పాల్గొన్నారు. గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లోని బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో గురువారం నేషనల్ కో-ఆపరేటివ్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ వార్షిక మహాజన సభ జరిగింది. సభలో పాల్గొన్న రవీందర్‌రావు రాష్ట్రంలోని డీసీసీ బ్యాంకులు, సహకార సంఘాల పనితీరు, ప్రగతిని వివరించారు. ఈ సందర్భంగా గుజరాత్ రాష్ట్ర సహకార వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంక్ చైర్మన్ డోలర్ వి కొచ్చన్ టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావును ఘనంగా సన్మానించారు.

జర్మనీలో నర్సింగ్‌కు దరఖాస్తులు ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 29: జర్మనీలో నర్సింగ్ కోర్సు చేసేందుకు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా వరంగల్ జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి సీహెచ్.ఉమారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్(టామ్‌కాం) ద్వారా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఆమె కోరారు. 60 శాతం మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణులై, 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉన్న అభ్యర్థులు నేటి సాయంత్రం వరకు tomcom.germany@gmail.comకు వారి బయోడేటాను మెయిల్ చేయాలని, లేదంటే 6302292450/7901290580 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు. పూర్తి వివరాలకు www.tomcom.telangana.gov.in వెబ్‌పోర్టల్‌ను సందర్శించాలని కోరారు.

ఏనుమాముల మార్కెట్‌కు 3 రోజులు సెలవులు

వరంగల్ వ్యవసాయం, ఆగస్టు 29: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు మూడు రోజుల సెలవులు ప్రకటించినట్లు ఆ మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం యార్డు బంద్, ఆదివారం సాధరణ సెలవు దినం, సోమవారం అమావాస్యను పురస్కరించుకుని మార్కెట్‌కు సెలవు ప్రకటించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని గమనించి రైతులు, వ్యాపారులు, కార్మికులు మార్కెట్ కమిటీకి సహకరించాలని కోరారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మడికొండ, ఆగస్టు 29: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. మడికొండ ఎస్సై దివ్య తెలిపిన వివరాల ప్రకారం.. శాయంపేట మండల కేంద్రానికి చెందిన వలుపదాసు ప్రశాంత్(26) అనే వ్యక్తి ఈనెల 23న జనగామలో ఉంటున్న తన స్నేహితుడి పెళ్లికి వెళ్లి తిరిగి స్నేహితుడి బైక్‌పై తన స్వగ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో మడికొండలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు రాగానే బైక్ అదుపు తప్పి కిందపడిపోవడంతో తల, ఇతర శరీర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. కడిపికొండకు చెందిన దిలీప్ అనే వ్యక్తి గాయపడిన ప్రశాంత్‌ను కాజీపేట బాపూజీనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లి అక్కడి నుంచి నగరంలోని మరో ఆస్పత్రికి తరలించి అతడి మిత్రుడికి, ప్రశాంత్ తల్లిదండ్రులకు సమాచారం అందజేశాడు. వారు ఆస్పత్రికి చేరుకొని ప్రశాంత్‌ను ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి తండ్రి చంద్రమౌళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కేయూ న్యాయ కళాశాలకు బార్ కౌన్సిల్ గుర్తింపు

కేయూక్యాంపస్, ఆగస్టు29: కాకతీయ యూనివర్సిటీ న్యాయ కళాశాలకు బార్ కౌన్సిల్ గుర్తింపును కొనసాగిస్తూ ఢిల్లీలోని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, న్యాయ విద్య స్టాండింగ్ కమిటీ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎల్ఎల్‌బీ కోర్సు అఫ్లియేషన్‌ను 2024-2025కు కొనసాగిస్తూ ఉత్తర్వులు రావడంతో యూనివర్సిటీ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ మేరకు కేయూ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిమ్మ సుదర్శన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి కృషి చేశారు. కేయూ అఫ్లియేషన్ ఫీజు చెల్లించలేదనే కారణంతో బీసీఐ అధికారులు గుర్తింపును తాత్కాలికంగా నిలిపి వేశారు. దీంతో రెండురోజులుగా రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు కేయూ న్యాయ కళాశాలలో అడ్మిషన్‌లు పొందేందుకు వెబ్‌ఆప్షన్‌లు నిలిపివేశారు. రాష్ట్రంలోని ప్రతిష్ఠాత్మకమైన న్యాయ కళాశాలలో అడ్మిషన్‌లు పొందలేక పోవడంతో విద్యార్థులు ఆందోళన చెందారు. ఎట్టకేలకు బీసీఐ గుర్తింపుతో కథ సుఖాంతమైంది. కేయూ న్యాయ కళాశాలలో అడ్మిషన్‌లు పొందేందుకు వెబ్‌ఆప్షన్‌లు ఇచేందుకు అధికారులు మరో రెండు రోజులు గడువును పెంచినట్లు న్యాయకళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్ వెల్లడించారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందకుండా కేయూ న్యాయ కళాశాలలో అడ్మిషన్‌లు పొందాలని ఆయన కోరారు.

ముత్య కిడ్నీ సెంటర్‌లో అరుదైన శస్త్ర చికిత్స



ఆపరేషన్ చేసుకున్న రోగితో వైద్యులు

వరంగల్ మెడికల్, ఆగస్టు 29: నర్సంపేటకు చెందిన 53 సంవత్సరాల మహిళకు హనుమకొండలోని ముత్య కిడ్నీ సెంటరులో అరుదైన కిడ్నీ శస్త్ర చికిత్స (ల్యాప్రోస్కోపిక్ పార్షియల్ నెఫ్రెక్టమీ) విజయవంతం అయినట్లు ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ఎడమ కిడ్నీలో క్యాన్సర్‌తో బాధపడుతున్న రోగి ఇతర ఆస్పత్రులలో సంప్రదించగా మొత్తం కిడ్నీ తొలగించాలని సూచించినా, హనుమకొండలోని ముత్య కిడ్నీ సెంటరులో వైద్య నిపుణుల బృందం కేవలం కిడ్నీ పైభాగంలోని కణతిని మాత్రమే తొలగించి కిడ్నీని రక్షించినట్లు పేర్కొన్నారు. ఈ శస్త్ర చికిత్సను డాక్టర్ బచ్చు చందుకృష్ణ, డాక్టర్ మన్నెం శ్రీనాథ్‌రెడ్డి, అనస్తీషియా నిపుణురాలు డాక్టర్ రుచిక బజాజ్ నిర్వహించారు. ఈ అత్యాధునిక లాపరోస్కోఫిక్ శస్త్రచికిత్స గతంలో హైదరాబాద్‌లో మాత్రమే అందుబాటులో ఉండేదని, కానీ ఇప్పుడు వరంగల్, హనుమకొండ నగరాల్లో తొలిసారిగా విజయవంతంగా చేసినట్లు చెప్పారు. శస్త్ర చికిత్స అనంతరం రోగి మూడు నెలల తరువాత ఫాలో అప్ కోసం తిరిగి వచ్చినప్పుడు కణతి పూర్తిగా లేనట్లు, మరలా ప్రాప్తి కాలేదని వైద్యులు నిర్ధారించారు. ఈ అసాధారణ విజయంతో హైదరాబాద్‌లోని పలువురు ప్రముఖ లాపరోస్కోఫిక్ వైద్యులు ముత్య కిడ్నీ సెంటరు వైద్య బృందాన్ని అభినందించారు.

వివాహితను రెండో పెళ్లి చేసుకున్న వ్యక్తిపై కేసు

వేలేరు, ఆగస్టు 29: భార్య, పిల్లలు ఉండగా, మరో వివాహితను పెళ్లి చేసుకున్న వ్యక్తిపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. వివరాల్లోకివెళితే.. వేలేరు మండల కేంద్రానికి చెందిన సూత్రపు సతీష్ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. 16 ఏళ్ల కిందట సిద్ధిపేట జిల్లా హుస్నాబాద్ మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన మమతను వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు ఆడ పిల్లలున్నారు. కాగా, అదే గ్రామానికి చెందిన దేవులపల్లి పావనికి 13 ఏళ్ల కిందట వరంగల్‌కు చెందిన వ్యక్తితో వివా హం జరిగింది. ఆమెకు ఇద్దరు కుమార్తెలున్నారు. అయితే సతీష్‌కు, పావనికి వివాహం కాకముందే సంబంధం ఉంది. దీంతో వారు తరచూ ఫోన్‌లో మాట్లాడుకునేవారు. ఇది గమనించిన పావని భర్త రెండేళ్ల కిందట పిల్లలతో సహా వదిలేశాడు. ఈ క్రమంలో సతీష్ యేడాది కిందట పావనిని రెండో వివాహం చేసుకున్నాడు. ఇద్దరు భార్యలతో వేర్వేరుగా కాపురాలు పెట్టాడు. కాగా, పావని వద్ద ఉన్న నగదు, బంగారు ఆభరణాలను తీసుకుని ముఖం చాటేశా డు. దీంతో ఈనెల 22న మొదటి భార్య ఇంటికి పావని వెళ్లడంతో సతీష్ దాడి చేసి బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో సతీష్ తనను మోసం చేశాడని పావని పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ట	క్వింటా కనిష్ట
మక్కలు(బిల్టీరకం)	2936	2700
పల్లికాయ (సూక)	5910	5400
పల్లికాయ (పచ్చిది)	3500	3000
కందులు	8653	8552
పెసళ్లు	7012	2552
పత్తి	7555	5000
పసుపు (కాడి)	11885	10000
పసుపు (గోల)	11559	11409
తేజ మిర్చి	12000	8000
తేజ ఏసీ	18000	15000
వండర్‌హాట్ ఏసీ	15000	13000
యూఎస్341 ఏసీ	14600	11000
తాలు మిర్చి	6000	3000

-వరంగల్ వ్యవసాయం

పోలీసు చట్టాలపై పట్టు సాధించాలి : సీపీ

వరంగల్ క్రైం, ఆగస్టు 29: శిక్షణ సమయంలోనే చట్టాలపై పోలీసులు పట్టు సాధించాలని సీపీ అంబర్ కిషోర్ ఝా సూచించారు. గురువారం మడికొండలోని పోలీస్ శిక్షణా కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ట్రెయినీ కానిస్టేబుళ్లకు చట్టాలపై విధానాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చట్టాలపై పట్టు కలిగి ఉంటే విధులు నిర్వహించే సమయంలో ఎదురయ్యే సమస్యలను సులభంగా అధిగమించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ జితేందర్‌రెడ్డి, రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

జనగామ జిల్లా పోరాటాల గడ్డ

(5వ పేజీ తరువాయి)


జనగామ కలెక్టరేట్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ


మొక్క నాటుతున్న గవర్నర్

వరంగల్ ఎంపీ కడియం కావ్య, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి గవర్నర్‌ను సన్మానించారు. ఈ సమావేశాన్ని జాతీయ గీతాలాపనతో ప్రారంభించారు. సమావేశంలో భాగంగా జిల్లా భౌగోళిక స్వరూపం, చారిత్రక విశేషాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలు, తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర, పోరాటవీరుల చరిత్ర తదితర అంశాలకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా గవర్నర్‌కు కలెక్టర్ రిజ్వాన్ బాషా వివరించారు. ఆ తర్వాత కవులు, కళాకారులు తమను తాము పరిచయం చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ' గేయ రచయిత అందె శ్రీ పాట రూపంలో, పద్మశ్రీ పురస్కార గ్రహీత గడ్డం సమ్మయ్య చిందు యక్షగానంతో తమ అనుభవాలను పంచుకున్నారు. చీరపై ఇక్కత్, పోచంపల్లి డిజైన్ రూపొందించామని, దీనికి జియో ఐడెంటిఫికేషన్ కోసం ప్రయత్నాలు చేస్తున్నామని చేనేత కార్మికులు చెప్పగా గవర్నర్ అభినందించారు. అనంతరం పలుశాఖల పనితీరుపై అడిగి తెలుసుకున్నారు. వైద్య శాఖలో సరిపడా వైద్యులు అందుబాటులో ఉన్నారా అని ఆరా తీశారు. తెలంగాణలో జనగామ జిల్లాకు పోరాటాల పరంగా ప్రత్యేక స్థానం ఉందని అందెశ్రీ వివరించారు. తెలంగాణ సాయుధపోరాటం మొదలు అనేక పోరాటాలను నడిపించిన చరిత్ర ఈ ప్రాంతానికి ఉందని ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ గడ్డపై ఎందరో పోరాట వీరులు జన్మించారని వివరించారు.

ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. జనగామ జిల్లా చరిత్ర గురించి తనకు ఇంకా తెలుసుకోవాలని ఉందన్నారు. వీలైతే త్వరలోనే జనగామకు మళ్లీ ఒకసారి వస్తానని గవర్నర్ అన్నారు. సమావేశంలో ఒకవైపు కవులు, కళాకారులు, మరోవైపు అధికారులు ఆసీనులు కావడం సంతోషానిచ్చిందన్నారు. ఒకరు సమాజ పరివర్తన రూపకర్తలైతే, మరొకరు విధి విధానాలను అమలు చేసేవారని అన్నారు. ఈ రెండు వర్గాలు భుజం భుజం కలిపి పనిచేసినప్పుడే గొప్ప మార్పును చూడగలమన్నారు. తెలంగాణ డయాగ్నస్టిక్ హబ్ ద్వారా ప్రజలపై ఆర్థిక భారం తగ్గుతుందని అన్నారు. డయాగ్నస్టిక్ సెంటర్‌లో పాథాలజిస్టులను నియమించేలా చర్యలు తీసుకోవాలన్నారు. చేనేత కార్మికులు ప్రదర్శించిన చీరలపై గవర్నర్ ఆసక్తి కనబరిచారు. చేనేత ఉత్పత్తిని కేవలం వస్త్రంగానే చూడవద్దని, ఒక వ్యక్తి పరిపూర్ణ సామర్థ్యాన్ని పొందేందుకు చేసిన ప్రయత్నంగా చూడాలన్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో ప్రజలు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే గొప్ప విజయాలను అందుకోగలమన్నారు.

అనంతరం కలెక్టరేట్‌లోని స్టేట్ చాంబర్‌లో కవులు, కళాకారులతో కలిసి భోజనం చేశారు. సమావేశంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, గవర్నర్ కార్యాలయ జాయింట్ సెక్రటరీ భవానీశంకర్, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్లు పింకేశ్‌కుమార్, రోహిత్‌సింగ్, డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మునిసిపల్ చైర్‌పర్సన్ జమున లింగయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ బీఆర్ఎస్‌లవి మ్యాచ్‌ఫిక్సింగ్ రాజకీయాలు

అభిషేక్ సింగ్ మన్విపై కేసీఆర్‌కు ఎందుకు పోటీ పెట్టలేదు : మెదక్ ఎంపీ రఘునందన్‌రావు


మీడియాతో మాట్లాడుతున్న రఘునందన్‌రావు

లింగాలఘణపురం, ఆగస్టు 29: రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు మ్యాచ్‌ఫిక్సింగ్ రాజకీయాలకు పాల్పడుతున్నాయని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఆరోపించారు. గురువారం లింగాలఘణపురం మండలం కిష్టగూడెంలో పెట్రోల్ బంక్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ రఘునందన్‌రావు మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్సీ కవితకు బెయిల్ రావడం వెనుక బీజేపీకి సంబంధమున్నట్లు కాంగ్రెస్ నేతలు ఆరోపించడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన చాలామంది నేతలకు బెయిల్స్ వచ్చాయని అవికూడా బీజేపీ, టీఆర్ఎస్ వాళ్లు ఇప్పిస్తేనే వచ్చాయేమోనని ఆలోచించాలన్నారు. ఏడాదిన్నర పదవీకాలం ఉన్న కేశవరావును రాజీనామా చేయించి కాంగ్రెస్‌లో చేర్పించుకోగా నాలుగన్నరేళ్ల పదవీకాలం ఉన్న 12 నుంచి 15 మంది ఎమ్మెల్యేలను ఎలాంటి రాజీనామా చేయించకుండానే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేర్పించుకోవడం వెనుక ఉన్న కుట్ర రాజకీయాలేంటో ప్రజలకు అర్థమవుతున్నాయన్నారు. కవితకు బెయిల్ పిటిషన్ కోసం వాదించిన కాంగ్రెస్ నేత అభిషేక్ సింగ్ మన్విని కేశవరావు స్థానంలో రాజ్యసభకు పోటీ చేయించారని, దీంతోనే బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీలకున్న బంధం తేటతెల్లమవుతుందన్నారు. రాజ్యసభకు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత బీఆర్ఎస్‌కు 38 మంది ఎమ్మెల్యేల బలం ఉన్నప్పటికీ బీఆర్ఎస్ అభ్యర్థిని ఎందుకు పోటీ పెట్టలేదని ప్రశ్నించారు. చీటికి మాటికి ఎమ్మెల్యేల అనర్హత గురించి మాట్లాడే కేటీఆర్.. రాజ్యసభకు తమ పార్టీ నుంచి అభ్యర్థిని ఎందుకు పోటీలో నిలుపలేదని ప్రశ్నించారు. నిజంగానే అనర్హత గురించి మాట్లాడదల్చుకుంటే బీఆర్ఎస్ పోటీలో నిలిపే రాజ్యసభ అభ్యర్థికి కాకుండా మరో పార్టీకి చెందిన అభ్యర్థికి ఎమ్మెల్యేలు ఓటేస్తే విప్ జారీ చేసే అధికారం ఉంటుందని, అప్పుడు అనర్హత వేటు పడుతుందనే విషయం కేటీఆర్‌కు ఎందుకు తెలియలేదని విమర్శించారు. నీతి, నిజాయితీతో కూడిన విలువల కోసం కేశవరావు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారని సీఎం రేవంత్‌రెడ్డి, మల్లికార్జున్ ఖర్గే చెబుతున్నారని, అదే నీతి నిజాయితీ విలువలు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేల్లో ఏమయ్యాయని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్ కూడా తన పదవికి రాజీనామా చేయకుండానే లోక్‌సభకు పోటీచేసి ఇప్పుడు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారన్నారు.

కాంగ్రెస్ బీఆర్ఎస్ ఢిల్లీలో మ్యాచ్‌ఫిక్సింగ్ రాజకీయాలకు పాల్పడ్డారని ఆరోపించారు. కవితకు బీజేపీ చెబితేనే బెయిల్ ఇచ్చారని కాంగ్రెస్ ఆరోపణలు చేయడం సరికాదన్నారు. అదే సీబీఐ, ఈడీ సోనియాగాంధీ, రాహుల్ గాంధీకి నోటీసులు ఇచ్చిందని, కానీ అరెస్ట్ చేయలేదని, అప్పుడు కూడా బీజేపీ చెబితేనే అరెస్ట్ చేయలేదని ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేస్తే రాహుల్ గాంధీ కాంగ్రెస్ నేతృత్వంలో ఆప్, తృణమూల్ కాంగ్రెస్ పార్టీలు ప్రతిపక్ష ఎంపీలతో పార్లమెంట్ ఎదుట లిక్కర్ కేసు తప్పని, మనీష్ సిసోడియాను విడుదల చేయాలని డిమాండ్ చేశారని, కానీ బీజేపీ విడుదల చేయలేదని, సర్వోన్నత న్యాయస్థానం మాత్రమే విడుదల చేసిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ నేతలకు కోర్టులన్నా, సెబీలన్నా విలువలేదని నిలదీశారు. తెలంగాణలో బలమైన ప్రతిపక్షంగా ఎదుగుతున్న బీజేపీని దెబ్బతీసేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి, నాయకులు కేవీఎల్ఎన్‌రెడ్డి, మహిళామోర్చా జిల్లా అధ్యక్షురాలు కత్తుల లక్ష్మి, ఊడ్గుల రమేశ్, సౌడ రమేశ్, భవానందరెడ్డి, వెంకట్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'దేవాదుల'లో కదలిక

(5వ పేజీ తరువాయి)

రూ.4,400కోట్ల నుంచి రూ.6,016కోట్లకు పెంచి పనులు ప్రారంభించింది. ఆ తరువాత పనుల్లో జాప్యం జరుగటంతో పాటు నిర్మాణ సామగ్రి ధరలు సైతం భారీగా పెరగటంతో 2008లో మరోసారి అంచనా వ్యయాన్ని రూ.9,427.23 కోట్లకు పెంచారు. ఆ తరువాత 2017లో అప్పటి సీఎం కేసీఆర్ దేవాదుల ప్రాజెక్టును రీ డిజైన్ చేయటంతో భారీగా ఖర్చు పెరిగింది. దీంతో రూ.13,445.44కోట్లకు ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని మరోసారి పెంచారు. 2022-23లో మరో రూ.4వేల కోట్ల అవసరంగా అధికారులు ప్రతిపాదనలు చేశారు. మొత్తంగా ఇప్పటి వరకు దేవాదుల ప్రాజెక్టుపై రూ.14,188కోట్ల వరకు ఖర్చు చేసింది.

అయితే ప్రాజెక్టు పూర్తి కావడానికి మరో రూ.10వేల కోట్ల వరకు నిధులు కావాలని ఇంజనీర్లు ప్రతిపాదనలు పంపించారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇంజనీర్ల ప్రతిపాదనలను పరిశీలించి అదనంగా మరో రూ.3,312కోట్లు కేటాయిస్తే సరిపోతుందని అంచనా వేసింది. ఈ మొత్తాన్ని విడుదలు చేసేందుకు ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసింది. దీంతో మొత్తం దేవాదుల అంచనా వ్యయం రూ.17,500కోట్లకు చేరనుంది. అలాగే ప్రాజెక్టులో కీలకమైన భూసేకరణకు కూడా ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్రాజెక్టుకు మొత్తం 33,224ఎకరాల భూమి అవసరం కాగా, ఇప్పటి వరకు 30,268ఎకరాల భూమిని సేకరించారు. ఇంకా 2,957 ఎకరాల భూమిని సేకరించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో అధికారులు భూసేకరణకు రెవెన్యూ అధికారులతో కలిసి బృందంగా ఏర్పాటు చేసుకుంటున్నారు. హనుమకొండ, జనగామ జిల్లాలోనే అత్యధికంగా భూసేకరణ చేయాల్సి ఉంది. దీనిపై అధికారులు దృష్టిసారించారు.



అత్యుత్తమైన సాంకేతికతతో వినియోగదారులకు సేవలు

హనుమకొండ టౌన్, ఆగస్టు 29: అత్యుత్తమైన సాంకేతికతను వినియోగించుకొని వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని హనుమకొండ, వరంగల్ సర్కిల్ ఎస్ఈలు వెంకటరమణ, మధుసూదన్‌రావులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ పనిలో అధునాతమైన సాంకేతిక పద్ధతులు అవలంబిస్తూ విద్యుత్ అంతరాయాలను కనిష్ట స్థాయికి తీసుకువచ్చామన్నారు. డిస్కమ్‌కు సంబంధించిన ప్రతీ సమాచారాన్ని చూసే డాష్ బోర్డు అప్లికేషన్‌ను పెంపొందించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. వ్యవసాయ పంపుసెట్లు, పారిశ్రామిక ఫీడర్ల వద్ద నష్టాలు వాటిల్లకుండా కెపాసిటర్ బ్యాంకులు దోహదపడుతున్నాయన్నారు. అసెట్ మ్యాపింగ్ ట్రాకింగ్‌లో అన్ని 33 కేవీ, 11 కేవీ స్తంభాలకు యూనిక్ పోల్ నెంబర్ పెయింటింగ్ ప్రక్రియను చేపట్టామన్నారు. ఎప్పటికప్పుడు నూతన సాంకేతికను అందిపుచ్చుకొని దానికి అనుగుణంగా అభివృద్ధిలో ముందుకు వెళుతున్నామన్నారు.

హాస్టళ్లను సందర్శించిన
కేంద్ర ప్రభుత్వ అధికారులు

కేయూక్యాంపస్,ఆగస్టు29: 2012, 2013 ఏడాదిలో కేంద్ర సాంఘిక సంక్షేమ సాధికారత సంస్థ నిధులతో నిర్మించిన రెండు హాస్టళ్లను గురువారం కేంద్ర ప్రభుత్వ అధికారులు సందర్శించి పరిశీలన చేశారు. క్యాంపస్‌లోని సావిత్రిబాయ్ పూలే హాస్టల్, డాక్టర్ బాబు జగ్జీవన్‌రావ్, కామన్‌మెస్ హాస్టళ్లను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలపై రిజిస్ట్రార్ డాక్టర్ పి.మల్లారెడ్డితో చర్చించారు. ఈ కార్యక్రమంలో యూనవర్సిటీ అధికారులు వాసుదేవరెడ్డి, రాధిక, స్వప్న, లక్ష్మీ, డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి

కాళోజీ జంక్షన్, ఆగస్టు 29: టూరిజం కార్పొరేషన్‌లో దీర్ఘకాలికంగా పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, పర్మినెంట్ ఉద్యోగులతో సమానంగా వేతనాలు చెల్లించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, తెలంగాణ టూరిజం కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బు రాజమౌళికి వినతి పత్రం సమర్పించారు. బుధవారం రాత్రి సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో ఆయనను కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. సీఎంను కలిసిన వారిలో ఇఫ్టూ జాతీయ కౌన్సిల్ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, ఎస్.బాలమల్లేశ్, వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు ఉన్నారు. ఈ సందర్భంగా వారికి సీఎం హామీ ఇచ్చినట్లు రాజమౌళి తెలిపారు.

రెవెన్యూ, మైన్స్ అధికారుల దాడులు

టిప్పర్ స్వాధీనం.. యజమానిపై కేసు నమోదు


అక్రమ మొరం తవ్వకాలను పరిశీలిస్తున్న అధికారులు

హసన్‌పర్తి, ఆగస్టు 29: హసన్‌పర్తి, ధర్మసాగర్ మండలం సరిహద్దు ప్రాంతం మడిపల్లి రెవెన్యూశివారులో రాపాకపల్లిలో అక్రమంగా నిర్వహిస్తున్న మొరం మాఫియాపై రెవెన్యూ, మైన్స్ అధికారులు గురువారం సంయుక్తంగా దాడులు నిర్వహించినట్లు హసన్‌పర్తి మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఫాజిల్ తెలిపారు. మడిపల్లి రెవెన్యూ శివారు రాపాకపల్లి సర్వే నెం.499, 500 కలిగిన గుట్ట ప్రాంతంలో సంబంధిత యజమానికి ఎకరానికి ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకొని 3ఎకరాల విస్తీర్ణంలో తవ్వకాలు జరిపి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నట్లు సమాచారం అందినట్లు ఆర్ఐ ఫాజిల్ తెలిపారు. ఈ విషయంపై సంబంధిత మైన్స్ అధికారులకు సమాచారం అందించి ఆర్ఐ చంద్రలేఖ సమక్షంలో తవ్వకాలు జరిపిన ప్రాంతాన్ని సర్వే చేయగా .విస్తీర్ణంలో తేడాలు ఉన్నట్లు గుర్తించినట్లు ఆర్ఐ ఫాజిల్ వివరించారు. అనంతరం అక్రమ తవ్వకాలు జరుగుతున్న ప్రాంతంలో ఒక టిప్పర్‌ను స్వాధీనం చేసుకొని సంబంధిత యజమానిపై కేసు నమోదు చేసినట్లు రెవెన్యూ, మైన్స్ ఆర్ఐలు ఫాజిల్, చంద్రలేఖ తెలిపారు.

యూనివర్సిటీ ఉద్యోగుల సమస్యలు పరిష్కంచాలి

కేయూక్యాంపస్ ఆగస్టు 29: దేశవ్యాప్తంగా అన్ని యూనివర్సిటీలలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఆల్ ఇండియా యూనివర్సిటీ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ పుల్లా శ్రీనివాస్ కోరారు. గురువారం కేయూ పరిపాలన భవనం ఎదుట డిమాండ్ డే సందర్భంగా ఉద్యోగులు నిరసన, ధర్నా చేపట్టారు. ఈ సందర్భగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఉద్యోగులకు పీఆర్‌సీ అమలుచేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్స్ ఉద్యోగులను క్రమబద్ధీకరించి అందరికీ హెల్త్‌కార్డులు జారీ చేయాలన్నారు. వీసీల నియామకాలను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మొట్టు రవి, బొక్క మొగిలి, ఎస్.రాము, ప్రేమ్‌సాగర్, చుచ్చు బాలాజీ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

• జిల్లా కలెక్టర్ ప్రావీణ్య • ఘనంగా క్రీడా దినోత్సవం

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 29: క్రీడల్లో పాల్గొని పతకాలు సాధించడంతో పాటు అత్యుత్తమ ప్రతిభ కనబర్చితే క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవం వేడుకల్లో భాగంగా జిల్లా యువజన, క్రీడాలాభివృద్ధి హనుమకొండ జిల్లా ఆధ్వర్యంలో హనుమకొండ జేఎన్ఎస్‌లో జిల్లా స్థాయి క్రీడాపోటీలు గురువారం పండుగా వాతావరణంలో నిర్వహించారు. ఈ మేరకు జేఎన్ఎస్‌లోని సాయంత్రం ఏర్పాటు చేసిన క్రీడాపోటీల ముగింపు వేడుకలకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడాకారులకు జాతీయ క్రీడా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రీడల్లో ప్రతిభ కనబర్చుతూ రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ వేదికలపై తమ సత్తా చాటి రాణించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులకు తమ సహాయ సహకారాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఒలంపిక్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్, అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి, డీఎస్ఏ కోచ్‌లు కొత్త ప్రశాంత్, కూరపాటి రమేష్, ఎండీ. అఫ్జల్, రాయబారపు నవీన్, నరేందర్, శ్రీమన్నారాయణ, రాజు, శంకర్, పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, విష్ణు పాల్గొన్నారు.

వరంగల్‌లో...

వరంగల్ జిల్లా యువజన, క్రీడలాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జాతీయ క్రీడాదినోత్సవ వేడుకలను కోలాహలంగా నిర్వహించారు. గురువారం వరంగల్‌లోని వెంకట్రామాజంక్షన్ నుంచి ఓసిటీ క్రీడా మైదానం వరకు చేపట్టిన క్రీడార్యాలీని వరంగల్ కలెక్టర్ సత్యశారదాదేవి ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం జంక్షన్‌లో ఏర్పాటు చేసిన ర్యాలీ డెమోలో భాగంగా కలెక్టర్ క్రికెట్ బ్యాట్ పట్టి ఆడారు. అనంతరం ఈ ర్యాలీ వెంకట్రామా జంక్షన్ నుంచి కాశిబుగ్గ చౌరస్తా మీదుగా ఓసిటీ క్రీడా మైదానం వరకు సందడిగా సాగింది. ర్యాలీలో వందల మంది క్రీడాకారులతో పాటు వివిధ క్రీడా అసోసియేషన్ల బాధ్యులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వరంగల్ డీవైఎస్‌వో సత్యవాణి మాట్లాడుతూ.. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇటీవల ఓసిటీ క్రీడా మైదానం వేదికగా జిల్లాస్థాయి వివిధ క్రీడాంశాలలో నిర్వహించిన అహ్వానిత క్రీడాపోటీలలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులను అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బైరబోయిన కైలాస్‌యాదవ్, వరంగల్ జిల్లా ఖోఖో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రమణ, వరంగల్ జిల్లా డీఎస్ఏ కోచ్‌లు లింగమూర్తి, సుమన్, కుమారస్వామి, మహేష్, జిల్లాలోని వివిధ క్రీడా సంఘాల బాధ్యులు క్రీడాభిమానులు పాల్గొన్నారు.

● హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జిల్లా హాకీ అసోసియేషన్ బాధ్యులు, సీనియర్ హాకీ క్రీడాకారుడు సోదా రామకృష్ణ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గురువారం హనుమకొండ నయింనగర్‌లోని హాకీ కోర్టులో రామకృష్ణ ముందుగా కేక్ కట్ చేసి జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను ప్రారంభించి క్రీడాకారులకు స్వీట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉస్మాన్, వేణు, నాగార్జున, రాజేష్, నిఖిత్, తదితరులు పాల్గొన్నారు.

ఏకశిలలో క్రీడా, భాషా దినోత్సవం

హనుమకొండ టౌన్: హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్, ప్రముఖ రచయిత గిడుగు వెంకటరామ్మూర్తి జన్మదినాలను పురస్కరించుకొని హనుమాన్‌నగర్‌లోని ఏకశిల హైస్కూల్‌లో గురువారం జాతీయ క్రీడాదినోత్సవం, తెలుగు భాషాదినోత్సవం వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. క్రీడలు కేవలం శారీరక ధృఢత్వాన్ని పెంచడమే కాకుండా మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయన్నారు. మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ బి.కొండల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బి.శైలజారెడ్డి, ఉపాధ్యాయులు వేణుగోపాల్‌స్వామి, రవీందర్, రవి, విద్యార్థులు పాల్గొన్నారు.



క్రీడాసామగ్రి చేతపట్టుకుని క్రీడాదినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతున్న విద్యార్థినులు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

● వరంగల్ ఎడ్యుకేషన్: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం హనుమకొండలోని సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుగులోతు నెహ్రూ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. భారత హాకీ క్రీడకు ఎనలేని వన్నె తెచ్చిన ధ్యాన్‌చంద్ సేవలు ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పీడీ ఎం. కరుణాకర్, ఎన్. బాబు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ధర్మసాగర్: జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు బాషా దినోత్సవ కార్యక్రమం ధర్మసాగర్ కేజీబీవీలో ఎస్‌వో ఎం.మాధవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల అభివృద్ధి అధికారి అనిల్‌కుమార్ విచ్చేసి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. తెలుగు భాష. అమ్మ భాష అని, పర భాష వ్యామోహంలో పడి మాతృ భాషా మరువకూడదన్నారు. తెలుగు భాషా సాహిత్యాన్ని విశిష్ఠతను కాపాడి ముందు తరాలకు అందించే బాధ్యత మన అందరిపై ఉందన్నారు. గిడుగు రాంమ్మూర్తి గొప్పతనం గురించి వారి రచనలను గురించి ఎంపీడీవో విద్యార్థినులకు ఈ సందర్భంగా వివరించారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 29: జాతీయ తెలుగు బాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండలోని ఆర్ట్స్ కళాశాలలో వేడుకలు నిర్వహించారు. గురువారం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.జ్యోతి గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వాడుక భాష కోసం ఉద్యమాన్ని చేపట్టిన గిడుగు రామ్మూర్తి జన్మదినాన్ని భాషా దినోత్సంగా జరుపుకోవడం సమంజసమన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి డాక్టర్ కె. సదాశివ్, అధ్యాపకులు డాక్టర్ ఎం. లింగయ్య, డాక్టర్ రాజు, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ ఫిరోజ్, డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల తెలుగు విభాగాధిపతిగా డాక్టర్ కర్రె సదాశివ్‌ను నియమించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. జ్యోతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆయనకు నియామక పత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. సంవత్సర కాలం పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారని ఆమె తెలిపారు.

నిరాదరణకు గురవుతున్న మాతృభాష

మార్కెట్ శక్తుల ప్రభావంతో మాతృభాష నిరాదరణకు గురవుతోందని అభ్యుదయ రచయితల సంఘం (అరసం) అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బూర భిక్షపతి, డాక్టర్ ఎం.శంకర్ నారాయణ అభిప్రాయపడ్డారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండలోని ప్రభుత్వ బీఈడీ కళాశాలలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అరసం జిల్లా ఉపాధ్యక్షురాలు సుమిత్ర, దేవనారాయణ, రాజ్‌కుమార్, వీరస్వామి తదతరులు పాల్గొన్నారు.


గిడుగు రామ్మూర్తి చిత్ర పటానికి పూలమాల వేస్తున్న ప్రిన్సిపాల్ జ్యోతి

డైట్‌లో దివ్యాంగుల ప్రత్యేక శిబిరం

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 29: దివ్యాంగులకు ఉపకరణాల నిర్ధారణ శిబిరం హనుమకొండలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో నిర్వహించారు. గురువారం ఏఈడీ కోఆర్డినేటర్ బి.రాధ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో ఆమె మాట్లాడుతూ.. దివ్యాంగులైన పిల్లల కోసం వారి తల్లిదండ్రులు సమయం కేటాయించి ప్రతీరోజు డాక్టర్ చెప్పినట్లు ఫిజియోథెరపీ చేయించాలన్నారు. అలింకో డాక్టర్ సునిత, డాక్టర్ గీత, జీసీడీవో సునిత పాల్గొన్నారు.

పిల్లల్లో పోషణలోపం అరికట్టవచ్చు

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు 29: పెరుగుదల పర్యవేక్షణ ద్వారా 0-6సంవత్సరాల పిల్లల్లో పోషణలోపం అరికట్టవచ్చని జిల్లా సంక్షేమ అధికారి బి. రాజమణి అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, హెల్త్ ఆఫీసర్లు, పోషణ అభియాన్ సిబ్బందికి పిల్లల్లో పోషణలోపంపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు.




పోచమ్మతల్లిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి దంపతులు

ఘనంగా పోచమ్మ బోనాలు

న్యూశాయంపేట, ఆగస్టు 29: న్యూశాయంపేటలో గురువారం ఊరంతా ఘనంగా పోచమ్మ బోనాలు చేశారు. స్థానిక కార్పొరేటర్ మామిండ్ల రాజు ఆధ్వర్యంలో న్యూశాయంపేట జంక్షన్ నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంలో పోచమ్మతల్లి ప్రతిమను ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ రథాన్ని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి - నీలిమా రెడ్డి దంపతులు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులు, ఎంపీక కావ్య, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ పోచమ్మతల్లిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామంలోని ప్రజలు ఒక్కొక్కరుగా వెళ్లి పోచమ్మతల్లికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఊరంతా ఒకే రోజు బోనాలు చేయడంతో పండగ వాతావరణం నెలకొంది. మాజీ కార్పొరేటర్ వేల్పుల మోహన్‌రావు, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు అంకేశ్వ రపు సురేందర్, కాంగ్రెస్ నాయకులు పిండి రమేష్, మామిండ్ల సురేష్‌తో పాటు న్యూశాయంపేట కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 29: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో పనిచేస్తున్న పార్ట్‌టైమ్ అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని సంఘం అధ్యక్షుడు డాక్టర్ వై. రాంబాబు డిమాండ్ చేశారు. గురువారం ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాంబాబు మాట్లాడుతూ... 16 పీరియడ్ల వర్క్‌లోడ్‌తో పనిచేస్తున్న పార్ట్‌టైమ్ అధ్యాపకులకు ప్రమోషన్ ఇచ్చి కాంట్రాక్ట్ అధ్యాపకులుగా కన్వర్షన్ చేయాలన్నారు. 2018లో ఇచ్చిన జీవో నెం. 11 ఇచ్చినా ఇప్పటివరకు పార్ట్‌టైం అధ్యాపకులను కాంట్రాక్టు అధ్యాపకులుగా కన్వర్ట్ చేయలేదన్నారు. ప్రభుత్వ అనుమతి కావాలనే సాకుతో వర్సిటీ అధికారులు కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వమే బడ్జెట్ పోస్టులకు బడ్జెట్ సాంక్షన్ చేస్తుంటే వర్సిటీ అధికారులు కన్వర్షన్ చేయడంలో తాత్సరం చేయడం ఏంటని ప్రశ్నించారు. పార్ట్‌టైం అధ్యాపకులను కాంట్రాక్ట్ అధ్యాపకులుగా కన్వర్షన్ చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం జనరల్ సెక్రెటరీ డాక్టర్ నరేందర్‌నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ దేవోజీ నాయక్, అధ్యాపకులు డాక్టర్ తిరుణహరి శేషు, డాక్టర్ రమేష్, డాక్టర్ రవీందర్‌రెడ్డి, డాక్టర్ నవీన్, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ బాలకృష్ణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తిలో సామాజిక బాధ్యత అవసరం

ఐనవోలు, ఆగస్టు 29 : సామాజిక బాధ్యతగా ఉపాధ్యాయ వృత్తిని నిర్వహిస్తారో వారిని సమాజం గుర్తుంచుకుంటుందని డీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా నాయకుడు కె.దేవదాస్ అన్నారు. పున్నేలు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు మచ్చ యాకయ్య ఉద్యోగ విరమణ సన్మానకార్యక్రమం గురువారం పాఠశాల ఆవరణలో హెచ్ఎం ఆర్. పరమేశ్వర్ అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాలు యాకయ్య దంపతులను ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో డీటీఎఫ్, పీఆర్టీయూ, ఎస్టీయూ, యూటీఎఫ్, ఆయా ఉపాధ్యాయ సంఘాల నాయకులు కృష్ణమూర్తి, జి. సమ్మయ్య, చంద్రమోహన్, మధులిమాయే, బ్రహ్మచారి, కిషన్‌గౌడ్, ఉన్నత, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులతో పాటు ఆయా మండలాల ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, గ్రామ పురప్రముఖులు, విద్యార్థులు పాల్గొని సన్మానించారు.

సఖీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

సుబేదారి, ఆగస్టు 29: సఖీ, వన్ స్టాప్ సెంటర్ అందిస్తున్న సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సఖీ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ హైమావతి అన్నా రు. గురువారం సుబేదారి ఎక్సైజ్ కాలనీలోని సఖీ వన్ స్టాప్ సెంటర్‌లో మహిళల చట్టాలపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా శిశు దివ్యాంగుల అండ్ వయోవృద్ధులశాఖ ఆధ్వర్యంలో సఖీ సెంటర్లను నిర్వహిస్తున్నామని అన్నారు. కౌన్సెలింగ్ సహాయం, వైద్యసహాయం, పోలీసు సహాయం, తాత్కాలిక వసతి, న్యాయ సహాయం వంటి ఐదు రకాల సేవలను అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి, కౌన్సిలర్ విజయలక్ష్మితో పాటు మహిళలు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌వోను కలిసిన కాంగ్రెస్ నాయకులు

మడికొండ, ఆగస్టు 29: మడికొండ పోలీస్‌స్టేషన్ నూతన ఎస్‌హెచ్‌వోగా బాధ్యతలు చేపట్టిన పుల్యాల కిషన్‌ను గురువారం మడికొండ కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్‌హెచ్‌వోను కలిసిన వారిలో మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, నాయకులు బిల్ల రవిందర్, వస్కుల శ్రీను, కొప్పుల నవీన్‌యాదవ్, అర్జున్, శివ, నాగరాజు, వినయ్, చంటి, సామ్యేల్, గోపి, కార్తీక్ పాల్గొన్నారు.

గద్దర్ వర్ధంతిని విజయవంతం చేయాలి

కాజీపేట, ఆగస్టు 29: హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ప్రముఖ కళాకారుడు, దివంగత గద్దర్ ప్రథమ వర్ధంతిని విజయవంతం చేయాలని గద్దర్ విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ సభ్యుడు జిలకర శ్రీనివాస్, కేంద్ర నర్సింగరావులు కోరారు. కాజీపేట మీడియా పాయింట్‌లో గురువారం జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. గద్దర్‌కు వరంగల్‌తో విడదీయరాని సంబంధం ఉందన్నారు. తెలంగాణ ఉద్యమంలో గద్దర్ పాత్ర మరువలేనిదన్నారు. ఈ వర్ధంతి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుమ్మడి సూర్య కిరణ్, విమలక్క, ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, సీఎల్ యాదగిరి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి సదయ్య తదితరులు పాల్గొనున్నారని చెప్పారు.

మండల పాస్టర్‌ల వార్షికోత్సవం

కాజీపేట, ఆగస్టు 29: కాజీపేట మండల పాస్టర్స్ 29వ వార్షికోత్సవం గురువారం కాజీపేట కర్మెల్ బాపిస్టు చర్చిలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాస్టర్‌లు డి.డేవిడ్, జీడీ స్వామి హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బిషప్ జి.జాన్‌మార్కండేయ క్రీస్తు సందేశాన్ని అందించారు. అనంతరం మండల పాస్టర్ సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో మండల పాస్టర్‌ల కమిటీ చైర్మన్ మంద కుమార్, అధ్యక్ష, కార్యదర్శులు సభ్యులు పాల్గొన్నారు.

బంజారా సంస్కృతికి ప్రతీక తీజ్

పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వడ్డెపల్లి, ఆగస్టు 29: హనుమకొండలోని వివిధ డివిజన్లలో తీజ్ ఉత్సవాలు అంబరాన్నంటాయి. బంజారా మహిళలు ఆట పాటలతో బంజారా సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబిపజేశారు. నవరాత్రులు తీజ్ ఉత్సవాలను అత్యంత భక్తి ప్రపత్తులతో నిర్వహించిన బంజారా ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం తీజ్ బుట్టలను డప్పుచప్పుళ్ల, భాజాభజంత్రీలు, కోలాటాలు, నృత్యాలతో యువతి, యువకులు ఆటపాటలతో బంజారా సంస్కృతి ఉట్టిపడే విధంగా అలరింపజేశారు. హనుమకొండ రాంనగర్ బంజారా కాలనీలో గిరిజన సంఘం రాష్ట్ర నేతలు ధారావత్ భానునాయక్, భూక్య రాములు ఆధ్వర్యంలో నిర్వహించిన తీజ్ నిమజ్జన వేడుకల్లో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హాజరై మేరామాయాడీ, సంత్‌సేవాలాల్ మహారాజ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. పవిత్రమైన తీజ్ ఉత్సవాలు బంజారా సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు.

హనుమకొండ అశోక కాలనీలోని గిరిజన భవన్‌లో గోర్ బంజారా తీజ్ ఉత్సవ కమిటీ గ్రేటర్ వరంగల్ ఆధ్వర్యంలో నిర్వహించిన తీజ్ ఉత్సవాల సంబరాలు అంబరాన్నంటాయి. బంజారా మహిళలు నెత్తిన నీటి బిందెలతో పాటు తీజ్ బుట్టలను ఎత్తుకొని సంస్కృతి సంప్రదాయాలతో అలరింపజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు మేరామాయాడీ, సంత్‌సేవాల్ మహరాజ్‌ను కొలిచారు. మేరామాయాడీ, సంత్ సేవాలాల్ మహరాజ్ నినాదాలతో గిరిజన భవన్ ప్రాంగణం మార్మోగింది. అనంతరం డప్పుచప్పుళ్లతో ప్రత్యేక శకటాలపైన అలంకరించిన తీజ్ బుట్టలను భారీ ఊరేగింపుతో వడ్డెపల్లి చెరువుతోపాటు పద్మాక్షి గుండంలో గురువారం రాత్రి భక్తి ప్రపత్తులతో నిమజ్జనం చేశారు.

● జూలైవాడ: గ్రేటర్ 49వ డివిజన్‌లోని గణేష్‌నగర్‌లో తీజ్ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. బంజార సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడే విధంగా బంజార మహిళలు సంప్రదాయ దుస్తుల్లో ఆటపాటలతో అలరించారు. బంజారాల ఆరాధ్యదైవం సేవాలాల్ మహారాజ్, మేర మడియాలను భక్తిశ్రద్ధలతో పూజించారు. ఈ వేడుకల్లో తీజ్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు జాటోత్ మంగీలాల్, ఎస్ఐ రవికుమార్, ఉపాధ్యక్షుడు మాలోతు శంకర్ నాయక్, కార్యదర్శి అజ్మీరా శ్రీకాంత్, పూజారి పోరిక జైసింగ్, ఆకున్ సభర్వాల్, రవి, శ్రీనివాస్, దేవి, రమ, లక్ష్మీబాయి, హైమావతి, రాధ, అశ్విని, సరోజ, మంగమ్మ, వీరేందర్, వసంత్ పాల్గొన్నారు.

● వరంగల్ కార్పొరేషన్: సంత్‌సేవాలాల్ సేవా సమితి ఆధ్వర్యంలో తీజ్ నవరాత్రి ఉత్సవాలు గ్రేటర్ 2వ డివిజన్ గుండ్లసింగారం సంత్‌సేవాలాల్ మహరాజ్ ప్రాంగణంలో గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముందుగా వివాహం కాని యువతులు గోదుమ నారుతో నృత్యాలు చేసి అందరిని అలరించారు. ఆటా పాటలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో బంజారా మహిళలకు లంబాడ దుస్తులు అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మాజీ ఎంపీ సీతారాంనాయక్ మాట్లాడుతూ.. తీజ్ పండగ భారత గిరిజనులకు అద్దం పడుతుందన్నారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ.. లంబాడాలు గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పడుతారన్నారు. అనంతరం మహిళలు, యువతుల డ్యాన్స్‌లు దుమ్మురేపాయి. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాకేశ్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ లావుడ్య రవినాయక్, తీజ్ ఉత్సవ కమిటీ నాయకులు లావుడ్య రాజ్‌నాయక్, జవహర్‌లాల్, గడ్డం శివరాంప్రసాద్, బిట్టు సాంస్కృతిక సారధి కళాకారులు పాల్గొన్నారు.


గుండ్లసింగారంలో తీజ్ ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే నాగరాజు

సుభాషితం

ఇంద్రియాల స్వయంచాలకత

"ఓ అర్జునా! ఇంద్రియాలను లొంగదీసుకోవడం కష్టం. మనిషి వాటిని నిగ్రహించుకోవడానికి ఎంతగా ప్రయత్నించినా... ఆసక్తి తొలగిపోనంతవరకూ అవి అతని మనసును ఇంద్రియార్థాలవైపు బలవంతంగా లాక్కుపోతూనే ఉంటాయి" అని అర్జునుణ్ణి శ్రీకృష్ణుడు హెచ్చరించాడు. ఈ శ్లోకం బాహ్య ఇంద్రియ విషయాలకు ఇంద్రియాల స్వయంచాలకత గురించి (వాటంతట అవే ప్రవర్తించే తీరు గురించి) వివరిస్తుంది. ధూమపానం వల్ల కలిగే నష్టాల గురించి బాగా తెలిసి కూడా... దాన్ని మానుకోలేక... కొనసాగించేవారు దీనికి ఉత్తమ ఉదాహరణ. సిగరెట్ మానుకుందామనుకున్నప్పటికీ... తమకు తెలియకుండానే వెలిగించేశామని చాలామంది బాధపడుతూ ఉంటారు. రోడ్ల మీద ఇతరులతో చిన్న విషయాలకు కొట్లాడేవాళ్ళు లేదా నేరాల్లో పాల్గొన్నవారు తాము ఆ పనులను క్షణికావేశంతో చేశాం తప్ప ఉద్దేశపూర్వకంగా కాదని ప్రమాణపూర్తిగా చెబుతారు. కార్యాలయంలో లేదా కుటుంబంతో కఠినమైన పదాలతో మాట్లాడే వ్యక్తుల విషయంలో కూడా ఇదే జరుగుతుంది. ఆ మాటలు అనాలని ముందుగా నిర్ణయించుకొని అన్నవి కావు కాబట్టి ఆ తరువాత పశ్చాత్తాపం చెందుతారు. ఇంద్రియాలు మనల్ని స్వాధీనం చేసుకుంటాయనీ, కర్మ బంధంలో మనల్ని బంధిస్తాయని ఈ ఉదాహరణలు సూచిస్తున్నాయి.



మెదడులోని కణాలు (న్యూరాన్లు) నడక లాంటి స్వయంచాలక కార్యకలాపాలను చూసుకోవడానికి 'హార్డ్ వైరింగ్' అని పిలిచే కూటములను మన చిన్న వయసులోనే ఏర్పాటు చేస్తాయి. ఇది మెదడు శక్తిని ఎంతగానో ఆదాచేస్తుంది. రోజువారీ జీవితంలో మనం సంపాదించిన నైపుణ్యాలు, అలవాట్ల విషయంలో కూడా ఇదే జరుగుతుంది. ఇలా నిర్మితమైన 'హార్డ్ వైరింగ్' ఎంత శక్తిమంతంగా మారుతుందంటే... దాని వల్ల వచ్చిన అలవాట్లను అధిగమించడం చాలా కష్టం. కొత్తదాన్ని తయారు చెయ్యడం తప్ప... ఉన్న హార్డ్ వైరింగ్‌ను విచ్ఛిన్నం చెయ్యడం అసాధ్యమని న్యూరో సైన్స్ చెబుతోంది.

"ఇంద్రియాలు చాలా శక్తిమంతమైనవి. తెలివైన వ్యక్తి మనస్సును కూడా అవి బలవంతంగా హరించగలవు" శ్రీకృష్ణుడు హెచ్చరించాడు. ఇంద్రియాల స్వయంచలనాన్ని అధిగమించడానికి... సర్వశక్తిమంతుడైన పరమాత్మ ఎదుట ఆత్మసమర్పణ చేసుకోవాలని ఆయన బోధించాడు. ఇంద్రియాల గురించి అవగాహన పొందడం వల్లనే... వాటిని నియంత్రించడానికి అవసరమైన శక్తి సమకూరుతుంది. ఆ అవగాహన లేనప్పుడు... ఇంద్రియాలతో పోరాడి వాటిని అదుపు చెయ్యలేం.



కె. శివప్రసాద్
ఐఎఎస్

సుభాషితం

వారే సుజనులు


మనసి వచసి కాయే పుణ్య పీయూష పూర్ణాః
త్రిభువనముపకార శ్రేణిభిః ప్రీణయంతః
పరగుణ పరమాణూన్పర్వతీకృత్య నిత్యం
నిజహృది వికసంతః సంతి సంతః కియంతః...

అంటూ సుజనుల లక్షణాలను...తన నీతి శతకంలో భర్తృహరి వర్ణించాడు. దాన్ని...

హృదయ వచశ్శరీరముల నెంతయు పూర్ణ సుధాప్రపూర్ణులై
ముదము బహూపకారముల మూడు జగంబులకున్ ఘటించుచున్
వదలక సాధు సద్గుణలవంబులు కొండలు నేసి మెచ్చుచున్
మదిని వికాస యుక్తులగు మాన్యులు కొందరు వొల్తురిద్ధరన్... అని తెలుగులోకి అనువదించాడు ఏనుగు లక్ష్మణకవి.

భావం: మనసా, వాచా, కర్మణా... అంటే త్రికరణ శుద్ధిగా మంచి పనులు చేయాలనే తపన ఉన్నవారు, సమస్త ప్రజలూ ఆనందంగా ఉండాలని కోరుకొనేవారు, అలాంటి ఆనందాన్ని వారికి కలిగించేవారు, అందరినీ తమ ఉపకార బుద్ధితో ఆదుకొనేవారు, ఇతరులలో సద్గుణాలు గోరంత ఉన్నా వాటిని కొండంతగా భావించి మెచ్చుకొనేవారు సుజనులు. అలాంటివారు ఈ లోకంలో చాలా కొద్దిమంది మాత్రమే ఉంటారు.





ప్రతి జీవిలో పరమాత్మను దర్శించాలి

"శ్రీమద్రామానుజులు ప్రవచించిన ఆధ్యాత్మిక ధర్మం, చూపిన సంస్కరణ మార్గం నేటి సమాజంలోని సమస్యలకు తరుణోపాయం" అంటారు **శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీరామచంద్ర రామానుజ జీయర్ స్వామి.** ఆయన సుమారు రెండున్నర దశాబ్దాల క్రితం శ్రీభాష్యకార సిద్ధాంత పీఠాన్ని స్థాపించి... శ్రీవైష్ణవ ధర్మ ప్రచారాన్ని, సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం 27వ చాతుర్మాస్య దీక్షలో ఉన్న ఆయన 'నివేదన'తో సంభాషించారు.

ఆధ్యాత్మికతను ఎలా నిర్వచిస్తారు?

ఆధ్యాత్మికత అంటే... తమను, ఈ జగత్తును సృష్టించిన భగవత్ తత్త్వాన్ని తెలుసుకోవడం, భగవంతుడి పట్ల భక్తి ప్రపత్తులు కలిగి ఉండడం. మన ఋషులు గ్రహించిన ధర్మం ఏదైతే ఉన్నదో... దాని గురించి పెద్దల ద్వారా వివరంగా తెలుసుకొని ఆచరించడం. జీవితంలో తటస్థించే అనేక సమస్యలను ఎదుర్కొంటూ, సుఖదుఃఖాలను సమానంగా భావిస్తూ, భగవన్నామ సంకీర్తనాదులతో, పవిత్రమైన భగవద్గాథల శ్రవణంతో, తత్సంబంధమైన ఆచరణతో జీవితాన్ని భగవన్మయం చేసుకోవడం.

పరివ్రాజక జీవనంలోకి ప్రవేశించడానికి ముందు మీ నేపథ్యం ఏమిటి?

స్వస్థలం గుంటూరు. కిడాంబి రత్నమాచార్యులు, వెంకట లక్ష్మీవర్యుల కనిష్ఠ సంతానం. పారంపర్యంగా తిరువారాధన, స్వయమాచార్యత్వం ఉన్నాయి. మేము బీకామ్ చదువుతున్న రోజుల్లో... శ్రీకృష్ణపరమాత్మ బలంగా ఆకర్షించాడు. తన కైంకర్యం తప్ప మరే కోరికా లేకుండా చేశాడు. అప్పటివరకూ సాధారణ యువకుడిగా జీవిస్తున్న మామీద నిర్హేతుకమైన కృపను ప్రసాదించి... తనవాణ్ణి చేసుకున్నాడు. శ్రీ వైష్ణవ సంప్రదాయ అనుష్ఠానపరులైన శ్రీమాన్ ఉభయవేదాంత ప్రవర్తకాచార్యులు తెలికచర్ల కందాడై గోపాలాచార్య స్వామివారి శిష్యత్వం కూడా ఆ భగవంతుడి అనుగ్రహమే. అది కూడా చాలా విచిత్రంగా జరిగింది. కృష్ణ భక్తుడైన ఒక వ్యక్తి కలిసి... మాకు దగ్గరలోని నడిగడ్డపాలెంలో కొందరు స్వాములు శ్రీకృష్ణ లీలల గురించి ప్రవచనం ఇస్తున్నారని చెప్పాడు. అక్కడికి వెళ్ళి చూస్తే... పెరియాళ్వార్ అనుగ్రహించిన 'తిరుమొళి' అనే గ్రంథ ప్రవచనం సాగుతోంది. ప్రవచనం ఇస్తున్నది కులపతులు శ్రీతెలికచర్ల కందాడై గోపాలాచార్యస్వామి. ఆయన శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చిన జీయర్ స్వామివారితో సహా తొమ్మిదిమంది యతులకు (జీయర్‌లకు) గురువు. ఆయనను చూడగానే 'ఈయనే మాకు ఆచార్యులు' అని నిశ్చయం కలిగింది. ఇంతలో ఆయన "ఇక మేము ఎవ్వరికీ పాఠం చెప్పము" అని ప్రకటించారు. కార్యక్రమం ముగిశాక ఆయనను కలిసి "మాకు పాఠం చెప్పండి" అని విన్నవించుకుంటే... "మేము చెప్పము" అన్నారు. ఆయనను ఎంతగానో ప్రార్థించాక... చివరకు "మళ్ళీ రా!" అన్నారు. అలా పదిహేనురోజులకు ఒకసారి... దాదాపు పదిసార్లు ఆయనను కలుసుకోవడం జరిగింది. అలా అయిదునెలల పాటు పరీక్షించారు. తమ శిష్యరికం చెయ్యాలన్న సంకల్పం మాలో దృఢంగా ఉందని నిశ్చయపరుచుకున్నాక శిష్యుడిగా స్వీకరించారు. తొమ్మిదేళ్ళపాటు సంప్రదాయ గ్రంథాల్లోని రహస్యాలను బోధించారు. భగవద్రామానుజులు అనుగ్రహించిన గ్రంథాలను అధ్యయనం చేయించారు.

సన్యాసాశ్రమాన్ని ఎప్పుడు స్వీకరించారు?

ఆళ్వార్ తిరునగరి పెద్ద అత్తాన్ వరదాచార్య స్వామివారు, శ్రీశ్రీశ్రీ త్రిదండి మన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామివారు మంత్రదీక్ష ఇచ్చారు. మాకు ముప్ఫయ్యేళ్ళ వయసున్నప్పుడు... 1998 జూన్ 10న వానమామలైకి చెందిన కలియన్ రామానుజ జీయర్ స్వామి సన్యాసాశ్రమ దీక్ష ఇచ్చారు. శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల రఘునాథాచార్యస్వామి శ్రీభాష్యాన్ని అనుగ్రహించారు. మా ఆచార్యులు సంతృప్తి చెందే విధంగా మమ్మల్ని తయారు చేసుకున్నదీ తన నిత్య కైంకర్యాలకు ఏలోటూ లేకుండా చేయించుకుంటున్నదీ ఆ శ్రీ భూ గోదాసమేత గోవింద పెరుమాళ్. ఇలా... ఒక సామాన్యుడు ఆధ్యాత్మికంగా ఎదగడం అనే అద్భుతం జరిగేలా చేసింది ఆ స్వామే.

మీ దినచర్య, నియమాలు ఎలా ఉంటాయి?

సన్యాసాశ్రమ ధర్మానుసారం నిత్యం మా ఆరాధ్యదైవమైన ఆ పెరుమాళ్ ఆరాధన, సంబంధిత అనుష్ఠానాలు, జపతపాలు ఉంటాయి. అలాగే చాతుర్మాస దీక్ష, ధనుర్మాస దీక్ష, ఏకాదశి వ్రతాలు పాటిస్తాం. నిత్యం నాతో పాటు నా అనుయాయులు స్వామివారి సేవతో పాటు వివిధ కార్యక్రమాలలో భాగమవుతారు. ప్రస్తుతం చాతుర్మాస దీక్షలో ఉన్నాం.

శ్రీమద్రామానుజాచార్యులు ప్రవచించిన ధర్మం నేటి సమాజానికి ఏ విధంగా మార్గదర్శకత్వం అందిస్తుంది?

మనుషులే కాదు, సకల చరాచర జీవకోటిలోనూ శ్రీమన్నారాయణుడు అంతర్యామిగా ఉంటాడు. వాటిని రక్షిస్తాడు. స్వామిని ఆశ్రయించినవారందరికీ ఆయన రక్షణ పొందడానికి సమానమైన అధికారం ఉంది అనే సత్యాన్ని సమాజంలో అందరూ తెలుసుకోవాలి. శరీరంలో ఒక భాగానికి కష్టం కలిగితే వేరొక భాగం వెంటనే ఎలా స్పందిస్తుందో... అలాగే సమాజంలోని అన్ని వర్గాలు కలిసికట్టుగా ఉండాలి. ఒకరి సుఖదుఃఖాలను వేరొకరు పంచుకోవాలి. తమ శ్రేయస్సునే కాకుండా... మొత్తం సమాజ శ్రేయస్సును కోరుకోవాలి. ఇదీ పన్నెండువందల ఏళ్ళ క్రితం శ్రీమద్రామానుజులు అందించిన సందేశం. ఎందుకంటే భక్తి వ్యక్తిగతమే కాదు, సామాజికం కూడా. వ్యక్తిగా తాము ఆచరించాలి. తద్వారా సమాజానికి ఆదర్శంగా నిలవాలి. వారు ఆదర్శాలతో సామాజిక ఉజ్జీవనం కలిగించడం ద్వారా... అది సామాజికంగా కూడా మారుతుంది. ఈ విధంగా భక్తి ద్వారా సమాజానికి సామరస్యత నేర్పిన సమతామూర్తి మన రామానుజులు. వైష్ణవ ధర్మానుసరణతో, సర్వ జగత్కారకుడైన శ్రీమన్నారాయణుడి పట్ల భక్తి ప్రపత్తులను కలిగి ఉండడం వల్ల... తమ తమ పూర్వ కర్మల కారణంగా ఏర్పడిన సుఖదుఃఖాల నుంచి విముక్తి కలుగుతుందనేది భగవద్రామానుజులు లాంటి పెద్దలు మానవాళికి అందించిన తరుణోపాయం. ఈనాటి పరిస్థితుల్లో... ఆధ్యాత్మిక సాధన ద్వారా ప్రజలు తమ ఒత్తిడులను పోగొట్టుకోవడం తప్ప వేరే మార్గం లేదు.

శ్రీభాష్యకార సిద్ధాంత పీఠ స్థాపనకు ప్రేరణ ఏమిటి?

సమాజంలోని అట్టడుగు వర్గాల వరకూ... భగవద్రామానుజ సిద్ధాంతానికి అనుగుణంగా భగవత్ తత్త్వాన్ని చేరవేయడానికే పీఠాన్ని స్థాపించాం.

శ్రీవైష్ణవ సంప్రదాయ పీఠాలు ఎన్నో ఉన్నాయి. మీ పీఠం ప్రత్యేకత ఏమిటి? ఇతర పీఠాలతో సమన్వయం ఎలా ఉంటుంది?

శ్రీవైష్ణవ సంప్రదాయంలో ఎన్ని పీఠాలు ఉన్నా దేని ప్రత్యేకత దానిదే. వారివారి శక్త్యానుసారం సమాజ శ్రేయస్సు కోసం కార్యక్రమాలు చేయడం, ప్రజల్ని ఉత్తేజపరచి, సనాతన ధర్మాన్ని ఆచరించే విధంగా వారిని ముందుకు నడపడమే అన్ని పీఠాల ఉద్దేశం. ఈ క్రమంలో అన్ని పీఠాలు ఒక సమన్వయ పద్ధతిలో ఉండి తీరాల్సి ఉంది.

హిందూ ధర్మం నిమ్న వర్గాలకు దూరమయిందనే వాదన ఉంది. అందరికీ దాన్ని దగ్గర చేయడానికి మీ పీఠం చేస్తున్న కృషి, ఇతర కార్యక్రమాలు ఏమిటి?

అన్ని వర్గాలవారికి మన ధర్మం పట్ల విశ్వాసాన్ని కలుగజేసే విధంగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నాం. 'భగవంతుడే రక్షకుడు' అనే విశ్వాసంతో వచ్చినవారికి సమాశ్రయణ సంస్కారం (దీక్ష ఇవ్వడం) చేస్తున్నాం. వారికి భగవత్తత్త్వాన్ని విశదంగా తెలియజేసే గ్రంథాల సారాన్ని బోధిస్తున్నాం, మంత్రోపదేశం చేస్తున్నాం. గురు శిష్య పరంపరను కొనసాగించడం ద్వారా సనాతన ధర్మాన్ని కలకాలం నిలిపే ప్రయత్నం జరుగుతోంది. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం, తిరుచానూరు, ముంగనూరు (హైదరాబాద్ సమీపంలో)లలో శ్రీ భాష్యకార సిద్ధాంత పీఠాన్ని స్థాపించాం. శ్రీవైష్ణవ సంప్రదాయ ప్రచారం, ధర్మప్రచారం జరుగుతున్నాయి. మా సిద్ధాంతాలు, సంప్రదాయాలపై ప్రజలకు అవగాహన కల్పించడం కోసం అనేక పురాణ, ఇతిహాస, సంప్రదాయ గ్రంథాలను వ్యయప్రయాసలకోర్చి ముద్రిస్తున్నాం. సామాజిక కార్యక్రమాల్లో భాగంగా... శ్రీభాష్యకార ఎడ్యుకేషనల్ సర్వీస్ ట్రస్ట్ ద్వారా శ్రీవాగీశ విశ్వవిద్యాలయాన్ని స్థాపించి... పలువురు వేదపండితులను సమాజానికి అందించాం. గోసంరక్షణ చేస్తున్నాం. సంప్రదాయ విద్య మాత్రమే కాదు... లౌకిక విద్యను అభ్యసించే ఎంతో మంది విద్యార్థులకు కూడా ఆర్థిక, వస్తు రూపేణా చేయూత అందిస్తున్నాం. మేము ఆరాధించే గోవిందుని కృపకు వారిని పాత్రులుగా చేస్తున్నాం. ఇక... 2000నుంచి 2016 వరకు... పదహారేళ్ళపాటు శ్రీమహాలక్ష్మీ యాగాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించాం. అనేకమంది ప్రజలను వాటిలో భాగస్వాముల్ని చేశాం. ఇప్పుడు మళ్ళీ ప్రతి సంవత్సరం శ్రీమహాలక్ష్మీ యాగాలు నిర్వహిస్తున్నాం. భీమవరం, మునగనూరుల్లో ఆలయ నిర్మాణాలు జరుగుతున్నాయి.

సమాజంలో ఎటువంటి మార్పును ఆశిస్తున్నారు?

పీఠం కార్యక్రమాల ద్వారా, ప్రవచనాల ద్వారా సనాతన ధర్మం పట్ల ప్రజల్లో అవగాహన కలిగించడం, వారిలో భగవంతుడి పట్ల భక్తి ప్రపత్తులు కలిగించడం... ఇదే మేము ఆశించేది. అంతేకాకుండా 'వసుధైవ కుటుంబకమ్' అనే సూక్తిని ఆచరణలో పెట్టడం ద్వారా ప్రతి జీవిలో అంతర్యామిగా ఉన్న పరమాత్మను దర్శించడం, సమాజంలో అహింసా ప్రవృత్తిని ప్రేరేపించడం కూడా.

• కృష్ణశర్మ

చాతుర్మాస్య దీక్ష ప్రాధాన్యత ఏమిటి? పరివ్రాజకులందరికీ అది తప్పనిసరా?

ఆషాఢ శుద్ధ ఏకాదశిని 'తొలి ఏకాదశి' అంటారు. దానినే 'శయన ఏకాదశి' అని కూడా అంటారు. ఆ రోజు శ్రీమన్నారాయణుడు పాలకడలిలో, శేషపాన్పు మీద శయనిస్తాడు. అప్పటి నుంచి కార్తీక శుద్ధ ఏకాదశి వరకూ ఈ చాతుర్మాస్య వ్రతం నడుస్తుంది. స్వామి శయనించడంతో... నిత్య సంచారులుగా ఉండే యతులు ఆషాఢ పూర్ణమి నుంచి కార్తీక పూర్ణిమ వరకూ తమ సంచారాలను నిలిపివేసి, ఒక చోటే ఉంటూ అనుష్ఠానాలు కొనసాగిస్తారు. ఏవైనా యజ్ఞ, యాగాది విశేష కార్యక్రమాలు, వాటి ప్రచార కార్యక్రమాలు ఉన్నప్పుడు... నాలుగు మాసాల ఈ వ్రతాన్ని నాలుగు పక్షాలుగా ఆచరిస్తారు. అది ఆషాఢ పూర్ణిమ నుంచి భాద్రపద పూర్ణిమ వరకు. భాద్రపద శుద్ధ ఏకాదశికి 'పరివర్తన ఏకాదశి' అని పేరు. అంటే శయనించిన స్వామి... ఒక వైపునకు ఒత్తిగిల్లుతారు. ఒత్తిగిల్లడం కూడా సగం మేలుకోవడం కాబట్టి... భాద్రపద పూర్ణిమకు కొందరు తమ దీక్షను విరమిస్తారు. కార్తీక శుద్ధ ఏకాదశికి 'ఉత్థాన ఏకాదశి' అని పేరు. అంటే శయనించే స్వామి మేలుకుంటారు. నాలుగు మాసాలు చాతుర్మాస వ్రతం చేసేవారు ఆ సమయంలో విరమణ చేస్తారు. ప్రధానంగా ఈ నాలుగు మాసాలు వర్షాకాలం. వర్షాలకు కీటకాదులు బయటకు వస్తాయి. యతులు సంచరించేటప్పుడు అవి వారి పాదాల కింద పడి మరణిస్తాయి. ఇది హింస చేయడమే. కాబట్టి యతులు ఒకే చోట ఉండి అనుష్ఠానాలు జరుపుకోవాలనే నియమం విధించారు. పరివ్రాజకులకు చాతుర్మాస్య వ్రతం తప్పనిసరి విధి. యతులను వారి చాతుర్మాస్యాల ఆధారంగానే 'వృద్ధ యతులు'గా నిర్ణయిస్తారు తప్ప... వయసును బట్టి కాదు.

తెలుసుకుందాం

పదునాల్గు భువన భాండాలు

చతుర్దశ భువనాల ప్రస్తావన పురాణాలలో తరచుగా కనిపిస్తుంది. భూమితోపాటు భూమికి పైన ఉన్న మరో ఆరు లోకాలు... అంటే మొత్తం ఏడింటిని 'ఊర్ధ్వలోకాలు' అనీ, భూమికి దిగువన ఉన్న ఏడు లోకాలను 'అధోలోకాలు' అనీ పిలుస్తారు. వీటి గురించి 'శ్రీమద్భాగవతం'లోని 'ద్వితీయ స్కంధం'లో వివరంగా ఉంది.

భువనాత్మకుం డాయీశుండు
భువనాకృతితోడ నుండు బ్రహ్మాండంబున్
వివరముతో బదునాలుగు
వివరంబులుగా నొనర్చె విశదంబులుగన్ (పోతన భాగవతం)

విశ్వస్వరూపుడైన భగవంతుడు ఒక భవనంలా ఉన్న బ్రహ్మాండాన్ని విడివిడిగా చేసి, విపులమైన పద్నాలుగు భువనాలుగా తీర్చిదిద్దాడు. ఈ విశ్వమంతా పరమాత్ముడి శరీరమే. పద్నాలుగు భువనాలుగా విభజితమైన ఈ విశ్వంలో... పైన ఉన్న ఏడు లోకాలు... శ్రీ మహా విష్ణువు నడుముకు పైన ఉన్న దేహం కాగా, దిగువన ఉన్న ఏడు లోకాలు... మహా విష్ణువు నడుముకు దిగువన ఉన్న శరీరం. ఆయన కటి స్థలం భూలోకం. నాభి భువర్లోకం, హృదయం సువర్లోకం, వక్షస్థలం మహర్లోకం, కంఠం జనలోకం, పెదవులు తపోలోకం, శిరస్సు బ్రహ్మ నివాసమైన సత్యలోకం. అలాగే... జఘనం అతలం, ఊరువులు వితలం, మోకాళ్ళు సుతలం. పిక్కలు తలాతలం, చీలమండలు మహాతలం, కాలి మునివేళ్ళు రసాతలం, అరికాలు పాతాళం. కాగా... ఆయన పాదతలం నుంచి భూలోకం, నాభి నుంచి భువర్లోకం, శిరస్సు నుంచి సువర్లోకం... ఇలా ముల్లోకాల సృష్టి జరిగిందనేది మరో వివరణ. లోకాలన్నిటికీ కర్త, పోషకుడు, లయకారుడు ఆ భగవంతుడేననీ, ప్రళయకాలంలో ఈ పద్నాలుగు భువనాలు పరబ్రహ్మలో విలీనం అవుతాయని పూర్వ ఋషులు పేర్కొన్నారు. ఈ లోకాల విశిష్టతలను తెలుసుకుందాం.



భూలోకంతో కలిపి, భూలోకానికి పైన ఉండేవి ఊర్ధ్వలోకాలు:

భూలోకం: ఇక్కడ నాలుగు విధాలైన జీవరాశులు ఉంటాయి. అవి స్వేదజాలు (చెమట నుంచి ఉద్భవించే పేలు, నల్లులు లాంటివి), అండజాలు (గుడ్డు నుంచి ఉద్భవించే పక్షులు), జరాయుజాలు (మానవ, పశు గర్భాల నుంచి పుట్టే మనుషులు, పశువులు), ఉద్భిజాలు (మొక్కలు, చెట్లు).

భువర్లోకం: ఇది భూలోకానికి పైన ఉంటుంది. సూర్యుడు, చంద్రుడు, గ్రహాలు, నక్షత్రాలు, సూక్ష్మ శరీరంలో ఉండే కింపురుషులు, కిన్నెరులు, విద్యాధరులు లాంటి జాతుల వారు ఉంటారు.

సువర్లోకం: ఇది భువర్లోకం పైన ఉంటుంది. దీన్ని 'స్వర్గ లోకం' లేదా 'సువఃలోకం' అని కూడా అంటారు. ఇంద్రాది దిక్పాలకులు, మహర్షులు, గంధర్వులు, అప్సరసలు ఉంటారు. వారు కోరుకున్న రూపాన్ని పొందగలిగే సామర్థ్యం కలిగిన వారు. వారికి ఆకలి దప్పులు, శరీర దుర్గంధం, వృద్ధాప్యం లాంటివి ఉండవు.

మహర్లోకం: ఇది సువర్లోకానికి పైన ఉంటుంది. దేవతలు తపస్సు చేసే లోకం ఇది. స్వర్గంలో దేవతలు అనుభవించే దివ్య సుఖాలను.... ఇక్కడ తాపసులు తమ తపస్సు ద్వారా సంపూర్ణంగా అనుభవిస్తూ ఉంటారు.

జనోలోకం: దీన్నే 'సత్య లోకం' అని కూడా అంటారు. ఇది మహర్లోకానికి పైన ఉంటుంది. అత్యంత పుణ్యాత్ములైనవారు ఈ లోకంలో సుఖ శాంతులతో వర్ధిల్లుతూ ఉంటారు. అయోనిజులైన దేవతలు ఇక్కడ తపస్సు చేస్తూ ఉంటారు.

తపోలోకం: ఇది జనోలోకం పైన ఉంటుంది. కైలాసం, వైకుంఠం, మణిద్వీపం, స్కంధలోకం ఇక్కడే ఉంటాయి. ఇక్కడ దేవతలు నివసిస్తారు. పంచభూతాలు, పంచేంద్రియాలు వారి ఆధీనంలో ఉంటాయి. ఎప్పుడూ సుగంధాలు వెదజల్లుతూ, ప్రశాంతంగా ఉండే లోకం ఇది. భూలోకంలో వివిధ దేవతలను ఉపాసించినవారు... ఈలోకానికి చేరుకొని, కల్పాంతం వరకూ ఇక్కడ తపస్సు చేస్తారు. ఆ తరువాత కర్మానుసారం భూలోకంలో జన్మించి, సత్కర్మలను ఆచరిస్తూ ఉంటారు. మహా ప్రళయంలో సర్వం లయమైనప్పుడు... వారు జన్మరాహిత్యాన్ని పొందుతారు.

సత్యలోకం: ఇది తపోలోకానికి పైన ఉంటుంది. ఊర్ధ్వలోకాలన్నిటిలో ఇది అత్యుత్తమమైనది. ఇది సృష్టికర్త అయిన బ్రహ్మకు నివాసం. బ్రహ్మ అనేది ఒక పదవి. అనేకానేక కల్పాలకు ఒకరు ఈ పదవిని అధిష్ఠిస్తారు. తమ కర్తవ్యం పూర్తయిన తరువాత బ్రహ్మంలో లయమవుతారు. భవిష్యత్తులో హనుమంతుడు బ్రహ్మ పదవిని స్వీకరిస్తాడని పురాణాలు చెబుతున్నాయి. మహర్షులు అనేక ఉపాసనలు చేసినవారు, వేదాంతులు, భూలోకంలో ఆత్మజ్ఞానాన్ని పొందినవారు ఈ లోకంలో వేదాంత చర్చలు చేస్తూ ఉంటారు.

భూలోకానికి దిగువన ఉండేవి అధోలోకాలు:

అతల లోకం: భూమికి దిగువన ఉండే లోకం ఇది. ఈ లోకంలో రాక్షసులు ఉంటారు. వాళ్ళు భౌతికమైన భోగలాలసులుగా మదోన్మత్తులుగా ఉంటారు. మయుడి కుమారుడైన బలుడి విహార స్థలం.

వితల లోకం: అతలలోకానికి కింద ఉంటుంది. స్వర్ణ జలం ప్రవహించే హాటకీ నది ఉండే చోటు ఇది. ఈ నదీ జలాలతో తయారైన బంగారంతో తయారైన ఆభరణాలను రాక్షస మహిళలు ధరిస్తారు.

సుతల లోకం: వితల లోకానికి అడుగున ఉండే ఈ లోకంలోనే సప్త చిరంజీవులలో ఒకరైన బలి చక్రవర్తి ఉంటాడు. ఆయన నిత్యం విష్ణువును ధ్యానిస్తూ, ఇంద్రుడిని మించిన భోగాలను అనుభవిస్తూ... సుతలలోకాన్ని పాలిస్తాడు.

తలాతల లోకం: ఇది సుతలానికి కింద ఉంటుంది. మాయావులైన రాక్షసులతోపాటు దానవ శిల్పి మయుడు, మహా శివుడు సంహరించిన త్రిపురాసురులనే రాక్షస రాజులు ఇక్కడ ఉంటారు.

మహాతలం: గరుత్మంతుడి సవతితల్లి కద్రువ పుత్రులైన, వేలాది శిరస్సులు కలిగిన సర్పాలు (కాద్రవేయులు) సకుటుంబంగా ఇక్కడ నివసిస్తారు. వారు మహా బలవంతులు, కోరిన రూపం ధరించగలిగేవారు. ఈ లోకం తలాతలం కింద ఉంటుంది.


రసాతల లోకం: మహాతలానికి దిగువన ఉండే రసాతల లోకం... నివాత కవచులు, కాలకేయులు తదితర రాక్షసులకి నివాస స్థలం. వీరందరూ అత్యంత సాహసవంతులైన రాక్షస ప్రముఖులు.

పాతాళ లోకం: రసాతల లోకానికి కింద ఉండే పాతాళమే నాగలోకం. మహా మణులతో ప్రకాశిస్తూ ఉండే పాతాళంలో... నాగలోకాధిపతి వాసుకి, ఆదిశేషుడితో సహా సమస్త సర్పజాతి నివసిస్తూ ఉంటుంది.

సద్గురువాణి

సాధన అంటే...

"ఎంతకాలం సాధన చేసినా... ఎక్కడికీ చేరుకోలేనట్టు అనిపిస్తోంది" అనే ప్రశ్న ఎదురయింది. దీనికి సమాధానం ఏమిటంటే... మీరు ఎన్ని సంవత్సరాలు సాధన చేసినా ఎక్కడికీ వెళ్ళలేరు. వెళ్ళలేకపోవడం కాదు... అస్సలు వెళ్ళలేరు. ఎందుకంటే యోగం, ధ్యానం తదితర సాధనలు చేయడం వెనుక ఉన్న అంతరార్థం... ఎక్కడికో వెళ్ళడం కాదు, ఇక్కడ ఉండగలిగే స్థితికి రావడం. 'ఇక్కడ ఉన్నది ప్రతిచోటా ఉంది, ఇక్కడ లేనిది ఎక్కడా లేదు' అని అర్థం చేసుకోవడం. ఎక్కడికో వెళ్ళాల్సిన అవసరాన్ని దాటి వెళ్ళడమే సాధన. నిజానికి వెళ్ళేందుకు మరొక చోటంటూ ఏదీ లేదు. ఉన్నదల్లా ఇక్కడే... ఈ క్షణం మాత్రమే. మిగిలినదంతా మీ ఆలోచనల్లోనే ఉంది.




సాధన అనేది ఒక ఉపకరణం. మీలో పరిపక్వత తీసుకువచ్చి, మరెక్కడికో వెళ్ళాల్సిన అవసరాన్ని పోగొట్టే ఒక పద్ధతి. మీరు ఇక్కడ కూర్చుంటారా?, హిమాలయాల్లో లేదా ఆఫ్రికాలో, అమెరికాలో, ఉత్తర ధృవంలో, దక్షిణ ధృవంలో కూర్చుంటారా? అనేది ముఖ్యం కాదు. బహుశా కొన్ని ప్రదేశాలు అనుకూలంగా ఉండొచ్చు. కానీ అది ప్రధానం కాదు. సాధనలో... మీలో జరిగేదాన్ని మాత్రమే మీరు అనుభూతి చెందుతారు. ఉన్నది ఉన్నట్టుగా చూసే పరిపక్వ స్థాయికి మిమ్మల్ని చేర్చేదే సాధన.

• సద్గురు జగ్గీ వాసుదేవ్

కాపాడేది సత్యమే


సద్బోధ



ఇద్దరు వ్యక్తులు ఒక నీటి ప్రవాహంలో చిక్కుకుపోయారు. వారిని ఒడ్డున ఉన్న ప్రజలు గమనిస్తున్నారు. కానీ ఎలా కాపాడాలో తెలియక ఆందోళన పడుతున్నారు. ఇంతలో... ఆ వ్యక్తుల్లో ఒకరికి పెద్ద దుంగ కనిపించింది. దాన్ని అతను గట్టిగా పట్టుకున్నాడు. రెండో వ్యక్తి చుట్టూ వెతికితే... ఒక తాడు కనిపించింది. అతను దాన్ని అందుకున్నాడు. ఒడ్డు వైపు విసిరాడు. అక్కడ ఉన్న జనం దాన్ని పట్టుకున్నారు. ఆ తాడు... దుంగలా దృఢంగా లేదు. చాలా దుర్బలంగా, గట్టిగా లాగితే తెగిపోయేలా ఉంది. కానీ దాన్ని ఒడ్డున ఉన్న వాళ్ళు మెల్లగా లాగారు. తాడు చివర ఉన్న వ్యక్తిని ఒడ్డుకు చేర్చారు. పెద్ద దుంగ ఉన్న వ్యక్తి దాన్నే అంటిపెట్టుకొని ఉన్నాడు. ఉధృతంగా ఉన్న ప్రవాహం అతన్ని దిగువకు లాక్కొనిపోయింది.

మనకు ప్రాపంచికమైన ఆనందాలు, డబ్బు, పేరు ప్రతిష్ఠలు, ఆడంబరాలు దుంగలా పెద్దవిగా కనిపిస్తాయి. కానీ అవేవీ మనల్ని రక్షించలేవు. రక్షణ సూత్రం ఎప్పుడూ సన్నటి తాడులాగానే ఉంటుంది. ఆధ్యాత్మిక దృష్టితో చూస్తే... మనల్ని కాపాడేది ఏదీ మన కళ్ళకి కనిపించదు. దాన్ని మనం స్పృశించలేం. అనుభూతి చెందలేం. అదే అంతిమమైన సత్యం. అది ఎప్పుడూ అగోచరంగానే ఉంటుంది. ఆ సత్యాన్ని గ్రహించి, దాన్ని నమ్ముకుంటే మనల్ని కాపాడుతుంది. ప్రాపంచికమైన వాటి మీద ఆధారపడి, అవే నిత్యం అనుకుంటే... నిస్సహాయతలో, దుఃఖంలో మునిగిపోక తప్పదు. కాబట్టి ఏది సత్యమో, ఏది మనని కాపాడుతుందో తెలుసుకోవాలి. దాన్ని అంటిపెట్టుకొని ఉండాలి. లౌకికమైన వస్తువులను, సంపదను నమ్ముకున్న వ్యక్తి నాశనమైపోతాడనేది ప్రకృతి సూత్రం. భగవంతుడి మీద విశ్వాసమే మనల్ని సురక్షితంగా ఉంచుతుంది.

- స్వామి రామతీర్థ



రజనీకాంత్ చిత్రంలో నాగార్జున

రజనీకాంత్ కథానాయకుడిగా తెరకెక్కుతోన్న 'కూలీ' చిత్రంలో అక్కినేని నాగార్జున కీలకపాత్ర పోషిస్తున్నారు. గురువారం ఆయన పుట్టిన రోజు సందర్భంగా చిత్ర బృందం ఈ విషయాన్ని ప్రకటించింది. ఇందులో ఆయన పోషిస్తున్న సైమన్ పాత్రను పరిచయం చేస్తూ యూనిట్ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో కళానిధి మారన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అలాగే నాగార్జున కీలకపాత్ర పోషిస్తున్న మరో చిత్రం 'కుబేర' నుంచి ఆయన స్టైలిష్ లుక్‌ను విడుదల చేశారు. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్‌రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

మగవాళ్లనూ వదల్లేదు

• దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్‌పై తాజా ఆరోపణ

మాలీవుడ్‌లో మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులపై జస్టిస్ హేమ కమిటీ ఇచ్చిన నివేదిక పరిశ్రమను కుదిపేస్తోంది. తాజాగా మరి కొందరు మలయాళ సినీ ప్రముఖులపై అత్యాచారం కేసులు నమోదయ్యాయి. నటి మిను మునీర్ ఆరోపణలతో బుధవారం నటుడు, సీపీఎం ఎమ్మెల్యే ముఖేశ్, హీరో జయసూర్యపై అత్యాచారం కేసు నమోదు చేశారు. వీరితో పాటు మరో ఐదుగురిపైనా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దీంతో ఇప్పటివరకూ 17 మందిపై కేసులు నమోదయ్యాయి.



మలయాళ చిత్రపరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను వెలికితేవడంలో హేమ కమిటీ పనితీరు అద్భుతంగా ఉందని టాలీవుడ్ కథానాయిక సమంత ప్రశంసించారు. అలాగే ఈ కమిటీ ఏర్పాటుకు కారణమైన డబ్ల్యూసీసీ (ఉమెన్ ఇన్ సినిమా కలెక్టివ్) సంస్థనూ ఆమె అభినందించారు. ఆ సంస్థ సభ్యుల కష్టం వల్లే ఈ రోజు మహిళల సమస్యలు చర్చనీయాంశంగా మారాయని చెప్పారు. సినీ పరిశ్రమలో మహిళల సంరక్షణ కోసం ఆ సంస్థ అవిశ్రాంతంగా పాటుపడుతోందని అభినందించారు. 'డబ్ల్యూసీసీ గురించి నాకు చాలా కాలంగా తెలుసు. ప్రభుత్వం హేమ కమిటీ ఏర్పాటు చేయడానికి ఆ సంస్థ తీసుకొన్న చొరవే కారణం. వారి పోరాటానికి నా కృతజ్ఞతలు' అన్నారు.

అవకాశం ఇస్తానని...

మలయాళ దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్ తనను లైంగికంగా వేధించాడని బెంగాలీ నటి శ్రీలేఖ మిత్ర ఆరోపించిన విషయం తెలిసిందే. అయితే అతను ఆడవాళ్లనే కాదు మగవాళ్లనూ వదల్లేదు అని కోజికోడ్‌కు చెందిన సజీర్ అనే వ్యక్తి సంచలన ఆరోపణలు చేశాడు. తనపైన 2012లో రంజిత్ లైంగిక దాడికి పాల్పడ్డాడు అని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు సజీర్ కేరళ డీజీపీకి ఫిర్యాదు చేశాడు. "సినిమా అవకాశం ఇస్తానని చెప్పి బెంగళూరులోని తాజ్ హోటల్‌కు అర్ధరాత్రి పిలిపించుకున్నాడు. గదిలోకి వెళ్లాక నా దుస్తులు తొలగించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. నా ఫొటోలు తీశాడు. 'వాటిని ఎవరికి పంపావు' అని అడిగితే 'లోపలి గదిలో నటి రేవతి ఉన్నారని రంజిత్ నాతో చెప్పాడు. అయితే ఆమె నిజంగా అక్కడ ఉన్నారా? లేదా, వారిద్దరి మధ్య ఎలాంటి సంబంధం ఉందనేది నాకు తెలియదు' అని సజీర్ చెప్పాడు.

పృథ్వీరాజ్ తగిన వ్యక్తి

అమ్మ (అసోసియేషన్ ఆఫ్ మలయాళ మూవీ ఆర్టిస్ట్స్) అధ్యక్ష పదవికి మోహన్‌లాల్ రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో బాధ్యతలు నిర్వహించేందుకు హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ తగిన వ్యక్తి అని నటి మిను మునీర్, పార్వతి తిరువోతు అభిప్రాయపడ్డారు. అమ్మ ఎగ్జిక్యూటివ్ ప్యానెల్ మూకుమ్మడి రాజీనామాపై నటి పార్వతి తిరువోతు స్పందించారు. అసోసియేషన్‌లో నిరంకుశ పాలన నడుస్తోందని ఆరోపించారు. మీడియా ముందుకొచ్చి మాట్లాడే అవకాశం లేక పోవడంతోనే రాజీనామా చేశామన్నారు. తమ నిర్ణయం పిరికితనంగా అనిపించిందన్నారు. ఇంతమంది మహిళలు ధైర్యంగా బయటకొచ్చి ఫిర్యాదు చేస్తున్నా కేరళ ప్రభుత్వం విచారణలో నిర్లక్ష్యం చూపుతోందని మిను ఆరోపించారు.

కోలీవుడ్‌లోనూ కమిటీ

'అడ్జెస్ట్‌మెంట్' పేరుతో సినిమా అవకాశాలు ఇస్తామని గాలం వేసేవారు ఎంతటివారైనా చెప్పుతో కొట్టాలని 'నడిగర్ సంఘం' ప్రధాన కార్యదర్శి, హీరో విశాల్ పిలుపునిచ్చారు. జస్టిస్ హేమ కమిషన్ తరహాలోనే కోలీవుడ్‌లోనూ నడిగర్ సంఘం ఆధ్వర్యంలో పది మంది సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేస్తాం అని చెప్పారు.

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/zMezrwpలో చదవండి.

నవరస నటనకు యాభై ఏళ్లు!



ఎన్టీఆర్ వంటి మహా నటుడికి వారసుడు కావడం ఒక విధంగా బాలకృష్ణ అదృష్టం, మరో రకంగా అగ్నిపరీక్ష కూడా. తండ్రి పేరు నిలబెట్టి ఆ విషయంలో విజయం సాధించారు బాలకృష్ణ. యాభై ఏళ్లక్రితం సరిగ్గా ఇదే రోజున విడుదలైన 'తాతమ్మ కల'(1974 ఆగస్టు 30) చిత్రంతో చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టారు. సాధారణంగా 30 ఏళ్లో, నలభై ఏళ్ల కాలమో కథానాయకుడిగా నటించి, ఆ తర్వాత క్యారెక్టర్ పాత్రలకు షిఫ్ట్ అయిన నటులు ఎందరో! కానీ బాలకృష్ణ విషయం చాలా ప్రత్యేకం. తొలి సినిమా 'తాతమ్మ కల' నుంచి ఇప్పటి వరకూ ఒక్క ఏడాది కూడా గ్యాప్ తీసుకోకుండా హీరోగానే నటిస్తూ యాభై ఏళ్ల నట జీవితాన్ని పూర్తి చేసుకుని చరిత్ర సృష్టించారు బాలకృష్ణ. సెప్టెంబర్ ఒకటిన దక్షిణాది చిత్ర పరిశ్రమలోని అతిరథ మహారథుల సమక్షంలో ఆయనకు భారీ సన్మానం జరుగుతున్న నేపథ్యంలో ఆయన కెరీర్‌లో మలుపులు, మెరుపులు....

ప్రపంచ వ్యాప్తంగా ఎందరో నటీనటులు తమ వారసుల్ని వెండితెరకు పరిచయం చేశారు. ఆ సంప్రదాయాన్ని మన దేశంలో మహా నటుడు పృథ్వీరాజ్ కపూర్ అనుసరించారు. ఆయన తనయులు రాజ్ కపూర్, షమ్మీ కపూర్, శశి కపూర్ తండ్రి లాగానే నటనను వృత్తిగా స్వీకరించి తమదైన బాణీ పలికించారు. రాజ్ కపూర్ కూడా తండ్రిని ఆదర్శంగా తీసుకొని తన ముగ్గురు కొడుకుల్ని హీరోలుగా పరిచయం చేశారు. దక్షిణాది మహా నటుడు నందమూరి తారకరామారావు ఈ విషయంలో రాజ్ కపూర్‌ను అనుసరిస్తూ తొలిసారిగా తెలుగు నాట తన తనయులు హరికృష్ణ, బాలకృష్ణను నటనా రంగంలో అడుగు పెట్టేలా ప్రోత్సహించారు. అయితే నట వారసుల్లో ఎవరికీ లేనంత సుదీర్ఘమైన కెరీర్ బాలకృష్ణ సొంతం.

- బాలకృష్ణ నటించిన తొలి చిత్రం 'తాతమ్మ కల'కు కూడా కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. కుటుంబ నియంత్రణ విధానాన్ని దేశంలో తొలిసారిగా ప్రవేశ పెట్టినప్పుడు ఆ విధానాన్ని వ్యతిరేకిస్తూ ఎన్టీఆర్ నిర్మించిన సినిమా ఇది. యాభై రోజుల ప్రదర్శన పూర్తి చేసుకున్న తర్వాత సినిమాను ఆపేసి, చిన్న చిన్న మార్పులతో మళ్లీ విడుదల చేశారు. రెండు సార్లు సెన్సార్ అయి, రెండు సార్లు విడుదల అయిన సినిమా తెలుగులో ఇదొక్కటే. ఇందులో బాలకృష్ణది బాలనటుడి పాత్ర కాదు. కథలో కీలకమైన పాత్ర.
- ఎన్టీఆర్ అనితర సాధ్యంగా అభినయించిన శ్రీరామ, శ్రీకృష్ణ పాత్రలను బాలకృష్ణ సైతం పోషించి అభిమానుల్ని అలరించారు. అంతే కాదు ఎన్టీఆర్ పోషించని అభిమన్యు, నారద, ఆంజనేయ పాత్రలను బాలకృష్ణ పోషించి అభినందనలు అందుకున్నారు. పెద్దాయన పాతాళ భైరవి వంటి జానపద చిత్రాల్లో నటిస్తే, బాలయ్య భైరవ ద్వీపం సినిమాతో అభిమానులను ఆకట్టుకున్నారు.
- ఒకే చిత్రంలో అటు భగవంతుడు, ఇటు భక్తునిగా నటించిన ఘనత తెలుగు నాట ఎన్టీఆర్, బాలకృష్ణ దే. 1964లో వచ్చిన శ్రీ సత్యనారాయణ మహత్యం' లో ఎన్టీఆర్ శ్రీ మహా విష్ణువుగా, సత్యవ్రతుడిగా నటించారు. అలాగే 'పాండురంగడు' లో బాలయ్య శ్రీకృష్ణ, పుండరీక పాత్రలతో మెప్పించారు.
- బాలకృష్ణ ఎప్పుడూ ట్రెండ్‌ను ఫాలో కాలేదు. ఆయన నటిస్తేనే అది ట్రెండ్ అయింది. ఆ ట్రెండ్‌ను తర్వాత మిగిలిన హీరోలందరూ ఫాలో కావడం గమనార్హం. డిస్కో డ్యాన్సులు, మెషిన్‌గన్స్‌తో యాక్షన్ సినిమాలు వస్తున్న రోజుల్లో బాలకృష్ణ పంచె కట్టుతో, కర్ర సాముతో బాక్సాఫీసు దగ్గర కాసుల వర్షం కురిపించారు. ఆ తర్వాత చాలా కాలం తెలుగులో గ్రామీణ వాతావరణంలో సినిమాలు వచ్చాయి. అలాగే తెలుగులో ఫ్యాక్షన్ సినిమాల నిర్మాణం బాగా పెరగడానికి బాలకృష్ణ నటించిన 'సమరసింహారెడ్డి', 'నరసింహనాయుడు' చిత్రాల సంచలన విజయమే కారణం.
- ఎన్టీఆర్ తన 52 వ ఏట బాపు దర్శకత్వంలో రూపొందిన శ్రీరామాంజనేయ యుద్ధం చిత్రంలో శ్రీరామునిగా నటించారు. అలాగే బాలకృష్ణ కూడా తన 52 వ ఏటనే అదే బాపు దర్శకత్వంలో శ్రీరామరాజ్యం చిత్రంలో శ్రీరామునిగా నటించడం విశేషం.
- తండ్రి పేరుతో తీసిన బయోపిక్ లో తనయుడు హీరోగా నటించిన సందర్భాలు గతంలో లేవు. అరుదైన ఆ ఘనత బాలయ్య కే దక్కింది. ఎన్టీఆర్ బయోపిక్ కథానాయకుడు, మహానాయకుడు చిత్రాల్లో బాలయ్య ఎన్టీఆర్ గా కనిపించడంతో అభిమానులు మురిసిపోయారు.
- రాజకీయ నాయకునిగా కూడా తండ్రి వారసత్వాన్ని కాపాడుతున్నారు బాలకృష్ణ. మూడు సార్లు హిందూపరం శాసనసభ్యుడిగా ఎన్నికై హ్యాట్రిక్ సాధించిన బాలకృష్ణ ప్రజా సేవలోనూ తన ముద్రను చాటారు.

ఇప్పటివరకూ రాని సినిమా



హీరో శ్రీవిష్ణు, దర్శకుడు హసిత్ గోలీ 'రాజ రాజ చోర' చిత్రం తర్వాత కలసి చేస్తున్న చిత్రం 'శ్వాగ్'. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ఇందులో రాజు, భవభూతి, సింగ, యయాతి పాత్రలను శ్రీవిష్ణు, రాణి రుక్మిణీదేవి పాత్రలో రీతూ వర్మ నటించారు. ఈ చిత్రం టీజర్ విడుదల చేసిన సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో శ్రీవిష్ణు మాట్లాడుతూ ' మన అందరి ఇళ్లలో ఉన్న పాయింటే అయినా ఇండియన్ స్ర్కీన్ మీద ఇప్పటివరకూ రాని సినిమా ఇది. ఇలాంటి సినిమా తీయడానికి ముందుకు వచ్చిన విశ్వప్రసాద్ గారికి కృతజ్ఞతలు. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం' అన్నారు. 'శ్రీవిష్ణు, హసిత్‌తో కలసి ఇంతకుముందు 'రాజ రాజ చోర' సినిమా చేశాం. 'శ్వాగ్' చాలా విభిన్న చిత్రం' అని తెలిపారు విశ్వప్రసాద్. దర్శకుడు హసిత్ గోలీ మాట్లాడుతూ 'ఇది అచ్చ తెలుగు సినిమా. కంటెంట్ చాలా మాట్లాడుతుంది. తాత, ముత్తాతలతో కలసి చూడగలిగే సినిమా. విష్ణు బాగా చేశారు. ఎప్పటికీ గుర్తుండిపోయే సినిమా అవుతుంది' అన్నారు. మీరా జాస్మిన్, దక్ష నాగార్కర్, శరణ్య ప్రదీప్, సునీల్, రవిబాబు, గెటప్ శ్రీను, గోపరాజు రమణ తదితరులు నటించారు.

ఐదు భాషల్లో 'కుంభ'



స్వీయ దర్శకత్వంలో వి.సముద్ర నిర్మించే 'కుంభ' చిత్రం గురువారం హైదరాబాద్‌లో మొదలైంది. హీరో విజయ్‌రామ్‌పై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు సముద్ర సతీమణి విజయలక్ష్మి కెమెరా స్విచాన్ చేయగా, నిర్మాత డీఎస్ రావు తొలి క్లాప్ ఇచ్చారు. తొలి షాట్‌కు చంద్రమహేశ్, దేవిప్రసాద్ గౌరవ దర్శకత్వం వహించారు. 'కథలను నమ్ముకుని కొత్త వాళ్లతో ఐదు సినిమాలు తీస్తున్నాను. వాటిల్లో 'కుంభ' ఒకటి. ఐదు భాషల్లో ఈ సినిమా తయారవుతుంది' అని సముద్ర చెప్పారు. విజయ్‌రామ్ హీరోగా, సూరజ్ ఆదిత్య విలన్‌గా నటిస్తున్నారు.



తెలుగు భాషా దినోత్సవం రోజున...

కొత్తగా..

ఎప్పటినుంచో తెలుగు భాష, సంస్కృతి, విలువల గురించి సినిమా తీయాలనే కోరిక ఉంది. సందేశంలా కాకుండా మంచి వాణిజ్య విలువలు ఉన్న అంశాలు కలిగిన కథ దొరికినప్పుడే అలాంటి సినిమా చేయాలి. ఇప్పుడు అటువంటి కథ కుదిరింది. 1980 నేపథ్యంలో జరిగే సినిమా ఇది. తెలుగు భాషా దినోత్సవం రోజున ఈ సినిమా వివరాలు ప్రకటించడం ఆనందంగా ఉంది' అన్నారు దర్శకుడు వైవీఎస్ చౌదరి. సీనియర్ ఎన్టీఆర్ ముని మనవడు నందమూరి తారక రామారావు హీరోగా, వీణా రావు హీరోయిన్‌గా నటించనున్నారు. గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో నందమూరి హరికృష్ణ వర్ధంతి సందర్భంగా చౌదరి ఆయనకు నివాళులు అర్పించారు. చిత్ర ఎగ్జిక్యూటివ్ నిర్మాత రమేశ్ అత్తిలిని చౌదరి ఈ సందర్భంగా పరిచయం చేశారు. 'మేం నలుగురం స్నేహితులం కలసి చిత్ర నిర్మాణరంగంలోకి అడుగుపెట్టాలని అనుకున్నాం. చౌదరిగారితో కలసి ఈ ప్రాజెక్ట్ చేయడం ఆనందంగా ఉంది' అన్నారు రమేశ్ అత్తిలి. ఈ కార్యక్రమంలో నిర్మాత యలమంచిలి గీత, మాటల రచయిత బుర్రా సాయిమాధవ్, గీత రచయిత చంద్రబోస్ పాల్గొన్నారు.

నాలుగున్నరేళ్లు పోరాడి పదవి సాధించిండు

- కోర్టు తీర్పుతో బొల్లారం పదో వార్డు కౌన్సిలర్‌గా స్వతంత్ర అభ్యర్థి ప్రమాణం
- బీఆర్ఎస్ మహిళా కౌన్సిలర్‌పై అనర్హత


ప్రమాణ స్వీకారం చేస్తున్న నరసింహరాజు

జిన్నారం, ఆగస్టు 29: మున్సిపల్ ఎన్నికల్లో రెండో స్థానంలో నిలిచి.. నాలుగున్నరేళ్ల న్యాయపోరాటం చేసి గెలిచిన ఓ వ్యక్తి ఎట్టకేలకు కౌన్సిలర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం బొల్లారం మున్సిపాలిటీకి 2020 జనవరిలో ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో బీసీ జనరల్ స్థానమైన 10వ వార్డు కౌన్సిలర్‌గా బీఆర్ఎస్ అభ్యర్థి శైలజ గెలుపొందారు. స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన నరసింహరాజు రెండో స్థానంలో నిలిచారు. అయితే, శైలజ బీసీ కాదని ఓసీ సామాజిక వర్గానికి చెందిన వారని పేర్కొంటూ నరసింహరాజు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ కేసును విచారించిన జిల్లా న్యాయస్థానం శైలజను అనర్హురాలిగా ప్రకటిస్తూ రెండు నెలల క్రితం తీర్పు ఇచ్చింది. దీంతో ఎన్నికల్లో రెండో స్థానంలో నిలిచిన నరసింహరాజు కౌన్సిలర్ అయ్యారు. కోర్టు, జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ మంగతాయారు.. నరసింహరాజుతో కౌన్సిలర్‌గా గురువారం ప్రమాణ స్వీకారం చేయించారు. అయితే, నరసింహరాజు పదవీ కాలం మరో ఐదు నెలల్లోనే ముగియనుంది.

కుమార్తె కవితను చూసి భావోద్వేగం!

కేసీఆర్ కళ్లలో నీళ్లు.. ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌కు కవిత

తండ్రితో ఆప్యాయ ఆలింగనం.. ఆయనకు పాదాభివందనం

మర్కుక్, హైదరాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): చాన్నాళ్ల తర్వాత కూతురు కవితను చూసి బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ భావోద్వేగానికి గురయ్యారు. ఆయన కళ్లలో నీళ్లు తిరిగాయి. ఢిల్లీ మద్యం విధానం కుంభకోణంలో బెయిల్ లభించడంతో ఐదున్నర నెలల జైలు జీవితం తర్వాత తిహాడ్ నుంచి విడుదలైన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత గురువారం తండ్రి కేసీఆర్‌ను కలిసేందుకు సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌కు వచ్చారు. ఆమె వెంట భర్త అనిల్, కుమారుడు ఉన్నారు. ఫామ్‌హౌస్ వద్ద బీఆర్ఎస్ నేతలు ఆమెకు ఘన స్వాగతం పలికారు. గుమ్మం ఎదుట గుమ్మడికాయతో దిష్టితీసి.. హారతులతో ఆమెను లోపలికి ఆహ్వానించారు. ఇంట్లోకి వస్తూనే కేసీఆర్‌కు కవిత పాదాభివందనం చేశారు. కుమార్తెను ఆశీర్వదించిన కేసీఆర్ ఆమెను ఆప్యాయంగా అక్కున చేర్చుకున్నారు. ఈ సందర్భంగా తండ్రి చేతిని కవిత ముద్దాడారు. కవితకు బెయిల్ లభించడం పట్ల కేసీఆర్ హర్షం వ్యక్తం చేశారు. కాగా అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ పరాజయం, కవిత అరెస్టు, లోక్‌సభ ఎన్నికల్లో పార్టీకి ఒక్క సీటూ రాకపోవడంతో తీవ్ర నిరాశలో ఉన్న కేసీఆర్ ముఖంలో చాన్నాళ్ల తర్వాత సంతోషం ఉత్సాహం కనిపించాయని పలువురు బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు.


కేసీఆర్ పాదాలకు నమస్కరిస్తున్న కవిత

రైతు కష్టం రోడ్డు పాలు

భారీగా పతనమైన టమాట ధర

డిమాండ్ లేక అమ్ముడుపోక రోడ్డుపై పారబోత


చేవెళ్ల మార్కెట్ పరిసరాల్లో టమాటాలు పారబోసిన రైతులు

చేవెళ్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రెండు నెలల క్రితం భారీగా పలికిన టమాట రేటు ఇప్పుడు ఒక్కసారిగా తగ్గడంతో రైతుల కష్టం రోడ్డుపాలవుతోంది. పెట్టిన పెట్టుబడిలో పదోవంతు కూడా రాక రైతులు గగ్గోలు పెడుతున్నారు. పండించిన పంటను మార్కెట్‌కు తరలిస్తే అక్కడ రేటు లేక యార్డులోనే పారబోస్తున్నారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల డివిజన్‌లో 750 ఎకరాల్లో టమాటాను సాగుచేశారు. వర్షాలతో దిగుబడి బాగానే ఉండటంతో రైతులు పెద్దమొత్తంలో టమాటాలను మార్కెట్‌కు తెస్తున్నారు. చేవెళ్ల మార్కెట్‌లో రెండు నెలల క్రితం దాదాపు రూ. 2 వేల వరకు పలికిన 25 కిలోల టమాట బాక్స్ ధర గురువారం రూ. 100 నుంచి 250 మాత్రమే పలికింది. దీంతో పెట్టుబడైనా రాదని రైతులు వాపోతున్నారు. వర్షాలతో దిగుబడి పెరగడంతో నిత్యం వందలాది బాక్సుల టమాట మార్కెట్‌కు వస్తోంది. దీంట్లో బాగా ఉన్న టమాటాలనే నామమాత్ర ధరకు వ్యాపారులు కొంటున్నారు. చాలా మంది రైతుల టమాట అమ్ముడుపోక రోడ్డు పక్కన పారబోసి వెళ్లిపోతున్నారు. కొందరు రైతులయితే ధరలేదని టమాట తెంపడం లేదు. కురుస్తున్న వర్షాలతో టమాటాలకు మచ్చలొచ్చి నిలువ ఉండవని, అందుకే ఎక్కువగా కొనడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. పంట ఉత్పత్తి ఎక్కువ ఉండడంతో చేవెళ్ల మార్కెట్‌కు నిత్యం ఎనిమిది వందల నుంచి వెయ్యి బాక్స్‌ల టమాట వస్తోందని, సరిపడా డిమాండ్ లేక ధర పడిపోయిందని వారు అంటున్నారు. అయితే వ్యాపారులు తమ వద్ద 25 కిలోల బాక్స్‌ను 100 నుంచి 150కే కొని వినియోగదారులకు మాత్రం ఎక్కువ రేటుకు అమ్ముకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

రేవంత్ వ్యాఖ్యలు సరికాదు!

(మొదటిపేజీ తరువాయి)

బెయిల్ వచ్చిందని సీఎం కామెంట్ చేశారు" అని కవిత తరఫు న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఈ వ్యాఖ్యలపై ధర్మాసనం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. సీఎం రేవంత్‌రెడ్డిని తీవ్రంగా మందలించింది. జస్టిస్ బీఆర్ గవాయి స్పందిస్తూ... "ముఖ్యమంత్రి స్థాయి హోదాలో ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడంతో కొందరి ఆలోచనల్లో భయాలు రేకెత్తే అవకాశం ఉంది. రాజకీయ నాయకులను సంప్రదించి మేము తీర్పులు ఇస్తున్నామా?" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. "న్యాయమూర్తులుగా మేం ప్రమాణం చేస్తాం. మనస్సాక్షిగానే మా విధిని నిర్వర్తిస్తాం" అని స్పష్టం చేశారు. మరో న్యాయమూర్తి, జస్టిస్ కేవీ విశ్వనాథన్ జోక్యం చేసుకొని... "ఇది ఒక సీఎం హోదాలో ఉన్న బాధ్యత గల వ్యక్తి చేయాల్సిన వ్యాఖ్యలా? సంస్థల పట్ల పరస్పర గౌరవం ఉండాలని ప్రాథమిక కర్తవ్యం చెప్పలేదా? గౌరవం కలిగి ఉండాలి' అని వ్యాఖ్యానించారు. మరోసారి జస్టిస్ గవాయి అసంతృప్తి వ్యక్తం చేస్తూ... చట్టసభలు, కార్యనిర్వాహక వ్యవస్థ కార్యకలాపాల్లో తాము జోక్యం చేసుకోబోమని, అలాగే రాజకీయ నాయకుల నుంచి కూడా తాము అదే ఆశిస్తామని చెప్పారు. సుప్రీంకోర్టు ఆదేశాలపై వ్యాఖ్యానించిన మహారాష్ట్ర ఐఏఎస్ అధికారికి కోర్టు ధిక్కార నోటీసులు జారీచేసిన విషయాన్ని ధర్మాసనం ప్రస్తావించింది. తెలంగాణ ముఖ్యమంత్రి సైతం దేశ అత్యున్నత న్యాయస్థానం పట్ల గౌరవం లేకుండా, ఇలాంటి ప్రవర్తనే కలిగి ఉంటే ఆయన తెలంగాణ బయటి కోర్టులో విచారణను ఎదుర్కోవాల్సి ఉంటుందని మందలించింది. కాగా... ప్రభుత్వం తరఫున రోహత్గీ జోక్యం చేసుకుని ముఖ్యమంత్రి తరఫున తాను క్షమాపణలు చెబుతున్నానని అన్నారు. అంతలోనే.. మరో సీనియర్ న్యాయవాది సిథార్థ లూథ్రా ముఖ్యమంత్రికి కౌన్సిలింగ్ ఇస్తామని ధర్మాసనాన్ని అభ్యర్థించారు. ఈ క్రమంలో పిటిషనర్ తరఫు న్యాయవాది శేషాద్రి నాయుడు స్పందిస్తూ... సుప్రీంకోర్టు గురించి ముఖ్యమంత్రి ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నప్పుడు హైకోర్టు, దిగువ కోర్టుల పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించాలని సూచించారు.

హోంశాఖ సీఎం దగ్గరే ఉంది

ఓటుకు నోటు కేసును మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయాలని







కోరుతూ ఈ ఏడాది జనవరి 31న బీఆర్ఎస్ నేతలు జగదీశ్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, మహ్మద్ అలీ, కల్వకుంట్ల సంజయ్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్లపై గురువారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, జస్టిస్ బీఆర్ గవాయ్, ప్రశాంత్ కుమార్ మిశ్రా, కేవీ విశ్వనాథన్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారించింది. తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, సిద్ధార్థ్ లూథ్రా, మేనకా గురుస్వామి, న్యాయవాదులు శ్రావణ్ కుమార్, ఎంఏ నజ్కీ, పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు ఆర్యమ సుందరం, సిద్ధార్థ దవే, దామ శేషాద్రి నాయుడు, న్యాయవాది మోహిత్‌రావు హాజరయ్యారు. తొలుత ఆర్యమ సుందరం తన వాదనలు వినిపిస్తూ... "కేసులో నిందితుడు రేవంత్‌రెడ్డి ప్రస్తుతం తెలంగాణ ముఖ్యమంత్రిగా ఉన్నారు. దర్యాప్తు సంస్థ ఏసీబీని పర్యవేక్షించే హోంశాఖ కూడా ఆయన వద్దే ఉంది. ఈ కేసులో ప్రత్యక్ష సాక్షులను, దర్యాప్తు సంస్థల అధికారులను ఇంకా విచారించలేదు. అలాగే.. పీసీసీ అధ్యక్షుడిగా మహబూబ్‌నగర్‌లో జరిగిన ర్యాలీల్లో పలుమార్లు పోలీసులపై రేవంత్‌రెడ్డి బెదిరింపు ధోరణి ప్రదర్శించారు. అదే వ్యక్తి తర్వాత సీఎంగా బాధ్యతలు చేపట్టారు. ఆయన తీరును పరిశీలిస్తే కేసుపై ఎలాంటి ప్రభావం పడుతుందో అర్థమవుతుంది. గతంతో పోలిస్తే ప్రభుత్వం దాఖలు చేసే కౌంటర్ అఫిడవిట్లలోనూ కూడా వైఖరి మారింది" అని ఆర్యమ సుందరం తెలిపారు. మరో సీనియర్ న్యాయవాది దామా శేషాద్రి నాయుడు వాదనలు వినిపిస్తూ.. తెలంగాణ ప్రభుత్వ ప్రాసిక్యూషన్ తీరు, పోలీసు అధికారులతో పాటు సుప్రీంకోర్టుకు సంబంధించి రేవంత్‌రెడ్డి గతంలో చేసిన కొన్ని ప్రకటనల నేపథ్యంలో విచారణపై పిటిషనర్లలో భయాందోళనలు నెలకొన్నాయని తెలిపారు. జస్టిస్ బీఆర్ గవాయి స్పందిస్తూ... కేవలం అపోహలతో విచారణను బదిలీ చేస్తే మన న్యాయ వ్యవస్థపై నమ్మకం లేదన్నట్టే అవుతుందని వ్యాఖ్యానించారు. ట్రయల్ జరిగే విషయంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నందున ఈ కేసు విచారణకు ఇండిపెండెంట్ ప్రాసిక్యూషన్‌ని నియమిస్తామని చెప్పారు. విశ్వసనీయతను పెంచేందుకే స్వతంత్ర ప్రాసిక్యూటర్‌ను నియమిస్తామని స్పష్టం చేశారు. 2021 నుంచి స్టే అమలులో ఉండగా, 2024 ఎన్నికల తర్వాతే మీరు కోర్టుకు వచ్చారు.. ఎందుకు? అని పిటిషనర్ల తరఫున న్యాయవాదులను ప్రశ్నించారు. "మా న్యాయ వ్యవస్థపై మాకు పూర్తి విశ్వాసం ఉంది. అందరి అనుమానాలను నివృత్తి చేసేందుకు స్పెషల్ ప్రాసిక్యూటర్ ను నియమిస్తాం. ఏపీ లేదంటే తెలంగాణ నుంచి ఒకరిని స్పెషల్ ప్రాసిక్యూటర్‌గా నియమిస్తాం. ప్రతి ఒక్కరి మనస్సులో విశ్వాసం ఉండేలా, మీకు అభ్యంతరం లేకుండా ప్రత్యేక ప్రాసిక్యూటర్‌ని నియమిస్తాం. తెలంగాణకు చెందిన మా సహచరులను సంప్రదించి ఈ నియామకాన్ని మేమే పర్యవేక్షిస్తాం. ప్రత్యేక ప్రాసిక్యూటర్ నియామకాన్ని సుప్రీంకోర్టే చేపడుతుంది" అని జస్టిస్ గవాయి చెప్పారు. పిటిషన్‌ను డిస్మిస్ చేస్తామని, స్పెషల్ ప్రాసిక్యూటర్ నియామకంపై మధ్యాహ్నం 2 గంటలకు తీర్పు ఇస్తామని తెలిపారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నియామకం విషయంలో వి.సురేందర్‌రావు(ప్రస్తుతం సీఎం కేసులో ప్రాసిక్యూటర్), ఉమా మహేశ్వర్‌రావు పేర్లు తెరపైకి వచ్చాయి. చివరికి ఎలాంటి నిర్ణయం తీసుకోని ధర్మాసనం.. తదుపరి విచారణను సెప్టెంబర్ 2కు వాయిదా వేస్తున్నట్లు వెల్లడించింది. అలాగే.. విచారణ బదిలీ అంశాన్ని ప్రస్తుత స్థితిలో రద్దు చేయలేమని స్పష్టం చేసింది.

క్యాష్ కారులో పెట్టేయమ్మా..!!

- రూ.లక్ష లంచం తీసుకుని ఏసీబీకి చిక్కిన అసిస్టెంట్ రిజిస్ట్రార్

మేడ్చల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఆ రూ.లక్ష పార్కింగ్ ప్లేస్‌లో ఉన్న నా కారులో పెట్టేయంటూ.. లంచం తీసుకోవడంలో అతి తెలివి ప్రదర్శించిన ఓ ప్రభుత్వ ఉద్యోగి అవినీతి నిరోధక శాఖకు దొరికిపోయాడు. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా సహకార సంఘం అసిస్టెంట్ రిజిస్ట్రార్ బీ శ్రీనివాసరాజు రూ.లక్ష లంచం తీసుకుంటూ గురువారం ఏసీబీకి చిక్కారు. ఏసీబీ సిటీ రెంజ్-2 డీఎస్పీ శ్రీధర్ కథనం ప్రకారం.. నవభారత్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ కేసులో తనకు సహకరించాలని కోరుతూ ఓ వ్యక్తి(ఫిర్యాదుదారుడు) అసిస్టెంట్ రిజిస్ట్రార్(ఆర్బిట్రేటర్) శ్రీనివాసరాజును జూలై 24న కలిశాడు. ఇందుకు శ్రీనివాసరాజు రూ.5 లక్షలు లంచం డిమాండ్ చేయగా సదరు వ్యక్తి ఏసీబీని ఆశ్రయించాడు. ఏసీబీ సూచన మేరకు శ్రీనివాసరాజుతో మాట్లాడిన ఫిర్యాదుదారుడు రూ.లక్ష తీసుకుని పని చేయాలని ఒప్పించాడు. ఇందుకు అంగీకరించిన శ్రీనివాసరాజు గురువారం తన కార్యాలయానికి డబ్బు తెచ్చి ఇవ్వాలని సూచించాడు. ఈ మేరకు ఫిర్యాదుదారుడు డబ్బుతో కలెక్టరేట్‌కు రాగా భవనం పార్కింగ్‌లో ఉన్న తన కారు డ్యాష్‌బోర్డులో డబ్బు పెట్టాలని శ్రీనివాసరాజు సూచించాడు. ఫిర్యాదుదారుడు పార్కింగ్ ప్రదేశానికి వెళ్లగానే శ్రీనివాసరాజు తన కారును అన్‌లాక్ చేశాడు. దీంతో లంచం డబ్బును కారులో పెట్టిన ఫిర్యాదుదారుడు.. ఏసీబీ అధికారులతో కలిసి శ్రీనివాసరాజు వద్దకు వచ్చాడు. శ్రీనివాసరాజును అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు అతడిని రిమాండ్‌కు తరలించారు.

రేవంత్‌రెడ్డిది చిట్‌చాట్ కాదు.. చీట్ చాట్!

- కవిత బెయిల్ విషయంలో న్యాయం గెలిచింది
- సుప్రీంకోర్టు తీర్పును సీఎం తప్పుబట్టడం నేరం
- వాల్మీకి స్కామ్‌పై ఈడీ విచారణ కోరదామా?
- రంగనాథ్ తన ఆఫీస్ కూల్చుకుని ఇతర భవనాలపై పడాలి:హరీశ్‌రావు



హైదరాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): "మీడియా ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి చేసేది చిట్‌చాట్ కాదు.. 'చీట్ చాట్' అని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. అబద్ధాలను సీఎం గోబెల్స్‌లాగా ప్రచారం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. గురువారం హరీశ్ మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. కవిత బెయిల్ విషయంలో సీఎం వ్యాఖ్యలను సుప్రీం తప్పుపట్టిన విషయాన్ని గుర్తుచేసిన హరీశ్.. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి సుప్రీంకోర్టు తీర్పును తప్పుపట్టడం నేరమన్నారు. "వక్రబుద్ధి ఉంటే అన్నీ వంకరగానే కనిపిస్తాయి. ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డికి బెయిల్ బీజేపీ ఇస్తేనే వచ్చిందా?" అని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కవిత బెయిల్ విషయంలో న్యాయం, ధర్మం గెలిచిందన్నారు. "సిసోడియాకు బెయిల్ వస్తే బీజేపీతో పోరాటం.. కవితకు బెయిల్ వస్తే బీజేపీతో లాలూచీ అంటారా?" అని సూటిగా ప్రశ్నించారు. కర్ణాటకలో జరిగిన 'వాల్మీకి' కుంభకోణం పట్టపగలు జరిగిన నిలువుదోపిడీ లాంటిదని హరీశ్ ఆరోపించారు. ఈ వ్యవహారానికి సంబంధించి.. తెలంగాణలోని తొమ్మిది కంపెనీల ఖాతాలకు డబ్బులు బదిలీ అయినట్లు తెలుస్తోందని.. రాహుల్‌గాంధీ, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. వాల్మీకి స్కామ్ డబ్బులు ఎవరికి వచ్చాయో తేల్చడానికి ఈడీ విచారణ కోరేందుకు రేవంత్‌రెడ్డి ముందుకొస్తే.. తానూ వస్తానని పేర్కొన్నారు.

భూములు కొల్లగొట్టే కుట్ర

ఫోర్త్ సిటీ పేరుతో కాంగ్రెస్ పాలకులు భూముల దోపిడీకి కుట్ర చేస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. కందుకూరులోని సర్వే నంబర్ 9లో 385 ఎకరాలు ప్రభుత్వ భూమిని కొల్లగొట్టేందుకు సర్వే చేస్తున్నారని, తుక్కుగూడలో సర్వేనంబర్ 895లో 25ఎకరాలు పేదరైతుల వద్ద బినామీల పేరిట తీసుకుంటున్నారని మండిపడ్డారు. ప్రభుత్వంలో పెద్దలుగా చలామణి అవుతున్నవారి తమ్ముళ్ల పీఏల పేరిట ముచ్చర్లలో భూములు కొంటున్నారని ధ్వజమెత్తారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ మొదట తన ఆఫీసును కూలగొట్టుకుని ఇతర భవనాలపై పడాలన్నారు. నెక్లెస్‌రోడ్, లుంబినీ పార్క్, హోటళ్లు, క్లబ్‌లు దేనికింద ఉన్నాయని ప్రశ్నించిన హరీశ్... "నాలాపై ఉన్న బుద్ధభవన్, జీహెచ్ఎంసీ కార్యాలయాలను తొలుత కూల్చాలి" అని డిమాండ్ చేశారు. ప్రతిపక్షాలను టార్గెట్ చేయడం తగదని హితవు పలికారు. అలాగే.. రైతు రుణమాఫీపై రిపోర్టు ఇవ్వాలని తనను కోరడం హాస్యాస్పదమని, నివేదిక తానిస్తే.. ఇక రేవంత్‌రెడ్డి సీఎం పదవిలో ఉండడం ఎందుకని హరీశ్ ప్రశ్నించారు. రుణమాఫీ సభకు రావాలని సీఎం మూడుసార్లు ఆహ్వానించినా రాహుల్ గాంధీ రాలేద ని విమర్శించారు. "ఆయన ఎప్పుడు హైదరాబాద్ వస్తారో చెప్పండి.. నేను ఎయిర్‌పోర్టులో రిసీవ్ చేసుకొని రేవంత్ సొంత గ్రామానికి తీసుకువెళ్లి రుణమాఫీ అయిందో లేదో రైతుల ద్వారా చెప్పిస్తాన"ని హరీశ్ పేర్కొన్నారు. అలాగే.. గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు పాముకాటుకు గురై ప్రాణాలు కోల్పోతుంటే సీఎం ఏం చేస్తున్నారని నిలదీశారు. గురుకులాల అధ్వాన పరిస్థితికి, విద్యార్థుల మరణాలకు విద్యాశాఖ మంత్రిగా కూడా ఉన్న రేవంతే బాధ్యుడని గురువారం ఎక్స్ వేదికగా హరీశ్ విమర్శించారు.

పేదల ఇళ్లను కూల్చితే ఊరుకోబోం

రాష్ట్రానికి తొలి సీఎంలా రేవంత్ పోజు: ఈటల

ఓల్డుబోయినపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పేదల ఇళ్లను కూల్చి వేస్తే ఊరుకోబోమని ఎంపీ ఈటల రాజేందర్ హెచ్చరించారు. గురువారం ఓల్డ్ బోయినపల్లి డివిజన్‌లోని హస్మత్‌పేట బోయిన చెరువును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఈటల మీడియాతో మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడి 70 ఏళ్లు దాటినా.. ఇవాళే రాష్ట్రం ఏర్పడినట్లుగా.. మొదటి సీఎం తానే అయినట్లుగా రేవంత్‌రెడ్డి పోజు కొడుతున్నాడని విమర్శించారు. ఎన్ కన్వెన్షన్‌ను, ఒకటో రెండో పెద్దవాళ్ల నిర్మాణాలను కూల్చి.. వందలాది మంది పేదలకు నోటీసులు ఇవ్వడం సరికాదని అన్నారు. హస్మత్‌పేట్ చెరువు పక్కన ఇళ్లు కట్టుకున్న 125 మందికి, అల్వాల్ చెరువు సమీపంలో ఉన్న 120 మందికి నోటీసులు ఇవ్వడంతో వారంతా కన్నీరుమున్నీరవుతున్నారని చెప్పారు. వారంతా 40 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నారని తెలిపారు. రేవంత్‌రెడ్డి గొప్ప ప్రగతి కాముకుడని.. ఆయన మాత్రమే రాష్ట్రాన్ని కాపాడగలరని ప్రొఫెసర్ నాగేశ్వర్ లాంటివారు పొగుడుతున్నారని.. వారికి చెరువు పక్కన ఉన్న పేదోళ్ల కన్నీళ్లు తెలుసా..? అని ఈటల ప్రశ్నించారు.

పాలమూరులో అర్ధరాత్రి ఆపరేషన్

రెండున్నర గంటల్లో 70 ఇళ్ల కూల్చివేత

పెద్దఎత్తున మోహరించిన పోలీసులు..

బాధితుల్లో దివ్యాంగులు.. కలెక్టరేట్ ఎదుట ధర్నా

మహబూబ్‌నగర్, ఆగస్టు 29: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో అర్ధరాత్రి తర్వాత అధికారులు కూల్చివేతలు చేపట్టారు. రెండున్నర గంటల వ్యవధిలో 70 ఇళ్లను నేలమట్టం చేశారు. కొన్నిటిని పూర్తిగా, మరికొన్నింటిని పాక్షికంగా, ఇంకొన్నింటి పునాదులను తొలగించారు. పట్టణంలోని సర్వే నంబర్ 523 ఆదర్శనగర్‌లో దళారులు నకిలీ పట్టాలు సృష్టించి 75 నుంచి 100 గజాల చొప్పున విక్రయించారన్న ఫిర్యాదులున్నాయి. ఈ స్థలాలు కొన్న కొందరు నిర్మాణాలు చేపట్టారు. గురువారం తెల్లవారుజామున 3:30కు పోలీసులు, రెవెన్యూ, మునిసిపల్ అధికారులు సంయుక్తంగా రంగలోకి దిగి.. తాళాలు వేసిన ఇళ్ల కూల్చివేత చేపట్టారు. ఆర్డీవో, డీఎస్పీ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని స్టేషన్‌లకు చెందిన వంద మందికి పైగా పోలీసులను మోహరించారు. పడగొట్టిన ఇళ్లలోని సామగ్రి, ఫర్నిచర్ కూడా దెబ్బతిన్నాయి. ఉదయం 6 గంటలకల్లా యంత్రాలు, పోలీసులు వెళ్లిపోయారు. కాగా, కూల్చినవాటిలో.. కళ్లు లేని, నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగులకు చెందిన ఇళ్లు కూడా ఉన్నాయి. వారు అక్కడకు చేరుకుని విలపించడం అందరినీ కలచివేసింది. ఆదర్శనగర్‌లో అక్రమ కట్టడాల పేరిట కూల్చివేతలు ఇది నాలుగోసారి. తమకు పట్టాలున్నాయని, పన్ను చెల్లిస్తున్నామని, నోటీసులు లేకుండా ఎలా కూల్చివేస్తారని బాధితులు ప్రశ్నించారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకున్నామని వాపోయారు. పింఛన్ డబ్బులు దాచుకుని నిర్మాణాలు చేపట్టామని దివ్యాంగులు చెప్పారు. మరోవైపు కూల్చివేసిన ఇళ్లను మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ గురువారం సాయంత్రం పరిశీలించారు. బాధితులను పరామర్శించారు.

కులగణన చేపట్టకపోవడం బీసీల వ్యతిరేక చర్య

- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి:ఆర్.కృష్ణయ్య


హైదరాబాద్, కవాడిగూడ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు దాటుతున్నా కులగణన చేపట్టకపోవడం బీసీల వ్యతిరేక చర్య అని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. కులగణనను కాంగ్రెస్ ఎన్నికల హామీగా ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాలన్నారు. కులగణన కోసం వెంటనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లో అఖిలపక్ష రాజకీయ, బీసీ కుల సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీల డిమాండ్ల పట్ల ప్రభుత్వాన్ని సంప్రదిస్తే ఎలాంటి సానుకూల స్పందన రాలేదన్నారు. ఇకనైనా జాప్యం చేయకుండా కులగణన చేపట్టాలని, కాలపరిమితి ముగిసిన బీసీ కమిషన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కమిషన్‌లో రాజకీయ నాయకులను కాకుండా అనుభవజ్ఞులైన విద్యావేత్తలు, నిపుణులకు చోటు కల్పించాలన్నారు. కులగణన కోసం జీవో జారీ చేస్తే సరిపోదని, నిధులు విడుదల చేయాలన్నారు. ఇదిలా ఉండగా.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ప్రకటించి ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ జనసమితి (టీజేఎస్) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. టీజేఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరాం అధ్యక్షతన హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశాల సందర్భంగా చేసిన తీర్మానాలను పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మార్జున్ మీడియాకు తెలిపారు. సెప్టెంబరు 30న పార్టీ 4వ ప్లీనరీ ఏర్పాటుకు నిర్ణయించామని, 12 జిల్లాలకు ఇన్‌చార్జ్‌లను నియమించినట్టు పేర్కొన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్ల కోసం సెప్టెంబర్ 2న కలెక్టరేట్ల ముట్టడి: జాజుల

స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ హామీని అమలు చేయకుంటే లక్షలాదిమంది బీసీలతో హైదరాబాద్‌ను దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ సెప్టెంబరు 2న అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద నిరసన ముట్టడి చేపడతున్నామని తెలిపారు. గురువారం ఇందిరాపార్కు చౌరస్తాలో బీసీ భవన్‌లో కుల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్ ముట్టడి పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.

జన్వాడ అక్రమ నిర్మాణాలపై .. సీఎం ఎందుకు స్పందించడం లేదు

- చెరువులో కట్టిన ఒవైసీ కాలేజీలపై చర్యలేవి..?
- వేరే విద్యా సంస్థలకు నోటీసులిస్తారా: సంజయ్
- రంగనాథ్ ఖద్దరు బట్టలు వేసుకోవాలి: ఏలేటి



సిరిసిల్ల రూరల్/హైదరాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జన్వాడ అక్రమ కట్టడాలపై సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు స్పందించడం లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. గతంలో ప్రతిపక్ష నేతగా ఆ కబ్జాలపై పోరాటం చేసి జైలుకు వెళ్లిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు ముఖ్యమంత్రి హోదాలో ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో చెప్పాలన్నారు. సిరిసిల్లలో గురువారం సంజయ్ విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్‌లో ఒక్క ఎన్ కన్వెన్షన్‌ను కూల్చివేసి గొప్ప అనిపించుకోవద్దని అన్నారు. హైదరాబాద్‌లోని సల్కం చెరువులో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ.. కళాశాల భవనాలను నిర్మించారని.. వాటిని ఎందుకు కూల్చడం లేదని ప్రశ్నించారు. విద్యార్థులు ఉన్నందున గడువు ఇస్తామని చెప్పిన హైడ్రా అధికారులు.. ఇతర విద్యాసంస్థల భవనాలను కూల్చివేసేందుకు ఎందుకు నోటీసులు ఇస్తున్నారని ప్రశ్నించారు. తమ భవనంపై చేయి వేస్తే ప్రభుత్వం సంగతి చూస్తానని ఒవైసీ బెదిరిస్తే ఎందుకు మౌనం వహిస్తున్నారని నిలదీశారు. రైతు రుణమాఫీ, ఆరు గ్యారెంటీలను ప్రజలు మర్చిపోయేందుకు ప్రభుత్వం హైడ్రాను తెరమీదికి తీసుకొచ్చిందని సంజయ్ అన్నారు. కాగా, హైడ్రా కమిషనర్ రంగనాథ్ తనను విమర్శించాలనుకుంటే ఖాకీ డ్రెస్సు బదులు ఖద్దరు బట్టలు వేసుకోవాలని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. రంగనాథ్ వ్యవహారం పని తక్కువ.. పబ్లిసిటీ ఎక్కువ అన్న చందంగా ఉందని విమర్శించారు. "ఐపీఎస్ అధికారులు వృత్తిలో భాగంగా అవసరమైతేనే మీడియాతో మాట్లాడాలి. కానీ రంగనాథ్ తన ఇమేజ్ ప్రమోషన్ కోసం అదే పనిగా ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. ఇంటర్వ్యూల్లో నన్ను ఉద్దేశించి మాట్లాడటం సరికాదు. నాపై వ్యక్తిగత విమర్శలు చేస్తే ప్రివిలేజ్ మోషన్ నోటీసు ఇస్తా. పాతబస్తీలోని చెరువులను పునరుద్ధరించిన తర్వాతే హైదరాబాద్‌లోని మిగతా చెరువుల ఆక్రమణలు తొలగించాలి. సల్కం చెరువులోని ఒవైసీ భవనాల్లో విద్యా సంస్థలున్నాయని, విద్యా సంవత్సరం పూర్తయ్యాక వాటిని కూల్చేస్తామంటున్నారు. ఇదే సూత్రం ఇతర విద్యా సంస్థలకు ఎందుకు వర్తించదు..? అంటే హైడ్రా హిందువులపై ప్రయోగించడానికేనా..? అక్బరుద్దీన్ డీఫ్యాక్టో డిప్యూటీ సీఎంలా వ్యవహరిస్తున్నారు. అందుకే హైడ్రా ఆయన విద్యా సంస్థల జోలికెళ్లడం లేదు" అని మహేశ్వర్‌రెడ్డి అన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

- సీఎంకు టూరిజం కార్పొరేషన్ కాంట్రాక్టు ఉద్యోగుల వినతి

హైదరాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో ఏళ్ల తరబడి పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాన్ని ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి కోరారు. ఈ మేరకు గురువారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు నేతృత్వంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. సుమారు రెండున్నర దశాబ్దాలుగా వివిధ విభాగాల్లో పని చేస్తున్న 180 మంది ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల పదవీ విరమణ వయసు 61కి పెంచాలని, సమాన పనికి సమాన వేతనాలు కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇవ్వాలని ముఖ్యమంత్రిని కోరినట్లు రాజమౌళి తెలిపారు. కాగా అర్హతలున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించేందుకు చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్ హామీ ఇచ్చినట్లు వివరించారు.

జేఎన్‌టీయూలో సెంట్రలైజ్డ్ స్పాట్ కౌన్సెలింగ్

8 అనుబంధ ఇంజనీరింగ్ కాలేజీలకు హైదరాబాద్‌లోనే నిర్వహణ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూకు అనుబంధంగా ఉన్న ఎనిమిది ఇంజనీరింగ్ కాలేజీల్లో కౌన్సెలింగ్ అనంతరం మిగిలిపోయిన సుమారు 800కు పైగా సీట్లను స్పాట్ కౌన్సెలింగ్ ద్వారా భర్తీకై రిజిస్ట్రార్ గురువారం నోటిఫికేషన్ జారీ చేశారు. అయితే ఏ కాలేజీలో సీట్లను ఆ కాలేజీలోకాకుండా అన్ని కాలేజీల్లో సీట్ల భర్తీకి హైదరాబాద్‌లోనే సెంట్రలైజ్డ్ కౌన్సెలింగ్ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ నెల 30న జేఎన్‌టీయూ హైదరాబాద్, సుల్తాన్‌పూర్ కాలేజీల్లో మిగిలిన సీట్లకు, 31న మంథని, జగిత్యాల జేఎన్‌టీయూ కాలేజీల్లో సీట్లకు, 2న వనపర్తి, సిరిసిల్ల, పాలేరు, మహబూబ్‌బాద్ జేఎన్‌టీయూ కాలేజీల్లో మిగిలిపోయిన సీట్లకు స్పాట్ కౌన్సెలింగ్ ఉంటుందని.. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ విద్యార్హతల ధ్రువపత్రాలతో ఆయా తేదీల్లో జేఎన్‌టీయూలోని అడ్మిషన్స్ విభాగంలో హాజరుకావచ్చని తెలిపారు. ఇదిలా ఉంటే సెంట్రలైజ్డ్ స్పాట్ కౌన్సెలింగ్ వల్ల ఖమ్మం, మహబూబాబాద్, మంథని, వనపర్తి, సిరిసిల్ల ప్రాంతాలకు చెందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హైదరాబాద్‌కు వెళ్లాల్సి రావడం ఇబ్బందికరంగా భావిస్తున్నారని కొన్ని కాలేజీల ప్రిన్సిపాళ్లు చెబుతున్నారు. ఇంతకు ముందు మంథని జేఎన్‌టీయూ కాలేజీలో సింగరేణి కోటా సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించినట్లుగానే వర్సిటీ అడ్మిషన్ విభాగం అధికారులు అనుబంధ కళాశాలలకు వచ్చి స్పాట్ ప్రక్రియను చేపడితే బాగుండేదంటున్నారు.

స్పోర్ట్స్

క్రీడల్లో మరింత మంది మెరవాలి

ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ: క్రీడా రంగం అభివృద్ధికి, క్రీడాకారులను ప్రోత్సహించడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పరస్కరించుకుని భారత హాకీకి ఆయన తీసుకొచ్చిన ఖ్యాతిని కొనియాడారు. ధ్యాన్‌చంద్ గౌరవార్థం ప్రతి ఏటా జరుపుకొంటున్న జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా దేశంలోని క్రీడాకారులు సాధించిన ఘనకీర్తులను స్మరించుకోవడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్‌లో భారత్ తరఫున క్రీడల్లో మరింత మంది మెరవాలని ఆకాంక్షించారు.

వరల్డ్ అథ్లెటిక్స్ ఫైనల్లో షారుఖ్

జాతీయ స్టీపుల్‌చేజ్ రికార్డు బ్రేక్



న్యూఢిల్లీ: వరల్డ్ అథ్లెటిక్స్ అండర్-20 చాంపియన్‌షిప్ 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో భారత యువ అథ్లెట్ షారుఖ్ ఖాన్ ఫైనల్‌కు చేరాడు. ఈ క్రమంలో స్టీపుల్‌చేజ్ అండర్-20 జాతీయ రికార్డును కూడా షారుఖ్ బద్దలుకొట్టాడు. తాజాగా జరిగిన హీట్స్‌లో 18 ఏళ్ల షారుఖ్ 8 నిమిషాల 45.12 సెకన్లలో రేసును ముగించి ఆరో స్థానంలో నిలిచాడు.

జో రూట్ శతకం

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 358/7

లండన్: స్టార్ బ్యాటర్ జో రూట్ (143) రికార్డు శతకంతో అదరగొట్టాడు. దీంతో శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 7 వికెట్లకు 358 పరుగులు చేసింది. ఓపెనర్ డకెట్ (40), బ్రూక్ (33) ఫర్వాలేదనిపించగా, క్రీజులో అట్కిన్సన్ (74 బ్యాటింగ్), పాట్స్ (20 బ్యాటింగ్) ఉన్నారు. ఏడో వికెట్‌కు రూట్, అట్కిన్సన్ 87 పరుగులు జత చేశారు. మరోవైపు రూట్‌కిది టెస్టుల్లో 33వ శతకం కాగా ఇంగ్లండ్ తరఫున అత్యధిక శతక జాబితాలో అలిస్టర్ కుక్‌తో సమంగా నిలిచాడు.

షహీన్ అఫ్రీదిపై వేటు!

కరాచీ: పాకిస్థాన్ జట్టులో కీలక పేసర్‌గా కొనసాగుతున్న షహీన్‌షా అఫ్రీదిపై వేటు పడింది. బంగ్లాదేశ్‌తో శుక్రవారం నుంచి జరిగే రెండో టెస్టు కోసం షాన్ మసూద్ సారథ్యంలో 12 మంది సభ్యుల జట్టును ప్రకటించారు. ఇందులో షహీన్‌కు చోటు దక్కలేదు. దీంతో రెండో టెస్టుకు లెఫ్టామ్ పేసర్ మీర్ హమ్జాను తీసుకున్నారు. అలాగే స్పిన్నర్ అబ్రార్ అహ్మద్‌కు చోటు కల్పించారు.

పారాలింపిక్స్

ప్రీక్వార్టర్స్‌కు శీతల్



రెండో ర్యాంకుతో రౌండ్-16కు..

పారిస్: పారాలింపిక్స్‌లో భారీ అంచనాలతో బరిలోకి దిగిన కాంపౌండ్ ఆర్చర్ శీతల్ దేవి త్రుటిలో ప్రపంచ రికార్డును చేజార్చుకొంది. గురువారం జరిగిన మహిళల వ్యక్తిగత ర్యాంకింగ్ రౌండ్‌లో మొత్తం 703 పాయింట్లు సాధించిన శీతల్.. రెండో ర్యాంక్‌తో ప్రీక్వార్టర్స్‌కు చేరుకొంది. ఈ క్రమంలో ఫోబీ ప్యాటర్సన్ (698 పాయింట్ల) వరల్డ్ రికార్డును బద్దలు కొట్టింది. అయితే, టర్కీ ఆర్చర్ ఓజ్నూర్ గిర్డీ క్యూర్ మొత్తం 704 పాయింట్లతో శీతల్‌ను అధిగమించడమే కాకుండా.. ప్రపంచ రికార్డుతో అగ్రస్థానాన్ని సొంతం చేసుకొంది. టాప్-4లో నిలిచిన ఆర్చర్లు నేరుగా రౌండ్-16కు అర్హత సాధిస్తారు. సరిత 682 పాయింట్లతో 9వ స్థానం దక్కించుకొంది. శనివారం జరిగే ప్రీక్వార్టర్స్‌లో రౌండ్-32 విజేతతో శీతల్ తలపడనుంది. కాగా, కాంపౌండ్ మిక్స్‌డ్ ర్యాంకింగ్ రౌండ్‌లో శీతల్-రాకేష్ కుమార్ జోడీ 1399 పాయింట్ల వరల్డ్ రికార్డు స్కోరుతో టాప్‌లో నిలిచింది. వ్యక్తిగత విభాగంలో రాకేష్ 5వ స్థానంలో, శ్యామ్ సుందర్ స్వామి 15వ స్థానంలో నిలిచారు.

సుఖాంత్, యతిరాజ్ బోణీ: బ్యాడ్మింటన్‌లో తొలి రోజు భారత్‌కు మిశ్రమ ఫలితాలు లభించాయి. పురుషుల ఎస్ఎల్-4 విభాగంలో సుఖాంత్ కదమ్, టోక్యో రజత పతక విజేత సుహాస్ యతిరాజ్, తరుణ్ గ్రూప్ దశను విజయాలతో ఆరంభించారు. గురువారం జరిగిన పురుషుల ఎస్ఎల్4 గ్రూప్-బిలో తన తొలి మ్యాచ్‌లో కదమ్ 17-21, 21-15, 22-20తో మహ్మద్ అమీన్ బర్హుద్దీన్ (మలేసియా)పై, గ్రూప్-డిలో తరుణ్ 21-17, 21-19తో ఒలివెరా రోడ్రి గో (బ్రెజిల్) గెలిచారు. గ్రూప్-ఎలో సుహాస్ యతిరాజ్ 21-7, 21-5తో హికామత్ రమ్దానీ (ఇండోనేసియా)పై నెగ్గాడు. ఐఏఎస్ అధికారి అయిన సుహాస్ జిల్లా కలెక్టర్‌గా సేవలందించాడు. మహిళల గ్రూప్-సిలో పలక్ కోహ్లి 21-12, 21-14తో మెలినా (ఫ్రాన్స్)ను ఓడించింది. మహిళల ఎస్ఎల్-3 గ్రూప్-ఎలో మాన్సీ జోషి 21-16, 13-21, 18-21తో ఇక్షియర్ కోనితా (ఇండోనేసియా) చేతిలో, మన్‌దీప్ కౌర్ 8-21, 14-21తో మరియం ఇనోలా (నైజీరియా) చేతిలో ఓడారు. మిక్స్‌డ్ ఎస్ఎల్3-ఎస్‌యు 5 గ్రూప్-ఎలో సహచర జంటల మధ్య జరిగిన మ్యాచ్‌లో నితీష్ కుమార్-తులసీమతి 21-14, 21-17తో యతిరాజ్-పలక్ జంటపై గెలిచింది.



తొలి స్వర్ణం నాదే

పారిస్ పారాలింపిక్స్‌లో తొలి స్వర్ణం నెదర్లాండ్స్ సైక్లిస్ట్ కరోలిన్ గ్రూట్ సొంతం చేసుకొంది. మహిళల ట్రాక్ సైక్లింగ్ సి4-5 500 మీ. టైమ్ ట్రయల్‌లో కరోలిన్ 35.566 సెకన్ల టైమింగ్‌తో పసిడి పట్టేసింది.



ఈతలో 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ స్వర్ణం నెగ్గిన గాబ్రియెల్ గెరాల్డో అరాజో (బ్రెజిల్); సైక్లింగ్ ఇండివిడ్యువల్ పర్స్యూట్‌లో కాంస్యం సాధించిన రికార్డో టెన్ అర్గైల్స్ (స్పెయిన్) ఆనందం

గేమ్స్ ముగిశాక జరిగేది ఇదే

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)



ప్రతిష్ఠాత్మక ఒలింపిక్స్, పారాలింపిక్స్ క్రీడలకు ఆతిథ్యమివ్వడమంటే మాటలు కాదు. బిలియన్లకొద్దీ డాలర్లను ఖర్చుపెడుతూ కొత్త నిర్మాణాలు చేపట్టాల్సి ఉంటుంది. అలాగే సరికొత్త క్రీడా పరికరాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అయితే ఏళ్ల కొద్దీ సాగిన ఈ ఏర్పాట్లన్నీ కేవలం నెల రోజుల పాటు జరిగే పోటీల కోసమేననే విషయం తెలిసిందే. మరి.. ఆ తర్వాత ఏం జరుగుతుంది? వందలకొద్దీ బంతులు, నెట్స్, క్రీడా ఫ్లోర్లతో పాటు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ఈత కొలనులు.. అలాగే ఇతర క్రీడా పరికరాలు ఏమవుతాయి? ఎలా వినియోగించుకుంటారనే సందేహం క్రీడాభిమానులకు వస్తుంటుంది. వాస్తవానికి అత్యంత ఆర్భాటంగా గేమ్స్‌ను నిర్వహించాక ఆర్గనైజర్లకు ఆ పనిముట్లు, క్రీడా పరికరాలతో ఎలాంటి ఉపయోగమూ ఉండదు. అందుకే వాటిని తయారీదారులకు తిరిగిచ్చేయడమో లేక స్థానిక క్లబ్బులకు, సంస్థలకు డొనేట్ చేయడమో జరుగుతూంటుంది. అయితే ప్రస్తుత పారిస్ గేమ్స్ నిర్వాహకులు తెలిపిన దాని ప్రకారం.. ఈ గేమ్స్ కోసం ఉపయోగించిన మొత్తం 1.2 మిలియన్ క్రీడాపరికరాల్లో 75 శాతం ఆయా క్రీడా సమాఖ్యల నుంచి లీజుకు తీసుకున్నవేనట. కాబట్టి తిరిగి అవి తమ స్వంతదారుల చెంతకు వెళ్లనున్నాయి. ఇలా ఫ్రెంచ్ వాలీబాల్ సమాఖ్య తమ దగ్గరకు వచ్చిన బంతులు, నెట్స్, పోస్ట్స్, స్పోర్ట్స్ ఫ్లోర్లు దేశంలోని ఇతర క్రీడా సెంటర్లకు పంపిణీ చేయనుంది. అలాగే తైక్వాండో సమాఖ్య కూడా పారిస్ రీజియన్‌లోని అనేక క్లబ్బులకు సరఫరా చేస్తుంది. ఇక మిగిలిన 25 శాతం కొనుగోలు చేసిన పరికరాలను దేశంలో క్రీడాభివృద్ధి కోసం విరాళంగా ఇవ్వనున్నారు. సెయిని సెయింట్ డెనిస్ లాంటి ప్రాంతాల్లో కనీస క్రీడా సదుపాయాలు కూడా లేవు. అలాంటి చోట్ల ఆయా ప్రజల ఫిట్‌నెస్‌తో పాటు ఆటల పట్ల మక్కువ పెంచేందుకు వీటిని వినియోగిస్తారు. మరోవైపు పారిస్ గేమ్స్ కోసం తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కొన్ని సౌకర్యాలను వివిధ వేదికలకు మార్చుతారు. బీచ్ వాలీబాల్ ఈవెంట్‌ను నిర్వహించిన ఈఫిల్ టవర్ స్టేడియంలోని ఇసుకను మార్విల్లేలోని డిపార్ట్‌మెంటల్ పార్క్‌లో మూడు పిచ్‌ల ఏర్పాటు కోసం వినియోగించనున్నారు. అలాగే స్కేట్‌బోర్డు స్ట్రీట్ కాంపిటీషన్ ఏరియాను సెయినీ సెయింట్ డెనిస్‌లో తిరిగి ఏర్పాటు చేయబోతున్నారు. పారిస్ లా డిఫెన్స్ ఎరీనాలో ఉన్న తాత్కాలిక స్విమ్మింగ్‌పూల్స్‌ను సెయినీ సెయింట్ డెనిస్, సెవ్రాన్, బగ్నోలెట్ ప్రాంతాల్లో రీఇన్‌స్టాల్ చేసి వినియోగంలోకి తెస్తారు. ఇక పోటీల కోసం ప్రఖ్యాత గెర్‌ఫ్లోర్ కంపెనీ ఆయా వేదికల్లో 33 వేల మీటర్ల ఫ్లోర్లను బిగించింది. గేమ్స్ ముగిశాక ఈ స్పోర్ట్స్ ఫ్లోరింగ్‌ను తొలగించి పారిస్ రీజియన్‌లోని మున్సిపాలిటీలు, క్లబ్బుల్లో తిరిగి ఏర్పాటు చేయనుంది. మరోవైపు ఒలింపిక్ చరిత్రలోనే తొలిసారిగా 12 ప్రాంతాల్లో సెకండ్ హ్యాండ్ ఫెయిర్స్‌ను ఏర్పాటు చేయనుంది. ఇందులో వేలాది యూనిఫామ్స్, కప్స్, ఫ్లాగ్స్, అథ్లెట్లు వినియోగించిన టవల్స్, వేదికలను అలంకరించేందుకు ఉపయోగించిన వస్తువులను అమ్మకానికి ఉంచుతారు. ఇవే కాకుండా వేలాది ట్రాలీలు, హ్యాండ్ ట్రక్స్, ఫ్యాన్లు, వ్యాక్యూమ్ క్లీనర్లను ఆయా క్రీడాసమాఖ్యలు, కమ్యూనిటీస్, వ్యాపార కంపెనీలు కొనుగోలు చేసుకునేందుకు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండనున్నాయి.

సిన్నర్ అలవోకగా..



న్యూయార్క్: టాప్ సీడ్ జానిక్ సిన్నర్ సునాయాస విజయంతో ముందంజ వేయగా.. డిఫెండింగ్ చాంప్‌లు నొవాక్ జొకోవిచ్, కొకొ గాఫ్‌తోపాటు రెండో సీడ్ అర్యానా సబలెంక, అలెగ్జాండర్ జ్వెరెవ్ మూడో రౌండ్‌కు దూసుకెళ్లారు. గురువారం జరిగిన రెండో రౌండ్ మ్యాచ్‌లో సిన్నర్ 6-4, 6-0, 6-2తో అలెక్స్ మిచెల్సన్ (అమెరికా)పై వరుస సెట్లతో నెగ్గాడు. రెండో సీడ్ జొకోవిచ్‌కు వాకోవర్ లభించింది. లాసియా డిజారితో రెండో రౌండ్ మ్యాచ్‌లో జొకో 6-4, 6-4, 2-0తో ముందంజలో ఉన్న సమయంలో ప్రత్యర్థి మెడికల్ కారణాలతో రిటైరయ్యాడు. 8వ సీడ్ కాస్పర్ రూడ్ 6-4, 6-2, 2-6, 7-6(3)తో గేల్ మోన్‌ఫిల్స్‌ను ఓడించారు. మహిళల్లో సబలెంక 6-3, 6-1తో లూసియా బ్రోంజెట్టి (ఇటలీ)పై, మూడో సీడ్ గాఫ్ (అమెరికా) 6-4, 6-0తో మారియా (జర్మనీ)పై, ఎమ్మా నవారో 6-1, 6-1తో రుస్‌పై, ఉక్రెయిన్ భామ స్విటోలినా 6-1, 6-2తో అన్హెలినా కలినినాపై, 7వ సీడ్ క్విన్‌వెన్ జాంగ్ 6-7(3), 6-1, 6-2తో ఎరికా ఆండ్రీవ పై, విక్టోరియా అజరెంకా 6-1, 6-4తో క్లారా బురెల్‌పై, మర్టా కోస్ట్యుయుక్ 7-6(10), 6-1తో హ్యారియట్ డార్ట్‌పై, అన్నా కలిన్స్కియా 6-2, 6-4తో అన్నా బోండర్‌పై గెలిచి మూడో రౌండ్‌కు చేరుకొన్నారు.

గుకేష్, ప్రజ్ఞా ఐదో స్థానంతో సరి

అలీరెజాకు టైటిల్

సెయింట్ లూయిస్ (అమెరికా): సింక్యుఫీల్డ్ కప్‌ను భారత గ్రాండ్‌మాస్టర్లు డి.గుకేష్, ఆర్.ప్రజ్ఞానంద ఒక్క విజయం కూడా లేకుండా ముగించారు. ఫ్రాన్స్ జీఎం అలీరెజా ఫిరౌజా టైటిల్ కైవసం చేసుకోగా, స్థానిక జీఎం ఫాబియానో కరువానా రన్నరప్‌గా నిలిచాడు. భారత్ జీఎంలు ప్రజ్ఞానంద, గుకేష్ సంయుక్తంగా ఐదో స్థానం దక్కించుకున్నారు. అలీరిజా (6) టాప్‌లో నిలవగా, ప్రజ్ఞానంద, గుకేష్ చెరో 4.5 పాయింట్లతో ఐదో స్థానంతో సరిపెట్టుకున్నారు.

రిలయన్స్ బోనస్ షేర్ల బొనాంజా

ఒక షేరుకు బోనస్‌గా మరో షేరు జారీ

- వచ్చేనెల 5న బోర్డు భేటీలో తుది నిర్ణయం
- దీపావళికి జియో ఏఐ క్లౌడ్ వెల్‌కమ్ ఆఫర్
- జియోఫోన్‌కాల్ ఏఐ సేవల ప్రారంభం
- 47వ ఏజీఎంలో ముకేశ్ అంబానీ ప్రకటన



న్యూఢిల్లీ: దేశంలో అత్యంత విలువైన కంపెనీ రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) తన షేర్‌హోల్డర్లకు బోనస్ షేర్ల బొనాంజా ప్రకటించింది. కంపెనీ షేర్‌హోల్డర్ల వద్ద ఉన్న ప్రతి షేరుకు బోనస్‌గా మరో షేరును (1:1 నిష్పత్తిలో) జారీ చేయాలనుకుంటున్నట్లు ఆర్ఐఎల్ చైర్మన్ ముకేశ్ అంబానీ ప్రకటించారు. కంపెనీ వాటాదారుల 47వ వార్షిక సాధారణ సమావేశంలో (ఏజీఎం) మాట్లాడుతూ వచ్చేనెల 5న సమావేశం కానున్న ఆర్ఐఎల్ బోర్డు ఈ ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకోవడంతో పాటు వాటాదారుల నుంచి ఆమోదం కోరనుందన్నారు. 2000 సంవత్సరం నుంచి ఆర్ఐఎల్ ఇప్పటికే రెండు సార్లు (2017 సెప్టెంబరు, 2009 నవంబరు) వాటాదారులకు 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్లను జారీ చేసింది. 'కంపెనీ స్వల్పకాలిక లాభార్జనను కోరుకోవడం లేదు. సంపదను కూడబెట్టాలనుకోవడం లేదు. దేశం కోసం సంపదను సృష్టించాలనుకుంటోంది' అని ఏజీఎంలో అంబానీ అన్నారు. బోనస్ షేర్ల జారీ ప్రకటనతో బీఎస్ఈలో కంపెనీ షేరు 1.51 శాతం పెరిగి రూ.3,040.85కు చేరుకుంది. దాంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజే రూ.30వేల కోట్లకు పైగా పెరిగి మొత్తం రూ.20.57 లక్షల కోట్లు దాటింది.

100జీబీ ఉచిత క్లౌడ్ స్టోరేజీ

ఈ ఏడాది దీపావళికి జియో ఏఐ క్లౌడ్ వెల్‌కమ్ ఆఫర్‌ను ప్రారంభించనున్నట్లులో అంబానీ ప్రకటించారు.ఈ ఆఫర్‌లో భాగంగా, రిలయన్స్ జియో తన వినియోగదారులకు 100జీబీ వరకు ఉచిత క్లౌడ్ స్టోరేజీ వసతి కల్పించనుందని అంబానీ తెలిపారు. ఈ ఏఐ ఆధారిత క్లౌడ్ స్టోరేజీలో జియో యూజర్లు తమ ఫొటోలు, వీడియోలు, డాక్యుమెంట్లతోపాటు ఇతర డిజిటల్ కంటెంట్, డేటాను స్టోర్ చేసుకోవచ్చన్నారు. అవసరమైన వారికి అదనపు స్టోరేజీని అత్యంత అందుబాటు ధరలో అందించనున్నట్లు అంబానీ స్పష్టం చేశారు. ఈ సేవల ద్వారా గూగుల్, యాపిల్‌కు జియో గట్టిపోటీ ఇవ్వనుందని మార్కెట్ వర్గాలన్నాయి. జియో అందించనున్న మరిన్ని ఏఐ సేవల వివరాలు..

జియో ఫోన్‌కాల్ ఏఐ: రిలయన్స్ జియో తన వినియోగదారుల ఫోన్‌కాల్స్‌ను ఏఐతో అనుసంధానించేందుకు వీలుగా 'జియోఫోన్‌కాల్ ఏఐ' సర్వీసును ప్రవేశపెట్టింది. ఈ ఫీచర్ ద్వారా జియో యూజర్లు తమ కాల్స్‌ను రికార్డ్ చేసుకోవడంతో పాటు కాల్ రికార్డ్స్‌ను జియో క్లౌడ్‌లో స్టోర్ చేసుకోవచ్చు. అంతేకాదు, రికార్డ్ చేసుకున్న కాల్ సంభాషణను టెక్స్ట్ రూపంలోకి బదిలీ చేసుకోవచ్చు. ఇతర భాషలోకి తర్జుమా కూడా చేసుకోవచ్చని కంపెనీ వెల్లడించింది. అంతేకాదు, సుదీర్ఘ సంభాషణను సంక్షిప్త రూపంలోనూ క్లౌడ్‌లో నిక్షిప్తం చేసుకోవచ్చు.

జియో బ్రెయిన్: అందుబాటు ధరలో శక్తిమంతమైన జనరేటివ్ ఏఐ మోడల్స్‌ను ఆఫర్ చేసేందుకు జియో బ్రెయిన్ పేరుతో పూర్తి ఏఐ లైఫ్‌సైకిల్ టూల్స్, ప్లాట్‌ఫామ్స్‌తో కూడిన సమగ్ర సూట్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు కంపెనీ ప్రకటించింది. వేగంగా నిర్ణయాలు తీసుకోవడానికి, కచ్చితమైన అంచనాలతో పాటు కస్టమర్ల అవసరాలను మరింత మెరుగ్గా అర్థం చేసుకునేందుకు ఇది దోహదపడనుందని అంబానీ అన్నారు.

జియో టీవీ ఓఎస్: యాపిల్ సిరి, అమెజాన్ అలెక్సాకు పోటీగా జియోటీవీ ఓఎస్ విత్ వాయిస్ అసిస్టెంట్ హలో జియోను లాంచ్ చేస్తున్నట్లు ముకేశ్ అంబానీ ప్రకటించారు. పూర్తిగా దేశీయంగా అభివృద్ధి చేసిన ఈ ఆపరేటింగ్ సిస్టమ్ జియో సెట్ టాప్ బాక్స్‌ల పనితీరును మరింత మెరుగుపరచనుందన్నారు. ముఖ్యంగా బడా సైజు స్మార్ట్‌టీవీల్లో మరింత వేగంగా, నిరాటంకంగా, వ్యక్తిగత అభిరుచులకు అనుగుణంగా సేవలను పొందడానికి ఇది తోడ్పడనుందన్నారు.

ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ : జామ్‌నగర్‌లో గిగావాట్ స్థాయి ఏఐ రెడీ డేటా సెంటర్ల ఏర్పాటు ద్వారా జాతీయ స్థాయి ఏఐ మౌలిక వసతిని అభివృద్ధి చేయనున్నట్లు అంబానీ ప్రకటించారు.

రిటైల్ వ్యాపారం 3-4 ఏళ్లలో రెట్టింపు

త్వరలో లగ్జరీ జువెలరీ విభాగంలోకి..

గత ఆర్థిక సంవత్సరంలో రూ.3 లక్షల కోట్ల వార్షికాదాయ మైలురాయిని అధిగమించిన రిలయన్స్ రిటైల్.. వచ్చే 3-4 ఏళ్లలో వ్యాపారాన్ని రెట్టింపు స్థాయికి పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుందని ఈ విభాగ డైరెక్టర్ ఇషా అంబానీ తెలిపారు. త్వరలోనే లగ్జరీ జువెల్లరీ వ్యాపారంలోకి అడుగుపెట్టనున్నట్లు వెల్లడించారు.

అతిపెద్ద మొబైల్ డేటా కంపెనీగా జియో

ప్రపంచంలో అతిపెద్ద మొబైల్ డేటా మార్కెట్‌గా భారత్, అతిపెద్ద మొబైల్ డేటా సేవల కంపెనీగా రిలయన్స్ జియో అవతరించాయని ముకేశ్ అంబానీ తెలిపారు. జియో ప్రస్తుత కస్టమర్లు 49 కోట్లకు చేరుకున్నారని, వారి నెలవారీ డేటా వినియోగ సగటు 30 జీబీ దాటిందన్నారు. ప్రపంచ డేటా ట్రాఫిక్‌లో జియో వాటా 8 శాతంగా ఉందన్నారు. కాగా, జియో 5జీ, 6జీ సాంకేతికతలకు సంబంధించి 350 పేటెంట్ల కోసం దరఖాస్తు చేసిందన్నారు.

ప్రపంచ టాప్-30లోకి..

రిలయన్స్ ఇండస్ట్రీస్ డీప్ టెక్నాలజీ సామర్థ్య కంపెనీగా పరివర్తనం చెందుతోందని అంబానీ అన్నారు. డీప్ టెక్ సాంకేతిక సామర్థ్యాలు, ఆధునిక ఉత్పత్తి విధానాల వినియోగం ద్వారా రిలయన్స్ సమీప భవిష్యత్‌లో ప్రపంచంలోని టాప్-30 కంపెనీల జాబితాలో చేరనుందన్నారు. గుజరాత్, జామ్‌నగర్‌లో 20 గిగా వాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేస్తున్న సోలార్ గిగా ఫ్యాక్టరీలో ఉత్పత్తి ఈ ఏడాది చివరినాటికి ప్రారంభం కానుందని ముకేశ్ అంబానీ వెల్లడించారు.

2030 నాటికి ఆర్ఐఎల్ సైజు డబుల్

రిలయన్స్ ఇండస్ట్రీస్ పరిమాణం 2030 నాటికి రెట్టింపు కానుందని ముకేశ్ అన్నారు. వచ్చే 3-4 ఏళ్లలో రిలయన్స్ జియో, రిలయన్స్ రిటైల్ వ్యాపారాల ఆదాయం, స్థూల లాభం రెట్టింపు కావచ్చన్నారు. గ్రీన్ ఎనర్జీ బిజినెస్ వచ్చే 5-7 ఏళ్లలో ఓ2సీ వ్యాపార పరిమాణం, లాభార్జన స్థాయికి చేరుకోవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

బిజినెస్

రియల్టీలోకి ఎంఎస్ఎన్ గ్రూప్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఇప్పటివరకు ఫార్మా రంగంలో కార్యకలాపాలు సాగిస్తున్న ఎంఎస్ఎన్ గ్రూప్ రియల్ ఎస్టేట్ రంగంలోకి ప్రవేశించింది. రాబోయే 5 సంవత్సరాల కాలంలో హైదరాబాద్‌లోని ప్రీమియం ప్రదేశాల్లో 2 కోట్ల చదరపు అడుగుల విస్తీర్ణంలో లగ్జరీ ఫ్లాట్లు, వాణిజ్య ప్రదేశాలు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది. గురువారం ఎంఎస్ఎన్ రియల్టీ బ్రాండ్‌ను ఆవిష్కరించిన సందర్భంగా గ్రూప్ వ్యవస్థాపక చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎంఎస్ఎన్ రెడ్డి ఈ విషయం ప్రకటించారు. తమ తొలి ప్రాజెక్టు నియోపోలిస్‌లో ప్రారంభం కానున్నట్టు ఆయన చెప్పారు. అక్కడ 15 ఎకరాల స్థలం కొనుగోలు చేశామని; రెరా, హెచ్ఎండీఏ అనుమతులు రాగానే నిర్మాణ కార్యకలాపాలు ప్రారంభిస్తామని ఆయన వెల్లడించారు. ప్రస్తుతం తమ చేతిలో విభిన్న ప్రాంతాల్లో 40 ఎకరాల స్థలం అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. రియల్టీ కార్యకలాపాల కోసం ఎంఎస్ఎన్ అర్బన్ వెంచర్స్ పేరు మీద ప్రత్యేక అనుబంధ సంస్థ ఏర్పాటు చేసినట్టు ఆయన చెప్పారు. తెల్లాపూర్, మంచిరేవుల, పటాన్‌చెరు, ఇస్నాపూర్‌లలో ప్రాజెక్టులు చేపట్టే యోచన ఉన్నదన్నారు. ప్రస్తుతానికి లగ్జరీ భవనాల నిర్మాణం మాత్రమే చేపడతామని; తదుపరి దశలో అఫర్డబుల్ హౌసింగ్, రిటైల్ విభాగాల్లో ప్రవేశించే యోచన ఉన్నదని ఆయన తెలిపారు. తమ ప్రాజెక్టుల్లో ఫ్లాట్ కనీస విస్తీర్ణం 2500 నుంచి 3000 చదరపు అడుగులుంటుందన్నారు. ఈ ఏడాది మార్చి చివరికి తమ గ్రూప్ 100 బిలియన్ డాలర్ మైలురాయిని దాటినట్టు డాక్టర్ రెడ్డి తెలియచేశారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,200 ▼	67,100 ▼	93,000 ▼
ముంబై	72,000 ▲	65,950 ▲	85,070 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



30 వ తేదీ			
హైదరాబాద్	495	విజయవాడ	525
వరంగల్	497	గోదావరి	520
చిత్తూరు	508	విశాఖపట్నం	525
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	109	విజయవాడ	108
వరంగల్	109	గుంటూరు	107
కరీంనగర్	109	ఒంగోలు	107
మహబూబ్‌నగర్	109	చిత్తూరు	100
కర్నూలు	109	నెల్లూరు	100
విశాఖపట్నం	104	అనంతపురం	107
గోదావరి	108		

స్పైస్‌జెట్‌పై డీజీసీఏ విస్తృత నిఘా

న్యూఢిల్లీ: సంక్షోభంలో ఉన్న స్పైస్‌జెట్‌ను పౌర విమానయాన డైరెక్టర్ జనరల్ (డీజీసీఏ) కార్యాలయం విస్తృత నిఘాలో పెట్టింది. దీని కింద విమానయాన కార్యకలాపాల్లో భద్రత కోసం డీజీసీఏ అధికారులు స్పాట్ చెకింగ్‌లు చేయడంతో పాటు రాత్రి వేళ నిఘా పెంచుతారు. ఇటీవల కాలంలో విమానాల రద్దు సంఘటనలు పెరిగడంతో పాటు సంస్థ ఆర్థిక ఒత్తిడులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ నెల 7, 8 తేదీల్లో ఇంజనీరింగ్ విభాగాలపై స్పెషల్ ఆడిట్ నిర్వహించామని, అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నామని డీజీసీఏ తెలిపింది.

ప్రభుత్వానికి ఎల్ఐసీ డివిడెండ్

న్యూఢిల్లీ: ప్రభుత్వానికి ఎల్ఐసీ 2023-24 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వానికి రూ.3662.17 కోట్ల డివిడెండ్ చెల్లించింది. ఎల్ఐసీ మేనేజింగ్ డైరెక్టర్ సిద్ధార్థ మొహంతి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు డివిడెండ్ చెక్కును అందచేశారు. ఈ ఏడాది మార్చి ఒకటో తేదీన చెల్లించిన మధ్యంతర డివిడెండ్ రూ.2441.45 కోట్లతో కలిపితే మొత్తం రూ.6103.62 కోట్ల డివిడెండు చెల్లించినట్టయింది.

స్టాక్ మార్కెట్‌లో రికార్డుల హోరు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్‌లో రికార్డుల హోరు కొనసాగుతోంది. సెన్సెక్స్, నిఫ్టీ గురువారం మరో ఆల్‌టైమ్ హై వద్ద ముగిశాయి. సెన్సెక్స్ 349.05 పాయింట్ల లాభంతో 82,134.61 వద్ద, నిఫ్టీ 99.60 పాయింట్ల లాభంతో 25,151.95 వద్ద క్లోజయ్యాయి. ఇంట్రా డేలో సెన్సెక్స్ 500.27 పాయింట్ల లాభంతో 82,285.83 పాయింట్ల జీవిత కాల గరిష్ఠాన్ని తాకింది. నిఫ్టీ కూడా ఇంట్రా డేలో 140.55 పాయింట్ల లాభంతో 25,192.90 పాయింట్ల జీవిత కాల గరిష్ఠాన్ని తాకింది. గత ఎనిమిది సెషన్స్‌లో సెన్సెక్స్ 1,709.93 పాయింట్లు లాభపడింది. నిజానికి సూచీలు గురువారం ఇంట్రా డేలో తీవ్ర ఆటుపోట్లకు లోనయ్యాయి. మిడ్ సెషన్‌లో ఒక దశలో సూచీలు నష్టాల్లోకి వెళ్లాయి. అయితే రిలయన్స్ ఇండస్ట్రీస్ వాటాదారులకు 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్లు జారీ చేయనున్నట్టు కంపెనీ చైర్మన్ ముకేశ్ అంబానీ చేసిన ప్రకటన ట్రేడింగ్ చివర్లో మార్కెట్‌కు బూస్టర్‌లా పని చేసింది.

లాభాల్లో టీవీ18, నెట్‌వర్క్18 షేర్లు

టీవీ18, నెట్‌వర్క్18 కంపెనీల షేర్లు గురువారం మంచి లాభాలతో ముగిశాయి. రిలయన్స్-వాల్ట్ డిస్నీ మీడియా ఆస్తుల విలీనానికి సీసీఐ ఆమోదం తెలపడం ఇందుకు ప్రధాన కారణం. దీంతో బీఎస్ఈలో టీవీ18 షేర్లు ఒక దశలో 13.18 శాతం లాభంతో రూ.54.26కు దూసుకు పోయాయి. చివరికి 7.66 శాతం లాభంతో రూ.51.61 వద్ద ముగిశాయి. నెట్‌వర్క్18 కంపెనీ షేర్లు ఇంట్రా డేలో ఒక దశలో 10.17 శాతం లాభంతో రూ.106.01కి దూసుకు పోయాయి. చివరికి 3.42 శాతం లాభంతో రూ.99.51 వద్ద ముగిశాయి.

ప్రీమియర్ ఎనర్జీ ఐపీఓ సూపర్ హిట్

గురువారం ముగిసిన హైదరాబాద్ కంపెనీ ప్రీమియర్ ఎనర్జీ ఐపీఓ 74.09 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. రూ.2,830 కోట్ల సమీకరణ కోసం కంపెనీ 4,46,40,825 షేర్లు జారీ చేయగా, మదుపరుల నుంచి 3,30,76,25,013 షేర్లకు బిడ్స్ వచ్చాయి. క్యూఐబీ ఇష్యూ 216.67 రెట్లు, నాన్ ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్ల విభాగం 49.76 రెట్లు, రిటైల్ ఇన్వెస్టర్ల విభాగం 7.25 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది.

జనరిక్ కేన్సర్ ఔషధం కోసం ఎఫ్‌డీఏకి నాట్కో దరఖాస్తు

న్యూఢిల్లీ: హైదరాబాద్ కేంద్రంగా పని చేసే నాట్కో ఫార్మా మరో జనరిక్ కేన్సర్ ఔషధాన్ని మార్కెట్‌లో విడుదల చేసేందుకు సిద్ధమవుతోంది. ఊపిరితిత్తుల కేన్సర్ చికిత్సలో ఉపయోగించే ఈ ఔషధానికి సంబంధించిన అబ్రివేటెడ్ న్యూ డ్రగ్ అప్లికేషన్‌ను (అండా) అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ ఎఫ్‌డీఏకు సమర్పించింది. ప్రస్తుతం నోవార్టిస్ కంపెనీ టాబ్రెక్టా పేరుతో ఈ టాబ్లెట్లను అమెరికా, భారత్‌తో సహా అనేక దేశాల్లో మార్కెట్ చేస్తోంది. డోసేజిని బట్టి 56 టాబ్లెట్లతో కూడిన బాక్స్ ధర ప్రస్తుతం భారత్‌లో రూ.17,000 నుంచి రూ.33,000 వరకు ఉంది. కంపెనీ ఫైల్ చేసిన అండా దరఖాస్తుని ఎఫ్‌డీఏ ఆమోదించిన వెంటనే నాట్కో ఫార్మా ఈ టాబ్లెట్లను జనరిక్ వెర్షన్‌లో చౌకగా మార్కెట్‌లో విడుదల చేయనుంది.

బఫర్ జోన్‌లో ఉంటే ఏ చర్యలు తీసుకున్నా ఓకే

- కొన్నప్పుడు దుర్గంచెరువు బఫర్‌జోన్ అని తెలీదు
- రేవంత్ సోదరుడు తిరుపతిరెడ్డి స్పందన

బంజారాహిల్స్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తన ఇల్లు బఫర్ జోన్‌లో ఉంటే ఎలాంటి చర్యలు తీసుకున్నా అభ్యంతరం లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి స్పష్టం చేశారు. దుర్గం చెరువు సమీపంలోని డాక్టర్స్ కాలనీలో ఉండే తిరుపతిరెడ్డితో పాటు స్థానికులకు రెండు రోజుల క్రితం మీ ఇళ్లు బఫర్ జోన్‌లో ఉన్నాయని రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. నోటీసులపై తిరుపతిరెడ్డి స్పందిస్తూ, అమర్ సొసైటీ ద్వారా పూర్వ యజమాని 600 గజాల స్థలాన్ని కొనుగోలు చేసి, జీహెచ్ఎంసీ నుంచి అన్ని రకాల అనుమతులు తీసుకొని ఇంటి నిర్మాణం చేపట్టారని చెప్పారు. 1995లోనే ఈ లే అవుట్‌కు అనుమతులు వచ్చాయని ప్రస్తావించారు. ఆ ఇంటిని తాను 2016లో కొనుగోలు చేసినట్టు తెలిపారు. ఆ సమయంలో స్థలం ఎఫ్‌టీఎల్‌కు కానీ, బఫర్ జోన్‌కు కానీ వస్తుందనే విషయం తెలియదన్నారు. భూమి పత్రాలు న్యాయవాదికి చూపించిన తర్వాతే కొనుగోలు చేశానని చెప్పారు. ఇప్పుడు అధికారులు బఫర్ జోన్ అంటూ నోటీసులు ఇచ్చారని, అది నిజమే అయితే కొంత సమయం ఇస్తే సామాన్లు తీసుకొని బయటకు వస్తానని, ఆ తర్వాత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకున్నా తనకు అభ్యంతరం లేదని ప్రకటించారు. తన ఇంటి విషయాన్ని బీఆర్ఎస్ రాజకీయం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ చేయలేని పనులు సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహిస్తున్నారని, అందుకే ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రతీది రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ తన ఇంటిపై చేస్తున్న వ్యాఖ్యల కారణంగా మొత్తం కాలనీలో ఉన్న నిర్మాణాలన్నీ ప్రమాదంలో పడ్డాయని అభిప్రాయపడ్డారు.

ఎఫ్‌టీఎల్ తాఖీదులను.. షోకాజ్ నోటీసులుగా పరిగణించాలి

- పిటిషనర్ల వాదనలను తహసీల్దార్ వినాలి
- అన్ని పత్రాలను పరిశీలించాలి
- కావూరీహిల్స్ పిటిషన్‌లో హైకోర్టు ఆదేశాలు



హైదరాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఫుల్ ట్యాంక్ లెవెల్(ఎఫ్‌టీఎల్) విషయంలో తహసీల్దార్ వాల్టా చట్టం కింద ఇచ్చిన తాఖీదులను షోకాజ్ నోటీసులుగా పరిగణించాలని హైకోర్టు స్పష్టం చేసింది. దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో అక్రమంగా ఇళ్లను నిర్మించారంటూ కావూరీహిల్స్ వాసులకు ఈ నెల 3న శేరిలింగంపల్లి తహసీల్దార్ నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే.! సేల్‌డీడ్స్, ఇతర అనుమతి పత్రాలతో రెండు వారాల్లో నోటీసులకు సమాధానాలివ్వాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. దీన్ని సవాలు చేస్తూ కావూరీహిల్స్ వాసులు– మాడిశెట్టి మురళీధర్‌రావు సహా.. ఏడుగురు వ్యక్తులు వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టులో గురువారం వాదనలు ముగిశాయి. తొలుత జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం ఎదుట ఈ పిటిషన్లపై విచారణకు రాగా.. ఇప్పటికే దుర్గం చెరువుకు సంబంధించి ప్రజాహిత వ్యాజ్యాల(పిల్స్)ను వింటున్న చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావుల ధర్మాసనానికి బదిలీ చేశారు. పిటిషనర్ల తరఫున బొమ్మినేని భరత్‌రెడ్డి వాదనలను వినిపిస్తూ.. 58 ఎకరాల్లో 280 ప్లాట్లతో అన్ని అనుమతులు పొందిన లేఅవుట్‌లో తన క్లైంట్లు 1998లో ప్లాట్లను కొనుగోలు చేసినట్లు కోర్టుకు వివరించారు. ఇన్నేళ్ల తర్వాత దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఇళ్లు ఉన్నాయని.. 30 రోజుల్లో తొలగించాలని నోటీసు ఇవ్వడం అక్రమమని పేర్కొన్నారు. కనీసం తమ వద్ద ఉన్న డాక్యుమెంట్లను చూడకుండా, ఎలాంటి వాదనలను వినకుండా ఏకపక్షంగా నోటీసులు ఇచ్చారని వివరించారు. వాదనలను నమోదు చేసుకున్న ధర్మాసనం.. ఈ నెల 3న తహసీల్దార్ ఇచ్చిన నోటీసులను షోకాజ్ నోటీసులుగా పరిగణిస్తామని స్పష్టం చేసింది. తహసీల్దార్ పిటిషనర్ల వాదనలను విని, నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. కేసు మెరిట్‌పై తాము ఎలాంటి వ్యాఖ్య చేయడం లేదని పేర్కొంటూ.. పిటిషన్లను ముగించింది. కాగా.. దుర్గం చెరువు కాలుష్యానికి సంబంధించిన పిల్‌పై కంప్లైయన్స్ నివేదిను ప్రభుత్వం హైకోర్టుకు సమర్పించింది. ఈ పిటిషన్‌పై విచారణ వచ్చే వారానికి వాయిదా పడింది.

ఇక హైడ్రా నోటీసులు

- విధి విధానాలు రూపొందిస్తున్నాం
- చెరువులు, స్థలాల పరిరక్షణ బాధ్యత ఆ ఏజెన్సీకే
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి



సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సీఎస్

హైదరాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగు రోడ్డు పరిధిలోని చెరువులు, కుంటలు, నాలాలు, పార్కులు, ప్రభుత్వ స్థలాల్లోని ఆక్రమణల తొలగింపునకు ఇక 'హైడ్రా' ద్వారానే నోటీసులు జారీ చేయించనున్నామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. చెరువులు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణ బాధ్యతలను పూర్తి స్థాయిలో హైడ్రా(హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ)కు అప్పగిస్తామన్నారు. ఇలాంటి అంశాలతో కూడిన హైడ్రా విధివిధానాలను రూపొందిస్తున్నామని వివరించారు. చెరువుల్లోని ఆక్రమణల తొలగింపు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ విషయంలో హైకోర్టు ఆదేశాల మేరకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించడంపై సచివాలయంలో ఆమె గురువారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ చెరువులు, కుంటలు, పార్కులు, ప్రభుత్వ స్థలాల్లోని ఆక్రమణల తొలగింపుపై నీటిపారుదల, పురపాలక, పంచాయతీరాజ్ శాఖలు, జీహెచ్ఎంసీ ప్రస్తుతం వేర్వేరుగా నోటీసులు జారీ చేస్తున్నాయని అన్నారు. ఈ గందరగోళానికి తెరదించుతూ ఇకపై ఓఆర్ఆర్ పరిధిలోని అన్ని రకాల ఆక్రమణల తొలగింపునకు 'హైడ్రా' ద్వారానే నోటీసులను జారీ చేయనున్నామని తెలిపారు. ఇందుకు సంబంధించిన విధివిధానాల రూపకల్పన బాధ్యతను మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శికి అప్పగించినట్టు వివరించారు. అలాగే, జీహెచ్ఎంసీ యాక్ట్, తెలంగాణ ల్యాండ్ ఎన్‌క్రోచ్‌మెంట్ యాక్ట్, తెలంగాణ వాటర్, ల్యాండ్ అండ్ ట్రీస్ యాక్ట్(వాల్టా), నీటిపారుదల శాఖ చట్టాల ద్వారా జారీ చేసే అన్ని రకాల నోటీసులు, ఆక్రమణల తొలగింపు వ్యవహారాలను హైడ్రా పరిధిలోకి తెస్తున్నామని చెప్పారు. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ పరిరక్షణ బాధ్యతను కూడా జల మండలి నుంచి హైడ్రా పరిధిలోకి తీసుకురానున్నామన్నారు. హైడ్రా ఆధ్వర్యంలో మొత్తం 72 బృందాలు ఏర్పాటయ్యాయని, వీటిని మరింత పెంచి విభాగాన్ని బలోపేతం చేస్తామని చెప్పారు. ఇందుకోసం పోలీసు, సర్వే, నీటిపారుదల శాఖల నుంచి సిబ్బందిని తీసుకుంటామని తెలిపారు. కాగా, హైడ్రా కూల్చివేతల విషయంలో ఎలాంటి న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆమె ఆదేశించారు.

చుక్క పెట్టి.. చక్కబెట్టారు

టీపీవో అభ్యంతరాన్ని తొక్కిపెట్టిన అసిస్టెంట్ సిటీ ప్లానర్.. ఆపై మున్సిపల్ డిప్యూటీ కమిషనర్‌స్థాయిలో అనుమతి!

- ఆరుగురు అధికారులపై క్రిమినల్ కేసులకు హైడ్రా సిఫారసు
- శాఖాపర చర్యలకు నివేదన.. ఉద్యోగ వర్గాల్లో కలకలం



హైదరాబాద్ సిటీ, మేడ్చల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఇప్పటివరకు చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలోని నిర్మాణాల కూల్చివేతలు చేపట్టిన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్- అసెట్ ప్రొటెక్షన్ మానిటరింగ్ ఏజెన్సీ (హైడ్రా).. ఇప్పుడు ఈ అక్రమానికి ఊతం ఇచ్చిన ప్రభుత్వ అధికారుల పాత్రపైనా దృష్టి సారించింది. ద్విముఖ వ్యూహంలో భాగంగా.. ఓవైపు కూల్చివేతలు చేపడుతూనే మరోవైపు నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు జారీ చేసినవారిపై కొరడా ఝుళిపించేందుకు సిద్ధమవుతోంది. తెరవెనుక ఉంటూ తతంగం నడిపించినవారిని బయటకు లాగుతోంది. ఆయా విభాగాల్లో బాధ్యులపైనా చర్యలకు ఉపక్రమించింది. దరఖాస్తు దశ నుంచి అనుమతుల వరకు నిర్మాణదారులు సమర్పించిన డాక్యుమెంట్లు, ప్రభుత్వ విభాగాలు ఇచ్చిన నివేదికలను పరిశీలిస్తోంది. పాత్రధారులను తేల్చేందుకు పోలీస్ శాఖ తరహాలో సమగ్ర విచారణ సాగిస్తోంది. ఈ క్రమంలో హైడ్రాకు విస్తుపోయే విషయాలు తెలిశాయి. అన్నీ అవగాహన ఉండి కూడా కొందరు అధికారులు నిర్మాణాలకు ఆమోదం తెలిపారని అంచనాకు వచ్చింది.

సైబర్ నేరగాళ్లలా.. సాంకేతిక లొసుగుల ఆసరాతో

అక్రమాలకు తెగించిన అధికారులు.. సైబర్ నేరగాళ్లను తలదన్నేలా సాంకేతిక లొసుగులను ఆసరా చేసుకున్నారని హైడ్రా నిర్ధారించింది. కిందిస్థాయి ఉద్యోగులు అభ్యంతరం తెలిపినా.. ఉన్నతాధికారులు కుమ్మక్కయి అనుమతులిచ్చారని అంచనాకు వచ్చింది. చెరువుల కబ్జాలో నిర్మాణదారులకు పలు విభాగాల అధికారులు సహకరించారని తేల్చింది. క్రిమినల్ కేసుల నమోదుకు రంగం సిద్ధం చేసిన నేపథ్యంలో.. వీరిపై స్థానిక పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేయాలని భావిస్తున్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ సైబరాబాద్ కమిషనర్‌కు ఈ మేరకు లేఖ రాశారు. ఇదే సమయంలో నిబంధనలు అతిక్రమించిన అధికారులపై చర్యలకు సంబంధిత శాఖలకు సిఫారసు చేయనున్నారు.

అనుమతులు ఎలా ఇచ్చారు? ఏం జరిగింది?

ఇప్పటివరకు కూల్చివేసిన భవనాల్లో.. చందానగర్ ఈర్ల చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో జీ ప్లస్ 2 భవనాలు రెండింటికి జీహెచ్ఎంసీ సర్కిల్ అధికారులు అనుమతిచ్చారు. నిర్మాణం పూర్తికాక ముందే నివాసయోగ్య పత్రం (ఓసీ) కూడా జారీ చేశారు. ఫిర్యాదులు రావడంతో క్షేత్రస్థాయిలో పరిశీలించిన హైడ్రా.. ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలున్నాయని నిర్ధారించి పడగొట్టింది. తెరవెనుక ఏం జరిగిందో లోతుగా పరిశీలిస్తే.. టీఎస్‌బీపాస్‌లో దరఖాస్తు చేయగా.. ఈ స్థలం చెరువులో ఉందని.. సాగునీటి అధికారులు అభ్యంతరం తెలుపుతున్నారని మహిళా టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ (టీపీవో) ఫైల్‌లో రాశారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ) దీన్ని పట్టించుకోలేదు. సాగునీటి శాఖ అభ్యంతరంపై తన అభిప్రాయం చెప్పకుండా.. ఫైల్‌లో డాట్ (చుక్క) రాసి మునిసిపల్ డిప్యూటీ కమిషనర్ (ఎండీసీ)కు పంపారు. వాస్తవానికి కింది ఉద్యోగి నుంచి వచ్చిన ఫైల్‌లో అభిప్రాయం రాస్తే తప్ప పై అధికారికి చేరవేసే అవకాశం ఉండదు. ఇక్కడ ఏసీపీ, ఎండీసీ కుమ్మక్కయ్యారు. టీపీవో అభిప్రాయాన్ని తొక్కిపెట్టి వీరు చెరువులో నిర్మాణానికి అనుమతులు ఇచ్చారని హైడ్రా గుర్తించినట్లు తెలిసింది.

ల్యాండ్, సర్వే ఏడీ సొంత నివేదిక!

ప్రగతినగర్ ఎర్రకుంట చెరువులో ఏకంగా స్టిల్ట్ ప్లస్ ఐదంతస్తులుగా మూడు భవనాలకు హెచ్ఎండీఏ అనుమతులిచ్చింది. వీటినీ హైడ్రా నేలమట్టం చేసింది. ఇక్కడ తతంగంలో ల్యాండ్ సర్వే రికార్డ్స్, రెవెన్యూ, హెచ్ఎండీఏ అధికారుల హస్తం ఉందని నిర్ధారణకు వచ్చారు. కోర్టు ఆదేశాల మేరకు స్థలం యజమాన్య హక్కుపై సాగునీటి, రెవెన్యూ, ల్యాండ్ సర్వే రికార్డు విభాగాల అధికారులు సంయుక్త సర్వే నిర్వహించారు. ఈ స్థలం ఎర్రకుంట చెరువులో ఉందని తేల్చారు. అసిస్టెంట్ డైరెక్టర్ (ల్యాండ్, సర్వే) మాత్రం సంయుక్త సర్వేకు భిన్నంగా రెండు నివేదికలు సిద్ధం చేశారు. ఒకదాంట్లో ప్రభుత్వ స్థలమని, మరో దాంట్లో ప్రైవేట్ భూమి అని రాశారు. పై అధికారులకు.. ప్రైవేట్ భూమి అని రాసిన నివేదికను పంపారు. నల్లగొండలోనూ ఈ అధికారి తప్పుడు సర్వే నివేదికలు ఇచ్చినట్లు చెబుతున్నారు.

కేసులు వీరిపైనే..

ఈర్ల చెరువు అనుమతుల జారీలో

- చందానగర్ డిప్యూటీ మునిసిపల్ కమిషనర్
- అసిస్టెంట్ సిటీ ప్లానర్

ప్రగతినగర్ ఎర్రకుంటలో

- మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా సర్వే సర్వే డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్
- బాచుపల్లి తహశీల్దార్
- హెచ్ఎండీఏ అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్
- నిజాంపేట కార్పొరేషన్ కమిషనర్
- గండిపేటలో సూపరింటెండెంట్

తహసీల్దార్ తెలివి..

బాచుపల్లి తహసీల్దార్ ఏకంగా ఇతర ప్రాంతంలోని ప్రైవేట్ సర్వే నంబరును ఎర్రకుంటకు చూపి ప్రైవేట్ భూమి అని నివేదిక ఇచ్చారు. వివాదాల నేపథ్యంలో ఎర్రకుంట చుట్టూ ఫెన్సింగ్, గేట్ ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూమి అని బోర్డు కూడా పెట్టారు. కాగా, ఇందులో భవన నిర్మాణ అనుమతి కోసం దరఖాస్తు వెళ్లింది. టీఎస్‌బీపాస్ నిబంధనల ప్రకారం ప్రతి దరఖాస్తుపై సంబంధిత అధికారి క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. ఈ లెక్కన హెచ్ఎండీఏ అసిస్టెంట్ ప్లానింగ్ అధికారి (ఏపీవో) పర్యటించాలి. కానీ, కార్యాలయంలో కూర్చుని ఆన్‌లైన్‌లో ఉన్న డాక్యుమెంట్ల ఆధారంగా అనుమతులు జారీ చేశారు. బిల్డర్‌తో కుమ్మక్కైన ఆయా విభాగాల అధికారులు.. చెరువు స్థలంలో నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేసినట్లు హైడ్రా నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. కాగా, గండిపేట పరిధిలో పలు భవనాలకు సూపరింటెండెంట్ అధికారి ఆమోదం ఉన్నట్లు తేల్చారు. మాజీ సర్పంచ్ కూడా పాత తేదీతో అనుమతులిచ్చారని అంచనాకు వచ్చారు.

అధికార వర్గాల్లో కలకలం..

ఆరుగురు అధికారులపై కేసుల నమోదుకు హైడ్రా సిఫారసు చేయడం కలకలం రేపుతోంది. మేడ్చల్ జిల్లా పరిధిలోని పలు ప్రాంతాల్లో బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్, చెరువు శిఖం స్థలాల్లో నిబంధనలకు విరుద్ధంగా అనుమతులిచ్చిన ఐదుగురిని హైడ్రా ఇప్పటికే గుర్తించింది. తాజాగా మరో ఆరుగురిపై చర్యలకు శ్రీకారం చుట్టింది. అధికార దుర్వినియోగానికి పాల్పడిన వీరిపై కేసులు పెట్టడంతో పాటు నిర్మాణాలను కూల్చివేయడానికి నోటీసులు ఇచ్చినట్లు సమాచారం.

హైడ్రా పేరిట అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

- వసూళ్లపై దృష్టి పెట్టాలని ఏసీబీకి సీఎం రేవంత్ ఆదేశం



హైదరాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): హైడ్రా పేరిట అధికారులు ఎవరైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలుంటాయని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. వసూళ్లకు పాల్పడే వారిపై దృష్టి సారించాలని ఏసీబీ, విజిలెన్స్ అధికారులను అప్రమత్తం చేశారు. హైదరాబాద్‌లో హైడ్రా పేరు చెప్పి కొంతమంది కింది స్థాయి అధికారులు అవినీతికి పాల్పడుతున్నారంటూ వచ్చిన ఫిర్యాదులపై సీఎం స్పందించారు. గతంలో ఇచ్చిన నోటీసులు, రెండు, మూడు ఏళ్ల కిందటి ఫిర్యాదులను అడ్డు పెట్టుకుని కొన్ని చోట్ల రెవెన్యూ, మునిసిపల్, ఇరిగేషన్ అధికారులు డబ్బులు డిమాండ్ చేస్తున్న విషయం తన దృష్టికి వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు సీఎంవో గురువారం మీడియాకు ఓ ప్రకటన విడుదల చేసింది.

జన్వాడ ఫామ్‌హౌస్ వద్ద సర్వే పూర్తి

- నివేదికపై గోప్యత పాటిస్తున్న అధికారులు

శంకర్‌పల్లి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జన్వాడలోని కేటీఆర్ ఫామ్‌హౌస్ వద్ద అధికారులు చేపట్టిన సర్వే దాదాపుగా పూర్తి అయింది. మరోసారి సర్వే చేస్తామని అధికారులు పేర్కొన్నా.. గురువారం ఆ పరిసరాల్లోకి ఎవరూ రాలేదు. మియాఖాన్‌గడ్డలో బుధవారం నిర్వహించిన సర్వేకు సంబంధించి చేవెళ్ల ఆర్డీవో సాయిరామ్‌కు అధికారులు నివేదిక సమర్పించినట్లు తెలిసింది. అయితే, ఈ నివేదికపై అధికారులు అత్యంత గోప్యంగా వ్యవహరిస్తున్నారు. ఏ విషయమూ బయటకు పొక్కనీయడం లేదు. మియాఖాన్‌గడ్డలో ఫిరంగి కాలువను కబ్జా చేసి నిర్మించిన ఆక్రమణలను పూర్తిగా తొలగించే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. పలువురు ప్రముఖులు సైతం ఫిరంగి కాలువను ఆక్రమించి, నిర్మాణాలు చేపట్టారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సర్వే నివేదిక పూర్తి స్థాయిలో సిద్ధమైన తర్వాత.. అన్ని ఆక్రమణలను తొలగించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది.

ముఖ్యమంత్రిపై బీఆర్ఎస్ నేతల అక్కసు..

- పదేళ్లు అధికారంలో ఉండి వారు చేసిందేం లేదు: ఆది శ్రీనివాస్
- జనం ఛీకొట్టినా మారని కేటీఆర్: నిరంజన్
- కంగనాపై పోలీసులకు వీహెచ్ ఫిర్యాదు

హైదరాబాద్/అంబర్‌పేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పదేళ్లు అధికారంలో ఉండి ఏం చేయలేని బీఆర్ఎస్ నేతలు.. సీఎం రేవంత్ రెడ్డి తీసుకుంటున్న సాహసోపేత నిర్ణయాలపై ఈర్ష్య, ద్వేషాలు పెంచుకుంటున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సీఎం ఏ పనిచేసినా బీఆర్ఎస్ నేతలు ఓర్చుకోలేకపోతున్నారని విమర్శించారు. గురువారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సోది మాటలు చెబుతున్న హరీశ్‌రావు మంత్రిగా ఉన్నప్పుడు అప్పటి సీఎం కేసీఆర్‌కు చెప్పి హైడ్రా లాంటిది ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేస్తుంటే గగ్గోలు పెడుతున్నారని.. తెలంగాణకు ఐటీని పరిచయం చేసిన రాజీవ్‌గాంధీ విగ్రహం సచివాలయం ముందు పెడుతుంటే అడ్డుపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైడ్రా ముందు పార్టీలు, కులాలు, మతాలు లేవని, అక్రమంగా ఎవరు కట్టినా కూల్చుడేనన్నారు. సీఎం సోదరుడికి కూడా హైడ్రా నోటీసులు ఇవ్వడం హర్షించదగ్గ పరిణామమని వ్యాఖ్యానించారు. ప్రజలు ఛీ కొట్టినా బీఆర్ఎస్ సీనియర్ నేత కేటీఆర్ కన్నూమిన్నూ గానక మాట్లాడుతున్నారని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ మండిపడ్డారు. తిరిగి అధికారంలోకి వస్తామని భ్రమలతో.. అధికారంలోకి వచ్చిన వెంటనే రాజీవ్‌గాంధీ విగ్రహం తీసేస్తామని అహంకారంతో బీరాలు పలుకుతున్నారని విమర్శించారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన రాజీవ్‌గాంధీ మరణించిన రోజు తీవ్రవాద వ్యతిరేక దినంగా పాటిస్తారనే విషయాన్ని విస్మరించి మాట్లాడడం మంచిది కాదని కేటీఆర్‌కు హితవు పలికారు. పదేళ్లు అధికారంలో ఉండి చేసిన తప్పులకు ప్రాయశ్చిత్తంగా కొన్ని రోజులు కేసీఆర్ కుటుంబం మౌనంగా ఉంటే శ్రేయస్కరమని చెప్పారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్‌పై చర్యలు తీసుకోవాలంటూ కాంగ్రెస్ సీనియర్ నేత వి.హన్మంతరావు అంబర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదే విషయమై గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ.. కంగనా వ్యాఖ్యలు కాంగ్రెస్ కార్యకర్తల మనోభావాలను గాయపరిచాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాపులారిటీ కోసమే ఆమె రాహుల్‌పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని.. ఇలాంటి వాళ్లను ప్రోత్సహిస్తే బీజేపీపై ప్రజల తిరగబడతారని వ్యాఖ్యానించారు.

ఎప్పుడో కట్టిన ఇళ్లకు ఇప్పుడు నోటీసులా?

(మొదటిపేజీ తరువాయి)

ఎఫ్‌టీఎల్ ఎన్‌క్రోచ్‌మెంట్ నిర్మాణాలను ఇంటి యజమానులే తొలగించాలని, లేని పక్షంలో తామే చర్యలు తీసుకుని కూల్చివేసే అవకాశం ఉందని అధికారులు నోటీసుల్లో పేర్కొనడంపై ఆవేదన వెలిబుచ్చుతున్నారు. ఎప్పుడో కట్టిన ఇళ్లకు ఇప్పుడు నోటీసులా? అని వాపోతున్నారు. 25 ఏళ్ల క్రితం తాము అన్ని అనుమతులూ తీసుకుని, లేఅవుట్ ప్రకారమే నిర్మాణాలు చేశామని.. తమ దగ్గర తగిన ఆధారాలు ఉన్నాయని వారు చెబుతున్నారు. 1974 ఇరిగేషన్, రెవెన్యూ రికార్డుల ప్రకారం.. గుట్టల బేగంపేట గ్రామంలో దుర్గం చెరువు విస్తీర్ణం 160.6 ఎకరాలుగా ఉంది. ఇక్కడ.. సర్వే నంబర్ 55 నుంచి 59 వరకు నెక్టార్ గార్డెన్‌ను అభివృద్ధి చేశారు. అందులోని ఇళ్లు ఎఫ్‌టీఎల్‌లో ఉన్నాయని నోటీసులివ్వడంపై స్థానికులు అభ్యంతరం తెలుపుతున్నారు. చట్ట ప్రకారం.. ఇరిగేషన్ విభాగం చెరువు ఎఫ్‌టీఎల్ బౌండరీలను నిర్దేశించిన తర్వాతనే, తమ లే-అవుట్లకు అనుమతులు తీసుకుని నిర్మాణాలు చేశామంటున్నారు. సర్వే నంబర్ 49, 47 పార్ట్‌లో 20 ఏళ్ల క్రితమే కల్యాణినగర్ కాలనీ ఏర్పడిందని వారు పేర్కొన్నారు. 2015లో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు తమకు నోటీసులు ఇచ్చినప్పుడు స్పష్టమైన సమాధానం చెప్పామని గుర్తుచేశారు. తమ ఇళ్లు శిఖం పట్టా భూముల పరిధిలోకి ఎలా వస్తాయని ప్రశ్నిస్తున్నారు. హైడ్రా కూల్చివేతలు, సీఎం రేవంత్ ప్రసంగం నేపథ్యంలో రాజకీయ కారణాలతోనే ఇప్పుడు ఈ వ్యవహారం మరోసారి మొదటికొచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల నుంచి వేధింపులు ఎక్కువయ్యాయని వాపోతున్నారు.



1999-2000 నడుమ..

దుర్గం చెరువు పై భాగం గుట్టలబేగంపేట పరిధిలోకి వస్తుంది. ఈ ప్రాంతంలో 1990-2000 నడుమ సర్వే నంబర్ 47 నుంచి 59 వరకు పలు కాలనీలకు లే-అవుట్లు వేశారు. ఆయా కాలనీల్లో ఇప్పటివరకూ 700 ప్లాట్లలో ఇళ్ల నిర్మాణాలు జరిగాయి. కావూరి హిల్స్, సాగర్ సొసైటీ, నెక్టార్ గార్డెన్, కల్యాణ్ నగర్ కాలనీ, డాక్టర్స్ కాలనీ, సాయి సొసైటీ, అమర్ సొసైటీ కాలనీలాంటివి దీనికి ఆనుకుని ఉన్నాయి. ఇందులో 204 ఇళ్ల యజమానులకు ఈ ఏడాది ఏప్రిల్‌లోనే ఇరిగేషన్ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ నెల3న మరికొంతమందికి నోటీసులు ఇచ్చారు. అలాగే, చందానగర్‌లోని గంగారం పెద్దచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో 60 మందికి నోటీసులిచ్చారు. అలాగే.. కూకట్‌పల్లి మండల పరిధిలోని అల్లాపూర్ సున్నం చెరువు పరిధిలో 12 ఇళ్లకు, ప్రగతినగర్ అంబర్ చెరువు పరిధిలో 25 ఇళ్లకు నోటీసులు జారీ చేశారు. ఆగస్టు 3 నుంచి 10వ తేదీ నడుమ కొన్ని వందల మంది తమకు నోటీసులు అందినట్టు చెబుతున్నారు. ఈ నెల 3న నోటీసులు అందుకున్న 77 మందిలో 90 శాతం పైగా కమర్షియల్ భవనాలు, అపార్టుమెంట్ల యజమానులున్నారు. వాటిలో పలువురు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు 86 శాతానికి పైగా ఉండడం చర్చనీయాంశంగా మారింది. అయితే గతంలో నోటీసులు అందుకున్న పలువురు కోర్టును ఆశ్రయించి అధికారులు ఇచ్చిన నోటీసులపై స్టే తీసుకున్నట్లు సమాచారం. నిజానికి.. కల్యాణ్‌నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్, బృందావన్ కాలనీ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, సాయి సొసైటీ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, అమర్ కో-ఆపరేటివ్ సొసైటీ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, కావూరి హిల్స్ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్లు ఎఫ్‌టీఎల్ సమస్యపై ఈ ఏడాది మార్చి 22న హైకోర్టును ఆశ్రయించాయి. తాము చట్టప్రకారమే నిర్మాణాలు చేసుకున్నామని కోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. అయితే 2000 సంవత్సరంలో నగరంలో వచ్చిన వరదల నేపథ్యంలో దుర్గంచెరువు ఎఫ్‌టీఎల్‌ను డీమార్కేషన్ చేశారని ఆయా సొసైటీలవారు గుర్తుచేస్తున్నారు. ప్రస్తుతం హైడ్రా కమిషనర్ 1974 నాటి రికార్డుల్లోని ఎఫ్‌టీఎల్ ప్రకారం చర్యలు చేపడుతుండగా.. రెవెన్యూ అధికారులు తమ విషయంలో దాన్ని పట్టించుకోకుండా.. 2000 నాటికే అక్కడ ఉన్న వారిని పట్టించుకోకుండా నోటీసులు ఇచ్చి వేధిస్తున్నారని వాపోతున్నారు. దీనిపై న్యాయపోరాటం చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొంటున్నారు.

ఓల్డుబోయినపల్లి హస్మత్‌పేట హరిజన బస్తీలో 125 ఇళ్లకు నోటీసులు

- వారంలో ఖాళీ చేయాలని ఆదేశాలు..
- బస్తీ వాసుల్లో ఆందోళన

ఓల్డు బోయినపల్లి, ఆగష్టు 29 (ఆంధ్రజ్యోతి): బోయిన్ చెరువు పరిధిలో కట్టుకున్న ఇళ్లను వారం రోజుల్లో ఖాళీచేయాలంటూ.. ఓల్డు బోయినపల్లి హస్మత్‌పేట హరిజన బస్తీలోని 125 మందికి రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చారు. దీంతో ఏంచేయాలో పాలుపోక వారంతా ఆందోళన చెందుతున్నారు. నోటీసులిచ్చిన వారంలో ఖాళీ చేయాలంటే తామంతా ఎక్కడికి వెళ్లాలని వారు ప్రశ్నిస్తున్నారు. మూకుమ్మడిగా ఆత్మహత్య చేసుకోవడం తప్ప వేరే దారి లేదని వాపోతున్నారు. 1987లో అప్పటి ప్రభుత్వం తమకు పట్టాలు ఇచ్చిందని.. ఊళ్లో తమ పొలాలు అమ్ముకుని 30, 50, 60, 70 గజాల స్థలాల్లో తమ తాహతును బట్టి ఇళ్లు కట్టుకుని జీవిస్తున్నామని వారు తెలిపారు. అక్కడ 70 ఏండ్ల కిందట బోయిన్ చెరువు అనేది లేదని.. వ్యవసాయం కోసం మూడు బావులు ఉండేవని, ఆ బావులు నిండి చెరువుగా మారిందని బస్తీలో ఉన్న వృద్ధులు కొందరు చెబుతున్నారు. ఆటోలు నడుపుకుంటూ.. ఇండ్లల్లో పని చేసుకుంటూ.. హమాలీ పని చేసుకుంటూ.. పైసా పైసా కూడబెట్టి, సరిపోక పోతే అప్పుచేసి స్థలాన్ని కొనుక్కుని ఇళ్లు కట్టుకుంటే.. ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి హైడ్రా పేరుతో తమ ఇండ్లను కూల్చి వేస్తామంటూ నోటీసులివ్వడం ఎంత వరకు న్యాయమని వారంతా వాపోతున్నారు.

ఇంటింటా జ్వర సర్వే నిర్వహించండి:దామోదర

హైదరాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సీజనల్ వ్యాధులు, డెంగీ ప్రబలుతున్న నేపథ్యంలో ఇంటింటా జ్వర సర్వే నిర్వహించాలని మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. అక్కడికక్కడే బాధితుల రక్త నమూనాలను సేకరించి, పరీక్షించాలని చెప్పారు. సీజనల్ వ్యాధులపై డీఎంహెచ్‌వోలతో గురువారం ఆయన సమీక్ష సమీక్షించారు. సీజనల్ వ్యాధులు, డెంగీ కేసులు ఎక్కువగా నమోదయ్యే హైరిస్క్ ప్రాంతాలను గుర్తించి, ఎక్కడికక్కడ వైద్య సేవలను అందించాలని సూచించారు. డీఎంహెచ్‌వోలు క్షేత్రస్థాయిలో పర్యటించి, చేపట్టిన చర్యలపై నివేదికలను సమర్పించాలన్నారు. డెంగీ విషయంలో ప్రజలను అయోమయానికి గురి చేసే ఆస్పత్రులను గుర్తించి, కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. వ్యాధుల కట్టడి విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

ఎలక్ట్రిక్ ఉత్పత్తుల పరిశ్రమలను ప్రోత్సహిస్తాం

- ఎలక్ట్రిక్ ఎక్స్‌పో ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎలక్ట్రిక్ ఉత్పత్తులు తయారు చేసే పరిశ్రమలను ప్రోత్సహిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. తక్కువ విద్యుత్‌ను వాడుకునే ఉత్పత్తుల తయారీ పెరగాలని, కంపెనీలు ఆ దిశగా దృష్టి సారించాలని సూచించారు. సికింద్రాబాద్ ఎలక్ట్రిక్ ట్రేడర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో హైటెక్స్‌లో ఏర్పాటుచేసిన ఎలక్ట్రిక్ ఎక్స్‌పోను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని పరిశ్రమలకు అనేక రాయితీలు ఇస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని పరిశ్రమలు ఏటా 14.5శాతం వృద్ధి సాధిస్తుండడంతో ఈ రంగాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయన్నారు. ఎలక్ట్రిక్ పరిశ్రమలు, నిర్మాణ సంస్థలు కలిసి పని చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. వచ్చే నెల 5, 6 తేదీల్లో గ్లోబల్ ఏఐ సదస్సును హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు కొనసాగనున్న ఎక్స్‌పోలో విద్యుత్ లైట్లు, స్విచ్ బోర్డులు, విద్యుత్ వైర్లు, ఎర్తింగ్ పరికరాల స్టాళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

30 నియోజకవర్గాల్లో సమీకృత గురుకులాలు

- రూ.5 వేల కోట్లతో త్వరలోనే ఏర్పాటు: పొన్నం

హుస్నాబాద్, ఆగస్టు 29: రాష్ట్రవ్యాప్తంగా రూ.5 వేల కోట్లతో 30 నియోజకవర్గాల్లో 25 ఎకరాల విస్తీర్ణంలో సమీకృత గురుకుల విద్యాలయాలను త్వరలోనే ఏర్పాటు చేయబోతున్నామని బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో నియోజకవర్గ స్థాయి విద్యాశాఖ అధికారుల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 25 వేల పాఠశాలల్లో రూ.11 వేల కోట్లతో మౌలిక వసతులను మెరుగుపరిచామని చెప్పారు. హుస్నాబాద్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా నిర్వహించిన క్రీడా దినోత్సవంలో ఆయన పాల్గొని కాసేపు వాలీబాల్, కబడ్డీ ఆడారు.

తెలంగాణకు 200 మెగావాట్ల సోలార్ పవర్

చెన్నై, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్నెల్సీఐఎల్) తెలంగాణ రాష్ట్రానికి 25 యేళ్లపాటు 200 మెగావాట్ల సోలార్ విద్యుత్‌ను సరఫరా చేయనుంది. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర డిస్కమ్‌లతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సోలార్ విద్యుత్‌ను ఎన్నెల్సీ సంస్థ సరసమైన ధరకు సరఫరా చేయనుంది.

ముగ్గురు మహిళా మావోయిస్టుల మృతి

ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్, కాంకేర్‌లో ఎన్‌కౌంటర్

చర్ల, ఆగస్టు 29: ఛత్తీస్‌గఢ్‌లో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మహిళా నక్సలైట్లు మృతి చెందారు. నారాయణపూర్, కాంకేర్ జిల్లాల సరిహద్దులోని అబూజ్‌మడ్ అడవుల్లో మావోయిస్టులు ఉన్నారని బలగాలకు సమాచారం అందడంతో కూంబింగ్ చేపట్టారు. రెండు జిల్లాలకు చెందిన ఎస్టీఎఫ్, బీఎస్ఎఫ్ బలగాలు అడవుల్లో గాలింపు చేపడుతున్న క్రమంలో భద్రతా బలగాలకు, మావోయిస్టు దళాలకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ముగ్గురు మహిళా మావోయిస్టులు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కాగా, ఎన్‌కౌంటర్ నుంచి భారీ సంఖ్యలో మావోయిస్టులు తప్పించుకున్నట్లు బలగాలు తెలిపాయి.

డెంగీతో ఒకరి మృతి

» అదే లక్షణాలతో ఓ చిన్నారి కూడా...

లింగంపేట, తిరుమలాయపాలెం, ఆగస్టు 29 : రాష్ట్రంలో డెంగీ రోజురోజుకూ విజృంభిస్తోంది. ఆ జ్వరాల బారిన పడి అనేక మంది ఆస్పత్రులు పాలవుతున్నారు. తాజాగా డెంగీ బారిన పడి ఒకరు చనిపోగా, అదే లక్షణాలతో ఓ చిన్నారి మృతి చెందింది. కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం మెంగారం గ్రామానికి చెందిన అన్నం రాజు(42)కు మూడు రోజుల క్రితం జ్వరం రావడంతో.. స్థానిక వైద్యుల సూచన మేరకు కుటుంబీకులు హైదరాబాద్‌కు తరలించారు. డెంగీగా నిర్ధారించిన వైద్యులు చికిత్స అందిస్తుండగా రాజు గురువారం మృతి చెందాడు. అలాగే, ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడేనికి చెందిన బత్తుల నాగేశ్వరరావు రెండో కుమార్తె మహన్య(6) వారం రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. ఈ క్రమంలోనే పెద్దకుమార్తె అమాల్యకూ జ్వరం రావడంతో ఇద్దరిని ఖమ్మంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఇద్దరికీ డెంగీ లక్షణాలుండడంతో వైద్యులు చికిత్స అందిస్తుండగా మహన్య మృతి చెందింది.

కొత్త కోర్సులను ప్రభుత్వం ఎలా నిరాకరిస్తుంది?

» హైకోర్టులో ఇంజినీరింగ్ కళాశాలల పిటిషన్లు

హైదరాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఇంజినీరింగ్ సీఎస్ఈ, సీఎస్ఈ సైబర్ సెక్యూరిటీ, ఏఐ-ఎంఎల్ తదితర కోర్సులకు ఏఐసీటీఈ అనుమతులు ఇచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం నిరాకరించడం చెల్లదంటూ పలు కళాశాలలు హైకోర్టును ఆశ్రయించాయి. ఇది తెలంగాణ ఎడ్యుకేషన్ యాక్ట్ సెక్షన్ 20లో పేర్కొన్న విధానానికి వ్యతిరేకమని పేర్కొంటూ ఎంజీఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ, విద్యాజ్యోతి, సీఎంఆర్, కేఎంఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ, మల్లారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ, మర్రి ఎడ్యుకేషనల్ సొసైటీ తదితర ఇంజినీరింగ్ కాలేజీలు ఈ పిటిషన్లు దాఖలు చేశాయి. ఏఐసీటీఈ ఇప్పటికే తమకు అనుమతిచ్చిన సీట్ల భర్తీకి తాజాగా కౌన్సెలింగ్ నిర్వహించేలా ఆదేశాలు జారీచేయాలని కోరారు. ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాస్‌రావు ధర్మాసనం... ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. విచారణ వచ్చేనెల 4కు వాయిదాపడింది.

ఎంబీబీఎస్ ప్రవేశాల స్థానికతపై తీర్పు రిజర్వు

హైదరాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్, బీడీఎస్‌లో కాంపిటెంట్ కోటా కింద 85 శాతం సీట్లలో ప్రవేశాలకు ఎవరు స్థానికులు అన్న వివాదంపై హైకోర్టు తీర్పు రిజర్వు చేసింది. నీట్ పరీక్షకు ముందు వరుసగా నాలుగు సంవత్సరాలు (ఇంటర్, పది, తొమ్మిది తరగతులు) తెలంగాణలోనే చదివి ఉండటంతోపాటు పరీక్షలు సైతం ఇక్కడే రాసి ఉండాలని ప్రభుత్వం జారీచేసిన జీవో 33 చట్టబద్ధతపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం గురువారం విచారణ కొనసాగించింది. ఇంటర్ వేరే రాష్ట్రాల్లో చదివినంత మాత్రాన తెలంగాణ నివాసులు అనర్హులుగా మారిపోతున్నారని.. కొన్నేళ్లు తెలంగాణలో చదివిన నాన్‌లోకల్స్ అర్హులుగా మారుతున్నారని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు పేర్కొన్నారు.

ఉద్యమ గడ్డ మీద కుల వివక్ష తగదు

» రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

మర్కుక్, ఆగస్టు 29: విప్లవ ఉద్యమాలు జరిగిన తెలంగాణలో నేటికీ కుల వివక్ష, అంటరానితనం పాటించడం విచారకరమని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య విచారం వ్యక్తం చేశారు. దళితులను తోటి మనుషులతో సమానంగా చూడాలని, కుల వివక్ష పాటిస్తే తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దుర్గమ్మ పండుగలో దళితుల బోనాలను అడ్డుకొని అంటరానితనం పాటించిన సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం శివారు వెంకటాపూర్‌లో గురువారం జరిగిన పౌరహక్కుల దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. అలాగే దుర్గమ్మ ఆలయంలో దళితులతో ప్రవేశం చేయించారు. సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా చైర్మెన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ అంబేడ్కర్ స్ఫూర్తితో ఆధిపత్యాన్ని ప్రశ్నించి సమానంగా జీవించాలని పిలుపునిచ్చారు.

జర్నలిస్టుల సమస్యలపై త్వరలో సీఎంతో భేటీ

» తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

హుజూర్‌నగర్, ఆగస్టు 29: రాష్ట్రంలోని జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ కానున్నట్లు మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో టీయూడబ్ల్యుజే(ఐజేయూ) అధ్వర్యంలో శ్రీనివాస్‌రెడ్డికి ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ హైదరాబాద్‌లో జేఎన్‌జే సొసైటీకి కేటాయించిన 70ఎకరాల స్థలంపై సుప్రీంకోర్టు తీర్పు వచ్చినా గత ప్రభుత్వం పంపిణీ చేయకుండా రెండేళ్ల పాటు కాలయాపన చేసిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నదని, హైపవర్ కమిటీని ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి ముందడుగు వేశామన్నారు. 10 రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీనివాస్‌రెడ్డితో మరోసారి భేటీ అయి విధి విధానాలపై చర్చించనున్నట్లు తెలిపారు. అక్రిడిటేషన్లు, హెల్త్‌కార్డులు, ఇళ్ల స్థలాలపై త్వరలో సీఎం అధికారిక ప్రకటన చేస్తారని వివరించారు.

లోన్‌యాప్‌ల పేరిట మోసం.. 8 మంది అరెస్టు

హైదరాబాద్/ కరీంనగర్ క్రైం/ కాల్వ శ్రీరాంపూర్/ఓదెల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): లోన్‌యాప్‌ల పేరుతో మోసాలకు పాల్పడుతున్న 8 మంది సభ్యుల ముఠాను సైబర్ సెక్యూరిటీ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. వనపర్తి జిల్లా కొత్తకోటకు చెందిన వ్యక్తి రూ.లక్ష పీఎం విశ్వకర్మ కమ్యూనిటీ వర్క్ లోన్ కోసం దరఖాస్తు చేసుకోగా.. మంజూరుకు కొంత నగదు కట్టాలంటూ అదే రోజు అతడి ఫోన్‌కు ఓ సందేశం వచ్చింది. అది నమ్మిన అతడు మొత్తం రూ. 12,250 చెల్లించాడు. ఆ తరువాత మళ్లీ రూ.9 వేలు చెల్లించాలని సందేశం రావడంతో మోసపోయానని గ్రహించి 1930 నంబర్‌లో ఫిర్యాదు చేశాడు. సైబర్ సెక్యూరిటీ బ్యూరో, కొత్తకోట పోలీసులు సంయుక్త ఆపరేషన్ నిర్వహించి వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం బలిపల్లి ఎర్రగుట్ట తండాకు చెందిన 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ముఠాపై దేశవ్యాప్తంగా 55 ఎఫ్ఐఆర్‌లు, నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో 373 ఫిర్యాదులు ఉన్నట్లు సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరక్టర్ శిఖా గోయల్ వెల్లడించారు. మరోవైపు తీసుకున్న డబ్బులు చెల్లించాలని లోన్‌యాప్ నిర్వాహకులు వేధించడంతో కరీంనగర్‌కు చెందిన సతీష్‌రెడ్డి (43) ఆత్మహత్య చేసుకున్నాడు. అలాగే, పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్‌కు చెందిన తుండ్ల శ్రీనివాస్ (27) ఫైనాన్స్, క్రెడిట్ కార్డ్ అనే రెండు లోన్ యాప్‌ల ద్వారా సుమారు 4,80,000 వరకు రుణం తీసుకున్నాడు. డబ్బులు కట్టాలని వారు వేధిస్తుండడంతో మనోవేదనకు గురై బుధవారం అర్ధరాత్రి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలించారు.

గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్

కచ్చితంగా ముందే అనుమతి తీసుకోవాలి.. శోభా యాత్రలో లోటుపాట్లకు తావివ్వొద్దు

గణేశ్ ఉత్సవాలపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి


గణేశ్ ఉత్సవాలపై సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు పొంగులేటి, పొన్నం, దుద్దిళ్ల, సీతక్క

హైదరాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గణేష్ మండపాల నిర్వాహకులు ముందస్తుగా అనుమతి తీసుకుంటే ఉచితంగా విద్యుత్తు సరఫరా చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. అనుమతులు లేకుండా విద్యుత్ వినియోగిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గణేష్ ఉత్సవాల నిర్వహణపై సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు చేసిన విజ్ఞప్తిపై సీఎం సానుకూలంగా స్పందించారు. జవాబుదారీతనం కోసమే అనుమతి తీసుకోవాలని కోరుతున్నామని తెలిపారు. హైదరాబాద్ ప్రతిష్ఠను మరింత పెంచేలా గణేష్ ఉత్సవాల నిర్వహణ ఉండాలని, ఇందుకోసం ఉత్సవ కమిటీలు, మండపాల నిర్వాహకులు, అధికారులత సమన్వయంతో చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. మండపాల ఏర్పాటు నుంచి శోభాయాత్ర దాకా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. అనుమతులు తీసుకుంటే ఆయా ప్రాంతాల్లో భద్రత, ట్రాఫిక్ తదితర ఇబ్బందులు తలెత్తకుండా చూసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఎటువంటి లోటుపాట్లకు తావివ్వద్దని, జోన్ల వారీగా ఉన్నతాధికారులకు బాధ్యతలు అప్పగించాలని సీఎస్ శాంతికుమారిని ఆదేశించారు. గత ఏడాది ఔటర్ రింగు రోడ్డు పరిధిలో 1.50 లక్షల విగ్రహాలు ఏర్పాటు చేశారన్న అంచనాలున్న నేపథ్యంలో మొత్తం విగ్రహాలను హుస్సేన్ సాగర్‌కే కాకుండా ఇతర చెరువుల్లోనూ నిమజ్జనం చేసే అవకాశాన్ని పరిశీలించాలని సూచించారు. దీంతో సాగర్ వద్ద రద్దీ తగ్గడంతో పాటు ఆయా చెరువుల వద్ద నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లను ప్రభుత్వం ముందుగానే చేసే వీలుంటుందన్నారు. ఈ విషయంలో ఉత్సవ సమితి సభ్యులు, మండప నిర్వాహకులు ముందగానే సమాచారం ఇవ్వాలని సూచించారు. 17న నిమజ్జనం ఉండగా.. అదే రోజున తెలంగాణ విలీన దినం ఉందని గుర్తు చేశారు. ఆయా పార్టీలు పలు కార్యక్రమాలు నిర్వహించనున్న నేపథ్యంలో సరైన ప్రణాళికతో ముందుకెళ్లాలని పోలీసులకు సూచించారు. ఉత్సవాల నిర్వహణకు సంబంధించి నగర పరిధిలోని నలుగురు ఎంపీలు, ఎమ్మెల్యేల అభిప్రాయాలు తీసుకోవాలన్నారు. కాగా, నిమజ్జనం రోజైన సెప్టెంబరు 17వ తేదీన అనంత చతుర్దశి వచ్చిందని, ఆ రోజు ప్రాముఖ్యతను తెలుపుతూ దేవాదాయ శాఖ తరఫున ప్రచారం చేయాలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు జి.రాఘవరెడ్డి విజ్ఞప్తి చేయగా.. అవసరమైన ఏర్పాట్లు చేయాలని దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావును సీఎం ఆదేశించారు. మండపాల్లో డీజేలు వాడేందుకు అనుమతి ఇవ్వాలని ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ కోరగా.. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం ముందుకు వెళ్తామని సీఎం స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి పర్యావరణహిత విగ్రహాలను ప్రతిష్ఠించాలని మంత్రి శ్రీధర్‌బాబు ఉత్సవ సమితి బాధ్యులకు సూచించారు. గణేష్ ఉత్సవాలకు సంబంధించి ఇప్పటిదాకా నిర్వహించిన సమావేశాలు, ఉత్సవ సమితి సభ్యులు చేసిన సూచనలు, పరిష్కరించిన సమస్యల వివరాలను మంత్రి పొన్నం వివరించారు. మొత్తం 25వేల మందితో భద్రత ఏర్పాట్లు చేయనున్నట్లు డీజీపీ జితేందర్, హైదరాబాద్ సీపీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

మిలాద్-ఉన్-నబీ ప్రదర్శనలు సెప్టెంబరు 19న

» సర్కారు విజ్ఞప్తికి మిలాద్ కమిటీ సానుకూల స్పందన

మిలాద్-ఉన్-నబీ ప్రదర్శనలను సెప్టెంబరు 19న నిర్వహించేందుకు మిలాద్ కమిటీ ప్రతినిధులు అంగీకరించారు. మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని వచ్చే నెల 16న మిలాద్ ఉన్ నబీని ఘనంగా నిర్వహించాలని కమిటీ నిర్ణయించింది. సంబంధిత ఏర్పాట్లపై సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం రాత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సెప్టెంబరు 7 నుంచి 17వ తేదీ వరకు హైదరాబాద్‌లో గణేశ్ ఉత్సవాలు కొనసాగనున్న నేపథ్యంలో మిలాద్ ఉన్ నబీ ప్రదర్శనలను వాయిదా వేసుకునే అంశాన్ని పరిశీలించాలని సీఎం, మంత్రులు మిలాద్ కమిటీ సభ్యులను కోరారు. ఈ అంశంపై చర్చించే బాధ్యతను మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంఐఎం ఫ్లోర్‌లీడర్ అక్బరుద్దీన్ ఒవైసీకి అప్పగించారు. సమీక్ష అనంతరం వారు మరోసారి సమావేశమై విజ్ఞప్తి చేయగా.. మిలాద్ కమిటీ సభ్యులు సానుకూలత వ్యక్తం చేశారు. అయితే, మహ్మద్ ప్రవక్త వచ్చే ఏడాది మహ్మద్ ప్రవక్త 1500వ జన్మదినం నేపథ్యంలో.. ఏడాది పాటు ఉత్సవాల నిర్వహణకు అనుమతించాలని కమిటీ సభ్యులు కోరగా.. నిబంధనల ప్రకారం అనుమతులిస్తామని సీఎం చెప్పారు.

ఓటరు జాబితాల్లో తప్పులు ఉండొద్దు

» వచ్చే నెల 6న ముసాయిదా విడుదల

» 21న తుది జాబితాల ప్రచురణ

» జిల్లాల అధికారులతో ఎస్ఈసీ పార్థసారథి

హైదరాబాద్, ఆగస్టు29 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల రెండో సార్వత్రిక ఎన్నికల నిర్వహణ కోసం వార్డులు, గ్రామ పంచాయతీల వారీగా ఓటరు జాబితాలను ఎటువంటి తప్పుల్లేకుండా సిద్ధం చేయాలని జిల్లాల అధికారులను రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ సి.పార్థసారథి ఆదేశించారు. ఓటరు జాబితా తయారీ, ప్రచురణ పురోగతిపై అందరు జిల్లా కలెక్టర్లు, (హైదరాబాద్ మినహా) స్థానికసంస్థల అదనపు కలెక్టర్లు, జిల్లా పంచాయతీ అధికారులు, డివిజినల్ పంచాయతీ అధికారులు, అసెంబ్లీ నియోజకవర్గాల ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులతో గురువారం ఎస్ఈసీ కార్యాలయం నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. ఇందులో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్, కమిషనర్ అనితా రామచంద్రన్, ఇతరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసీఐ (భారత ఎన్నికల సంఘం) తయారుచేసిన అసెంబ్లీ నియోజకవర్గాల ఓటరు జాబితాలను యథావిధిగా పరిగణలోకి తీసుకొని వార్డువారీ, గ్రామ పంచాయతీల వారీగా ముసాయిదా ఓటరు జాబితాలను వచ్చేనెల 6న గ్రామ పంచాయతీల్లో విడుదల చేయాలని ఆదేశించారు. ఆతర్వాత మండల, జిల్లాస్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం ఏర్పాటు చేసి వారి సూచనలు సలహాలు స్వీకరించాలన్నారు. ఓటరు జాబితా రూపకల్పనలో పొరపాట్లు జరిగితే సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారి, లేదా జిల్లా పంచాయతీ అధికారులకు రాతపూర్వకంగా తెలియజేయాలన్నారు. ఫిర్యాదులను పరిశీలించి తుది ఓటరు జాబితాను వచ్చేనెల 21న ప్రచురించాలని ఆదేశించారు. ఒకవేళ ఎవరైనా అర్హులైన ఓటర్లు తమ పేర్లను పంచాయతీ ఓటర్ల జాబితాలో చేర్చుకోవాలన్నా.. ఎమైనా అభ్యంతరాలు ఉన్నా సంబంధిత అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సంబంధిత అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటరు చేర్పు, తొలగింపు జరిగిన తర్వాతనే గ్రామ పంచాయతీ ఓటరు జాబితాలో పరిగణలోకి తీసుకుంటారని వెల్లడించారు. వార్డుల వారీగా పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, పోలింగ్ సిబ్బంది వివరాల సేకరణ, రిటర్నింగ్ అధికారుల నియామకం, పోలింగ్ సిబ్బందికి శిక్షణపై మార్గదర్శకాలను పాటించాలని సూచించారు. అనంతరం రాష్ట్ర ఎన్నికల సంఘం, సెంటర్ ఫర్‌గుడ్ గవర్నెన్స్ సహకారంతో రూపొందించిన గ్రీవెన్స్ మాడ్యూల్‌ను ఆయన ఆవిష్కరించారు.

సబ్‌ప్లాన్ నిధులు పూర్తిగా ఖర్చు పెట్టాలి

» సమీకృత గురుకులాలకు ప్రాధాన్యం:భట్టి

హైదరాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు వంద శాతం వ్యయమయ్యేలా చూడాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సూచించారు. ఇందులో సమీకృత గురుకుల విద్యాలయాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. దళిత, గిరిజన కాలనీల్లో కమ్యూనిటీ హాళ్లు, అంతర్గత రహదారులు, డ్రైనేజీ నిర్మాణాలు, ఇతర మౌలిక సదుపాయాల పనులు చేపట్టాలన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులపై గురువారం సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ చట్టం స్ఫూర్తిని అధికారులు అర్థం చేసుకోవాలని, ఎస్సీ, ఎస్టీల కోసం కేటాయించిన నిధులను వారి ప్రాంతాల్లోనే వ్యయమయ్యేలా చూడాలన్నారు. ఇందుకోసం నియమించిన ప్రత్యేక అధికారి అన్ని శాఖలతో సమన్వయం చేస్తారని తెలిపారు.

విపత్తుల నియంత్రణపై పదేళ్లుగా ప్రణాళికే లేదా?

» మంత్రి పొంగులేటి విస్మయం

హైదరాబాద్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం ఏర్పాటయ్యాక విపత్తుల నియంత్రణకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళిక ఒక్కసారి కూడా చేపట్టలేదని, ఆ దిశగా ఒక్క సమావేశమూ నిర్వహించలేదని అధికారులు వివరించగా.. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విస్మయం వ్యక్తం చేశారు. గురువారం తొమ్మిది విభాగాల అధికారులతో సచివాలయంలో మంత్రి సమీక్ష నిర్వహించారు. వచ్చే రెండు నెలల్లో హైదరాబాద్, గోదావరి పరివాహక జిల్లాల్లో వరదలు సంభవించే అవకాశం ఉన్నందున జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ మార్గదర్శకాల ప్రకారం నివేదిక ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్ర స్థాయిలో టోల్‌ఫ్రీ నంబరును ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. కాగా, హైడ్రా పరిధిలో విపత్తుల నిర్వహణకు తీసుకుంటున్న చర్యలను కమిషనర్ రంగనాథ్ వివరించారు. గతంలో 30 బృందాలు ఉండేవని ఇప్పుడు 70కు పెంచామని, సిబ్బంది సంఖ్యను 1,800 నుంచి 3,500 పెంచినట్లు తెలిపారు.

పెసర కొనుగోళ్లు ప్రారంభించండి

» మార్క్‌ఫెడ్‌కు మంత్రి తుమ్మల ఆదేశం

రాష్ట్రంలో పెసర కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి శుక్రవారం నుంచే కొనుగోళ్లు ప్రారంభించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. మార్క్‌ఫెడ్ అధికారులను ఆదేశించారు. ప్రస్తుత వానాకాలంలో 64,175 ఎకరాల్లో పెసర పంట సాగైందని, 17,841 మెట్రిక్ టన్నుల వరకు దిగుబడి రావచ్చని అంచనాలున్నాయని చెప్పారు. ప్రస్తుతం 12 ప్రాంతాల్లో పంట కోతకు వచ్చిందని, పెసర పంట మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉందని గుర్తించామని తెలిపారు. ఈ నేపథ్యంలో ఖమ్మం, సంగారెడ్డి, వికారాబాద్, సూర్యాపేట, నారాయణపేట, మహబూబాబాద్, కామారెడ్డి జిల్లాల్లో శుక్రవారం నుంచే కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కావాలని స్పష్టం చేశారు. కాగా, నేతన్న చేయూత పథకం అమలులో భాగంగా రూ.90 కోట్లు నిధులు విడుదల చేశామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. ఈ నిధుల ద్వారా 36,133 మంది చేనేత కార్మికులు లబ్ధిపొందుతారని పేర్కొన్నారు.

పాఠ్యాంశంగా మహిళల గౌరవం

నేరాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పిస్తాం.. ప్రభుత్వాస్పత్రిలో వైద్యురాలికే రక్షణ లేకపోతే ఎలా?

» అఘాయిత్యాలకు గంజాయి వ్యసనమూ కారణమే

» మానవ అక్రమ రవాణా నివారణ సదస్సులో మంత్రి సీతక్క



సదస్సులో మంత్రి సీతక్కకు జ్ఞాపిక అందజేస్తున్న శిఖాగోయల్

హైదరాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): అన్ని స్థాయిల్లో మహిళలు ఏదో ఒక రూపంలో వేధింపులు ఎదుర్కోవాల్సి రావడం బాధాకరమని.. మహిళలను సెక్స్ సింబల్‌గా, వ్యాపార వస్తువుగా చూసే విధానం పోవాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఇటీవల దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్‌కతా వైద్యురాలిపై హత్యాచార ఘటనను గుర్తుచేస్తూ.. ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యురాలికే భద్రత లేకపోతే ఎలా? అని ఆవేదన వ్యక్తం చేశారు. మగవారి ఆలోచనా విధానంలో మార్పులు వస్తేనే.. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తారని, మహిళలను గౌరవించాలంటూ తమ పిల్లలకు తల్లిదండ్రులను నేర్పించాలని, లింగ బేధం లేకుండా అమ్మాయి, అబ్బాయిలను సమానంగా పెంచాలని సూచించారు. మహిళలను గౌరవించడం (హౌ టు రెస్పెక్ట్ ఉమెన్) అనే అంశమ్మీద ప్రత్యేకంగా ఓ పాఠ్యాంశాన్ని రూపొందించి పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధించేలా ప్రణాళిక సిద్ధం చేస్తామని చెప్పారు. నేరం జరగకముందే ఆ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. మానవ అక్రమ రవాణా నివారణ కోసం చేపట్టాల్సిన చర్యలపై గురువారం హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో తెలంగాణ ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో సీతక్క పాల్గొని మాట్లాడారు. నేరం జరిగిన వెంటనే బాధితులకు సత్వర న్యాయం చేయడంతో పాటు, నిందితులకు త్వరగా శిక్షపడేలా వ్యవస్థలను మెరుగుపరచాలని అభిప్రాయపడ్డారు. మహిళలు, చిన్నారులు మీద జరుగుతున్న అఘాయిత్యాలకు గంజాయి వ్యసనం కూడా కారణంగా కనిపిస్తోందన్నారు. ఆ మహమ్మారి నుంచి సమాజాన్ని బయటకు తీసుకొచ్చేందుకు యుద్ధం చేస్తున్నామని చెప్పారు.


అంగన్‌వాడీలను సీఎం సందర్శిస్తారు

రాష్ట్రంలోని అంగన్‌వాడీలు దేశానికి ఆదర్శంగా ఉండాలని, ఆ మేరకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సీతక్క సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలుంటాయని, ముఖ్యమంత్రి, మంత్రులు కూడా సందర్శిస్తారని తెలిపారు. సెప్టెంబరు 4 నుంచి తాను జిల్లాల్లో పర్యటిస్తానని.. పథకాలు, పురోగతిపై సమీక్షిస్తానని చెప్పారు. గురువారం సచివాలయంలో అన్ని జిల్లాల అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ అంగన్‌వాడీల ద్వారా అందుతున్న సేవలను మరింత విస్తృతం చేయాలని, చిన్నారులకు ఇస్తున్న ఉడకబెట్టిన కోడిగుడ్డును రెండు ముక్కలుగా చేసి అందించాలని సూచించారు.

టిమ్స్ వ్యయం పెంపుపై విచారణ!

విజిలెన్స్‌కు ఆదేశాలు జారీ చేసిన సీఎం రేవంత్

హైదరాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గత సర్కారు నిర్మించ తలపెట్టిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణ వ్యయాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సీరియస్‌గా ఉన్నారా? అంచనా వ్యయాలను పెంచడానికి కారణాలను ఆరా తీస్తున్నారా? ఈ ప్రశ్నలకు విశ్వసనీయ వర్గాలు అవుననే సమాధానం చెబుతున్నాయి. విజిలెన్స్ విచారణకు ఆదేశాలు జారీ చేశారని పేర్కొంటున్నాయి. దీంతో.. విజిలెన్స్ రంగంలోకి దిగి, ఆస్పత్రుల నిర్మాణాల వ్యయాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ హయాంలో నగరం నలుమూలలా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణానికి నిర్ణయించి.. పనులను ప్రారంభించిన విషయం తెలిసిందే.! ఎల్బీనగర్, అల్వాల్, సనత్‌నగర్‌లో తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(టిమ్స్) ఆస్పత్రులు, వరంగల్ సెంట్రల్ జైలు స్థలంలో హనుమకొండ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మించేందుకు పాలనాపరమైన అనుమతులను మంజూరు చేశారు. అన్ని ఆస్పత్రులకు శంకుస్థాపనలు చేశారు. ఇప్పుడు ఆ ఆస్పత్రులు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. అయితే.. తొలుత పేర్కొన్న అంచనా వ్యయం పెరుగుతూ వచ్చిందంటూ రేవంత్ సర్కారుకు ఫిర్యాదులు వచ్చినట్లు సమాచారం. అల్వాల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి విషయంలో.. ప్రతిపాదిత అంచనా రూ.897 కోట్లు కాగా.. దాన్ని రూ.300 కోట్ల మేర పెంచి, రూ.1,197 కోట్లకు చేర్చారు. దీనిపై సమగ్ర పరిశీలన జరిపిన సీఎం రేవంత్‌రెడ్డి.. అంతలా అంచనా వ్యయం పెరగడానికి కారణమేంటి? ఆస్పత్రి మొత్తం ఇటాలియన్ మార్బుల్స్ వేసినా.. ఇంత వ్యయం కాదు కదా? అన్ని ప్రశ్నించినట్లు తెలిసింది. దానికి అధికారులు స్పందిస్తూ.. ఆస్పత్రిలో అదనంగా మాతాశిశు సంరక్షణ(ఎంసీహెచ్) ఆస్పత్రిని కూడా ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఎంసీహెచ్ నిర్మాణానికి అంత ఖర్చవుతుందా? అని సీఎం వారిని నిలదీసినట్లు సమాచారం. ఆర్కిటెక్ట్‌లకు అధికమొత్తంలో చెల్లించారని సీఎం అభిప్రాయపడ్డట్లు తెలిసింది. దాంతోపాటు.. వరంగల్ ఆస్పత్రి స్థలం మార్టిగేజ్‌పై 'తా కట్టు వెనుక కనికట్టు 'ఏమిటి?' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో మార్చి 23న కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే.! దీనిపైనా విజిలెన్స్ విచారణకు.. వ్యయం పెంపుపై వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని వైద్యఆరోగ్య శాఖ కార్యదర్శిని సీఎం ఆదేశించినట్లు తెలిసింది. హైదరాబాద్‌లోని 3 టిమ్స్‌తోపాటు.. వరంగల్ ఆస్పత్రి నిర్మాణంపై విజిలెన్స్ రంగంలోకి దిగనున్నట్లు తెలుస్తోంది.


నాగార్జునసాగర్ 26 గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు

సాగర్ గేట్లన్నీ ఎత్తివేత

» ప్రాజెక్టుకు 3,48,235 క్యూసెక్కుల ఇన్ ఫ్లో

» కృష్ణా జలాశయాలకు పెరుగుతున్న వరద

గద్వాల/నాగార్జునసాగర్/కేతేపల్లి/మేళ్లచెర్వు, ఆగస్టు 29 : పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో కృష్ణానదికి భారీగా వరద వస్తోంది. గద్వాల జిల్లాలోని జూరాల ప్రాజెక్టులోకి 2,94,000 క్యూసెక్కులు, శ్రీశైలం జలాశయానికి 2,86,434 క్యూసెక్కుల వరద వస్తోంది. శ్రీశైలం ప్రాజెక్టు 10 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 2,79,830 క్యూసెక్కులను వదులుతున్నారు. నాగార్జున సాగర్‌కు 3,48,235 క్యూసెక్కుల వరద వస్తోంది. దీంతో 26 గేట్లల్లో 14 క్రస్ట్ గేట్లను 10 అడుగుల మేర, 12 గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 3,07,382 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఇక, గోదావరిపై ఉన్న మేడిగడ్డ బ్యారేజీకి 1.93 లక్షలు, సమ్మక్క బ్యారేజీకి 2.52 లక్షలు, సీతమ్మసాగర్‌కు 2.76 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు వదులుతున్నారు. శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టుకు 7534 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.



ఎన్‌జీ రంగా వర్సిటీలో
బీఎస్సీ ఆనర్స్

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ(ఏఎన్‌జీఆర్ఏయూ)- బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. అకడమిక్ మెరిట్ ఆధారంగా లాంలోని కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్‌లో అడ్మిషన్స్ ఇస్తారు. ఈ కాలేజీకి ఐకార్ గుర్తింపు ఉంది. మొత్తం 83 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థుల కోసం 10 శాతం సూపర్ న్యూమరరీ సీట్లు నిర్దేశించారు. గ్రామీణ అభ్యర్థుల కోసం 40 శాతం సీట్లు ప్రత్యేకించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన పురుషులు, మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చు. హాస్టల్ సౌకర్యం ఉంది.

అర్హత
- గుర్తింపు పొందిన బోర్డు నుంచి బైపీసీ/ఎంపీసీ/ఎంబైపీసీ గ్రూప్ సబ్జెక్టులతో ఇంటర్/ పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.
- మూడేళ్ల వ్యవధి గల డిప్లొమా(హోమ్ సైన్స్) ఉత్తీర్ణులైన అభ్యర్థుల కోసం పది శాతం సూపర్ న్యూమరరీ సీట్లు(ఎనిమిది సీట్లు) ప్రత్యేకించారు. గ్రామీణ అభ్యర్థులకు కేటాయించిన సీట్లకు దరఖాస్తు చేసుకోవాలంటే ఒకటో తరగతి నుంచి ఇంటర్ స్థాయి వరకు కనీసం నాలుగేళ్లు గ్రామ పాఠశాలల్లో చదివి ఉండాలి. సంబంధిత ధ్రువపత్రాన్ని సబ్మిట్ చేయాల్సి ఉంటుంది.
- అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 25 ఏళ్లు; దివ్యాంగులకు 27 ఏళ్లు మించకూడదు.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీలకు రూ.1000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 30
- **చిరునామా:** రిజిస్ట్రార్, ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, లాం, గుంటూరు-522034
- **వెబ్‌సైట్:** angrau.ac.in

వెటర్నరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో
బీవీఎస్సీ & ఏహెచ్



ఐకార్ ఆధ్వర్యంలోని ఇండియన్ వెటర్నరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఐవీఆర్ఐ)- బీవీఎస్సీ & ఏహెచ్ డిగ్రీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ ప్రోగ్రామ్ వ్యవధి అయిదున్నరేళ్లు. ఇందులోనే ఏడాది పాటు కంపల్సరీ రొటేటింగ్ ఇంటర్న్‌షిప్ కూడా ఉంటుంది. మొత్తం 50 సీట్లు ఉన్నాయి. వీటిలో 45 రెగ్యులర్ సీట్లు, 8 పేమెంట్ సీట్లు(సూపర్ న్యూమరరీ) ఉన్నాయి. వీటిని నీట్ యూజీ 2024 ర్యాంక్ ఆధారంగా భర్తీ చేస్తారు. ఎన్ఆర్ఐ కోటా కింద రెండు సీట్లు(సూపర్ న్యూమరరీ) ప్రత్యేకించారు. వీటిని అభ్యర్థుల అకడమిక్ మెరిట్ ఆధారంగా భర్తీ చేస్తారు. మిగిలిన అయిదు సీట్లను రోస్టర్ విధానంలో వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా భర్తీ చేస్తుంది. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్లు వర్తిస్తాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ/బయోటెక్నాలజీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. గ్రూప్ సబ్జెక్టుల్లో మొత్తమ్మీద కనీసం 50 శాతం మార్కులు ఉండాలి. నీట్ యూజీ 2024 అర్హత పొందాలి. ఇందులో నిర్దేశించిన కటాఫ్ కంటే ఎక్కువ మార్కులు తప్పనిసరి. 2024 డిసెంబరు 31 నాటికి అభ్యర్థుల వయసు 17 ఏళ్లు నిండి ఉండాలి.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.2,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 6
- **మొదటి రౌండ్ కౌన్సెలింగ్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** సెప్టెంబరు 18
- **మొదటి రౌండ్ కౌన్సెలింగ్ తేదీ:** సెప్టెంబరు 26
- **రెండో రౌండ్ కౌన్సెలింగ్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** సెప్టెంబరు 27
- **రెండో రౌండ్ కౌన్సెలింగ్ తేదీ:** అక్టోబరు 7
- **సీట్లు మిగిలిన పక్షంలో మాప్-అప్ రౌండ్ కౌన్సెలింగ్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** అక్టోబరు 10
- **మాప్-అప్ రౌండ్ కౌన్సెలింగ్ తేదీ:** అక్టోబరు 25
- **పేమెంట్ సీట్లు, ఎన్ఆర్ఐ కోటా సీట్లకు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** అక్టోబరు 25
- **పేమెంట్ సీట్లు, ఎన్ఆర్ఐ కోటా సీట్లకు కౌన్సెలింగ్:** నవంబరు 6
- **కోర్సు ప్రారంభం:** అక్టోబరు 1 నుంచి
- **వెబ్‌సైట్:** ivri.nic.in

ఇఫ్లూలో సంస్కృతం కోర్సు


హైదరాబాద్‌లోని ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ(ఇఫ్లూ)- 'ప్రొఫిషియెన్సీ కోర్స్ ఇన్ శాన్‌స్క్రిట్'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం 25 సీట్లు ఉన్నాయి. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్ పద్ధతిలో అడ్మిషన్స్ ఇస్తారు. కోర్సు వ్యవధి 50 గంటలు. తరగతులు సెప్టెంబరులో ప్రారంభమవుతాయి. బుధవారం నుంచి శుక్రవారం వరకు మధ్యాహ్నం రెండు గంటల నుంచి నాలుగు గంటల వరకు తరగతులు నిర్వహిస్తారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. కనీసం 80 శాతం అటెండెన్స్ తప్పనిసరి.

కోర్సు వివరాలు: కోర్సులో భాగంగా సంస్కృత భాషకు సంబంధించి వినడం, మాట్లాడడం, చదవడం, రాయడం నేర్పిస్తారు. ప్రాథమిక వ్యాకరణం, పదాలు, వాక్యాల నిర్మాణం తదితరాలకు సంబంధించిన మెటీరియల్ ఇస్తారు. నిబంధనల ప్రకారం కోర్సు పూర్తిచేసినవారికి సర్టిఫికెట్ ఇస్తారు.

అర్హత: పదోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. విదేశీ విద్యార్థులకైతే ఇంగ్లీష్‌లో కనీసం 50 శాతం మార్కులు ఉండాలి. వీరికి వీసా, రెసిడెంట్ పర్మిట్ తప్పనిసరి.

ముఖ్య సమాచారం
- **కోర్సు ఫీజు:** రూ.3,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 13
- **చిరునామా:** ఎస్ఎఫ్‌సీఏఆర్ ఆఫీస్, రూమ్ నెం.29, గ్రౌండ్ ఫ్లోర్, అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్, ఇఫ్లూ, హైదరాబాద్
- **వెబ్‌సైట్:** www.efluniversity.ac.in

ఆంధ్ర యూనివర్సిటీలో పీజీ



విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్(ఏయూడీఓఏ)- పీజీ ప్రోగ్రామ్‌లలో సెల్ఫ్ సపోర్ట్ కేటగిరీ సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ తదితర ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఏపీ పీజీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా వర్సిటీ నిర్వహించే కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు ఫీ రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు లభించవు.

కోర్సులు-స్పెషలైజేషన్‌లు
- **ఎంఏ:** ఇంగ్లీష్, తెలుగు, హిందీ, కూచిపూడి క్లాసికల్ డ్యాన్స్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, సోషియాలజీ, సోషల్ వర్క్, యోగా, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, అప్లయిడ్ ఎకనామిక్స్, ఎకనామిక్స్, మేథమెటిక్స్
- **ఎంఎఫ్ఏ:** స్కల్ప్చర్, పెయింటింగ్, ప్రింట్ మేకింగ్
- మాస్టర్ ఆఫ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్(ఎంహెచ్ఆర్ఎం)
- మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(ఎంఎల్ఐఎస్సీ)
- మాస్టర్ ఆఫ్ కామర్స్(ఎంకాం)
- మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్(ఎంపీఈడీ)

ఎమ్మెస్సీ: బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, మెరైన్ బయాలజీ అండ్ ఫిషరీస్, కోస్టల్ ఆక్వా కల్చర్ అండ్ మెరైన్ బయోటెక్నాలజీ, మెరైన్ బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ, హ్యూమన్ జెనెటిక్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, హోమ్ సైన్స్(ఫుడ్, న్యూట్రిషన్, డైటెటిక్స్), బోటనీ, జువాలజీ, అప్లయిడ్ మేథమెటిక్స్, మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్, ఫిజిక్స్, న్యూక్లియర్ ఫిజిక్స్, మెరైన్ జియోఫిజిక్స్, జియోఫిజిక్స్, ఫిజికల్ ఓషనోగ్రఫీ, మెటరాలజీ, అనలిటికల్ కెమిస్ట్రీ, ఇనార్గానిక్ కెమిస్ట్రీ, కెమిస్ట్రీ అండ్ అనాలిసిస్ ఆఫ్ ఫుడ్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఫిజికల్ కెమిస్ట్రీ, జియాలజీ, అప్లయిడ్ జియాలజీ, సైకాలజీ, జాగ్రఫీ, అప్లయిడ్ కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్

ముఖ్య సమాచారం
- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.1000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 4
- **కౌన్సెలింగ్ తేదీ:** సెప్టెంబరు 5
- **కౌన్సెలింగ్ వేదిక:** డైరెక్టర్, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్, విజయనగర్ ప్యాలెస్, పెదవాల్తేర్, విశాఖపట్నం
- **వెబ్‌సైట్:** www.audoa.andhrauniversity.edu.in



ఐఓబీలో అప్రెంటిస్‌లు

ఖాళీలు 550

చెన్నైలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, సెంట్రల్ ఆఫీస్ దేశవ్యాప్తంగా ఐఓబీ శాఖల్లో 550 అప్రెంటిస్ ఖాళీల భర్తీకి ఆన్ లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. అర్హులైన అభ్యర్థులు సెప్టెంబరు 10 లోగా దరఖాస్తు చేసుకోవాలి.

ఖాళీల వివరాలు

అప్రెంటిస్: 550(యూఆర్-284, ఎస్సీ-78, ఎస్టీ-26, ఓబీసీ- 118, ఈడబ్ల్యూఎస్-44)
ఆంధ్రప్రదేశ్‌లో 22, తెలంగాణలో 29 ఖాళీలున్నాయి.

అర్హతలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ/ సంస్థ నుంచి గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులై ఉండాలి.

వయసు: 2024 ఆగస్టు 1 నాటికి 20 నుంచి 28 సంవత్సరాల మధ్య ఉండాలి.

శిక్షణ వ్యవధి: ఒక సంవత్సరం.

స్టయిఫండ్: నెలకు మెట్రో ప్రాంతానికి రూ.15,000; అర్బన్ ప్రాంతానికి రూ.12,000; సెమీ అర్బన్/ రూరల్ ప్రాంతానికి రూ.10,000.

ఎంపిక: ఆన్‌లైన్ టెస్ట్(ఆబ్జెక్టివ్ టైప్), లోకల్ లాంగ్వేజ్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆధారంగా.

ఆన్‌లైన్ టెస్ట్(ఆబ్జెక్టివ్ టైప్) సబ్జెక్టులు: జనరల్/ ఫైనాన్షియల్ అవేర్‌నెస్(25 ప్రశ్నలు - 25 మార్కులు), జనరల్ ఇంగ్లీష్(25 ప్రశ్నలు - 25 మార్కులు), క్వాంటిటేటివ్ అండ్ రీజనింగ్ ఆప్టిట్యూడ్(25 ప్రశ్నలు - 25 మారుడ్, కంప్యూటర్/ సబ్జెక్ట్ నాలెడ్జ్(25 ప్రశ్నలు - 25 మార్కులు).

పరీక్ష సమయం: 90 నిమిషాలు


దరఖాస్తు రుసుము: జనరల్/ ఓబీసీ/ ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.800. ఎస్సీ/ ఎస్టీ/ మహిళా అభ్యర్థులకు రూ.600. దివ్యాంగులకు రూ.400.

ఆన్‌లైన్‌కు చివరి తేదీ: సెప్టెంబరు 10

ఆన్‌లైన్ పరీక్ష తేదీ: సెప్టెంబరు 22

వెబ్‌సైట్: www.iob.in/Careers

నిట్ వరంగల్‌లో ఫైర్ సేఫ్టీ ఆఫీసర్ ఉద్యోగాలు



వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్) ఒప్పంద ప్రాతిపదికన వివిధ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నది.

ఖాళీల సంఖ్య: 4

పోస్టులు
- విజిటింగ్ కన్సల్టెంట్(లీగల్ అడ్వయిజర్): 1
- ఫైర్ సేఫ్టీ ఆఫీసర్: 1
- విజిటింగ్ కన్సల్టెంట్(ఆర్కిటెక్ట్): 1
- ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్: 1

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగాల్లో బీఈ/ బీటెక్, బీఆర్క్, పీజీ, విజిటింగ్ కన్సల్టెంట్ పోస్టుకు హైకోర్టులో మూడేళ్లపాటు అడ్వకేట్‌గా పనిచేసిన అనుభవం ఉండాలి.

జీతం: నెలకు విజిటింగ్ కన్సల్టెంట్‌కు రూ.50,000; ఫైర్ సేఫ్టీ ఆఫీసర్‌కు రూ.70,000 విజిటింగ్ కన్సల్టెంట్‌కు ప్రతి విజిటింగ్‌కు రూ.5,000; ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్‌కు రూ.60,000.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్

ఎంపిక: రాతపరీక్ష/ ఇంటర్వ్యూల ఆధారంగా.

దరఖాస్తుకు చివరితేదీ: సెప్టెంబరు 26

వెబ్‌సైట్: https://nitw.ac.in/

జాబ్ కార్నర్

పీడీఐఎల్‌లో డిప్లొమా, డిగ్రీ ఇంజనీర్లు

నోయిడాలోని ప్రాజెక్ట్స్ అండ్ డెవలప్‌మెంట్ ఇండియా లిమిటెడ్ కాంట్రాక్ట్ ప్రాతిపదికన పీడీఐఎల్ కార్యాలయాలు/ ప్రాజెక్టు సైట్‌లో కింది విభాగాల్లో 57 ఇంజనీర్ ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. అర్హులైనవారు సెప్టెంబరు 11 తేదీలోగా ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.

ఖాళీలు
1. డిప్లొమా ఇంజనీర్: 4 పోస్టులు
2. డిగ్రీ ఇంజనీర్: 53 పోస్టులు

విభాగాలు: ఫైర్/ ఇండస్ట్రియల్ సేఫ్టీ, సివిల్(కన్‌స్ట్రక్షన్), ఎలక్ట్రికల్(కన్‌స్ట్రక్షన్), ఇన్‌స్పెక్షన్(ఎలక్ట్రికల్), ఇన్‌స్పెక్షన్(సివిల్), ఇన్‌స్పెక్షన్(మెకానికల్), ఇన్‌స్ట్రుమెంటేషన్(కన్‌స్ట్రక్షన్), మెకానికల్(కన్‌స్ట్రక్షన్), మెకానికల్(మెషినరీ).

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఇంటర్(సైన్స్ సబ్జెక్టులు), ఇంజనీరింగ్ డిప్లొమా, బీఎస్సీ, బీఈ, బీటెక్ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

దరఖాస్తు రుసుము: జనరల్/ ఓబీసీ అభ్యర్థులకు రూ.800. ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.400.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ: సెప్టెంబరు 11

వాక్ ఇన్ ఇంటర్వ్యూ తేదీలు: అక్టోబరు మొదటి లేదా రెండోవారం.

వేదిక: పీడీఐఎల్ భవన్, నోయిడా.

వెబ్‌సైట్: https://www.pdilin.com/

పी डी आई एल PDIL

లిటిల్స్




పులి గోరు

కృష్ణా పురంలో ఉండే కేశవానంద అనేస్వామీజీ వద్దకు రమణ అనే యువకుడు వచ్చి, స్వామీ, నాకు కోపం చాలా ఎక్కువగా వస్తుంది. దాని వల్ల అందరితో గొడవలు పడుతున్నాను . ఎవరిని చూసినా చిరాకుగా ఉంటుంది నాకు ఏదైనా ఉపాయం చెప్పండి అని అడిగాడు. దానికి ఆ స్వామీజీ నాయనా నీ కోపం చిరాకు తగ్గాలి అంటే నువ్వు అసలైన పులి గోరు మెడలో వేసుకోవాలి. పక్కనున్న అడవిలో ఒక పులి ఉంది దాని వద్దకు వెళ్లి నా పేరు చెప్పు నీకు గోరు ఇచ్చి పంపుతుంది. అన్నాడు సరే అని రమణ అడవికి వెళ్లి ఒక బక్కచిక్కిన ముసలి పులిని కలిసి, కేశవానంద స్వామి పేరు చెప్పి, తనకు గోరు కావాలని అడిగాడు. దానికి ఆ పులి, నాకు ముసలితనం వచ్చి, చూపు సరిగా ఆనడంలేదు. నువ్వు నాకు రోజూ ఆహారం తెచ్చిస్తే నీకు గోరు ఇస్తాను ఎఅన్నది దానికి సరేనన్న రమణ ప్రతిరోజూ మాంసం, చేపలు తీసుకెళ్లి పులికి ఇచ్చేవాడు.

కొన్ని రోజుల తర్వాత ఆ పులి ఇక నేడో రేపో నేను చనిపోతాను. నేను చనిపోగానే నా గోళ్లు నువ్వు తీసుకెళ్లవచ్చు అని అదే రోజున ఆ పులి చనిపోయింది. పులి చనిపోవడం చూసి, చాలా బాధ పడిన రమణ స్వామీజీ వద్దకు వచ్చి, దుఃఖ పడ్డాడు అది చూసిన స్వామీజీ 'ఇపుడు చనిపోయిన పులి మీద ఎంత జాలి, ప్రేమ చూపిస్తున్నావో, అదే ప్రేమ నీతోటి మనుషుల మీద కూడా చూపించు. నీ కోపం, చిరాకు ఇట్టే తగ్గుతాయి' అని చెప్పాడు ఆ రోజు నుండి రమణ చుట్టూ ఉన్న అందరిలో మంచిని చూడసాగాడు. త్వరలోనే అతనికి చీటికి మాటికి కోపం రావడం అనే సమస్య తగ్గిపోయింది.

10 తేడాలను కనుక్కోండి




ఏవి ఎన్ని?





దారి కనుక్కోండి

సరైన నీడను గుర్తించండి



డైలీ సుడోకు - 397

					5		4	6
	1				8			
		5		1				7
	7					9		4
1			5		2			8
4		2					5	
7				5		8		
			3				7	
9	8		6					

సుడోకు - 396 సమాధానం

8	2	7	9	3	5	1	4	6
6	1	4	7	2	8	3	9	5
3	9	5	4	1	6	2	8	7
5	7	8	1	6	3	9	2	4
1	6	9	5	4	2	7	3	8
4	3	2	8	9	7	6	5	1
7	4	1	2	5	9	8	6	3
2	5	6	3	8	1	4	7	9
9	8	3	6	7	4	5	1	2

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.